
సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 260
సోమవారం 3-6-2024
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



**అమెరికా ధనాధన్**
టి20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో కెనడాపై 7 వికెట్ల తేడాతో గెలుపు -12లో



**బఫెట్ సంపద రహస్యం అదే**
ముందుగా పెట్టుబడులు.. కాంపౌండింగ్‌తో దీర్ఘకాలంలో గొప్ప రాబడి -13లో



**భేటీలతో మోదీ బిజీబిజీ**
అధికారంలోకి వస్తే తొలి 100 రోజుల్లో చేయాల్సిన పనులపై ప్రధాని మోదీ అధికార యంత్రాంగంతో చర్చించారు.
వివరాలు 6లో ▸



**లొంగిపోయిన కేజ్రీవాల్**
మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆదివారం తిహార్ జైలులో లొంగిపోయారు.
వివరాలు 6లో ▸



**సిక్కింలో ఎస్‌కేఎం**
సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో సిక్కిం క్రాంతికారి మోర్చా విజయం సాధించింది. 32కు గాను 31 నియోజకవర్గాలను కైవసం చేసుకుంది.
వివరాలు 6లో ▸



**అరుణాచల్‌లో బీజేపీ**
అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. 60కి గాను 46 చోట్ల గెలుపొందింది.
వివరాలు 6లో ▸

# లెక్క ఏదైనా.. 'ఫ్యాన్' పక్కా

## అసెంబ్లీ ఎన్నికలపై మెజార్టీ జాతీయ, రాష్ట్ర మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్ స్పష్టీకరణ

- దేశ వ్యాప్త యంత్రాంగం ఉన్న టైమ్స్, దైనిక్ భాస్కర్ గ్రూప్‌ల ఎగ్జిట్ పోల్స్‌దీ అదే మాట
- 50 శాతం ఓట్లతో 14 లోక్‌సభ సీట్లు వైఎస్సార్‌సీపీవేనన్న టైమ్స్‌నౌ-ఈటీజీ రీసెర్చ్
- 50 శాతం కంటే ఎక్కువ ఓట్లతో 15-17 లోక్‌సభ సీట్లు వైఎస్సార్‌సీపీ గెలుస్తుందన్న దైనిక్ భాస్కర్(డీబీ)
- రాష్ట్ర మీడియా, సెఫాలజిస్టులు, సర్వే సంస్థలు చేసిన 32 ఎగ్జిట్ పోల్స్‌లో 24 పోల్స్ వైఎస్సార్‌సీపీ వైపే
- బీజేపీ భజన చేసే ఇండియాటుడే గ్రూప్, ఎన్‌డీటీవీ, జీన్యూస్‌ల ఎగ్జిట్ పోల్స్‌లో మాత్రం భిన్నంగా వెల్లడి
- 'ఈనాడు'తో భాగస్వామ్యం ఉన్న సీఎన్ఎన్ న్యూస్-18 ఎగ్జిట్ పోల్స్‌దీ అదే దారి
- 2021లో బెంగాల్లో, 2023లో రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో తప్పులో కాలేసిన ఇండియాటుడే ఎగ్జిట్‌పోల్స్
- తాజా ఎగ్జిట్‌పోల్స్‌లో కనీసం వైఎస్సార్‌సీపీ గుర్తును కూడా ఫ్యాన్‌కు బదులు చీపురుగా చూపిన సంస్థ
- గుర్తు తెలియకుండా, క్షేత్రస్థాయి స్థితిగతులు తెలుసుకోకుండా చేసిన సర్వే అని చెబుతున్న పరిశీలకులు
- తాను ఏపీలో పర్యటించినప్పుడు సర్వేలో పేర్కొన్న పరిస్థితులు లేవని విభేదించిన జర్నలిస్టు రాజ్‌దీప్
- మహిళలు, గ్రామీణ ఓటర్లు వైఎస్సార్‌సీపీవైపే ఉన్నారని అదే చానెల్లో సర్వే నిర్వాహకుడితో వ్యాఖ్యలు
- బీజేపీ నినాదమైన '400' సీట్లకు ఆ పార్టీని తీసుకెళ్లటమే లక్ష్యంగా కొన్ని జాతీయ సంస్థల ఎగ్జిట్‌పోల్స్
- రాజస్థాన్, హిమాచల్, హరియాణాలో ఉన్న స్థానాల కంటే అధిక స్థానాల్లో ఎన్‌డీఏ గెలుస్తుందని వెల్లడి
- రాజధాని, స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడం వల్లే కూటమి గెలుస్తోందంటూ వ్యాఖ్యలు
- కానీ.. ఎన్నికల ప్రచారంలో ఏ పార్టీ కూడా రాజధాని అంశాన్ని ప్రధాన ప్రచార అస్త్రంగా చేసుకోని తీరు
- బాబును అరెస్టు చేసినప్పుడు రాష్ట్రంలో చిన్నపాటి బంద్‌లు, నిరసనలు కూడా జరిగిన దాఖలాల్లేవు
- హైదరాబాద్‌లో 'ఐటీ గ్రూప్' పేరిట కూపన్లిచ్చి మరీ నిరసన చేయించిన ఒక సామాజిక వర్గం వ్యక్తులు
- వాస్తవానికి రాష్ట్రంలో అన్నివర్గాలకూ మేలు చేసే పాలనతో పటిష్టంగా నిలబడ్డ వైఎస్సార్‌సీపీ
- తమ కుటుంబాలు బాగుపడ్డాయనే భావనతో ఆ పార్టీ వెనక అంతే బలంగా నిలబడ్డ ప్రజలు
- ఇవన్నీ వైఎస్సార్‌సీపీని స్పష్టంగా విజయంవైపు తీసుకెళుతున్నాయని తేల్చిన సర్వే సంస్థలు
- సెఫాలజిస్టుల్ని బెదిరించి మరీ కౌంటింగ్‌నాడు అరాచకాలకు తెగబడాలని చూస్తున్న బాబు, లోకేశ్

2లో



### నాలుక్కర్చుకున్న ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా

- గ్రామీణ ప్రజలు, మహిళలు వైఎస్సార్‌సీపీకే మద్దతుగా నిలిచారన్న రాజ్‌దీప్ సర్దేశాయ్
- మీరు చేసిన సర్వే సహేతుకంగా లేదంటూ యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్‌గుప్తాకు చురక

2లో

### మళ్లీ ఘన విజయం ఖాయం

- రేపు ఉదయం 8 వరకు కూటమి ఊహల్లో విహరించవచ్చు: సజ్జల
- ఆ తర్వాత సంబరాలు చేసుకునేది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే
- ఘోర ఓటమిని గ్రహించే చంద్రబాబు నిశ్శబ్దం

3లో

### టైమ్స్ నౌ-ఈటీజీ ఎగ్జిట్ పోల్‌లో

# వైఎస్సార్‌సీపీ హవా

**51 శాతం ఓట్లతో 117-125 అసెంబ్లీ సీట్లు కైవసం**




సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధిస్తుందని దేశవ్యాప్తంగా విస్తృత నెట్‌వర్క్ కలిగిన టైమ్స్ నౌ-ఈటీజీ రీసెర్చ్ ఆదివారం తన ఎగ్జిట్ పోల్స్‌లో తేల్చి చెప్పింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 51 శాతం ఓట్లతో మొత్తం 117-125 సీట్లు కైవసం చేసుకుంటుందని.. అదే సమయంలో టీడీపీ-జనసేన-బీజేపీ (ఎన్డీయే) కూటమి 47 శాతం ఓట్లతో 50-58 సీట్లకే

మిగతా 2వ పేజీలో ▶

# ఏజెంట్లే కీలకం



- ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లాలి
- ప్రభుత్వ గుర్తింపు కార్డు, ఏజెంట్ నియామక పత్రం ఉండాలి
- ఫారం 17 సీ తప్పకుండా వెంట తీసుకెళ్లాలి
- అభ్యంతరాలను కచ్చితంగా లిఖితపూర్వకంగా తెలిపి ధ్రువీకరణ తీసుకోవాలి
- తుది ఫలితం ప్రకటించే దాకా హాల్ విడిచి వెళ్లకూడదు
- కౌంటింగ్ ప్రక్రియ మొత్తం రికార్డు
- ప్రత్యర్థులు కవ్వించినా సంయమనంతో వ్యవహరించాలి

3లో

## పోస్టల్ బ్యాలెట్‌పై హైకోర్టు ఉత్తర్వులు కొట్టివేయండి

**సుప్రీంకోర్టులో వైఎస్సార్‌సీపీ పిటిషన్.. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలనే కొనసాగించాలని విజ్ఞప్తి**

సాక్షి, న్యూఢిల్లీ: పోస్టల్ బ్యాలెట్ల విషయంలో వైఎస్సార్‌సీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలంటూ ఆదివారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పోస్టల్ బ్యాలెట్‌లపై అధికారిక సీల్, హోదా లేకుండా కేవలం స్పెసిమెన్ సిగ్నేచర్‌తో ఆమోదించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులను వైఎస్సార్‌సీపీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నియమ, నిబంధనలే కొనసాగించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేసింది. ఎక్కడా లేని విధంగా కేవలం ఏపీలోనే ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడాన్ని వైఎస్సార్‌సీపీ ప్రశ్నించింది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో వెంటనే ఈ పిటిషన్‌ను విచారించాలని సోమవారం కోరనుంది.



**ఇదండీ సంగతి**



రేపటి వరకూ ఉండటం కుదర్దుసార్! వెళ్లాలి!!

# 'నైరుతి' వచ్చేసింది

## రాయలసీమలోకి ప్రవేశించిన రుతు పవనాలు

- రెండు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరించే అవకాశం.. ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు
- ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర కోస్తాకూ విస్తరణ
- దూకుడుగా రుతుపవనాలు
- మూడ్రోజులు విస్తారంగా వర్షాలు
- విశాఖ, పల్నాడు జిల్లాల్లో పిడుగుపాట్లకు నలుగురు మృతి

14లో



# అవాంతరాలను ఉపేక్షించొద్దు

- ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఆటంకాలు కలిగించే వారిని నిర్దాక్షిణ్యంగా బయటకు పంపండి
- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు విషయంలో ఈసీఐ ఆదేశాలను పాటించండి
- ఫలితాల ప్రకటనకు సంబంధించిన ఫారం -21సి/21ఇ లు మరుసటి రోజే ఈసీఐకి చేరాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా



సాక్షి, అమరావతి: ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆటంకాలు కలిగించేందుకు ప్రయత్నించే వారిని ఉపేక్షించొద్దని.. నిర్దాక్షిణ్యంగా బయటకు పంపడమే కాకుండా చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమ ఏర్పాట్లను జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా

మిగతా 3వ పేజీలో ▶

# 92% మందికి ఇన్‌పుట్ సబ్సిడీ

## రైతన్నల ఖాతాల్లోకి కరువు సాయం, మిచాంగ్ పరిహారం


- 8.89 లక్షల మందికి రూ.1,126.31 కోట్లు జమ
- ఇక మిగిలింది 1.54 లక్షల మందికి మరో రూ.163.12 కోట్లు
- ఖాతా నంబరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఆధార్, పేర్లు సరిగా లేకనే
- క్షేత్రస్థాయిలో రీ వెరిఫికేషన్‌తో వారికీ లబ్ధి చేకూరేలా ఏర్పాట్లు
- ఐదేళ్లలో 34.41 లక్షల మందికి ఇన్‌పుట్ సబ్సిడీతో రూ.3,261.60 కోట్లు అందించిన సీఎం జగన్ సర్కారు
- వాస్తవాలు తెలుసుకోకుండా విషం కక్కుతున్న రామోజీరావు

2లో



# 92 శాతం మందికి ఇన్‌పుట్ సబ్సిడీ

## రైతన్నల ఖాతాల్లోకి కరువు సాయం, మిచాంగ్ పరిహారం 8.89 లక్షల మందికి రూ.1,126.31 కోట్లు జమ



Crop Damages: Details of Amount released to Farmers accounts for Drought Kharif-2023 & Michaung Cyclone

| S.No | Name of the Department | Total: Total Amount released to Farmers Accounts – No.of farmers | Total: Amount (In Crores) | Success: Amount Credited to Farmers Accounts – No.of farmers | Success: Amount (In Crores) | Failed: No.of farmers | Failed: Amount (In Crores) |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Agriculture | 696607 | 1123.09 | 600552 | 1027.9 | 98255 | 95.19 |
| 2 | Horticulture | 99118 | 109.34 | 89232 | 98.41 | 9666 | 10.93 |
| | Total | 997925 | 1232.43 | 889784 | 1126.31 | 106141 | 106.12 |

రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ అయినట్లు తెలుపుతున్న ప్రభుత్వ రికార్డులు

సాక్షి, అమరావతి: ఎన్నికల దృష్టితో కాకుండా అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా సంతృప్త స్థాయిలో లబ్ధి చేకూరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో కరువు, ప్రకృతి విపత్తులతో నష్టపోయిన 92 శాతం మంది రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి రాయితీని జమ చేసి ఆదుకుంది. 8.89 లక్షల మంది రైతన్నల ఖాతాల్లోకి రూ.1,126.31 కోట్లు జమ చేయగా మరో 1.54 లక్షల మందికి రూ.163.12 కోట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. అది కూడా ఖాతాల వివరాలు, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్, ఆధార్ నంబర్లు సరిపోలకపోవడం లాంటి సాంకేతిక కారణాలతో జాప్యం జరుగుతోంది. బ్యాంకర్లు, అధికార యంత్రాంగం ఈ సమస్యను పరిష్కరించిన వెంటనే మిగిలిన అర్హులకూ ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీటిని వక్రీకరిస్తూ పెట్టుబడి సాయం ఏమైపోయిందంటూ రామోజీ శోకాలు పెడుతున్నారు. ఒకపక్క ఈసీ ద్వారా అన్నదాతలకు సాయం అందకుండా అడ్డుపడ్డ చంద్రబాబు మరోవైపు ఎల్లో మీడియాలో నిస్సిగ్గుగా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు ఆ సీజన్ ముగిసే లోగానే పరిహారం అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా అండగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్-23లో ఏడుజిల్లాల పరిధిలోని 103 కరువు మండలాల్లో 14.24 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. 6.60 లక్షల మందికి రూ.847.22 కోట్ల కరువు సాయం చెల్లించాలని లెక్క తేల్చారు. గతేడాది రబీ ఆరంభంలో మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు 6.64 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నట్లు తేలింది. దీనికి సంబంధించి 4.61 లక్షల మందికి రూ.442.36 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని అంచనా వేశారు. ఈ రెండు విపత్తుల్లోనూ 77 వేల మంది ఉండటంతో నష్టపోయిన వారి సంఖ్య మొత్తం 10.44 లక్షలుగా తేల్చారు. ఈమేరకు రూ.1,289.57 కోట్లు జమ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయగా కోడ్ సాకుతో ఈసీని అడ్డంపెట్టుకుని చంద్రబాబు బృందం అడ్డుకుంది. ఈసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రైతులు హైకోర్టును ఆశ్రయిస్తే మే 10న జమ చేసేందుకు కోర్టు అనుమతినిచ్చింది. అయినప్పటికీ ఈసీ తాత్సారం చేయడం వెనుక ఎవరున్నారో అందరికీ తెలిసిందే.

**రూ.2,558 కోట్లు ఎగ్గొట్టిన బాబు**

నాడు 2014 ఖరీఫ్ కరువు సాయాన్ని చంద్రబాబు సర్కారు 2015 నవంబరు వరకు అందజేయలేదు. 2015 కరువు సాయం 2016 నవంబరులో విదిల్చింది. 2016లో కరువు వస్తే 2017 జూన్‌లో, 2017లో కరువు వస్తే 2018 ఆగస్టులో సరిపుచ్చారు. 2018లో కరువు వల్ల ఖరీఫ్‌లో రూ.1,832.28 కోట్లు, రబీలో రూ.356.45 కోట్ల పంటనష్టం జరిగితే చంద్రబాబు ప్రభుత్వం అందించిన సహాయం సున్నా. 24.80 లక్షల మంది రైతులకు రూ.2,558 కోట్లు ఎగ్గొట్టిన నిర్వాకం చంద్రబాబుదే. తిత్లీ తుపాను బాధితులకు బాబు ఎగ్గొట్టిన రూ.182.60 కోట్ల పరిహారంతో సహా ఈ ఐదేళ్లలో 34.41 లక్షల రైతులకు రూ.3,261.60 కోట్ల పెట్టుబడి రాయితీని అందించి ఆదుకున్నది సీఎం జగన్ ప్రభుత్వమే.

**తుది జాబితాలు రాగానే మిగతా వారికీ..**

నష్టపోయిన 10.44 లక్షల మంది రైతులకు రూ.1,289.57 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేయాల్సి ఉండగా ఆ ఖాతాల వివరాలను వ్యవసాయ శాఖ సీఎంఎఫ్‌ఎస్‌కు పంపించింది. అయితే 46,226 మంది రికార్డులు సరిగా లేవని వెనక్కి పంపారు. వీరికి రూ.57.15 కోట్లు జమ కావాల్సి ఉంది. మిగిలిన 9,97,925 మంది రైతులకు సంబంధించి రూ.1,232.43 కోట్లు జమ చేసేందుకు వ్యవసాయ శాఖ తిరిగి సీఎఫ్‌ఎంఎస్‌కు ప్రతిపాదనలు పంపింది. ఇందులో 8,89,784 మంది రైతులకు రూ.1,126.31 కోట్లు జమ అయింది. మరో 1,08,141 మందికి సంబంధించి రూ.106.12 కోట్లు సాంకేతిక కారణాలతో జమ కాలేదు. ఇలా 1.54 లక్షల మందికి రూ.163.27 కోట్లు జమ కావాల్సి ఉంది. బ్యాంక్ ఖాతా, ఆధార్ నెంబర్లు, రైతుల వివరాలు మిస్ మ్యాచ్ అయినట్టు గుర్తించడంతో ఆ వివరాలను జిల్లాలకు పంపి క్షేత్ర స్థాయి పరిశీలన జరుపుతున్నారు. జిల్లాల నుంచి తుది జాబితాలు రాగానే వారికి కూడా సొమ్ములు జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**త్వరలో రబీ 2023–24 కరువు జాబితాలు**

దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు రబీ 2023–24 సీజన్‌లో కూడా కొనసాగాయి. ఆరు జిల్లాల్లో 87 మండలాల్లో కరువు ప్రభావం ఉన్నట్లు గుర్తించారు. 2.37 లక్షలమంది రైతులకు చెందిన 2.52 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా తేలింది. తుది జాబితాల రూపకల్పన జరగకుండా కోడ్ సాకుతో చంద్రబాబు బృందం అడ్డుకోగా ఇటీవలే పోలింగ్ ముగియడంతో ఈసీ అనుమతితో తుది నివేదిక రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే సోషల్ ఆడిట్, అర్జీల స్వీకరణ, పరిష్కార ప్రక్రియ పూర్తిచేశారు. జిల్లాల నుంచి తుదిజాబితాలు రాగానే పెట్టుబడి రాయితీ విడుదలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**నాడు ప్రకటనలోనూ అంతులేని ఆలస్యం..**

చంద్రబాబు పాలనలో ఏటా కరువు కాటకాలే తాండవించడంతో సగటున 324 మండలాలు కరువు ప్రభావానికి గురయ్యాయి. ఖరీఫ్–2014లో 238, ఖరీఫ్–2015లో 359, ఖరీఫ్–2016లో 301, రబీ 2017–18లో 121, ఖరీఫ్–2018లో 347, రబీ 2018–19లో 257 మండలాల్లో కరువు విలయ తాండవం చేసింది. అయితే నాడు కరువు మండలాలను ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో ప్రకటించిన దాఖలాలే లేవు. 2014 ఖరీఫ్‌లో కరువు వస్తే 2015 మార్చి 10 వరకు మూడుసార్లుగా కరువు మండలాలను నోటిఫై చేశారు. 2015లో కరువు వస్తే నవంబరు నెలాఖరు వరకు ప్రకటించనే లేదు. 2016 ఖరీఫ్‌లో కరువు వస్తే 2017 ఫిబ్రవరి వరకు మూడు దఫాలుగా ప్రకటించారు. 2017 రబీలో కరువు వస్తే 2018 మార్చి నెలాఖరు వరకు మూడుసార్లు ప్రకటించారు. 2018 ఖరీఫ్‌లో కరువు వస్తే 2018 అక్టోబరు వరకు ఏకంగా ఐదు దఫాలుగా కరువు మండలాలను వెల్లడించారు. రబీ 2018–19లో కరువు వస్తే.. ఎన్నికలకు ముందు ఫిబ్రవరి 2019లో కరువు మండలాలను ప్రకటించారు.

**ఆ కథనాల్లో నిజం లేదు..**



ఖరీఫ్ 2023 కరువు, రబీ 2023–24లో మిచాంగ్ తుపానుకు సంబంధించి అర్హత పొందిన వారిలో ఇప్పటికే 8.89 లక్షల మందికి రూ.1,126.31 కోట్ల పెట్టుబడి రాయితీ జమచేశాం. మరో 1.54 లక్షల మందికి రూ.163.12 కోట్లు జమ చేయాల్సి ఉంది. సాంకేతిక సమస్యల్ని పరిష్కరించి త్వరలోనే వీరికి పరిహారం జమ చేస్తాం. 50 శాతం మందికి ఇంకా పరిహారం జమ కాలేదన్న కథనాల్లో వాస్తవం లేదు. ఇప్పటికే 92 శాతం మందికి జమ చేశాం. రబీ 2023–24 సీజన్‌లో కరువు నష్టానికి సంబంధించి తుది జాబితాల రూపకల్పన జరుగుతోంది. కలెక్టర్ల ఆమోదంతో తుది జాబితాలు రాగానే సకాలంలో పరిహారం జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తాం.

– చేవూరు హరికిరణ్,
స్పెషల్ కమిషనర్, వ్యవసాయశాఖ

---

## కుమారుడిని కాల్చి చంపిన కానిస్టేబుల్ అరెస్టు

ఒంగోలు టౌన్: డబ్బులు అడిగాడనే కోపంతో క్షణికావేశంలో తన కుమారుడు శేష్ కమల్ (20)ను సర్వీసు తుపాకీతో కాల్చి చంపిన ఏఆర్ కానిస్టేబుల్ కొదమల ప్రసాద్‌బాబును ఆదివారం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్పీ కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం... కానిస్టేబుల్ ప్రసాద్‌బాబు ఒంగోలు నగరంలోని భాగ్యనగర్‌లో ఈవీఎం గోడౌన్ వద్ద సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి ఆయనను కుమారుడు కమల్ మోటారు సైకిల్‌పై గోడౌన్ వద్దకు తీసుకువచ్చి దించాడు. అయితే ఒకటో తేదీ కావడంతో కుటుంబ అవసరాల కోసం డబ్బులు ఇవ్వాలని కమల్ తన తండ్రిని అడిగాడు. తన జీతం డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించిన ప్రసాద్‌బాబు కొడుకుతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో విచక్షణ కోల్పోయిన ప్రసాద్‌బాబు సమీపంలోని గదిలోకి వెళ్లి తుపాకి తీసుకువచ్చి కుమారుడు కమల్‌ను కాల్చి చంపాడు. అక్కడ ఉన్న సిబ్బంది వెంటనే ప్రసాద్ నుంచి తుపాకి లాక్కుని తీవ్రంగా గాయపడిన కమల్‌ను జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం కమల్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, ఘటన జరిగిన ప్రదేశం రిజర్వ్ గోడౌన్ కావడంతో అక్కడ పోలింగ్ ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ బాక్సులు లేవని పోలీసు అధికారులు వెల్లడించారు. ఘటన జరిగిన ప్రదేశానికి ఈవీఎం స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రం సుమారు 9 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపారు.

## సీఎంపై హత్యాయత్నం కేసు నిందితుడు బెయిల్‌పై విడుదల

వెంకటాచలం: సీఎం జగన్‌పై హత్యాయత్నం చేసిన నిందితుడు వేముల సతీష్ బెయిల్‌పై విడుదలయ్యాడు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం చెముడుగుంట సమీపంలోని జిల్లా జైలు నుంచి ఆదివారం బయటకు వచ్చాడు. మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్‌పై తాను దాడి చేయలేదని.. పోలీసులు ఇరికించారంటూ చెప్పాడు.

## టైమ్స్ నౌ–ఈటీజీ ఎగ్జిట్ పోల్‌లో వైఎస్సార్‌సీపీ హవా

▶ మొదటి పేజీ తరువాయి

పరిమితమవుతుందని వెల్లడించింది. అలాగే, లోక్‌సభ పోలింగ్ విషయానికొస్తే.. వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 14 ఎంపీ స్థానాలు, ఎన్డీయే కూటమి 48% ఓట్లతో 11 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందని తెలిపింది. ఈసారి ఏపీలో దాదాపు 82శాతం పోలింగ్ నమోదైందని.. 2019 ఎన్నికలతో పోలిస్తే ఇది ఇంచుమించు 2% అధికమని వివరించింది. అంతేకాక, మహిళల ఓటింగ్ కూడా ఈ దఫా 15% అధికంగా నమోదైందని టైమ్స్ నౌ–ఈటీజీ రీసెర్చ్ తెలిపింది.

---

# లెక్క ఏదైనా... ఫ్యాన్ పక్కా

## అసెంబ్లీ ఎన్నికలపై మెజార్టీ జాతీయ, రాష్ట్ర మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి : పేదలకు, పెత్తందారులకు.. విశ్వసనీయతకు, వంచనకు మధ్య పోరుగా దేశ వ్యాప్తంగా అత్యంత ఆసక్తి రేకెత్తించిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం ఖాయమని... ఏ లెక్కన చూసుకున్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం పక్కా అని అధిక శాతం జాతీయ, రాష్ట్ర మీడియా, సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ తేల్చిచెప్పాయి. రాష్ట్రంలో 50 శాతానికిపైగా ఓట్లతో వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధిస్తుందని ఇవన్నీ స్పష్టం చేశాయి. దేశ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృత యంత్రాంగం ఉన్న టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌కు చెందిన టైమ్స్‌నౌ–ఈటీజీ రీసెర్చ్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో 50 శాతం ఓట్లతో వైఎస్సార్‌సీపీ 14 లోక్‌సభ స్థానాలను చేజిక్కించుకుంటుందని.. ఎన్డీఏ కూటమి 48 శాతం ఓట్లతో 11 లోక్‌సభ స్థానాలకు పరిమితం అవుతుందని వెల్లడయింది. టైమ్స్ ఆఫ్ ఇండియా తరహాలోనే దేశ వ్యాప్తంగా విస్తృత యంత్రాంగం ఉన్న దైనిక్ భాస్కర్ గ్రూప్... రాష్ట్రంలో 15–17 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధిస్తుందని.. ఎన్డీఏ కూటమి 8–9 లోక్‌సభ స్థానాలకు పరిమితం అవుతుందని తన ఎగ్జిట్ పోల్స్ ద్వారా తేల్చిచెప్పింది. ఇక తెలుగు రాష్ట్రాల్లో టీవీ9 వంటి మీడియా సంస్థలు, సెఫాలజిస్టులు, ఆరా వంటి ప్రతిష్టాత్మక సర్వే సంస్థలు నిర్వహించిన 32 ఎగ్జిట్ పోల్స్‌లో 24 ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం తథ్యమని.. మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టమయింది.

**ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఇవి..**

| సంఖ్య | సర్వే సంస్థ | వైఎస్సార్ సీపీ | కూటమి |
|---|---|---|---|
| 1 | పార్థదాస్(చాణక్య) | 110-120 | 55-65 |
| 2 | జన్మత్‌పోల్స్ | 95-103 | 67-75 |
| 3 | టీవీ9 పోల్ | 110-120 | 55-65 |
| 4 | ర్యాప్ స్ట్రాటజీస్ | 158 | 17 |
| 5 | స్మార్ట్ పోల్ | 82(+/-8) | 93(+/-8) |
| 6 | ఆరా | 94-104 | 71-81 |
| 7 | ఆత్మసాక్షి | 98-116 | 59-77 |
| 8 | హెచ్ఎంఆర్ | 91-101 | 73-83 |
| 9 | క్యూ-మెగా | 120+ | 50-60 |
| 10 | పొలిటికల్ లేబొరేటరీ | 108 | 67 |
| 11 | రేస్ | 117-128 | 47-58 |
| 12 | ఎన్డీఏ ఎగ్జిట్‌పోల్ | 143 | 32 |
| 13 | ఎల్ఆర్ సర్వే | 93 | 82 |
| 14 | నాగన్న సర్వే | 118 | 49 |
| 15 | సీ-నెక్ట్స్ ఏపీ | 123 | 52 |
| 16 | ఎస్ఏఎస్‌గ్రూప్ ఐపీఎస్ఎస్ టీమ్ హైదరాబాద్ | 126 | 49 |
| 17 | కేఎస్ ప్రసాద్ | 146 | 29 |
| 18 | కోగంటి సత్యం | 110-125 | 45-55 |
| 19 | పోల్ స్ట్రాటజీస్ | 115-125 | 50-60 |
| 20 | అగ్నివీర్ | 124-128 | 46-49 |
| 21 | ఆపరేషన్ చాణక్య | 95-102 | 64-68 |
| 22 | సీపీఎస్ | 97-108 | 66-78 |
| 23 | ఫస్ట్‌స్టెప్ సొల్యూషన్స్ | 119 | 56 |
| 24 | సీపీఆర్ఎస్ | 120-135 | 40-55 |
| 25 | చాణక్య స్ట్రాటజీస్ | 39-49 | 114-125 |
| 26 | రింగ్ టు పోల్ | 60 | 115 |
| 27 | పీపుల్ పల్స్ | 45-60 | 111-135 |
| 28 | నేషనల్ ఫ్యామిలీ | 65-71 | 104-115 |
| 29 | పయనీర్ | 31 | 144 |
| 30 | పోల్ పల్స్ | 45-60 | 108-116 |
| 31 | రైజ్ | 52 | 123 |
| 32 | కేకే సర్వే | 31 | 133-144 |

**బీజేపీ భజన చేసే జాతీయ మీడియా ఎగ్జిట్ పోల్స్ తద్భిన్నం..**

బీజేపీ భజన చేసే ఇండియాటుడే గ్రూప్, జీన్యూస్.. ఈనాడుతో భాగస్వామ్యం ఉన్న నెట్‌వర్క్‌లోని సీఎన్ఎన్ న్యూస్–18 వంటి రెండు మూడు జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ మాత్రం రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని తేల్చడం గమనార్హం. రాజధాని అంశంతోపాటు స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడంపై ప్రజల్లో సానుభూతి వచ్చిందని.. అదే ఎన్డీఏ కూటమి విజయానికి బాటలు వేసిందని ఆ సంస్థలు విశ్లేషించాయి. కానీ వాస్తవంగా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో ఇటు వైఎస్సార్‌సీపీగానీ అటు ఎన్డీఏగానీ రాజధాని అంశాన్ని ఎక్కడా పెద్దగా ప్రస్తావించలేదు. ఇక స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు రాష్ట్రంలో ఎక్కడా చిన్నపాటి బంద్‌లు గానీ, ర్యాలీలు గానీ, నిరసనలు గానీ జరగనేలేదు. తప్పు చేశాడు కనక అరెస్టయ్యాడనే రీతిలో జనం స్పందించారు. దీంతో హైదరాబాద్‌లో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు కూపన్లు ఇచ్చి మరీ 'ఐటీ ఉద్యోగుల' పేరిట స్థానికంగా ఒక ఈవెంట్‌లా నిరసన కార్యక్రమం చేశారు. అలాంటిది ఈ రెండు అంశాలూ ప్రభావం చూపిస్తున్నాయని, అందుకే కూటమి గెలుస్తోందని ఈ జాతీయ ఛానెళ్లు చెప్పిన జోస్యం నూటికి నూరుపాళ్లు తప్పవుతుందని రాష్ట్ర వ్యవహారాలను దగ్గర నుంచి పరిశీలిస్తున్న విశ్లేషకులు స్పష్టంగా చెబుతున్నారు.

**కనీస జాగ్రత్తలు కూడా తీసుకోని ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మేదెలా?**

విచిత్రమేమంటంటే 'ఇండియా టుడే– మై యాక్సిస్' సంస్థ శనివారంనాడు దేశవ్యాప్త ఎగ్జిట్‌పోల్స్‌ను వెలువరించింది. దీన్లో బీజేపీ నినాదమైన '400' సీట్లకు ఆ పార్టీని చేర్చటమే లక్ష్యంగా ఒకో రాష్ట్రంలో స్వీప్ అంటూ ముందుకు వెళ్లిపోయినట్లు స్పష్టంగా కనిపించింది. పైపెచ్చు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి 2 నుంచి 4 లోక్‌సభ స్థానాలు వస్తాయని మాత్రమే చెప్పిన ఇండియా టుడే సంస్థ... ఆ సందర్భంగా వైఎస్సార్ సీపీ గుర్తును కూడా ఆప్ గుర్తయిన చీపురుగా చూపించింది. విశేషమేంటంటే దీన్నే తెలుగుదేశం పార్టీ తన ట్విటర్ ఖాతాలోనూ పోస్ట్ చేసుకుంది. మరి పార్టీ గుర్తు విషయంలో కూడా జాగ్రత్తలు పాటించకుండా చేసిన ఈ ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మేదెలా? ఇక కొన్ని రాష్ట్రాల విషయంలోనైతే కొన్ని ఎగ్జిట్ పోల్స్ అక్కడ వాస్తవంగా ఉన్న మొత్తం స్థానాలకన్నా ఎక్కువ స్థానాలు ఎన్డీఏ గెలుస్తుందని చూపించటాన్ని ఇప్పటికే ట్విటర్లో పలువురు ట్రోల్ చేస్తున్నారు కూడా. ఇదే ఇండియాటుడే– మై యాక్సిస్ సంస్థ 2021లో బెంగాల్లో చేసిన ఎగ్జిట్‌పోల్స్, 2023లో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో చేసిన ఎగ్జిట్‌పోల్స్ పూర్తిగా రివర్సయ్యాయనేది ఇక్కడ గమనార్హం. నిజానికి ఈ సర్వేను ప్రసారం చేస్తున్నపుడు 'ఇండియాటుడే' ఛానెల్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ సర్వే ఫలితాలతో విభేదించారు కూడా. తాను ఆంధ్రప్రదేశ్‌లో క్షేత్ర స్థాయిలో పర్యటించానని, సర్వేలో చెప్పినట్లుగా పరిస్థితులు అక్కడ లేవని పేర్కొన్నారు. గ్రామీణ, మహిళా ఓటర్లు పూర్తిగా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, అది తన పర్యటనలో కనిపించిందని సర్దేశాయ్ చెప్పగా... చంద్రబాబు నాయుడి అరెస్టు పట్ల జనంలో సానుభూతి పెల్లుబుకిందని, అదే కూటమి విజయానికి కారణమవుతోందని ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించిన ప్రదీప్ గుప్తా వ్యాఖ్యానించడం గమనార్హం. అంతేకాదు. తాజాగా బీజేపీ కూటమికి దేశంలో అత్యంత భారీగా స్థానాలు వస్తాయని పేర్కొన్న జాతీయ మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్‌లో చిత్రవిచిత్రమైన తప్పులు కనిపించాయి. ఇండియాటుడే గ్రూప్‌లోని ఆజ్ తక్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో తమిళనాడులో కాంగ్రెస్ 9 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తే.. అక్కడ 13–15 లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ విజయం సాధిస్తుందని తేల్చడంతో చర్చలో పాల్గొన్న వారే విస్తుపోయారు. రాజస్థాన్‌లో ఉన్నదే 25 లోక్‌సభ స్థానాలైతే.. ఆ రాష్ట్రంలో 33 స్థానాల్లో ఎన్డీఏ విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్‌లో టుడేస్ చాణక్య వెల్లడించడం గమనార్హం. జార్ఖండ్‌లో సీపీఐ (ఎంఎల్) ఒక స్థానంలో పోటీ చేస్తే.. రెండు నుంచి మూడు స్థానాల్లో ఆపార్టీ విజయం సాధిస్తుందని ఆజ్‌తక్ ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడించింది. హర్యానాలో ఉన్నదే 10 లోక్‌సభ స్థానాలైతే 16–19 స్థానాల్లో ఎన్డీఏ విజయం సాధిస్తుందని జీన్యూస్ ఎగ్జిట్ పోల్స్‌లో తేల్చడం విస్మయకరమే. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లో ఉన్నవే నాలుగు లోక్‌సభ స్థానాలైతే.. అక్కడ ఎన్డీఏ 6–8 స్థానాల్లో విజయం సాధిస్తుందని జీన్యూస్ తేల్చింది. విశేషమేంటంటే ఈ సంస్థలన్నీ రాష్ట్రంలో కూటమికే మెజారిటీ లోక్‌సభ స్థానాలు దక్కుతున్నాయని చెప్పాయి. లోతుగా పరిశీలించినట్లయితే ఈ జాతీయ మీడియా సంస్థలకు రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో ఎలాంటి యంత్రాంగమూ లేదు. వీటిలో చాలావరకూ ప్రజల అభిప్రాయాన్ని ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా తెలుసుకుని.. వాటినే ఎగ్జిట్ పోల్స్‌గా వెల్లడించాయి. గ్రామీణ ఓటర్లు, మహిళలు, వైఎస్సార్ సీపీకి ఎప్పుడూ అండగా ఉండే బలహీనవర్గాలు ఇలాంటి సర్వేల్లో పాల్గొనే అవకాశం తక్కువ. దీన్ని బట్టి చూస్తే.. ఈ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్... జూన్ 4న పూర్తి స్థాయిలో తిరగబడతాయని స్పష్టంగానే చెప్పొచ్చు.



**వైఎస్సార్‌సీపీ ఓడిపోయే అవకాశమే లేదు..**

రాష్ట్రంలో ఎక్కడికక్కడ పరిశ్రమలను తెస్తూ... గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ... ఐదేళ్లుగా కొనసాగిస్తున్న సంక్షేమ పథకాలు.. విప్లవాత్మక సంస్కరణలను జనం పెద్ద ఎత్తున ఆదరించారు. ఈ విషయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు నిర్వహించిన 'సిద్ధం' సభలతో రుజువయింది. అర్హతే ప్రమాణికంగా 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల్లో 60 శాతానికి పైగా వైఎస్సార్‌సీపీకి దన్నుగా నిలుస్తున్నట్లు పలు సర్వేలు వెల్లడించాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు.. మహిళల్లో వైఎస్సార్‌సీపీకి అత్యంత ఆదరణ ఉందని.. ఇదే ఆపార్టీ విజయానికి బాటలు వేస్తుందని ఇవే జాతీయ మీడియా సంస్థలు గతంలో విశ్లేషించాయి. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం ఓట్లు పోల్ కావడం.. మహిళలు ఎన్డీఏ కూటమి కంటే వైఎస్సార్‌సీపీకి 12 శాతం అధికంగా వేశారని.. ఇది ఆపార్టీ ఘనవిజయానికి బాటలు వేస్తుందని ఆరా మస్తాన్, చాణక్య పార్థదాస్‌లు కుండబద్దలు కొట్టారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే తాము ఓడిపోయే అవకాశమే లేదని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.

**కౌంటింగ్ నాడు అక్రమాలకు తెగబడటానికే!**

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు వస్తుండటంతో పలువురు సెఫాలజిస్టులను చంద్రబాబు నాయుడు, లోకేశ్ బెదిరించినట్లు వాళ్లే వ్యాఖ్యానిస్తున్నారు. ఓ సర్వే సంస్థ లోకేశ్ బెదిరింపులను తట్టుకోలేక... ఫలితాలను అట్నుంచి ఇటు మార్చి కూటమి గెలుస్తున్నట్లుగా ఇచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎలాగూ రెండ్రోజుల్లో తేలే ఫలితాల కోసం చినబాబు– చంద్రబాబు ఎందుకు ఇంతలా బెదిరింపులకు పాల్పడుతున్నారనే అంశాన్ని నిపుణులు లోతుగా విశ్లేషిస్తున్నారు. తామే గెలుస్తున్నామనే భ్రమలు కల్పించటం ద్వారా వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో నిరుత్సాహాన్ని నింపి... కౌంటింగ్ రోజున అవసరమైతే వారిని ప్రలోభపెట్టో, బెదిరించో తమ పబ్బం గడుపుకోవాలనేది తండ్రీ కొడుకుల ఆలోచనగా చెబుతున్నారు. ఈసీ ఎలాగూ తమకే సహకరిస్తుంది కనక ఎలాంటి దారుణాలకైనా వెనకాడకూడదన్నది వీళ్ల ఆలోచనగా చెబుతున్నారు. అయితే పురిట్లోనే సంధికొట్టినట్లు చాలామంది సెఫాలజిస్టులు వీరి బెదిరింపులకు లొంగకుండా వైఎస్సార్‌సీపీ గెలుస్తున్నదని చెప్పటం 'బాబు'లిద్దరికీ మింగుడుపడటం లేదు.

---

## ఏ ప్రభుత్వం వచ్చినా విభజన హామీలపై దృష్టి పెట్టాలి


**మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్**



సాక్షి, రాజమహేంద్రవరం: 'ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లు పూర్తయింది. నేటికీ విభజన హామీలు పూర్తి స్థాయిలో అమలు కాలేదు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా విభజన సమస్యలపై దృష్టి సారించాలి' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కోరారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు, వైఎస్ జగన్ ప్రభుత్వాలు కాపాడలేకపోయాయి. 9, 10 షెడ్యూళ్ల ప్రకారం తెలంగాణలోని ఉమ్మడి ఆస్తులు రూ.1,42,601 కోట్లలో విభజన హామీల ప్రకారం 58 శాతం నిధులు ఏపీకి రావాలి. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఏపీకి తీరని అన్యాయం జరుగుతోంది. రిసోర్స్ గ్యాప్ రూ.32,652 కోట్లను కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉండగా.. రూ.5,617 కోట్లే ఇచ్చి చేతులు దులుపుకుంది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి రూ.24,350 కోట్లు ఇస్తామని ప్రకటించిన కేంద్రం.. రూ.1,750 కోట్లే ఇచ్చింది. ఏపీకి రూ.6,700 కోట్ల విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉన్నా తెలంగాణ ప్రభుత్వం స్పందించడం లేదు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా కేంద్రమే పూర్తి చేయాల్సి ఉంది. కానీ రాష్ట్రం అడిగితే ఇచ్చామని కేంద్రం లోక్‌సభలో చెప్పింది. కేంద్రమే ఇచ్చిందని రాష్ట్ర శాసనసభలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం చెప్పింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అడిగితే ఇచ్చారా? అడగకుండా ఇచ్చారా? వంటి అంశాలకు సంబంధించి లిఖిత పూర్వకంగా ఎక్కడా లేదు. డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడానికి కారకులు ఎవరు? అధికారుల వైఫల్యమా? తదితర విషయాలు తేల్చకుండా రాజకీయ నాయకులను బాధ్యులను చేయడం సరికాదు. రాష్ట్ర విభజన అంశంపై సుప్రీంకోర్టులో నేను వేసిన పిటిషన్‌పై వైఎస్ జగన్ ప్రభుత్వం కూడా అఫిడవిట్ దాఖలు చేసింది. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా పదేళ్ల సమయం ఉన్నా.. చంద్రబాబు ప్రభుత్వం ముందుగానే అమరావతికి వచ్చేసి సొంత దుకాణం పెట్టింది. దీంతో రాష్ట్ర పరిస్థితి దారుణంగా మారింది' అని అన్నారు.

## నాలుక్కర్చుకున్న ఇండియాటుడే- యాక్సిస్ మై ఇండియా

- రాష్ట్ర ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్‌పై విస్తుపోయిన రాజకీయ విశ్లేషకులు
- గ్రామీణ ప్రాంత ప్రజలు, మహిళలు అధిక శాతం వైఎస్సార్‌సీపీకే మద్దతుగా నిలిచారన్న రాజ్‌దీప్ సర్దేశాయ్
- మీరు చేసిన సర్వే సహేతుకంగా కన్పించడం లేదంటూ యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్‌గుప్తాకు చురక
- చంద్రబాబు అరెస్టుతో సానుభూతి, దక్షిణాది రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మార్చే సంప్రదాయం ఉందన్న ప్రదీప్ గుప్తా
- కేజ్రీవాల్, హేమంత్ సోరేన్ అరెస్టుతో ఢిల్లీ, జార్ఖండ్‌ల్లో సానుభూతి వచ్చినట్లు మీ సర్వేలో కన్పించలేదేం అంటూ నిలదీసిన రాహుల్ కన్వల్
- 2021లో పశ్చిమ్ బంగా, 2023లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్‌లో తప్పిన ఇండియాటుడే–యాక్సిస్ మైఇండియా అంచనా




ఇండియాటుడే యాక్సిస్ మై ఇండియా సర్వేలో వైఎస్సార్‌సీపీ గుర్తును చీపురుగా చూపిస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలపై వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్‌పై ఇండియాటుడే–యాక్సిస్ మై ఇండియా నాలుక్కర్చుకుంది. యాక్సిస్ మై ఇండియా నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌ను ఇండియా టుడే శనివారం ప్రసారం చేసింది. ఈ సర్వేపై దేశ వ్యాప్తంగా రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేయడంతో.. ఆదివారం ఇండియాటుడే టీవీలో చర్చ చేపట్టింది. 'ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసింది. ఐదేళ్లలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారిపోయాయి. డీబీటీ పథకాల ద్వారా రూ.2.70 లక్షల కోట్ల లబ్ధి పేదలకు నేరుగా చేరాయి. జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల పట్ల గ్రామీణ ప్రజలు..ముఖ్యంగా మహిళలు ఎక్కువగా ఆకర్షితులయ్యారు. వారంతా ఈ ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలిచారని అంచనా వేస్తున్నాం' అని ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్‌పై ఆదివారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ఏపీలో జరిగిన మార్పును నేను స్వయంగా చూసాను. పాఠశాలలు, ఆస్పత్రుల్లోచాలా మార్పు కన్పించిందన్నారు. ఈ నేపథ్యంలో మీరు చేసిన సర్వే సహేతుకంగా లేదన్నది స్పష్టమవుతోందంటూ యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్ గుప్తాకు రాజ్‌దీప్ సర్దేశాయ్ చురకలంటించారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడం వల్ల ప్రజల్లో సానుభూతి.. దక్షిణాది రాష్ట్రాల్లో ఐదేళ్లకు ఓ సారి ప్రభుత్వాన్ని మార్చే సాంప్రదాయం ఉండటం ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమికి అనుకూలించిందని ప్రదీప్ గుప్తా చెప్పారు. దీనిపై యాంకర్ రాహుల్ కన్వల్ స్పందిస్తూ.. కేజ్రీవాల్ అరెస్టు వల్ల ఢిల్లీ, పంజాబ్‌ల్లో.. హేమంత్ సోరేన్ అరెస్టు వల్ల జార్ఖండ్‌లో ప్రజల్లో సానుభూతి రాలేదా.. అక్కడ ఎగ్జిట్ పోల్స్‌లో అది ప్రతిబింబించలేదేం అంటూ ప్రదీప్ గుప్తాను నిలదీశారు. తమిళనాడులో జయలలిత.. తెలంగాణలో కేసీఆర్ వరుసగా రెండు సార్లు విజయం సాధించారని ఎత్తిచూపారు. వీటిని పరిశీలిస్తే.. మీ సర్వేలో శాస్త్రీయంగా లేదేమోనని అనుమానాలు వ్యక్తం చేయడంతో ప్రదీప్‌గుప్తా నీళ్లు నమిలారు. ఇండియాటుడే–యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్స్ 2021లో పశ్చిమ్ బంగాలోనూ అంచనాలు తప్పాయి. అక్కడ బీజేపీ విజయం సాధిస్తుందని తేల్చిచెప్పగా.. టీఎంసీ ఘనవిజయం సాధించింది. ఇక గతేడాది నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆ సంస్థ ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడించింది. కానీ.. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ ఘనవిజయం సాధించి, అధికారంలోకి వచ్చింది.

## క్లుప్తంగా...

### మళ్లీ జగనే సీఎం: ఎంపీ వైవీ



గోపాలపట్నం (విశాఖ జిల్లా): ప్రజల ఆశీస్సులతో వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చారు. ఎయిర్‌పోర్టులో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికలు వేరు..ఏపీలో వేరని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించేలా మంగళవారం ఫలితాలు రానున్నాయన్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తారన్న నమ్మకం ఉందన్నారు. పోలింగ్ తరువాత కూటమి నేతలు ఎలక్షన్ కమిషన్‌ను అడ్డం పెట్టుకుని కుట్రలు పన్నుతున్నారన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో కూడా ఆటంకాలు కలిగించే విధంగా ప్రణాళికలు చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయన్నారు. ఎగ్జిట్ పోల్స్‌ను పూర్తిగా నమ్మాల్సిన అవసరం లేదన్నారు. వైవీ సుబ్బారెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి అదారి ఆనంద్ కుమార్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మహిళా నేతలు ఘనంగా స్వాగతం పలికారు.

### మళ్లీ సీఎం వైఎస్ జగనే

మంత్రి రోజా



తిరుమల: ఎగ్జిట్ పోల్స్‌లో ఏమి వచ్చినా అంతిమ విజయం వైఎస్సార్‌సీపీదేనని రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఆమె కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలపై మీడియా, ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్‌లో ఏమి వచ్చినా చివరగా గెలుపు మాత్రం వైఎస్సార్‌సీపీదేనని, మళ్లీ వైఎస్ జగనే ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కూటమి కొత్తేం కాదని, 2014లో డబుల్ ఇంజిన్ ఉన్నా అభివృద్ధి శూన్యమని తెలుపుతూనే ప్రజలు ఈసారి కూటమిని విశ్వసించరన్నారు.

### వైఎస్సార్‌సీపీ వైపే ప్రజాస్పందన


- వైఎస్సార్‌సీపీ నేత రావెల కిశోర్‌బాబు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ వైపే ప్రజాస్పందన ఉందని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు స్పష్టం చేశారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం రావెల మీడియాతో మాట్లాడారు. ఏపీలో మళ్లీ స్పష్టమైన ఫలితాలు రాబోతున్నాయన్నారు. 'ప్రజల నాడి, హృదయ స్పందన వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నాయి. ఎగ్జిట్‌పోల్స్ అంటే టీడీపీ భయపడుతోంది. ప్రజాతీర్పు అంటే టీడీపీకి ఎందుకు భయం? ప్రజాతీర్పును గౌరవించడానికి, ఓటమిని స్వీకరించడానికి టీడీపీ సిద్ధంగా లేదు. వైఎస్ జగన్ సీఎం కాకుండా ఎవరూ అడ్డుకోలేరు' అని రావెల స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి సత్తా చాటిందన్నారు. వైఎస్ జగన్ తన పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక 99 శాతం అమలు చేశారన్నారు. దీంతో ఓటర్లు మరోసారి వైఎస్సార్‌సీపీకే ఓటేశారని ఎగ్జిట్ పోల్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. టీడీపీ.. బీజేపీతో కలిసి చట్టాలను చుట్టాలుగా మార్చుకుందని, ప్రజలు దీన్ని గమనించాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం వివాదాస్పద నిర్ణయాలపైన సుప్రీంకోర్టులో పోరాటం చేస్తామని తెలిపారు. చివరకు న్యాయమే గెలుస్తుందనే నమ్మకం తమకుందని వెల్లడించారు.

### ఎన్నికల్లో 3 పార్టీల నేతలు సమన్వయంతో పనిచేశారు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో కూటమిలోని మూడుపార్టీల నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పని చేశారని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. ఫలితాల్లో కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎగ్జిట్ పోల్స్ కూటమికి అనుకూలంగా వచ్చాయని చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందన్నారు. ఓటమి భయంతో కౌంటింగ్‌పై వైఎస్సార్‌సీపీ అర్థంలేని ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. కౌంటింగ్ రోజు కూటమి ఏజెంట్లు, అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని, కౌంటింగ్ కేంద్రానికి సమయానికి చేరుకోవాలని సూచించారు. అధికారులు నిబంధనలు పాటించేలా కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు పనిచేయాలని, ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి తెచ్చే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. పూర్తిస్థాయి ఫలితాలు వచ్చే వరకు ఎవరూ అశ్రద్ధ వహించకూడదని, కౌంటింగ్ పూర్తయ్యేవరకు ప్రతి ఏజెంట్ కౌంటింగ్ కేంద్రంలోనే ఉండాలని సూచించారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ మాట్లాడుతూ ఏపీలో ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందన్నారు. లెక్కింపులో అనుమానాలుంటే రీకౌంటింగ్ అడగాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

# ఏజెంట్లే కీలకం

## ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లాలి

## తుది ఫలితం ప్రకటించే దాకా హాల్ విడిచి వెళ్లకూడదు

సాక్షి, అమరావతి: ఓట్ల లెక్కింపు ముహూర్తం సమీపించడంతో కౌంటింగ్ ఏజెంట్ల పాత్ర కీలకం కానుంది. ఈ ప్రక్రియపై పూర్తి అవగాహనతో పాటు నిబంధనలపై పట్టున్న వ్యక్తులను ఎంపిక చేసి రాజకీయ పార్టీలు శిక్షణ ఇస్తున్నాయి. కౌంటింగ్ హాళ్లలో టీడీపీ ఘర్షణలకు దిగి ఉద్రిక్తత రేకెత్తించే ప్రణాళికలు రూపొందించినట్లు స్పష్టమవుతున్నందున వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పార్టీ నేతలు సూచిస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం రికార్డు అవుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని సంయమనం పాటించాలని పేర్కొంటున్నారు. టీడీపీ ఏజెంట్లు పదేపదే అభ్యంతరాలు, అనుమానాలు వ్యక్తం చేసినా వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత కౌంటింగ్ సూపర్‌వైజర్లు, రిటర్నింగ్ ఆఫీసర్లదే కాబట్టి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు పరిస్థితులను నిశితంగా గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏవైనా అభ్యంతరాలు, అనుమానాలుంటే కౌంటింగ్ ఏజెంట్లు కచ్చితంగా లిఖితపూర్వకంగా రిటర్నింగ్



అధికారికి ఫిర్యాదు అందజేసి అక్నాలెడ్జ్‌మెంట్ (ధ్రువీకరణ) పత్రం తీసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. నోటిమాటగా అభ్యంతరం తెలిపితే అది చట్టం ముందు నిలబడదు కాబట్టి ప్రతీది లిఖితపూర్వకంగా తెలియచేయడం తప్పనిసరి. వీవీ ప్యాట్‌లకు సంబంధించి ప్రతి నియోజకవర్గానికి ఐదు చొప్పున లాటరీ ద్వారా ఎంపిక చేసి లెక్కిస్తారు. ఈవీఎంలలో పడిన ఓట్లకు, వీవీ ప్యాట్లలో ఉన్న ఓట్లకు తేడా ఉంటే ఫైనల్‌గా వీవీ ప్యాట్లలోని ఓట్లనే పరిగణించాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది.

### రీ కౌంటింగ్ హక్కు

లెక్కింపు ప్రారంభంలోనే ఈవీఎంల సెక్యూరిటీని ఏజెంట్లు జాగ్రత్తగా పరిశీలించాలని, ప్రతి రౌండ్‌లోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఓట్ల లెక్కింపు మొదలైన క్షణం నుంచి చిట్ట చివరి వరకూ ఏజెంట్లు కేంద్రంలోనే ఉండాలి. లెక్కింపు పూర్తయి గెలిచిన అభ్యర్థి ధ్రువీకరణ పత్రం తీసుకున్న తర్వాతే బయటకు రావాలి. ఈవీఎంలలో ఓట్ల వివరాలు కౌంటింగ్ సిబ్బంది ద్వారా స్పష్టంగా వినిపించకపోతే ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకోవాలి. కౌంటింగ్‌లో అనుమానాలు తలెత్తితే రీ కౌంటింగ్ కోరే హక్కు ఏజెంట్లకు ఉంటుంది. మంగళవారం ఉదయం 8 గంటల కల్లా లెక్కింపు ప్రారంభం కానున్నందున ఏజెంట్లు ఉదయం 6 గంటల లోపే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలి. ఏజెంట్‌గా ఉంటున్న వ్యక్తులు భారత ప్రభుత్వ గుర్తింపు కార్డు, ఏజెంట్ నియామక పత్రం రెండూ తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలి. కౌంటింగ్ కేంద్రంలోకి ఫారం–17 సీ, పెన్ను లేదా పెన్సిల్, తెల్ల కాగితాన్ని మాత్రమే అనుమతిస్తున్నారు. సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను అనుమతించరు.

# కౌంటింగ్‌లో రెప్పవాల్చొద్దు

## ఏజెంట్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి: సజ్జల

- రూల్ ప్రకారం మనకి రావాల్సిన ప్రతి ఓటూ కచ్చితంగా దక్కాల్సిందే
- ఎలాంటి తప్పు గుర్తించినా వెంటనే అధికారుల దృష్టికి తేవాలి



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో డ్రామాలాడటం, తప్పుడు లెక్కలు చూపించడంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సిద్ధహస్తుడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. కౌంటింగ్ సందర్భంగా ప్రత్యర్థుల కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని, సంయమనం కోల్పోకుండా అనుక్షణం జాగ్రత్తగా వ్యవహరించాలని పార్టీ ఏజెంట్లకు సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన తీరుపై ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఏజెంట్లకు ఆయన వర్చువల్‌గా దిశానిర్దేశం చేశారు. 175 నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లు దీనికి హాజరయ్యారు. విశ్రాంత ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల ఏమన్నారంటే..

**రెప్పగొట్టి ఏమార్చే యత్నాలు..**

ప్రతీ ఓటు చాలా విలువైందనే విషయాన్ని ఏజెంట్లు మరచిపోవద్దు. ఎన్నికల నిబంధనల ప్రకారం మనకు రావాల్సిన ప్రతీ ఓటు పార్టీకి దక్కేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదైనా తప్పు జరిగితే వెంటనే అధికారుల దృష్టికి తేవాలి. పోస్టల్ బ్యాలెట్‌పై అధికారి సంతకం విషయంలో అనుమానం వస్తే వెంటనే స్పందించాలి. ప్రత్యర్థులు రెప్పగొట్టి మీ దృష్టి మళ్లించేందుకు చేసే ప్రయత్నాలపై జాగ్రత్తగా ఉండాలి. కచ్చితంగా మనమే గెలుస్తున్నాం. జాతీయ మీడియా సర్వేలను చూస్తుంటే నవ్వు వస్తోంది. తమిళనాడులో ఓ పార్టీ 9 సీట్లలో పోటీ చేస్తే 14 చోట్ల గెలుస్తుందని చెప్పుకొచ్చాయి. ఇలా నాలుగైదు రాష్ట్రాల్లో తప్పుడు లెక్కలేసి బీజేపీ కూటమి గెలుస్తుందని చెబుతున్నారు. ఇలాంటి విద్యలు ప్రదర్శించటంలో చంద్రబాబును మించిన వారులేరు. ఈసీనే బెదిరించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు.

**ఈవీఎంలపైనా జాగ్రత్త..**

ఈవీఎంల కౌంటింగ్‌లో కూడా ధ్యాస పెట్టి జాగ్రత్తగా పరిశీలించాలి. మనకు వచ్చినవి, ప్రత్యర్థులకు వచ్చినవి, స్వతంత్ర అభ్యర్థులకు లభించిన ఓట్లను సరిగ్గా నమోదు చేసుకుని సంఖ్య సరిచూడాలి. వివరాలు నమోదు చేసుకోకుండా ప్రత్యర్థులు మన దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేస్తారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలి.

### పోస్టల్ బ్యాలెట్లపై న్యాయ పోరాటం..

కౌంటింగ్ రోజు కుట్రలకు కూటమి పథకం వేస్తోంది. మన ప్రత్యర్థులు వ్యవస్థల్లోకి చొరబడి అధికారులను వారికి అనుగుణంగా మలుచుకుంటున్న నేపథ్యంలో ఏజెంట్లు మరింత అప్రమత్తంగా ఉండాలి. కౌంటింగ్ వేళ మనసు లగ్నం చేసి పని చేస్తూ బ్యాలెన్స్ దెబ్బ తినకుండా చూసుకోవాలి. ఒకవేళ అక్కడ ఏదైనా పొరపాటు జరిగితే రికార్డు అయి తీరాలి. పోస్టల్ బ్యాలెట్ వద్ద సంక్లిష్ట ప్రక్రియ ఉంది. ఇన్ వ్యాలిడ్ ఓటు (చెల్లనివి) పొరపాటున కూడా వ్యాలిడ్ కాకూడదు. వ్యాలిడ్ ఓటు ఇన్ వ్యాలిడ్ అవ్వకూడదు. కౌంటింగ్ విధానంపై అనుమానాలున్నా, కూడికలో తేడా వచ్చినా మళ్లీ చూపించమని అడగవచ్చు. దీన్ని పట్టించుకోకపోతే అబ్జర్వర్ దృష్టికి తేవాలి. పోస్టల్ బ్యాలెట్ కవర్లపై గెజిటెడ్ అధికారి సంతకం చేసి స్టాంప్ వేయాలి. స్టాంప్ వేయకపోతే ఆయన ఎక్కడ పని చేస్తున్నారో స్వయంగా చేతిరాతతో రాసి సంతకం చేస్తే అనుమతించాలని ఈసీ సూచించింది. కానీ ఏపీ సీఈవో మాత్రం చేతితో డిజిగ్నేషన్ (హోదా) రాయకపోతే స్పెసిమన్ సంతకాలు కలెక్ట్ చేసి కౌంటింగ్ అధికారులకు ఇవ్వాలని, ఆ విధంగా చెక్ చేసుకోవాలని తాజాగా ఆదేశాలిచ్చారు. మరి ఈ సంతకం ఎవరిదని తెలుస్తుంది? దీనిపై పార్టీ తరపున అభ్యంతరం చెబుతున్నాం. దేశంలో ఎక్కడా లేని నిబంధన ఇక్కడ తెచ్చారు. దీనిపై మన పార్టీ న్యాయ పోరాటం చేస్తోంది. సుప్రీం కోర్టులో కేసు వేస్తున్నాం. ఏ తీర్పు వస్తుందనేది సోమవారం నాటికి తెలుస్తుంది. ఒకవేళ రిలీఫ్ వస్తే సంతకంతోపాటు డిటెయిల్స్ కానీ, సీల్ కానీ ఉండాల్సి ఉంటుంది. దీనిపై స్పష్టత రాగానే మళ్లీ తెలియజేస్తాం.

### బీజేపీ టార్గెట్‌కు అనుగుణంగా ఫిగర్స్

సర్వేల అడ్డగోలు లెక్కలు చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంది. సర్వే సంస్థలు జాతీయ స్థాయిలో బీజేపీకి 400 సీట్లు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నట్లుగా ఉంది. అందుకు అనుగుణంగా సర్వే లెక్కలు ఇచ్చుకుంటూ వెళ్లినట్లు కనిపిస్తోంది. ఇండియా టుడే సర్వే చూస్తే మరింత ఆశ్చర్యమేస్తుంది. పొత్తులో ఉంటే చాలు.. పోటీ చేసిన స్థానాల కన్నా ఎక్కువగా ఫలితాల్లో చూపారు. బిహార్‌లో అలాగే చేశారు. మనకు సంబంధించి రెండు ఇచ్చారు. ఒడిశాలో సున్నా ఇచ్చారు. బీజేపీ 400 సీట్ల టార్గెట్‌కు అనుగుణంగా ఫిగర్స్ ఇచ్చుకుంటూ వెళ్లారు. ఇలా చేసి ఈ రెండు రోజుల్లో వీళ్లు ఏం సాధిస్తారో అర్థం కావట్లేదు. ఈవీఎంలో నమోదైన వాటిని వీళ్లు ఏం చేయగలుగుతారు? అధికారంలో వాళ్ల చేతిలో ఉంది కాబట్టి కౌంటింగ్‌లో ఏమైనా మిస్‌యూజ్ చేయటానికి అవకాశం ఉందా? అనే డౌట్ వస్తోంది. వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబుకి వాళ్ల జోడీ దొరికిన తర్వాత ఏమైనా చేసే అవకాశం ఉంది. ఎన్నికల కమిషన్ ద్వారా ఇబ్బందులు కల్పిస్తున్నారు. ఎదుటివారికి ఇబ్బందులు కలిగించడంలో చంద్రబాబు పీహెచ్‌డీ పొందారు కాబట్టి మనం చాలా చాలా అలర్ట్‌గా ఉండాలి. మన పార్టీ నేతలు కేంద్ర కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు అందుబాటులో ఉంటారు.

### తేడా వస్తే మళ్లీ అడగండి

- ఏజెంట్లకు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి సూచన
- నోటా, ఇండిపెండెంట్ అభ్యర్థుల ఓట్లపై జాగ్రత్త
- అజాగ్రత్తగా ఉంటే ఫలితాలు తారుమారయ్యే ప్రమాదం



సాక్షి, అమరావతి: కౌంటింగ్ జరుగుతున్న విధానంపై అనుమానాలున్నా, కూడికల్లో తేడా వచ్చినా మళ్లీ చూపించాలని సంబంధిత అధికారిని ఏజెంట్లు కోరవచ్చని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఒకవేళ ఈ విజ్ఞప్తిని పట్టించుకోకుంటే అబ్జర్వర్ దృష్టికి తెచ్చి రాతపూర్వకంగా తెలియచేయాలి. ప్రతి రౌండ్ కౌంటింగ్ పూర్తయిన తర్వాత అబ్జర్వర్ ర్యాండమ్‌గా ఏవైనా రెండు కంట్రోల్ యూనిట్లను ఎంచుకొని సంబంధిత టేబుల్ ఇన్‌చార్జ్ వద్ద ఉన్న ఫలితాలతో తనిఖీ చేసి సరిపోయాయో లేదో నిర్ధారించుకుంటారు. రెచ్చగొట్టి బయటకు పంపేలా టీడీపీ ఏజెంట్లు ఎన్నికల అధికారుల ద్వారా ప్రయత్నించినా వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు సంయమనం పాటించాలి' అని ఆయన సూచించారు. ఎక్కడా ఆవేశాలకు గురి కావొద్దన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈవీఎంల కౌంటింగ్ ఉదయం 8.30 నుంచి 9.30 లోపు ప్రారంభం అయ్యేలా చూడాలన్నారు. చివరి నిమిషంలో కూడా ప్రత్యర్థులు కుతంత్రాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నోటా, ఇండిపెండెంట్ అభ్యర్థుల ఓట్లను వారి ఖాతాల్లో కలిపేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒక్కో రౌండ్‌లో ఇలా స్వల్ప ఓట్లు వెళ్లిపోయినా పోటాపోటీ ఉన్నచోట ఫలితాలు తారుమారయ్యే ఆస్కారం ఉందన్నారు. ప్రతి రౌండ్‌లో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో జాగ్రత్తగా సరి చూసుకున్నాకే సంతకం పెట్టాలని సూచించారు.

# మళ్లీ ఘన విజయం ఖాయం

- రేపు ఉదయం 8 వరకు కూటమి ఊహల్లో విహరించవచ్చు: సజ్జల
- ఆ తర్వాత సంబరాలు చేసుకునేది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే
- ఘోర ఓటమిని గ్రహించే పోలింగ్ నుంచి చంద్రబాబు నిశ్శబ్దం
- కౌంటింగ్ అధికారులనూ లొంగదీసుకోవడానికి కుట్ర

సాక్షి, అమరావతి: ఐదేళ్లుగా సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనకు మెచ్చిన ప్రజలు వైఎస్సార్‌సీపీకి మరోసారి అఖండ విజయాన్ని చేకూరుస్తున్నారని పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. జాతీయ, రాష్ట్ర మీడియా సంస్థలు, సర్వే సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్‌సీపీకి సానుకూలత ఉన్నట్లు ఇప్పటికే వెల్లడైందని, అవి ఊహించిన దానికంటే అధిక స్థానాలను దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. నిరంతరం మీడియాలో ప్రచారం కోసం వెంపర్లాడే చంద్రబాబు ఘోర ఓటమిని గ్రహించే పోలింగ్ నుంచి ఇప్పటిదాకా నిశ్శబ్దంగా ఉండిపోయారని చెప్పారు. బీజేపీ భజన చేసే రెండు మూడు జాతీయ మీడియా సంస్థలు రాష్ట్రంలో ఎన్డీయేకు అనుకూలంగా ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయని, వాటిని చూసి టీడీపీ సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదం అని అన్నారు. ఈనెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు రోజు ఉదయం 8 గంటల వరకూ వారు సంబరాలు చేసుకోవచ్చని వ్యంగ్యోక్తులు విసిరారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోతే టీడీపీ కార్యాలయంలో శ్మశాన నిశ్శబ్దం నెలకొంటుందని వ్యాఖ్యానించారు.

**ఈసీని అడ్డుపెట్టుకుని డ్రామాలు**

ప్రతిపక్షంలో ఉండి కూడా వ్యవస్థలను మేనేజ్ చేసిన చంద్రబాబు ఈసీని అడ్డుపెట్టుకుని డ్రామాలాడుతున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. ఓట్ల లెక్కింపులోనూ అరాచకాలకు పాల్పడేందుకు చంద్రబాబు చేస్తున్న కుట్రల పట్ల వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మరోసారి ఘనవిజయం సాధించడం ఖాయమని జాతీయ మీడియా, రాష్ట్ర మీడియా, సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడిస్తే కొన్ని జాతీయ మీడియా సంస్థలు ప్రజల్లో గందరగోళం సృష్టించేలా ఎన్డీయే భజన చేశాయని విమర్శించారు. వాటిని చూస్తే నవ్వొస్తోందన్నారు. తమిళనాడులో కాంగ్రెస్ తొమ్మిది చోట్ల పోటీ చేస్తే 13 స్థానాల్లో విజయం సాధిస్తుందని చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానాలోనూ ఉన్న లోక్‌సభ స్థానాల కంటే ఎన్డీయే ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తుందని వెల్లడించాయన్నారు. తప్పుల తడక లాంటి ఆ ఎగ్జిట్ పోల్స్‌కు ఎలాంటి విశ్వసనీయత లేదని సజ్జల స్పష్టం చేశారు. కచ్చితంగా వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు.


## నిబంధనలకు విరుద్ధంగా కొండారెడ్డి దరఖాస్తు

### ఎన్నికల ఏజెంట్‌గా నియమించాలంటూ దరఖాస్తు



నంద్యాల కొండారెడ్డి

ప్రొద్దుటూరు: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి నంద్యాల వరద రాజులరెడ్డి కుమారుడు కొండారెడ్డి తనను ఎన్నికల ఏజెంట్‌గా నియమించాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో గన్‌మెన్ సౌకర్యం ఉన్న నేతలు ఏజెంట్లుగా కూర్చోడానికి వీలులేదు. కొండారెడ్డికి టు ప్లస్ టు గన్‌మెన్ సౌకర్యం కొనసాగుతోంది. గతంలో ఒక సీబీఐ కేసుకు సంబంధించి గన్‌మెన్‌ను నియమించారు. అయినా కొండారెడ్డి మంగళవారం కడపలో జరిగే ఎన్నికల కౌంటింగ్‌కు ఏజెంట్‌గా నియమించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంపై ఏఈఆర్‌వో విద్యాసాగర్‌ను 'సాక్షి' అడగగా.. కొండారెడ్డికి గన్‌మెన్ సౌకర్యం ఉన్న విషయాన్ని పరిశీలించాలని డీఎస్పీ మురళీధర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. డీఎస్పీ నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



Chairperson and Members of ... Corporation.
Persons receiving any honorarium from Government or Persons working on part time in any Govt./ Govt. Aided Institutions.
Para Medical/Healthcare staff working in Govt./Govt. Aided institutions, Fair Price Shop dealers, Anganwadi Employees.
Persons in the service of the Government [This is an offence and Under Section 134-A of the R.P. Act 1951 and such appointees are punishable with imprisonment for a term which may extend to 3 (three) months, or with fine, or with both]
There is no prohibition against appointment of Gram Panchayat Pradhan/Gram Panchayat Sarpanch/Panchayat members, Councilors or Members of Municipal Corporation or Municipality and local persons, who are residents of the constituency ... There is no prohibition in appointing an NRI ...
Any other person having security cover provided by the State (both Union and State Govt.) shall not be allowed to act as Election Agent or Counting Agent of any candidate during an election even if they surrender or decide to relinquish their security.
Further, such person cannot enter the counting hall along with ...
However, if such person happens to be a contesting candidate, who has been provided with armed security personnel, gives an undertaking that he is surrendering his armed security personnel on his own voluntarily to be able to sit in the counting hall, such persons shall be allowed to sit.
Number of Counting Agents per candidate:
Each candidate has been allowed to appoint as many counting agents as there are counting tables and one more to watch the counting at the Returning Officer's table. Under the instructions of ECI not more than fourteen tables in addition to one table for the Returning Officer can be provided for counting in one counting hall. Thus, ...

గన్‌మెన్ సౌకర్యం ఉన్నవారిని ఎన్నికల ఏజెంట్లుగా నియమించవద్దని ఉన్న ఎన్నికల కమిషన్ నిబంధన

## దళితులపై కారంచేడు తరహా దాడులకు టీడీపీ కుట్ర

- ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తే.. అమలు చేసే ఆలోచన
- దళితులకు ఏమన్నా జరిగితే ఎన్నికల సంఘం, డీజీపీలదే బాధ్యత
- మాలమహానాడు, ఏపీ ఎమ్మార్పీఎస్ నేతలు



మాట్లాడుతున్న జాన్ కెనడీ. పక్కన సురేష్, శ్రీనివాస్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ మెజార్టీ సాధించిన తర్వాత దళితులపై తెలుగుదేశం పార్టీ నాయకులు దాడులకు పాల్పడేందుకు కుట్రలు పన్నుతున్నారని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి జయప్రకాష్ కెనడీ విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ హయాంలో దళితులు, మైనార్టీలు, బీసీల సంక్షేమం జరిగిందని, అందువల్లనే ఈ ఎన్నికల్లో ఆయా వర్గాలన్నీ వైఎస్సార్‌సీపీకే మద్దతుగా నిలిచాయని చెప్పారు. పోలింగ్ జరుగుతున్న రోజే ఈ విషయాన్ని గుర్తించిన టీడీపీ నాయకులు పలు జిల్లాల్లో దళితులపై దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్రంలో దళితులు, మైనార్టీలు, బీసీలకు సీఎం జగన్ సంక్షేమ పథకాలతో మేలు చేశారని, అందుకు కృతజ్ఞతగా ఈ ఎన్నికల్లో దళితులు, మైనార్టీలు, బీసీలు ఆయనకు అండగా ఉన్నారని తెలిపారు. అది సహించలేని టీడీపీ.. దళితులపై దాడులు చేయాలనే ఆలోచనల్లో ఉన్నట్లుగా తమకు సమాచారం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 30 ఏళ్ల కిందటి కారంచేడు వంటి ఘటనలు పునరావృతం చేయడానికి టీడీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని జయప్రకాష్ కెనడీ ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇచ్చిన ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకునే హక్కు దళితులకు లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత దళితులపై దాడులు జరగకుండా ఎలక్షన్ కమిషన్, డీజీపీ పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర జేఏసీ కన్వీనర్ మేదర సురేష్ మాట్లాడుతూ టీడీపీ నేతలు పోలింగ్ రోజున దళితులపై దాడులకు తెగబడుతున్నా ఎలక్షన్ కమిషన్ ప్రేక్షకపాత్ర వహించిందని విమర్శించారు. ఎన్నికల ఫలితాల తర్వాత దళితులపై దాడులు జరిగితే దానికి ఎలక్షన్ కమిషన్, డీజీపీలే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో విజయవాడ మాలమహానాడు నగర అధ్యక్షుడు చేపూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అవాంతరాలను ఉపేక్షించొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. ఎన్నికల్లో తీవ్రమైన పోటీ నెలకొన్న దృష్ట్యా ఓట్ల లెక్కింపు జరిగే 4వ తేదీతో పాటు దానికి ముందు, తర్వాత రోజుల్లో భావోద్వేగాలు అదుపుతప్పే అవకాశం ఉందన్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఉత్పన్నం కాకుండా, వాటి ప్రభావం ఓట్ల లెక్కింపు కార్యక్రమాలపై ఉండకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఏమాత్రం రాజీపడకుండా కఠినంగా వ్యవహరించాలని మీనా సూచించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

**కౌంటింగ్ పూర్తికాగానే ఈవీఎంలను భద్రపర్చాలి**

ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే వాయిదా వేయకుండా అదేరోజు ప్రతి ఈవీఎంకు సీల్‌వేసి భద్రపర్చాలి. ఫలితాల ప్రకటనకు సంబంధించిన ఫారం–21సి/21ఇ లు ఓట్ల లెక్కింపు పూర్తయిన మరుసటి రోజే ఈసీఐకి చేరేలా చేపట్టాల్సిన చర్యలపై మార్గదర్శకాలను జారీచేశాం. అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలి. ఇండెక్స్ కార్డులో ఎలాంటి తప్పులకు ఆస్కారంలేకుండా ఎంతో జాగ్రత్తగా ఆ కార్డును పూరించాలి. ఆయా కార్డులు అన్నీ ఈనెల 8లోపు మా కార్యాలయానికి అందజేయాలి.

**ప్రతి టేబుల్ వద్ద ఒక్కో ఏజెంట్**

ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక ఏజెంట్‌ను నియమించుకునే అవకాశాన్ని కల్పించాలి. అయితే, ఆర్వో టేబుల్ వద్ద అభ్యర్థి లేనప్పుడు మాత్రమే ఒక ఏజెంట్‌కు అవకాశం కల్పించాలి. కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చే ఏజెంట్ చేతిలో ఫారం–17సి, పెన్ను లేక పెన్సిల్, ప్లెయిన్ పేపర్ మాత్రమే ఉండేలా చూడాలి. అంతకుమించి ఏమున్నా అనుమతించొద్దు. అథారిటీ లెటర్లు కలిగిన పాత్రికేయులు అందరినీ మీడియా కేంద్రంలోకి అనుమతించాలి. వారు సెల్‌ఫోన్ కలిగి ఉన్నప్పటికీ అభ్యంతరం చెప్పొద్దు. కౌంటింగ్ సెంటర్‌లోకి మాత్రం సెల్‌ఫోన్‌తో వారిని అనుమతించడానికి వీల్లేదు.

**కౌంటింగ్‌కు పటిష్ట చర్యలు**

ఓట్ల లెక్కింపు కేంద్రాలు అన్నీ ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. అందుకు తగ్గట్లుగా అగ్నిమాపక శాఖ నుండి ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పొందాలి. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ప్రవేశం, నిష్క్రమణ ప్రణాళికను పటిష్టంగా ఏర్పాట్లుచేసుకోవాలి. ఈ ప్రణాళికకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తప్పనిసరిగా ఉండాలి. అదే విధంగా ప్రవేశం, నిష్క్రమణ ద్వారాలను తెలిపే సైన్ బోర్డులను అన్నిచోట్లా ఏర్పాటుచేయాలి. మొత్తం మీద ఓట్ల లెక్కింపు కార్యక్రమం విజయవంతానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలి. అదనపు సీఈఓలు పి. కోటేశ్వరరావు, సీఈఓ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జాయింట్ సీఈఓ ఎస్. వెంకటేశ్వరరావుతో పాటు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు వారి జిల్లాల నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## టీడీపీ నేత తోటలో పెట్రోల్ బాంబుల ముడి సరుకు లభ్యం

పల్నాడు జిల్లాలో కలకలం



పెట్రోల్ బాంబుల కోసం దాచిన ముడి సరుకు

రాజుపాలెం: పల్నాడు జిల్లాలోని రాజుపాలెం మండలంలో టీడీపీ నాయకుడి తోటలో పెట్రోలు బాంబుల తయారీకి ఉపయోగించే సరుకు లభించింది. దీంతో జిల్లా అంతటా కలకలం రేగింది. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసులు రాజుపాలెం మండలంలోని ప్రతి గ్రామంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలోని టీడీపీ నాయకుడు గుర్రాల జగన్‌మోహన్‌రావు, ఆయన తండ్రి సుధాకర్‌రావుకు చెందిన నిమ్మతోట, సపోట తోటలోని గడ్డివాముల్లో ఆదివారం పోలీసులు తనిఖీలు చేయగా, తొమ్మిది మద్యం క్వార్టర్ బాటిళ్లు, 4 లీటర్ల పెట్రోలు, 2 లీటర్లు పెట్రోలు కలిగిన బాటిళ్లు, ఒత్తులు కలిగిన 8 బీరు సీసాలు, ఒత్తులు కలిగిన 8 క్వార్టర్ సీసాలు లభ్యమయ్యాయి. పోలీసు అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. గుర్రాల జగన్‌మోహన్‌రావుతోపాటు ఆయన తండ్రి గుర్రాల సుధాకర్‌రావులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ షమీర్‌బాషా తెలిపారు.



మీ సిద్ధాంతం మీ ప్రయోగంతో ఏకీభవించకపోతే, అది తప్పు. అది ఎంత అందమైనదైనా అక్కరకు రానిదే.
– రిచర్డ్ ఫెయిన్‌మాన్



సాక్షి
సోమవారం, 3 జూన్ 2024

# వాన జ్ఞానం

ప్రపంచమంతటా సృష్టిగాథలు ఒక్కలానే ఉంటాయి. ఆదిలో అంతా జలమయమే. ఎందు కనీ? వర్షాలు... క్షణం తెరిపివ్వని వర్షాలు... బ్రహ్మాండమంత కుండతో ఎత్తిపోసినట్టు నిరంతర ధారాపాతాలు... ఆ తర్వాత ఎప్పుడో సూర్యుడూ, చంద్రుడూ, నక్షత్రాలూ పుట్టాయి. భూమి పైకి తేలింది. జీవి పుట్టింది. మనిషితో సహా రకరకాల రూపాల్లోకి పరిణామం చెందింది. వర్షం పడుతూనే ఉంది కానీ, నిర్విరామం నుంచి విరామానికి మారింది. చెప్పొచ్చేదేమిటంటే, వర్షం సృష్టి అంత ప్రాచీనం; ప్రకృతి అంత పురాతనం.

మనిషి పుట్టిన చోటనే ఎప్పుడూ లేడు కనుక భ్రమణజీవి; అంతకన్నా ఎక్కువగా భ్రమల జీవి. తను ప్రకృతిలో భాగమన్న సంగతి మరచి; తన జీవితానికి, తన నిర్ణయాలకు తనే కర్త నన్న భ్రమ వాటిలో ఒకటి. శీతోష్ణాలను మించి ఆ భ్రమను పటాపంచలు చేయగలిగింది వర్షాలే. మనం బయటికి వెళ్లడానికి సిద్ధమవుతాం. ఆకాశం మబ్బు పట్టి ఉన్నా వర్షం రాదులే అన్న భ్రమతో గడప దాటుతాం. చినుకుతో మొదలై చూస్తుండగానే ఆకాశానికి చిల్లిపడిందా అన్నంత ఉధృతితో వర్షం ముంచెత్తుతుంది. చెట్టు కిందికో, చూరు కిందికో, మరో కప్పు కిందికో పరుగుతీస్తాం. వర్షనిర్బంధం నుంచి బయటపడడానికి నిలువుకాళ్ళ తపస్సు చేస్తాం. మనలానే, మనపక్కకి ఎవరెవరో అపరిచితులు వచ్చి చేరతారు. మాటలు కలుస్తాయి, ముచ్చట్లుగా మారతాయి, స్నేహాలను అల్లుకుంటాయి, ప్రేమలు మొలకెత్తుతాయి, అవి పెళ్లిళ్లకూ దారితీయవచ్చు. ఒక్కోసారి ఒకే ఒక్క వర్షం ఊహించని సన్నివేశాలను కల్పించి జీవితాలను పెద్దమలుపు తిప్పచ్చు.

ప్రపంచ సాహిత్యంలో వర్షానుభవాన్ని చిత్రించని కథా, కావ్యం, నవలా దాదాపు ఉండవు. మనిషి బుద్ధిని బంకలా పట్టుకున్న మృగత్వం, కులమతాల భేదాలు, ధనిక, నిర్ధనిక తారతమ్యాలు, చదువు, అధికారంతో పుట్టే దుర్గర్వాలు సహా అన్ని రకాల మురికినీ, మకిలినీ కడిగి శుభ్రం చేసి మళ్ళీ మనిషిని చేయగల మంత్రజలం వర్షం. సమాజం గురించి మనుషుల గురించి నిశ్చితాభిప్రాయాల ఇరుకులో కరకుదేరిన అడ్వొకేట్ రావునూ, అతను చీదరించుకున్న బిచ్చగత్తెనూ ఒకచోటికి చేర్చిన పాలగుమ్మి పద్మరాజు కథ 'గాలివాన'నే చూడండి. ఆ క్షణంలో అతనికి అవసరమైన ఆ బిచ్చగత్తె ఆలింగనపు వెచ్చదనం అందించి అతనిలోని అరవయ్యేళ్ళ అజ్ఞానాహంకారాల జడలమర్రిని ఒక్క గాలివాన కూకటివేళ్ళతో కుప్పకూల్చింది. అతని బతుకు పలకను స్వచ్ఛజలాలతో పూర్తిగా ప్రక్షాళించి మానవత్వపు కొత్త ఓనమాలు దిద్దించింది. దాశరథి రంగాచార్య కథ 'తామరపూలు'లో చిట్టిపంతులికి తామరలే లోకం. ఋతుభ్రమణం గురించిన జ్ఞానం లేని ఆ అబ్బాయి ఎండాకాలంలో అవి కనిపించకపోయేటప్పటికి కలవరపడిపోయాడు. వానలు పడి తిరిగి కనిపించేవరకూ వాటికోసం ఒక జీవితకాలపు నిరీక్షణ. అలా ప్రకృతిపాఠాల బోధనలో వాన జ్ఞానకళిక అయింది. సొగసుతోపాటు ప్రకృతిలోని లయను, సమవర్తనను, ఒక్కోసారి అవి కలిగించే విషాదం గురించిన ఎరుకను తట్టిలేపే కథ మహేంద్ర రచించిన 'హొగినేకల్'. ఓ కుటుంబం ఆ కావేరి జలపాతాన్ని చూడడానికి చిన్న పాపను తీసుకుని వానను వెంటబెట్టుకుని వెళ్లింది. కావేరికి వరదెత్తి ఆ వరదలో పాప కొట్టుకుపోయింది. జీర్ణించుకోవడం కష్టమే కానీ; 'ఇదే ప్రకృతి. ఇదే ప్రకృతిధర్మం. అది మంచిదీ కాదు, చెడ్డదీ కాదు; దాని దృష్టిలో అన్నీ సమానం. సృష్టిని అంగీకరించే మనిషి, లయను కూడా అంగీకరిస్తే పెనుగులాట ఉండ'దంటుందీ కథ. వాన మన వ్యక్తిత్వాలకు, ఆలోచనలకు ఒక స్పష్టతనివ్వడానికి కూడా ఎలా నేపథ్యమవుతుందో కుప్పిలి పద్మ కథ 'గోడ' చెబుతుంది. 'వాన. తూర్పు సముద్రపు కెరటాల నురగల మీద వాన. యారాడ కొండల గరిక మీద వాన. రుషికొండ ఎగుడుదిగుడుల మీద వాన...' అని మొదలయ్యే ఈ కథలో స్వతంత్రభావాలు కలిగిన ఒక అమ్మాయి తనతో చదువుకున్న ఒక అబ్బాయి గదిలో ఆ వర్షపురాత్రిని గడపాల్సివస్తుంది. అతనిలో మగాడు నిద్రలేచి హద్దుమీరబోతే ఆ అమ్మాయి వారించి గట్టిగా బుద్ధి చెబుతుంది. మహమ్మద్ ఖదీర్ బాబు అద్భుతంగా పునఃకథనం చేసి సవ్యాఖ్యానంగా సంకలనం చేసిన 'నూరేళ్ళ తెలుగు కథ'లో ఈ నాలుగు కథలూ చేరాయి.

సహస్ర బాహువులతో జలఖడ్గాలు దూసి, ఉరుముల పెనుగర్జనలతో, మెరుపుల మిరుమిట్లతో వర్షం ఊరూవాడా ఆక్రమించుకుని జనాన్ని గృహనిర్బంధంలో ఉంచినప్పుడు ఇంకెన్ని చిత్రవిచిత్ర సన్నివేశాలు ఏర్పడగలవో తిలక్ కథ 'ఊరి చివరి ఇల్లు' చెబుతుంది. అలాంటి ఓ వర్షపురాత్రి ఒక ఆగంతక యువకుని రాక దుఃఖపూరితమైన ఒక యువతి జీవితంలో కొత్త ఆశా, ఉత్సాహాల జడివానగా మారి తెల్లవారేసరికి వానతోపాటే అదీ వెలసి అయ్యో అనిపిస్తుంది. వర్షం కలిగించే అలజడి సరే, అంతకన్నా ఎక్కువగా వర్షాభావం సృష్టించే కన్నీటి జలపాతాల సంగతేమిటి? తల్లావజ్ఝుల పతంజలి శాస్త్రి గారి 'ఆమె దనంతపురం', 'పిచ్చి లచ్చమ్మ', 'కదిరమ్మ పేరంటాలు' కథలు ఆ విషాద పార్శ్వాన్ని అనితరసాధ్యంగా అక్షరబద్ధం చేస్తాయి.

మరిన్నికొత్త అనుభవాలను మబ్బులతో మూటగట్టి మళ్ళీ వర్షరుతువు వస్తోంది. అవి తీపినే నింపాలని కోరుకుంటూ హర్షోల్లాసాలతో పునఃస్వాగతం చెబుదాం.

## గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.ద్వాదశి రా.11.05 వరకు, తదుపరి త్రయోదశి **నక్షత్రం:** అశ్విని రా.11.20 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.7.35 నుండి 9.05 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.24 నుండి 1.16 వరకు తదుపరి ప.3.00 నుండి 3.52 వరకు, **అమృతఘడియలు:** సా.4.33 నుండి 5.56 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.27
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

# శత్రు దేశాల గూఢచారి మిత్రులు

**ఒకరిది భారత్, మరొకరిది పాకిస్తాన్. ఒకరిది 'రా', ఇంకొకరిది 'ఐఎస్ఐ.' వారిద్దరూ ఒకప్పుడు వైరి దేశాల గూఢచార సంస్థల అధిపతులు. ఇద్దరూ కలిసి తాజాగా 'కోవర్ట్: ద సైకాలజీ ఆఫ్ వార్ అండ్ పీస్' అనే పుస్తకం రాశారు. వాళ్లమధ్య అసలీ స్నేహం ఎలా మొదలైంది? ఇంతకీ ఈ పుస్తకంలో ఏం ఉంది? చాలానే ఉన్నాయి. గూఢచారి అధినేతల ఆంతరంగిక జీవితాలు, ప్రేరణలు, అంతర్లీన మానసిక స్థితుల అన్వేషణ అది. అంతేకాదు, భారత్-పాక్ దేశాల శాంతి సాధనకు తమ తమ దేశాల పట్ల చిన్నపాటి అవిధేయ సంకేతం కూడా లేకుండా వారు ముందుకు వెళ్లిన మనోహరమైన విధానం కూడా పుస్తకంలో కనిపిస్తుంది.**

కామెంట్



కరణ్ థాపర్

బహుశా జాన్ లి కరే(గూఢచర్య కథాంశాల బ్రిటన్ రచయిత) కూడా దీనినొక ఏమాత్రం నమ్మదగని అసంభవంగా భావించి ఉండేవారు. సి.ఐ.ఎ.(అమెరికా నిఘా సంస్థ), కె.జి.బి.(రష్యా నిఘా సంస్థ)ల అధినేతలు కలిసి పని చేసేందుకు ఒక అంగీకారానికి రావటమే ఇది. కానీ నమ్మేందుకు కష్టంగా ఉన్నా, దక్షిణాసియాలో ఇటువంటిదే ఒకటి ఇంకా ఎవరూ గుర్తించకుండా, ఎవరి గమనింపునకూ రాకుండా సంభవించింది. భారత్-పాకిస్తాన్‌ల గూఢచారి సంస్థలైన 'రా' (రీసెర్చ్ అండ్ ఎనాలిస్ వింగ్), ఐ.ఎస్.ఐ. (ఇంటర్-సర్వీసెస్ ఇంటిలిజెన్స్)ల మాజీ అధిపతులు స్నేహితులుగా మారి తాము ఉమ్మడిగా కలిసి రాసిన పుస్తకాలకు పరస్పరం సహకరించుకున్నారు. అమర్‌జీత్ సింగ్ దులత్, జనరల్ అసద్ దుర్రానీ తమ తాజా పుస్తకం 'కోవర్ట్: ద సైకాలజీ ఆఫ్ వార్ అండ్ పీస్'ను ఈ నెలలో ఆవిష్కరించారు (నీల్ క్రిషణ్ అగర్వాల్ మరో సహ రచయిత). వారి మొదటి పుస్తకానికి 'ద స్పై క్రానికల్స్' అని సముచితమైన పేరే పెట్టారు.


ఈ అనుబంధం ఎలా మొదలైంది? చూస్తుంటే బ్యాంకాక్‌లోని ఛావ్ ప్రాయా నదిపై ఒక చిన్న నౌకలో మొదలైనట్లుంది. ఉగ్రవాదంపై ఒక అనధికార చర్చా కార్యక్రమానికి వాళ్లిద్దరూ ఆ నౌకలోని ఆహ్వానితులు. దులత్‌ని మాట్లాడమని ఆహ్వానించారు. ఇలాంటి చర్చా కార్యక్రమాలకు ఆయన కొత్త కనుక సంకోచంగా, అనాసక్తిగా ఉండిపోయారు. దుర్రానీ ఆ సంగతి గమనించి దులత్‌కు మద్దతుగా నిలిచారు. ఆ సందర్భం గురించి దులత్... తమ మధ్య 'కెమిస్ట్రీ' కుదిరిందని అంటారు. ఆ తర్వాత అనతికాలంలోనే వారిద్దరూ స్నేహితులైపోయారు.

'కోవర్ట్' పుస్తకం ఆ ఇద్దరి మధ్య సారూప్యాలను, వైరుధ్యాలను వెల్లడిస్తుంది. చిన్నతనంలో దుర్రానీ "ఎల్లప్పుడూ ఒంటరిగా ఉండటాన్ని ఇష్టపడేవారు". పెద్దయ్యాక కూడా "సమూహంలో భాగం కావాలని కోరుకోలేదు". చిన్నవాడిగా ఉన్నప్పుడు దులత్‌కు కొద్ది మంది స్నేహితులు ఉండేవారు. వారిలో "ఎక్కువగా పనివాళ్ల పిల్లలు". ఆయన మాటల్లోనే చెప్పాలంటే... "తనకై తను ఉండగలగటం, తనను తను కాపాడుకోవటం నేర్చుకున్నారు".

ఇక భవిష్యత్తు ఐఎస్ఐ చీఫ్... స్కూల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచేవాడు. "నేను ఎల్లప్పుడూ దాదాపు ప్రతి సబ్జెక్టులో మొదటి నలుగురు లేదా ఐదుగురిలో ఒకరిగా ఉండేవాడిని" అంటారాయన. దులత్ అందుకు విరుద్ధం. ఆయన "చాలా సగటు విద్యార్థి". కానీ ఈ భవిష్యత్తు 'రా' అధిపతి క్రీడల్లో తన తడాకా చూపించారు. స్కూల్లో ఆయన "ప్రతి ఆటా ఆడాడు". ఒంటరి దుర్రానీకి "సైక్లింగ్ అంటే చాలా ఇష్టం". కానీ "లాహోర్ వంటి నగరంలో సైకిల్ తొక్కేందుకు దూరపు స్థలం ఉండేది కాదు".



మాజీ 'గూఢచారి' అధిపతులు: అమర్‌జీత్ సింగ్ దులత్ (రా- ఇండియా), జనరల్ అసద్ దుర్రానీ (ఐఎస్ఐ-పాకిస్తాన్)




వ్యక్తిగతంగా దుర్రానీ ఎలా ఉండేవారో, అలాంటి వ్యక్తిగానే ఆయన ఎదగటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. "నేను భిన్నం, నేను నాలా ఉండే స్వభావం నాది", "నా గుణం ఎప్పుడూ కూడా కాస్త తిరుగుబాటు ధోరణితో ఉంటుంది" అంటారు దుర్రానీ. దులత్ ప్రధానంగా తల్లిదండ్రుల మాట వినటానికీ, విద్యాబుద్ధులు నేర్పిన క్రమశిక్షణ ప్రకారం నడచుకోటానికీ సిద్ధంగా ఉంటారు. "తగిన పనులు, తగని పనులు అని ఉంటాయి" అనే నమ్మకంతో ఆయన పెరిగాడు. ఇది ఆయనకు స్పష్టమైన నైతిక దిశానిర్దేశం చేసిందని నేను అనుకుంటాను.

దుర్రానీ సైన్యంలో చేరారు. "ఆ కారణంగా నేనెప్పుడైనా పశ్చాత్తాపం చెందానని నేను అనుకోను" అంటారు. దులత్ పోలీస్ అయ్యారు. ఎందుకంటే, "అంతకన్నా మెరుగైన సర్వీసులలోకి వెళ్లలేకపోయాను" అని ఆయన అంగీకరిస్తారు. అయితే యాదృచ్ఛికమో లేదా అనుకోని అదృష్టమో ఇద్దరూ కూడా ఇంటిలిజెన్స్ సంస్థల వైపు మళ్లారు.

"అనుకోకుండా నేను అక్కడికి చేరాను", "ఆ విషయాన్ని ఒప్పుకుంటాను" అంటారు దుర్రానీ నవ్వుతూ. "ఇంటిలిజెన్స్ అంటే ఏంటో తెలియకుండానే" దులత్ ఇంటిలిజెన్స్ బ్యూరోలో చేరారు. అయినప్పటికీ ఇద్దరూ అత్యున్నత స్థాయికి చేరుకుని, తమ తమ దేశ ప్రజల చేత ఐఎస్ఐ, 'రా' సంస్థల అత్యుత్తమ మాజీ అధిపతులుగా గుర్తింపు పొందారు. కనుక వారు విధిని నమ్ముతారని నేను అనుకోవచ్చా? జేమ్స్ బాండే ఇలాంటి మూఢ నమ్మకాలను ఎప్పుడూ ఎకాఎకిన కొట్టిపడేయలేదు. వీళ్లు మాత్రం అలా ఎందుకు చేస్తారు?

"కుండబద్దలు కొట్టటం" అని దులత్ ఎప్పుడూ అంటుండే దుర్రానీలోని "నిర్మొహమాటాన్ని" దులత్ ఇష్టపడతారు. దుర్రానీ ఉన్నదున్నట్లు బహిరంగంగా మాట్లాడతారు. పాకిస్తాన్ ఆర్మీని విమర్శించటానికి కూడా సంకోచించరు. అలాగే ఆయన భారతీయ సైన్యాన్ని ప్రశంసిస్తున్నట్లుగా కనిపిస్తుంది. అది మరింత కష్టమైన పని. ఆయన అనిన ఒక మాటను మీకు వదిలేసి, నా ముగింపు సరైనదేనా పరిశీలించమని మిమ్మల్ని అడుగుతున్నాను. "భారతదేశంలో ప్రజలు ప్రతిభ ద్వారా పైకి ఎదిగి ఐ.బి. (ఇంటిలిజెన్స్ బ్యూరో) ని, 'రా'ను చేజిక్కించుకుంటారు. కానీ మా దగ్గర దేశాధ్యక్షుడు, లేదా సైన్యాధ్యక్షుడికి నచ్చిన వ్యక్తి అటువంటి పదవులను చేపట్టవచ్చు. కనుక ఒక మంచి ఐఎస్ఐ చీఫ్ ఎవరు అవగలరు అనే దానికి ఎల్లవేళలా మేము అనుసరించే ఒక ప్రమాణం ఉండదు."

రహస్యాలను అలా ఉంచండి – 'కోవర్ట్' పుస్తకంలో వీరు 'రా', 'ఐఎస్ఐ' అంతర్గత కార్యకలాపాల పనితీరును బహిర్గతం చేయలేదు. 'ద స్పై క్రానికల్స్' లోనూ వాటి గురించి లేదు. బదులుగా ఈ తాజా పుస్తకం, "గూఢచారి అధినేతల ఆంతరంగిక జీవితాలు, ప్రేరణలు, అంతర్లీన మానసిక స్థితులను అన్వేషిస్తుంది". రెండు సూత్రాల మీద ఇది దృష్టి సారించింది. వారు ఎలాంటి మనుషులు? వారు అలా ఎందుకు చేయవలసి వచ్చింది? అనేవి ఆ రెండూ. అంతేకాదు, భారత్-పాక్ దేశాల శాంతి సాధనకు తమ తమ దేశాల పట్ల చిన్నపాటి అవిధేయ సంకేతం కూడా లేకుండా వారు ముందుకు వెళ్లిన మనోహరమైన విధానాన్ని కూడా వివరించింది. వారి అభిప్రాయాలు కూడా తరచూ ఒకేలా ఉన్న విషయం కూడా. చూస్తుంటే, గూఢచారులు చాలా అరుదుగా విభేదిస్తారని అనిపిస్తోంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

---

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**



సోషల్ మీడియా

### వెల్ డన్



అందరు అభ్యర్థులు, రాజకీయనాయకులకు... నేననుకోవడం ఇది చాలినంత చెప్పలేదు. మీరు చాలా కష్టపడ్డారు. మీకు బాగా అవసరమైన విశ్రాంతి తీసుకోండి. మీరు చేయాల్సింది చేశారు. ఫలితాల జనాల దగ్గర ఉన్నాయి. ఏది ఏమైనా సరే, మీరు బాగా కష్టపడ్డారు.

– చేతన్ భగత్, రచయిత

### ఎంతకైనా...



అధికారం దాహం ఉన్నవాళ్లు, అధికారంలో ఉండటం కోసం ఎవరికైనా వ్యతిరేకంగా ఉండగలరు. కుటుంబం, పార్టీ సభ్యులు, మద్దతు దారులు, పౌరులు, ఎవరైనా... పెద్ద విషయం కాదు.

– శివమ్ శంకర్ సింగ్, రచయిత

### ఎటులైనా కష్టమే...



ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను వివరించడం మీద మన శక్తులను వెచ్చిస్తే, జూన్ 4 నాటికి(అవి సరైనవిగా తేలితే) మన విశ్లేషణా శక్తి అడుగంటిపోతుంది; ఒకవేళ మన అంచనాలు, వచ్చిన ఫలితాల మధ్య తేడా ఉంటే మనతో మనమే విభేదించుకున్నట్టు ఉంటుంది.

– సుహాస్ పల్శీకర్, ప్రొఫెసర్

### ఆదరణ పెరిగిందా?



కాంగ్రెస్ ప్రతినిధి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సుప్రియా శ్రీనేత్ యూట్యూబ్ డేటాను వెల్లడించారు: కాంగ్రెస్ పార్టీ యూట్యూబ్ వేదికల మొత్తం వ్యూస్ మార్చ్ 16 నుంచి మే 30 వరకు 61.5 కోట్లు. అదే బీజేపీ వ్యూస్ 14.5 కోట్లు. ఇదే నిజమైతే, దీనికిదే ఒక కథనం.

– ఎం.కె.వేణు, సంపాదకుడు

### మారని ఫిర్యాదు



బీజేపీ కేవలం హిందువుల సెంటిమెంట్లనే పట్టించుకుంటోందనీ, బీజేపీ పాలనలోని ఇండియాలో ముస్లింలు అణచివేతకు గురవుతున్నారనీ మనకు ఇప్పుడు ఫిర్యాదులున్నాయి. కానీ మనకు అవే ఫిర్యాదులు స్వాతంత్ర్య కాలంలో కాంగ్రెస్‌తోనూ ఉన్నాయి. బహుశా మనం దీన్ని మనలో మనం పరిష్కరించుకోవాలి.

– ఒమర్ ఘాజీ, రచయిత

### మాట్లాడుకుందామా?



కార్గిల్ (1999) గురించిన వాస్తవాన్ని పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అంగీకరించిన నేపథ్యంలో, ఇండియా-పాకిస్తాన్ మధ్య చర్చలను తిరిగి ప్రారంభించడంలో ఇది ఏమైనా సాయపడగలదా? ఇప్పటికైతే కొన్ని సానుకూల సంకేతాలు కనబడుతున్నాయి.

– హుసేన్ హక్కానీ, పాకిస్తాన్ మాజీ రాయబారి

### విలువలేని ప్రాణాలు



ఉత్తరప్రదేశ్, బిహార్, ఒడిశాల్లో వడగాడ్పుల వల్ల 250 మందికి పైగా మరణించారు; అందులో 25 మంది పోలింగ్ అధికారులు. ఇక జమ్ములో బస్సు లోయలో పడి 22 మంది చనిపోయారు; ఢిల్లీలో జరిగిన అగ్నిప్రమాదంలో 8 మంది నవజాత శిశువులు చనిపోయారు. సామాన్య జనాల జీవితానికి అర్థమే లేదు.

– రాణా అయూబ్, జర్నలిస్ట్

---

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

అభిప్రాయం

# ప్రాంతీయ, రాజకీయ స్వభావాలు ఒకటి కాదు!


పులివెందుల ప్రజల గురించీ, ఇక్కడి సంస్కృతి గురించీ అభ్యంతరకరంగా మాట్లాడ్డం ఇవ్వాళ ప్రతి ఒక్కరికీ అలవాటు అయిపోయింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఈ ప్రాంత ప్రజల పట్ల విషం కక్కడం పెరిగిపోయింది. ఇక్కడ జరిగే రాజకీయ సంఘటనలన్నింటికీ మొత్తం పులివెందుల ప్రజలనూ, ఆ ప్రాంతాన్నీ, సంస్కృతినీ తప్పుపడుతూ మాట్లాడుతున్నారు.

ఇప్పటికే పులివెందుల ప్రజల పట్ల మిగతా ప్రాంతాల్లో ఒక చెడు అభిప్రాయాన్ని కలిగించడంలో మీడియా, సినిమా వాళ్లూ, రాజకీయనాయకులూ సఫలీకృతమయ్యారు. ఇప్పుడు సోషల్ మీడియా కూడా తోడవడంతో చివరికి ఈ ధోరణి ఎక్కడికెళ్లి ఆగుతుందో అనే ఆందోళన వ్యక్తమవుతోంది. నిజానికి ఈ ముద్ర మొత్తం రాయలసీమకు ఉంది. ఇక్కడ లేని జీవితాన్ని ఇక్కడిదిగా చూపించి డబ్బు చేసుకోవడంలో సినిమా వాళ్లు ముందున్నారు. ఇవ్వాళ ఏ సినిమా రంగమైతే రాయలసీమనూ... అందులోనూ పులివెందుల వంటి ప్రాంతాలనూ నేరపూరితంగా చూపిస్తూ ఉందో, ఆ రంగానికి ఇక్కడి ప్రజలు చేసిన సేవ అంతా ఇంతా కాదు.

సినిమారంగంలో మొత్తం దక్షిణ భారతదేశంలోనే తొలి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందిన బీఎన్ రెడ్డి పులివెందుల ప్రాంతం వాడే. ఈయన తీసిన 'స్వర్గసీమ', 'బంగారు పాప', 'మల్లీశ్వరి' వంటి సినిమాలు కళాఖండాలు. 'వాహిని' సంస్థను స్థాపించి ఈయన సృష్టించిన చిత్రరాజాలు ఎన్నో ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచే వచ్చిన బి. నాగిరెడ్డి కూడా సినీ రంగానికి ఎంతో సేవ చేశారు. విజయా సంస్థను ప్రారంభించి ఈయన నిర్మించిన 'పాతాళ భైరవి', 'మాయా బజార్', 'గుండమ్మ కథ', 'మిస్సమ్మ', 'షావుకారు' వంటి సినిమాలు అజరామరమైనవి. పత్రికా రంగంలోనూ బి. నాగిరెడ్డి అపార కృషి చేశారు. చక్రపాణితో కలసి 'చందమామ' పత్రికను ప్రారంభించారు. అప్పటి తరం పిల్లలు చందమామ చదవకుండా పెరగలేదంటే అతిశయోక్తి కాదు. మొరార్జీ దేశాయ్ వంటి మాజీ ప్రధాని కూడా బి. నాగిరెడ్డిని చందమామతోనే గుర్తు పెట్టుకుని 'చందమామ రెడ్డిగారు' అని పిలిచేవారట. తర్వాత ఆయన మహిళల కోసం 'వనిత', సినిమా పాఠకుల కోసం 'విజయ చిత్ర' వంటి పత్రికలను నడిపారు.

అలనాటి హాస్య నటుడు పద్మనాభం, 'షో' చిత్రానికి ఉత్తమ స్క్రీన్ ప్లే అవార్డు పొందిన నీలకంఠ వంటి వారు కూడా ఈ ప్రాంతం వారే. ఇక్కడ పుట్టిన రచయితలు మొదటి నుంచి అభ్యుదయ వాదులు. తమ రచనల్లో మానవత్వం, స్త్రీ హక్కులు, రైతు జీవితం, సామరస్య భావాల గురించి రాశారు. 'తెలుగునాట భక్తి రసం తెప్పలుగా పారుతోంది – డ్రైనేజి స్కీము లేక... డేంజరుగా మారుతోంది' అన్న ప్రముఖ హేతువాద జర్నలిస్టు గజ్జల మల్లారెడ్డి ఇక్కడి వాడే. తెలుగు సాహిత్య విమర్శ దిగ్గజం రాచమల్లు రామచంద్రారెడ్డి, కథకులు వైసీవీ రెడ్డి, నాద మునిరాజు, అరవేటి శ్రీనివాసులు, కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం పొందిన వేంపల్లె షరీఫ్ వంటి వాళ్లు ఇక్కడివాళ్లే.

ఎక్కువమంది వ్యవసాయం చేసి బతుకుతారు. ఒకప్పుడు చిరుధాన్యాలతోపాటు వేరుశనగ విపరీతంగా పండేది. ఇప్పుడు రైతులు చీని, నిమ్మ తోటలను పెంచుతున్నారు. వందల అడుగుల లోతులో బోర్లు వేస్తే కానీ నీళ్లు పడని స్థితి. తమతోపాటు పొలాల్లో పని చేసి తమకింత తిండి పెట్టే మూగజీవాలను ఇక్కడివాళ్లు ఇంటి మనుషుల కిందే చూసుకుంటారు. అవి చనిపోతే మనుషులతో సమానంగా అంత్యక్రియలు చేస్తారు. మధ్యాహ్నం ఇంటికొచ్చిన అతిథికి అన్నం పెట్టకుండా పంపరు. ఆడపిల్లలందరినీ వాళ్ల వయసుతో నిమిత్తం




లేకుండా గౌరవంగా 'అమ్మా' అని పిలుస్తారు. అత్యంత గౌరవ మర్యాదలకూ, సున్నితత్వానికీ, సహ జీవన సంస్కృతికీ నెలవు ఇక్కడి నేల. అందుకే ఇక్కడి నుంచి అంతమంది కళాకారులు రాగలిగారు. పెద్దన లాంటి వాళ్లు 'ఇక్కడ పుట్టిన చిగురు కొమ్మయినా చేవే' అన్నారంటే ఇదే కారణం.

అదంతా వదిలేసి కేవలం కళ్లముందు జరుగుతున్న కొన్ని రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని మొత్తం ఇక్కడి వాళ్లంతా దుర్మార్గులు అన్నట్టు, ఇక్కడి సంస్కృతి అంతా ఆటవిక సంస్కృతి అన్నట్టు రాజకీయ నాయకులు మీడియాలో మాట్లాడుతున్నారు. నిజానికి రాజకీయ స్వభావమూ, ప్రాంతీయ స్వభావమూ ఒకటి కాదు. ఏ ప్రాంతంలో అయినా రాజకీయం అన్నింటికీ అతీతమైంది. దానికి ఎల్లలు లేవు. అది పెట్టుబడి దారులతో కలసి దేశవ్యాప్తంగానే అన్ని రకాల వ్యవస్థలనూ, మానవీయ విలువలనూ ధ్వంసం చేస్తోంది. ఒక దశలో ప్రజాస్వామ్యానికి మూల సూత్రమైన ప్రజలను సైతం నిర్లక్ష్యం చేసి కేవలం డబ్బు, ప్రలోభాలు, బెదిరింపులతో అధికారం చేపట్టే దశకు వచ్చింది.


ఇలాంటి రాజకీయాల్లో ఎవరూ ప్రశ్నలు, విమర్శలకు అతీతులు కాదు. అయితే ఆ ముసుగులో తమకు గిట్టని లేదా ఓటేయని ప్రాంతాలను ఆ యా స్థానిక రాజకీయ నాయకుల చర్యలతో కలిపి నిందించడం కరెక్టు కాదు. ముఖ్యంగా పులివెందుల నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు కడప ఎంపీగా, రెండు సార్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన వైఎస్ రాజశేఖర రెడ్డి, తరువాత వచ్చిన ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విషయంలో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది.

జగన్‌పై రాజకీయ విమర్శలు చేయాల్సి వచ్చినప్పుడల్లా ఒక వర్గం మీడియా, నేతలు మొత్తం పులివెందుల ప్రాంతాన్నీ, అక్కడి ప్రజలనూ నిందిస్తూ మాట్లాడుతున్నారు. విచక్షణతో రాజకీయ విమర్శలను రాజకీయాలకు లేదా రాజకీయ వ్యక్తుల వరకే పరిమితం చేస్తే బావుంటుంది. అలా కాకుండా పరిస్థితి ఇలాగే కొనసాగితే పులివెందుల ప్రాంత ప్రజలు, ప్రజా సంఘాల వాళ్లు తగిన కార్యాచరణతో సదరు మీడియా, రాజకీయ నేతల ధోరణికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సి వస్తుంది.

– డా॥ వేంపల్లె షరీఫ్
జర్నలిస్టు, రచయిత । 96034 29366

# జగత్తంతా ఈశ్వరమయం!

ద్వారకలో శ్రీకృష్ణుడు సభలో కొలువుతీరి ఉండగా, ఒకరోజు ఒక బోయవాడు చేతిలో ఉత్తరంతో వచ్చి శ్రీకృష్ణుడి దర్శనాన్ని కోరగా, సేవకులు అతడిని శ్రీకృష్ణుడి సముఖానకు తెచ్చి, వచ్చిన పనియేదో ప్రభువుల వారితో విన్నవించుకోమనగా, ఆ బోయవాడు 'కుండినపురంలోని భీష్మక మహారాజు సభలో అమాత్యులవారు వ్రాసి ఇచ్చిన వర్తమానాన్ని యేలినవారి సముఖాన పెట్టడానికి రయాన వచ్చాను ప్రభూ!' అని వివరం చెప్పాడు.



జ్యోతిర్మయం

'మహారాజశ్రీ అఖండలక్ష్మీ సమేతులైన శ్రీకృష్ణులవారికి మేము వ్రాసి పంపించే విన్నపము. ఇక్కడి సర్వక్షేమ స్థితిని శ్రీవారికి ఈవరకే తెలిపియుంటిమి. ఇప్పుడు విన్నవించుకొనుట యేమనగా– భీష్మక మహారాజులవారు వారి కుమార్తెకు వివాహం చేయాలని సంకల్పించి, స్వయంవరానికై రాజులందరికీ వర్తమానాలు పంపించారు. ఆ సందర్భంగా శ్రీకృష్ణులవారు కూడా వేంచేయాలని కోరుకుంటూ ఎంతో ఆదరంతో మిమ్ములను ఆహ్వానించమని మాకు ఉత్తరువులను ఇచ్చారు. కనుక స్వామి వారు తప్పక విచ్చేయగలరని మా విన్నపము!' అని ఆ లేఖలోని విషయాన్ని మంత్రివర్యులు చదివి వినిపించగా విన్న శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వి, సభలో కొలువై ఉన్న వారిని ఉద్దేశించి 'కూతురు పెళ్ళి ఘనంగా చేయాలని ఉత్సాహంతో భీష్మక మహారాజు పంపిన వర్తమానాన్ని విన్నారు కదా! ఆ ఆహ్వానంపై మీ అభిప్రాయాన్ని ఆలోచించి చెబితే బాగుంటుంది. ఆప్తులైన మీరందరూ మేలైనదిగా ఏది అనుకుంటారో, ఆ దారిలో నడుచుకుంటేనే కదా ప్రభువునైన నాకు శుభం చేకూరుతుంది!' అని అంటాడు. శ్రీకృష్ణుడి మాటలకు సభలోని అందరూ ముగ్ధులై–

**నీరజనాభ కార్యముల నిశ్చయమిట్టిదటంచు దెల్పగా
నేరుచువారలుం గలరె నీయెదుటన్ సకలాంతరాత్మవై
నేరిచినట్టివారలను నేర్వనివారనిపించి దిద్దగా
నేరిచినట్టి దేవుడవు నీకొకరా యెఱిగించు నేర్పరుల్.**

'ఓ పద్మనాభ స్వామీ! జరగవలసిన పనిని గురించి 'ఇది ఇలా జరిగితే బాగుంటుంది' అని మీకు చెప్పగలిగినవారు ఉన్నారా? సకలమూ తెలుసునని భావించేవారి చేత కూడా వారికి ఏమీ తెలియదని ఒప్పించగలిగే నేర్పు కలిగిన దేవుడవైన మీకు చెప్పగలవారు ఎవరైనా ఈ ముల్లోకాలలోనూ ఉన్నారా?' అని భక్తితో బదులిచ్చారని కోటేశ్వరకవి రచించిన 'భోజసుతా పరిణయం' కావ్యం, ప్రథమాశ్వాసంలోని సన్నివేశంలో రసవత్తరంగా వర్ణించబడింది. 'సకలాంతరాత్మవు' అని ఒక్క మాటలో 'జగత్తులోని ప్రతిదీ ఈశ్వరాంశయే!' అని చెప్పడం ఇందులో గ్రహించదగినది.

– భట్టు వెంకటరావు

## క్లుప్తంగా...

### ఆకాశగంగలో నాగవల్లి దళార్చన

**తిరుమలలో వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు**

**తిరుమల:** తిరుమలలో హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీఆంజనేయస్వామి జన్మ స్థలమైన ఆకాశగంగలో శ్రీఅంజనాదేవి, బాలాంజనేయ స్వామికి ఆదివారం ఏకాదశి సందర్భంగా నాగవల్లి దళార్చన (తమలపాకులతో) నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, హనుమంతుని విశిష్టత, ఆకాశగంగలోని శ్రీబాలాంజనేయస్వామి విశిష్టతను వివరించారు. అనంతరం స్వామివారికి పంచామృత స్నపన తిరుమంజనం చేపట్టారు. తమలపాకులతో సహస్రనామ అర్చన నిర్వహించారు.

### కృష్ణబాబు దశదినకర్మకు ప్రముఖుల హాజరు

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు నివాళి**



**కొవ్వూరు:** ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) దశదిన కర్మకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. తూర్పు గోదావరి జిల్లా దొమ్మేరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హోం మంత్రి తానేటి వనిత, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, సినీ నిర్మాతలు ఎంఎల్ కుమార్ చౌదరి, కేఎల్ నారాయణ, రాజ్యసభ మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, శ్రీనివాసనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీల నేతలు, సినీ, పారిశ్రామిక ప్రముఖులు కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేశారు. కృష్ణబాబు అల్లుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్‌కృష్ణ, సోదరుడు ఆంధ్రా షుగర్స్ చైర్మన్ నరేంద్రనాథ్ చౌదరి, జేఎండీ పెండ్యాల అచ్చిబాబు తమ సంతాపాన్ని తెలిపారు.

### తుపాకీతో కాల్చుకుని మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

**అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘటన**


వేదవతి (ఫైల్)

**రాయచోటి:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం సెంట్రీ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ వేదవతి (26) గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తేలిందని, ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారిస్తామని డీఎస్పీ రామచంద్రరావు, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి చెప్పారు. వారు తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరు సమీపంలోని బింగానిపల్లెకు చెందిన వేదవతి, మదనపల్లెకు చెందిన దస్తగిరి 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఐదేళ్ల పాప ఉంది. దస్తగిరి పుంగనూరులోని ప్రైవేట్ కోచింగ్ సెంటర్లో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. వేదవతి చిత్తూరు నుంచి ఏడాది కిందట అన్నమయ్య జిల్లాకు బదిలీపై వచ్చారు. రాయచోటిలోనే కాపురం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం సెంట్రీ డ్యూటీలో ఉన్న వేదవతి చేతిలో ఉన్న గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఓటర్లపైనా రౌడీషీట్లు!

**దర్శి పోలీసుల దారుణాలు**

- వైఎస్సార్‌సీపీ బూత్ ఏజెంట్లపై కూడా..
- ఐజీ వచ్చి వెళ్లాకే వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు
- బూత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన టీడీపీ వారిపై కేసుల్లేవు
- ఈవీఎంలు పగులగొట్టి, వాటిని ఎత్తుకెళ్లేందుకు యత్నించినా వారిపై చర్యలు శూన్యం


దర్శి డీఎస్పీ కార్యాలయంలో ఐజీ


పోలీసులను దూషిస్తూ టీడీపీ శ్రేణులను రెచ్చగొడుతున్న నూకసాని బాలాజీ

**దర్శి:** నిన్నటి వరకూ వారిపై ఎలాంటి కేసులూ లేవు.. అయితే ఒక్కసారిగా వారిపై రౌడీషీట్లు ఓపెన్ అయ్యాయి.. ఒకరు కాదు ఇద్దరు కాదు, ఏకంగా ఎనిమిది మందిపై. అందులో ముగ్గురు వైఎస్సార్‌సీపీకి చెందిన బూత్ ఏజెంట్లు. మరో ముగ్గురు ఓట్లు వేసేందుకు వచ్చిన వారు. వారికి ఎలాంటి క్రిమినల్ చరిత్ర లేదు. పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఈవీఎం ధ్వంసం చేసిన వారిపై నామమాత్రం కేసులు పెట్టి చేతులు దులుపుకున్న దర్శి పోలీసులు.. వీరిపై ఎందుకు రౌడీషీట్ పెట్టారో అర్థంకాని విషయం. వాస్తవానికి ఎవరిపైనైనా రౌడీషీట్ తెరవాలంటే మూడు క్రిమినల్ కేసులు తప్పనిసరిగా ఉండాలి. కనీసం 307 కేసైనా అయి ఉండాలి. లేదా తరచూ నేరాలు చేసేవారిపైరౌడీషీట్ వేస్తారు. కానీ ఎలాంటి కేసులు లేని సామాన్యులపై వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు అనే నెపంతో రౌడీషీట్లు తెరిచిన దర్శి పోలీసులు తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి దర్శి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వెళ్లారు. ఆయన వెళ్లాక పోలీసులు రౌడీషీట్లు ఓపెన్ చేయడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు పోలింగ్ రోజు ఏం జరిగిందంటే..

**టీడీపీ అరాచకం సృష్టిస్తున్నా.. అడ్డుకోని పోలీసులు**

ఈ నెల 13వ తేదీన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు దర్శి పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని 117, 118 బూత్‌లలోకి సాయంత్రం ఆరు గంటలు దాటాక టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త లలిత్ సాగర్‌లతో పాటు అభ్యర్థి మామ కడియాల వెంకటేశ్వరరావు, తమ్ముడు గొట్టిపాటి భరత్‌లతో పాటు మరో 50 మంది నరసరావుపేటకు చెందిన వారు బూత్‌లోకి ఎగబడి ఈవీఎంలు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసు సిబ్బందితోపాటు ఎస్‌ఐ, సీఐ, డీఎస్పీలు కూడా అక్కడే ఉన్నా, వారిని అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదు. 6 గంటలు దాటాక బూత్‌లోకి రావడంపై ఏజెంట్లు ప్రశ్నిస్తున్నా పోలీసులు నోరు మెదపలేదు. దీంతో అక్కడ ఓటర్లుగా ఉన్నవారు, ఏజెంట్లు బూత్‌లోకి రాకుండా వారిని అడ్డుకున్నారు. ఎస్‌ఐ, సీఐ, డీఎస్పీ అక్కడే ఉన్నా చోద్యం చూస్తూ ఊరుకున్నారే గానీ వారిని అడ్డుకున్న పాపాన పోలేదు. అంతే కాకుండా అభ్యర్థి మామ కడియాల వెంకటేశ్వరరావు.. నిబంధనలకు విరుద్ధంగా నేరుగా పోలింగ్ బూత్‌లోకి చొరబడి నానా రభస చేసినా వారిని బయటకు పంపలేదు. ఏ పోలీసు ఆయన్ను అడ్డుకుని బయటకు పంపేందుకు సాహసం చేయకపోవడం గమనార్హం. అదే సమయంలో ఓటు వేసేందుకు లైన్‌లో నిలబడిన వారు సమయం దాటినా ఎందుకు లోపలకు వెళ్తున్నారని వారిని అడ్డుకున్నారు. ఆ సమయంలో గొడవ కాస్త పెద్దదైంది. చోద్యం చూస్తున్న పోలీసులను ఓటర్లు నిలదీయడంతో అప్పుడు పోలీసులు వారిని బయటకు పంపారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ అభ్యర్థి పోలీసుల కళ్లెదుటే తన అనుచరులను(నరసరావుపేటకు చెందిన వారిని) రెచ్చగొట్టి వెళ్లిపోయారు. అనంతరం వాళ్లు పోలీసులపై, పోలింగ్ బూత్‌పై రాళ్లు రువ్వారు. దీంతో తమిళనాడుకు చెందిన పోలీస్ కానిస్టేబుల్‌కు ఓ రాయి కడుపులో తగిలింది. దీంతో కిందపడిపోయిన పోలీసుపై కూడా విచక్షణ రహితంగా రాళ్లు రువ్వారు. అల్లరి మూకలు డీఎస్పీపై కూడా రాళ్లు రువ్వడంతో పోలీసులు తమ గార్డులు అడ్డుపెట్టి డీఎస్పీని బూత్ ప్రాంగణంలోకి తీసుకొచ్చారు. ఇంత రభస చేసినా నరసరావుపేటకు చెందిన వారిని వదిలేసి స్థానికులపై కేసులు పెట్టి మమ అనిపించారు. అలాగే పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో పోలింగ్ బూత్‌లో ఈవీఎంను టీడీపీ నాయకుడు వీసీరెడ్డి ధ్వంసం చేశాడు. పోలీసులు పట్టుకుని వచ్చి 41 నోటీసులు ఇచ్చి సరిపెట్టారేగానీ, అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత కళ్లు తిరుగుతున్నాయంటూ వీసీ రెడ్డి డ్రామా ఆడి ఆస్పత్రి నుంచి పోలీసుల కన్ను కప్పి పారిపోయాడు. పల్నాడు జిల్లా మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం పగుల గొట్టారన్న ఆరోపణ వీడియో బయటకు వచ్చాక హడావుడిగా పోలీసులు వీసీరెడ్డిని పిలిపించి అరెస్ట్ చేసి కోర్టుకు పెట్టారు. ఇంత చేసిన వీసీరెడ్డి పై మాత్రం ఎలాంటి రౌడీషీట్ పెట్టక పోవడం పోలీసుల తీరుపై అనుమానాలకు తావిస్తోంది. అలాగే పోలింగ్ బూత్‌లో చొరబడి గందరగోళం సృష్టించిన, పోలీసులపై రాళ్లు రువ్విన వారిపై మొక్కుబడిగా కేసులు పెట్టిన పోలీసులు.. వైఎస్సార్‌సీపీకి చెందిన బూత్ ఏజెంట్లు, సామాన్యులపై రౌడీషీట్లు తెరవడం విస్మయం కలిగిస్తోంది. పోలింగ్‌కు 48 గంటల ముందే బయట ప్రాంతానికి చెందిన వారు నియోజకవర్గాల్లో ఉండకూడదన్న నిబంధన ఉంది. అయితే అంత మంది నరసరావుపేటకు చెందిన వారు పట్టణంలో ఎలా ఉన్నారో దర్శి పోలీసులే చెప్పాలి.

# కరెంట్ 'కాలి'పోతోంది

**ఎండల వల్ల అత్యధికంగా నమోదవుతున్న విద్యుత్ డిమాండ్**

- సబ్ స్టేషన్లలో ట్రాన్స్ ఫార్మర్లపై భారీగా పడుతున్న భారం
- విద్యుత్ స్తంభాలపై ట్రాన్స్ ఫార్మర్లు తొలగించే ప్రయత్నం
- రాష్ట్రంలో విద్యుత్ కోతలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ



**సాక్షి, అమరావతి:** వేసవి ఉష్ణోగ్రత విద్యుత్ సరఫరా వ్యవస్థపై ప్రభావం చూపిస్తోంది. మునుపెన్నడూ లేనంతగా మండిపోతున్న ఎండలు, వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లు వంటి విపత్తుల కారణంగా కరెంటును పంపిణీ చేసే ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా సబ్ స్టేషన్లు అగ్ని గుండంలా మారుతున్నాయి. సాధారణంగానే వాటి వద్ద ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. ఈసారి ఆ పరిధిని మించి వేడి తరంగాలు చుట్టుముడుతున్నాయి.

**పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేసేలా చర్యలు**

ఎండలకు భయపడి జనం బయటకు రావడం తగ్గించారు. పాఠశాలలకు సెలవులు. అవుట్‌డోర్ వర్క్స్ లేవు. ఇంట్లో ఉండి అన్ని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ఇళ్లలో ఏసీల వినియోగం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై ఊహించని భారం పడుతున్నది. ఒక ఇంటిలో ఒక ఏసీ వాడితే వచ్చే లోడ్ అకస్మాత్తుగా 500 వాట్స్ నుంచి 2 వేల వాట్స్‌గా మారుతోంది. ఇది రాత్రి సమయంలో సాధారణ హౌస్‌ డ్రాల్ కంటే 3 రెట్లు ఎక్కువ. దీనివల్ల ఎనిమిదేళ్లలో ఎప్పుడూ లేనంతగా ఎక్కువకు విద్యుత్ డిమాండ్‌కు చేరుకుంది. ఇంతలా కరెంట్ వాడకం రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ వ్యవస్థ దాదాపు స్థిరంగా ఉండడం విశేషం. ఈ పరిస్థితిని ముందే ఊహించి ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడమే దీనికి కారణం. అయితే సాధారణ లోడ్ ఉన్నప్పుడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ చమురు ఉష్ణోగ్రత 35 నుంచి 40 డిగ్రీలు ఉంటుంది. కానీ అసాధారణ లోడ్, వేడి వల్ల ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ 70 నుంచి 80 డిగ్రీల వేడి ఉంటోంది. విద్యుత్ సబ్ స్టేషన్లలో పనిచేస్తూ, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను చూస్తున్న అధికారులు, సిబ్బంది ఇంత వేడిలో అక్కడ పనిచేయాలంటేనే భయపడిపోతున్నారు. అయినప్పటికీ విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగకూడదని, ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తిస్తూ, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేసేలా చేస్తున్నారు.

**అన్నిటా పిల్లర్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్లు**

రాష్ట్రంలో అన్ని చోట్లా పిల్లర్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే పెట్టాలని విద్యుత్ సంస్థలు భావిస్తున్నాయి. అంటే అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు, పరిశ్రమల వద్ద పెట్టినట్లు గృహ, వ్యవసాయ అవసరాలకు కూడా సిమెంటు దిమ్మలపై ట్రాన్స్‌ఫార్మర్లను పెట్టాలనుకుంటున్నారు. ప్రస్తుతం అనేక చోట్ల విద్యుత్ స్తంభాల మీద ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. అవి గాలి, వానకు పడిపోతున్నాయి. స్తంభం కూలిపోతే, దానిపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చడానికి సమయం పడుతోంది. ఈ లోగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ముందుగానే అలాంటి ట్రాన్స్‌ఫార్మర్లు తీసేయాలని నిర్ణయించారు. కొన్ని చోట్ల 30 నుంచి 40 ఏళ్ల పాత కండక్టర్లు ఉన్నాయి. గత ప్రభుత్వాలు వాటిని పట్టించుకోకుండా వదిలేశాయి. దీంతో కొద్దిపాటి గాలివాన, ఎండకే అవి తెగిపోతున్నాయి. వాటిని పూర్తిగా మార్చేసి, కొత్త లైన్లు వేసే పనిలో విద్యుత్ శాఖ ఉంది.

## వాతావరణ మార్పులతో 'బ్రెయిన్ స్ట్రోక్'

- మూడు దశాబ్దాలతో పోలిస్తే పెరిగిన మరణాలు
- శీతల గాలులు, వేడి తరంగాలతో నాడీ, రక్తప్రసరణ వ్యవస్థలో తీవ్ర మార్పులు
- ఫలితంగా స్ట్రోక్‌తో మరణాలు.. పక్షవాతంతో తీవ్ర వైకల్యం
- చైనాలోని జియాంగ్యా హాస్పిటల్ సెంట్రల్ సౌత్ వర్సిటీ అధ్యయనంలో వెల్లడి



**సాక్షి, అమరావతి:** ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న ఉష్ణోగ్రతలతో స్ట్రోక్ మరణాలు, పక్షవాత వైకల్య బాధితులు పెరుగుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. దాదాపు మూడు దశాబ్దాల డేటాను విశ్లేషించడం ద్వారా వాతావరణ మార్పులతో స్ట్రోక్ ప్రమాదం ముడిపడి ఉన్నట్టు నిర్ధారించారు. 2019లో 5.20 లక్షలకు పైగా స్ట్రోక్ మరణాలపై శీతల గాలులు, మండే వేడి తరంగాలు తీవ్ర ప్రభావం చూపాయని న్యూరాలజీ జర్నల్‌లో ప్రచురించిన కొత్త అధ్యయనం వెల్లడించింది. స్ట్రోక్ మరణాల్లో అధిక భాగం 4.70 లక్షల కంటే ఎక్కువ మరణాలు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో సంభవించినప్పటికీ.. 1990తో పోలిస్తే అధిక ఉష్ణోగ్రతల పెరుగుదలతో మరణించిన వారి సంఖ్య స్వల్పంగా పెరిగినట్టు కనుగొంది.

**ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం**

నాటకీయ ఉష్ణోగ్రత మార్పులు మానవ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయని చైనాలోని చాంగ్షాలోని జియాంగ్యా హాస్పిటల్ సెంట్రల్ సౌత్ వర్సిటీకి చెందిన అధ్యయనం నివేదిక చెబుతోంది. అధిక ఉష్ణోగ్రత కారణంగా స్ట్రోక్ ప్రమాదం వేగంగా పెరుగుతోందని, పదేళ్లు దాటిన వారితో పాటు ఆఫ్రికా వంటి వెనుకబడిన దేశాల్లో ప్రమాదం పొంచి ఉందని అధ్యయనం స్పష్టం చేస్తోంది. వృద్ధాప్యం కూడా స్ట్రోక్ ప్రమాదాన్ని సూచిస్తున్నాయని పేర్కొంది. భారతదేశంలో సరైన ఉష్ణోగ్రతలు లేని కారణంగా 33 వేల స్ట్రోక్ మరణాలు సంభవిస్తే.. వాటిల్లో 55 శాతం ఉష్ణోగ్రతలు పెరగడంతో, 45 శాతం ఉండాల్సిన ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం ప్రధాన కారణమని విశ్లేషించింది.

**పురుషుల్లోనే ఎక్కువ**

ఉష్ణోగ్రతల్లో మార్పులతో పక్షవాతం వచ్చి మరణించే వారి సంఖ్య ప్రతి లక్ష మందిలో 5.9 శాతం మంది మహిళలు కాగా.. పురుషుల్లో 7.7 శాతం ఉన్నట్టు అధ్యయన బృందం తేల్చింది. మధ్య ఆసియాలో లక్ష మందిలో 18 మంది అనుకూలంగా లేని (నాన్-ఆప్టిమల్) ఉష్ణోగ్రతల కారణంగా అత్యధిక స్ట్రోక్‌కు మరణాల రేటు నమోదైంది. శిలాజ ఇంధనాల దహనం, అటవీ నిర్మూలన, పారిశ్రామిక కాలుష్యం వాతావరణాన్ని పెను ప్రమాదంలోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ముప్పును తగ్గించే లక్ష్యంతో ప్రపంచ దేశాలు పని చేయాలని సూచిస్తోంది.

**ఎందుకు జరుగుతోందంటే..!**

చల్లని ఉష్ణోగ్రతలు మానవ శరీరంలోని సునిశిత నాడీ వ్యవస్థపై ప్రభావం చూపడంతో పాటు రక్తనాళాల్లో అధిక రక్తపోటును పెంచి స్ట్రోక్‌లకు దారి తీస్తోందని అధ్యయన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇంతలో వేడి ఉష్ణోగ్రతలు నిర్జలీకరణానికి కారణమవుతాయని.. తద్వారా రక్తం చిక్కబడటం (క్లాట్స్) వల్ల స్ట్రోక్ ప్రమాదాలు సంభవిస్తాయని పేర్కొన్నారు.

## శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ


ఆలయం వెలుపల జస్టిస్ ఎన్వీ రమణ

**తిరుమల:** తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్, ఆరోగ్యశ్రీ సీఈవో లక్ష్మీశా తదితరులు ఉన్నారు.

## ముక్కంటి సేవలో జస్టిస్ శేషసాయి


ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ శేషసాయి తదితరులు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తిలోని శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. న్యాయమూర్తికి దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట స్థానిక న్యాయమూర్తులు శ్రీనివాసనాయక్, కృష్ణప్రియ తదితరులు ఉన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న సీఎస్


సీఎస్ జవహర్‌రెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

**ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయం వద్ద సీఎస్‌కి ఈవో కె.ఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఈవో రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

## విదేశీ ఉద్యోగాల పేరిట మోసం కేసులో మరొకరు అరెస్ట్

**ఇప్పటివరకు ఆరుగుర్ని అరెస్ట్ చేసిన పోలీసులు**

**అల్లిపురం (విశాఖ జిల్లా):** కంబోడియా, మయన్మార్, బ్యాంకాక్‌లలో ఉద్యోగాల పేరిట మోసం చేసిన కేసులో ఆదివారం మరొకరిని అరెస్ట్ చేసినట్టు విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కంబోడియా, మయన్మార్, బ్యాంకాక్ వంటి దేశాలకు సైబర్ నేరాలు చేయడానికి యువతను పంపిస్తున్న వన్‌టౌన్‌లోని ప్రసాద్ గార్డెన్స్‌కి చెందిన బొంగు మురళిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బొంగు మురళి భవానీ ఫ్యాబ్రికేటర్స్ అండ్ ఇంజినీరింగ్ వర్క్స్ ఇన్‌స్టిట్యూట్ నడుపుతూ దాని పేరిట కంబోడియా ఏజెంట్ల వద్ద నిరుద్యోగ యువతను సైబర్ స్కామ్‌లు చేసేందుకు పంపిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. శ్రీకాకుళానికి చెందిన ఓ యువకుడి నుంచి రూ.1.60 లక్షలు తీసుకుని పంపించినట్టు విచారణలో తేలిందన్నారు. అక్కడికి వెళ్లిన తర్వాత తనను సైబర్ స్కామ్‌లు చేయమని టార్చర్ చేస్తున్నారని బాధితుడు తన అన్నయ్య విద్యాసాగర్‌కి తెలియజేశాడు. ఆయన సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. బొంగు మురళి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడు కంబోడియాలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఉన్నాయని నిరుద్యోగులను నమ్మించి.. క్యాష్ రూపంలో గాని ఫోన్ పే ద్వారా డబ్బులు తీసుకుంటున్నాడు. తర్వాత ముంబైలో అక్బర్ ట్రావెల్స్ ద్వారా ఫ్లైట్ టికెట్స్ తీసి వెయ్యి డాలర్లకు అభ్యర్థి పేరు మీద కరెన్సీ ఎక్స్ఛేంజ్ చేసి వారికి ఇస్తాడు. కొన్నిసార్లు కంబోడియాలోని ఏజెంట్లకు 150 డాలర్ల వరకు పంపిస్తే వారే వీసా పంపిస్తున్నారు. ఆ ఏజెంట్లు ఉద్యోగాల కోసం వెళ్లిన వారిని కంబోడియాలోని స్కామ్ కంపెనీల వద్ద డబ్బు తీసుకుని అమ్మేస్తున్నారు. కంబోడియన్లు కూడా సైబర్ స్కామ్‌లు చేయడానికి వినియోగిస్తున్నారు. ఇలా మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న బొంగు మురళితో సహా మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు సీపీ పేర్కొన్నారు. మురళిపై ఇదివరకే 9 కేసులు నమోదై ఉన్నాయి. అందులో 4 చీటింగ్ కేసులతో పాటు ఇతర కేసులు ఉన్నాయి. దీని వెనుక ఉన్న ప్రధాన ముఠాను పట్టుకోవడానికి లోతైన దర్యాప్తు చేపడుతున్నామని, అందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్టు సీపీ వెల్లడించారు. ఎవరైనా ఇటువంటి ఏజెంట్ల చేతిలో మోసపోతే వెంటనే సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.భవానీప్రసాదరావు ఫోన్ నంబర్ 94906 17917కు గాని.. 0891-2565454, సీపీ వాట్సాప్ నంబర్ 94933 36633కు గాని సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి డబ్బులు పోగొట్టుకున్నట్టయితే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, తద్వారా పోగొట్టుకున్న డబ్బుల్ని తిరిగి తెచ్చుకోవచ్చని పేర్కొన్నారు.

## లోకో పైలట్ల పేపర్ వర్క్‌కు చెల్లుచీటి

**సాక్షి, అమరావతి:** రైలు ప్రయాణం మరింత సురక్షితం చేసే దిశగా రైల్వే లోకో పైలట్లపై అనవసర పనిభారాన్ని తగ్గించాలని ఆ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రైలు ప్రయాణంలో ఉండగా లోకో పైలట్లు ఇక మీదట పేపర్ వర్క్ (రికార్డు నమోదు పని) చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దాంతో లోకో పైలట్లు విధి నిర్వహణలో పూర్తిగా రైలు నడపటంపైనే తమ దృష్టి సారించేట్టుగా ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో లోకో పైలట్లు దశాబ్దాలుగా రెండు రకాల రికార్డు పుస్తకాలను నిర్వహిస్తున్నారు. మెమో బుక్, ఇంజిన్ లాగ్ బుక్‌లను నిర్వహిస్తున్నారు. రైలులో ఉండే లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ రైలు నడుపుతునే ఈ రెండు బుక్‌లలో వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. అందులో మెమో బుక్ పర్సనల్ డైరీగా పరిగణిస్తారు. ప్రయాణంలో ప్రతి రైల్వేస్టేషన్ చేరిన (అరైవల్) సమయం, బయలుదేరిన (డిపార్చర్) సమయం, రైలు వేగ నియంత్రణలో వేరియేషన్ల అంశాలు, గార్డ్ వివరాలతోపాటు ఇతర అంశాలను నమోదు చేయాలి. ఇక ఇంజిన్ లాగ్ బుక్‌లో షిఫ్టుల వివరాలు నమోదు చేస్తారు. షిఫ్ట్ సమయాలతోపాటు రైలు నడుపుతున్నప్పుడు గుర్తించిన ఇతర అంశాలను అందులో రాయాలి. రైలు నడపడంపై ఏమైనా వివాదాలు తలెత్తితే లోకో పైలట్లు తమ వివరణను తెలియజేసేందుకు ఈ వివరాలు ఉపయోగపడతాయని ఆ రెండు బుక్‌లను ప్రవేశపెట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అంతగా అభివృద్ధి చెందని కాలంలో ప్రవేశపెట్టిన విధానం అది. ప్రస్తుతం ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. దాంతో రైల్వేస్టేషన్‌కు చేరిన సమయం, బయలుదేరిన సమయం వంటివన్నీ ఆటోమెటిగ్గా నమోదయ్యే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. రైలు గమనంలో ఉండగానే అన్ని వివరాలను గుర్తించి నమోదు చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నది రైల్వే శాఖ. అయినా సరే మెమో బుక్, ఇంజిన్ లాగ్‌బుక్‌లను నమోదు చేయాల్సి వస్తోంది. దాంతో పూర్తిగా రైలు నడపటం కోసం వెచ్చించాల్సిన విలువైన సమయం రికార్డుల నిర్వహణ పేరిట వృథా అవుతోంది. ఇది సరైన విధానం కాదని రైల్వే భద్రతా నిపుణుల కమిటీ ఇప్పటికే పలుసార్లు రైల్వే శాఖకు నివేదించింది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ కీలక విధాన నిర్ణయం తీసుకుంది. లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ ఇక మీదట విధి నిర్వహణలో ఉండగా పేపర్ వర్క్ చేయాల్సిన అవసరం లేదని నిర్ణయించింది.

# విదేశాలకే వి'హారం'

**భారతీయుల్లో పెరుగుతున్న విదేశీయానం**

- మాస్టర్ కార్డ్ ఎకనామిక్స్ ఇన్‌స్టిట్యూట్ తాజా నివేదికలో వెల్లడి
- ఎప్పుడూ లేనంతగా అంతర్జాతీయ ప్రయాణాలు
- ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 10 కోట్ల మంది విమానయానం
- ఇది దశాబ్దం కిందటి వరకు ఒక ఏడాదిలో చేసే ప్రయాణాల సంఖ్య కావడం గమనార్హం
- వచ్చే ఐదేళ్లలో దేశంలో 2 కోట్ల మందికిపైగా విదేశీ పర్యటనలు
- ఈ వేసవిలో ఆమ్‌స్టర్‌డామ్, సింగపూర్, లండన్, ఫ్రాంక్‌ఫర్ట్, మెల్‌బోర్న్‌ల సందర్శనకు భారతీయుల ఆసక్తి
- హోటళ్ల రేట్లు పెరగడంతో క్రూయిజ్ ప్రయాణాలకు మొగ్గు చూపుతున్న పర్యాటకులు



**సాక్షి, అమరావతి:** భారతీయులు విదేశీయానాల్లో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారు. 2019తో పోలిస్తే జపాన్‌లో 53 శాతం, అమెరికాలో 59 శాతం, వియత్నాంలో 248 శాతం భారతీయ ప్రయాణికులు రాకపోకలు పెరగడం విశేషం. మాస్టర్ కార్డ్ ఎకనామిక్స్ ఇన్‌స్టిట్యూట్ 'బ్రేకింగ్ బౌండరీస్' పేరుతో తాజా ట్రావెల్ ట్రెండ్స్‌ను విడుదల చేసింది. గతంలో ఎన్నడూ లేనంతగా భారతీయులు అంతర్జాతీయ ప్రయాణాలు చేస్తున్నట్టు నివేదిక పేర్కొంది. ఆదాయాన్ని మెరుగు పరచుకోవడంతో విదేశాలకు వెళ్లే భారతీయ ప్రయాణికులు సంఖ్య ట్రావెల్, టూరిజం రంగానికి ఊతమిస్తోందని నివేదిక పేర్కొంది. వచ్చే ఐదేళ్లలో 2 కోట్ల మందికిపైగా మధ్య తరగతి ప్రజలు (ఏడాదికి రూ.12 లక్షల కంటే ఎక్కువ సంపాదిస్తున్నవారు). దాదాపు 20 లక్షల మంది అధిక ఆదాయ ప్రజలు (ఏటా రూ.66 లక్షలు కంటే ఎక్కువ సంపాదిస్తున్న వారు) కూడా అంతర్జాతీయ ప్రయాణికుల జాబితాలో చేరతారని అంచనా వేసింది. విస్తరిస్తున్న విలాసవంతమైన ఆలోచనలు ఔట్ బౌండ్ ఇండియా ట్రావెల్ రంగాన్ని అసాధారణ వృద్ధిలోకి తీసుకెళ్తున్నాయని అభిప్రాయపడింది.

**తొలి త్రైమాసికంలో 10 కోట్ల మంది**

ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే సుమారు 10 కోట్ల మంది విమాన ప్రయాణాలు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఒక దశాబ్దం కిందటి వరకు ఈ సంఖ్యలో ప్రయాణాలు చేయాలంటే ఏడాది సమయం పట్టేది. అంటే భారతీయుల్లో ఏ స్థాయిలో ప్రయాణాలు వృద్ధి చెందాయో నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ ఏడాది మార్చి నాటికి దేశీయ ప్రయాణాలు 21శాతం, విదేశీ ప్రయాణాలు 4 శాతం మేర పెరిగినట్టు గుర్తించింది. ఆమ్‌స్టర్‌డామ్, సింగపూర్, లండన్, ఫ్రాంక్‌ఫర్ట్, మెల్‌బోర్న్‌లు ఈ వేసవి (జూన్-ఆగస్టు)లో భారతీయ ప్రయాణికులు సందర్శించే ఐదు ట్రెండింగ్ గమ్యస్థానాలుగా నిలవడం విశేషం. 2019, 2020లో ఒక పర్యటన సగటు వ్యవధి నాలుగు రోజులుగా ఉంటే ఈ ఏడాది ఐదు రోజులకు పెరిగింది.

**పెరిగిన క్రూయిజ్ ప్రయాణాలు**

ప్రపంచ వ్యాప్తంగా చూస్తే యూరోపియన్ చాంపియన్‌షిప్ కారణంగా 2024లో జర్మనీలోని మ్యూనిచ్ టాప్ ట్రెండింగ్ డెస్టినేషన్‌గా నిలిచింది. గత మార్చికి ముందు 12 నెలల్లో ప్రజలు అత్యధికంగా ప్రయాణించిన గమ్యస్థానంగా జపాన్ నిలిచింది. ముఖ్యంగా ఐదు మార్కెట్లలో నాలుగు యూరోపియన్ గమ్యస్థానాలు, టాప్ 10లో 50 శాతం ఆసియా-పసిఫిక్ గమ్యస్థానాలు ఉన్నాయి. గడిచిన ఏడాది అత్యధికంగా ప్రయాణికులను ఆకర్షించిన గమ్యస్థానాల్లో జపాన్, ఐర్లాండ్, రొమేనియా, ఇటలీ, స్పెయిన్, మలేషియా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, యూఏఈ, ఇండోనేషియా నిలిచాయి. అయితే విదేశీ సందర్శకుల రికవరీలో అమెరికా 2019తో పోలిస్తే 6 శాతం తక్కువగా ఉండటం గమనార్హం. హోటల్ పరిశ్రమలలో నిరంతరం ధరల పెరుగుదల కారణంగా క్రూయిజ్ ప్రయాణాలు ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో గ్లోబల్ క్రూయిజ్ ప్యాసింజర్ లావాదేవీల సంఖ్య 2019 కంటే దాదాపు 16 శాతం పెరిగాయి.

## ఐస్‌ల్యాండ్ అధ్యక్షురాలిగా హల్లా థామస్ డాటర్



**లండన్:** ఐస్‌ల్యాండ్ అధ్యక్ష ఎన్నికల్లో వ్యాపారవేత్త హల్లా థామస్ డాటర్ (55) విజయం సాధించారు. శనివారం జరిగిన ఎన్నికల్లో ముగ్గురు మహిళలే ప్రధానంగా తలపడ్డారు. హల్లా అత్యధికంగా 34.3% ఓట్లను దక్కించుకున్నారు. మాజీ ప్రధాని కట్రిన్ జాకబ్స్ డాటర్‌కు 25.2%, హల్లా హెచ్‌రుండ్ లొగా డాటర్‌కు 15.5 శాతం ఓట్లొచ్చాయి. ఆగస్ట్ 1న హల్లా బాధ్యతలు చేపట్టనున్నారు.

## అమెరికాలో కాల్పులు.. ముగ్గురు దుర్మరణం

**పెన్ హిల్స్(అమెరికా):** అమెరికాలో పెన్సిల్వేనియా, ఒహాయో రాష్ట్రాల్లో రెండు కాల్పుల ఘటనల్లో ముగ్గురు చనిపోగా 32 మంది గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. పెన్సిల్వేనియాలో పిట్స్‌బర్గ్ శివారులోని బార్‌లో ఆదివారం వేకువజామున జరిగిన కాల్పుల్లో ఇద్దరు చనిపోగా ఏడుగురు గాయపడ్డారు. ఒహాయోలోని ఏక్రాన్‌లో స్ట్రీట్‌పార్టీలో జరిగిన తుపాకీ కాల్పుల్లో ఒకరు చనిపోగా 25 మంది గాయపడ్డారు.

## గూడ్స్ ఢీ.. పైలట్లకు గాయాలు

**ఫతేగఢ్ సాహిబ్:** పంజాబ్‌లోని సర్‌హింద్ సమీపంలోని మాధోపూర్ వద్ద ఆదివారం ఉదయం రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు లోకో పైలట్లు గాయపడ్డారు. ఆగి ఉన్న గూడ్స్ రైలును వెనుక నుంచి మరో గూడ్స్ ఢీకొందని గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్‌పీ) అధికారి తెలిపారు. ప్రమాద తీవ్రతకు ఒక రైలింజన్ పక్కనే పట్టాలపై ఆగి ఉన్న ప్రయాణికుల రైలును ఢీకొట్టిందని వివరించారు. అయితే, ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదన్నారు. గాయపడిన లోకో పైలట్లు వికాస్ కుమార్, హిమాన్షు కుమార్‌లను పటియాలాలోని రాజేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. ఘటన కారణంగా కొన్ని రైళ్లను దారి మళ్లించామన్నారు. పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నట్లు వివరించారు.

## తమిళ నటుడు కరుణాస్ బ్యాగులో బుల్లెట్లు

**చెన్నై:** తమిళ నటుడు, మాజీ ఎమ్మెల్యే కరుణాస్ బ్యాగులో బుల్లెట్లు కనిపించడం కలకలం రేపింది. ఆదివారం ఉదయం కరుణాస్ చెన్నై విమానాశ్రయంలో అధికారులు సోదాలు జరపగా బ్యాగులో 40 వరకు తుపాకీ బుల్లెట్లు బయటపడ్డాయి. బుల్లెట్లు ఉంచుకునేందుకు తనకు అనుమతి ఉందని కరుణాస్ చెప్పారని అధికారులు వెల్లడించారు. అయితే, విమానంలోకి బుల్లెట్లు తీసుకురావడం నిషిద్ధమని ఆయనకు వివరించి, అనంతరం వెనక్కి పంపించి వేశామన్నారు.


# అరుణాచల్‌లో బీజేపీ

### అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం ● 60 స్థానాలకు 46 కైవసం

**ఈటానగర్:** అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించింది. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. 60 స్థానాలకు గాను ఏకంగా 46 చోట్ల కాషాయ జెండా రెపరెపలాడింది. 10 స్థానాలు ముందే ఏకగ్రీవంగా బీజేపీ సొంతం కావడంతో ఏప్రిల్ 19న మిగతా 50 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఆదివారం ఓట్ల లెక్కింపు జరిగింది. బీజేపీ 36 సీట్లు గెలుచుకోగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) 5, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) 3, పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ (పీపీఏ) 2 స్థానాలు నెగ్గాయి. కాంగ్రెస్ ఒక స్థానంతో సరిపెట్టుకుంది. ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నెగ్గారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 41 సీట్లు సాధించగా ఈసారి మరో ఐదు పెరగడం విశేషం. ఏకగ్రీవంగా నెగ్గిన వారిలో సీఎం పెమా ఖండూ కూడా ఉన్నారు.

**అభివృద్ధి రాజకీయాలకు పట్టం: మోదీ**

అరుణాచల్ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. బీజేపీకి మరోసారి విజయం కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రగతి కోసం మరింత ఉత్సాహంగా, నూతన శక్తితో పని చేస్తామంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''అభివృద్ధి రాజకీయాలకు ప్రజలు పట్టం కట్టారు. పార్టీ కార్యకర్తల అలుపెరుగని కృషితోనే ఈ విజయం సాధ్యమైంది'' అని అన్నారు.







**సంగీతాభిమాని...**

అరుణాచల్‌లో బీజేపీని వరుసగా మూడోసారి గెలుపు బాటన నడిపిన నాయకుడిగా పెమా ఖండూ పేరు మార్మోగిపోతోంది. క్రీడలు, సంగీతం పట్ల అమితాసక్తి ఉన్న ఆయన రాష్ట్రంలో తిరుగులేని నేతగా ఎదిగారు. 2000లో కాంగ్రెస్‌లో చేరిన ఖండూ తండ్రి డోర్జీ ఖండూ ప్రాతినిధ్యం వహించిన ముక్తో అసెంబ్లీ స్థానం నుంచి ఉప ఎన్నికలో గెలిచారు. నబామ్ తుకీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. 2016 జనవరిలో రాష్ట్రపతి పాలన అనంతరం బీజేపీ మద్దతిచ్చిన కల్హోపుల్ ప్రభుత్వంలో మరోసారి మంత్రి అయ్యారు. సుప్రీంకోర్టు జోక్యంతో తుకీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చింది. తుకీ రాజీనామాతో 2016లో ఖండూ 37 ఏళ్ల వయసులో తొలిసారి సీఎం అయ్యారు. తర్వాత బీజేపీలో చేరారు. 2019లో రెండోసారి సీఎం అయి ఐదేళ్లు కొనసాగారు. తాజాగా మరోసారి విజయం దక్కించుకున్నారు. బౌద్ధ మతస్థుడైన పెమా ఖండూ మోన్‌పా గిరిజన తెగకు చెందినవారు. తండ్రి డోర్జీ 2011లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు.

# సిక్కింలో ఎస్‌కేఎం

### తమాంగ్ పార్టీ క్లీన్‌స్వీప్

- 32 స్థానాలకు 31 కైవసం
- ఎస్‌డీఎఫ్‌కు 1, బీజేపీ, కాంగ్రెస్ 0
- మాజీ సీఎం చామ్లింగ్ ఓటమి




**గాంగ్‌టక్:** సిక్కిం శాసనసభ ఎన్నికల్లో సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కేఎం) సంచలన విజయం నమోదు చేసింది. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో 32 స్థానాలకు గాను ఏకంగా 31 తన ఖాతాలో వేసుకుంది. వరుసగా రెండోసారి అధికారం దక్కించుకుంది. ఎస్‌కేఎం అధినేత, ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్ తమాంగ్ ఈ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీకి దిగి రెండింటా విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో 17 సీట్లు గెలుచుకున్న ఎస్‌కేఎం ఈసారి క్లీన్‌స్వీప్ చేయడం విశేషం. పోలైన మొత్తం ఓట్లలో 58.28 శాతం సాధించింది! 2019 దాకా 25 ఏళ్ల పాటు అప్రతిహతంగా రాష్ట్రాన్ని పాలించిన విపక్ష సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్) ఒకే ఒక్క స్థానానికి పరిమితమైంది. ఎస్‌డీఎఫ్ అధ్యక్షుడు, మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ అనూహ్య ఓటమి చవిచూశారు. బీజేపీ, కాంగ్రెస్ అయితే ఖాతాయే తెరవలేదు! 31 సీట్లలో పోటీ చేసిన బీజేపీకి కేవలం 5.18 శాతం ఓట్లు లభించాయి. కాంగ్రెస్‌కైతే 0.32 శాతం ఓట్లే వచ్చాయి. భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్, ఎస్‌డీఎఫ్ ఉపాధ్యక్షుడు బైచుంగ్ భూటియా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే దిల్లీరామ్ థాపా కూడా ఓటమి చవిచూశారు. నామ్చీ జిల్లా బర్‌ఫుంగ్ నుంచి పోటీ చేసిన భూటియా ఎస్‌కేఎం అభ్యర్థి డోర్జీ భూటియా చేతిలో ఓటమి చవిచూశారు. డోర్జీకి 8,358 ఓట్లు, భూటియాకు 4,012 ఓట్లు లభించాయి. అసెంబ్లీ ఎన్నికల ముందే భూటియా ఎస్‌డీఎఫ్‌లో చేరారు.

**మోదీ అభినందనలు**

ఎస్‌కేఎంకు, సీఎం తమాంగ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి పని చేస్తామన్నారు. బీజేపీకి ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రధానికి తమాంగ్ కృతజ్ఞతలు తెలిపారు.

**టీచర్ నుంచి సీఎం దాకా**
**తమాంగ్ ఆసక్తికర ప్రస్థానం**



ప్రేమ్‌సింగ్ తమాంగ్. సిక్కింలో ఎస్‌కేఎం క్లీన్‌స్వీప్ వెనుక ఉన్న శక్తి. 56 ఏళ్ల తమాంగ్ వ్యక్తిగత చరిష్మాతోపాటు పరిపాలనాదక్షుడిగా ఆయనకున్న పేరు, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు ఈ ఘన విజయానికి కారణమయ్యాయి. తమాంగ్ 1968 ఫిబ్రవరి 5న జన్మించారు. తల్లిదండ్రులు కాలూసింగ్ తమాంగ్, ధన్‌మాయ తమాంగ్. పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్‌లో కాలేజీ విద్య పూర్తిచేశారు. 1990లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. మూడేళ్ల తర్వాత రాజీనామా చేసి ఎస్‌డీఎఫ్‌లో చేరారు. 15 ఏళ్ల పాటు మంత్రిగా చేశారు. 2009లో నాటి సీఎం పవన్ కుమార్ చామ్లింగ్‌తో విభేదించి ఎస్‌డీఎఫ్ నుంచి బయటకొచ్చారు. 2013లో ఎస్‌కేఎం ఏర్పాటు చేశారు. 2014 ఎన్నికల్లో పార్టీ 10 సీట్లు సాధించింది. అవినీతికి కేసుల్లో అరెస్టయిన తమాంగ్ ఏడాదిపాటు జైల్లో ఉండి 2017లో బయటికొచ్చారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 17 సీట్లు గెలిచి రెండేళ్లకే సీఎం అయ్యారు. అనంతరం పార్టీని మరింత పటిష్టపరిచారు.

## జైలుకు కేజ్రీవాల్

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతో ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం తిహార్ జైల్లో లొంగిపోయారు. అంతకుముందు రాజ్‌ఘాట్ వద్ద నివాళులర్పించి హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆప్ ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నేతలనుద్దేశించి మాట్లాడారు. ''నేను జైలుకు వెళ్తున్నది అవినీతికి పాల్పడి కాదు. నియంతృత్వానికి వ్యతిరేకంగా గళం వినిపించినందుకు. నాకు ఆప్ కంటే దేశమే ముఖ్యం. మోదీ మూడోసారి ప్రధాని అవుతారన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలన్నీ అబద్ధం. జనాన్ని మానసిక ఒత్తిడికి గురిచేసే మైండ్ గేమ్'' అన్నారు. అనంతరం లొంగిపోయే సమయంలో కేజ్రీవాల్ భార్య సునీత, ఆప్ నేతలు ఆతిశి, కైలాశ్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్, రాఖీ బిర్లా, రీనా గుప్తా, ఆప్ రాజ్యసభ సభ్యులు సంజయ్ సింగ్, సందీప్ పాఠక్ జైలు వద్దకు వచ్చారు.

**5 దాకా జ్యుడీషియల్ కస్టడీ**

మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌ను జూన్ 5 దాకా జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ డ్యూటీ జడ్జి సంజీవ్ అగర్వాల్ ఉత్తర్వులు జారీచేశారు. తిహార్ జైలులో లొంగిపోయాక ఆయనను జడ్జి ఎదుట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. ఈడీ 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ కోరగా జడ్జి 5 రోజులు అనుమతించారు.

## టోల్ ట్యాక్స్ పెంపు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్ వేలపై వాహనదారులు చెల్లించే టోల్ టాక్స్‌ను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) సగటున 5 శాతం పెంచింది. ఇది సోమవారం నుంచి అమలవుతుంది. ద్రవ్యోల్బణం, టోకు ధరల సూచీ ఆధారంగా టోల్ టాక్స్ ఏటా మారుతుంటుంది. ఈ పెంపు ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి రావాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల కారణంగా కేంద్రం తాత్కాలికంగా నిలిపివేసింది. పోలింగ్ ముగియడంతో జూన్ 3 నుంచి టాక్స్ పెంచుతూ ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై 855 వరకు టోల్ ప్లాజాలు ఉన్నాయి.

## ఒడిశాలో హోరాహోరీ

- అసెంబ్లీ పోరులో బీజేపీ, బీజేడీ నువ్వానేనా
- ఇరుపక్షాలకు 62–80 సీట్లు రావచ్చు
- ఇండియా టుడే ఎగ్జిట్ పోల్ వెల్లడి

**భువనేశ్వర్:** 147 స్థానాలున్న ఒడిశా శాసనసభ ఎన్నికల్లో ఈసారి హోరాహోరీ పోరు తప్పదని ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. విపక్ష బీజేపీకి 62 నుంచి 80 స్థానాలు లభించే అవకాశం ఉందని, అధికార బిజూ జనతాదళ్(బీజేడీ)కి సైతం 62 నుంచి 80 స్థానాలే దక్కే వీలుందని అంచనా వేసింది. దీన్నిబట్టి చూస్తే ఒడిశాలో బీజేపీ అధికారం దక్కించుకొనేందుకు ఆస్కారం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఒకవేళ బీజేడీకి స్పష్టమైన మెజార్టీ రాకపోతే ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాజకీయ ప్రస్థానం దాదాపు ముగిసినట్లే అని చెప్పొచ్చు. ఆయన ఐదుసార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికైన సంగతి తెలిసిందే. నవీన్ పట్నాయక్ ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వార్తలొస్తున్నాయి. ఒడిశాలో కాంగ్రెస్ 5 నుంచి 8 అసెంబ్లీ స్థానాలు గెలుచుకొనే అవకాశం ఉన్నట్లు ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. బీజేపీ ఓట్ల శాతం 42 శాతానికి పెరుగుతుందని, బీజేడీ ఓట్ల శాతం 42 శాతం పడిపోతుందని, కాంగ్రెస్‌కు 12 శాతం ఓట్లు లభించే అవకాశం ఉందని తెలియజేసింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేడీ 112 సీట్లు, బీజేపీ 23, కాంగ్రెస్ 9 సీట్లు గెలుచుకున్నాయి. 21 లోక్‌సభ స్థానాల్లో బీజేపీకి ఏకంగా 18–20 వస్తాయని ఇండియా టుడే అంచనా వేసింది!

## భేటీలతో మోదీ బిజీ బిజీ



ఆదివారం అధికారులతో మోదీ సమీక్షలు

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అధికార యంత్రాంగంతో సమీక్షలు నిర్వహించారు. మూడోసారి అధికారంలోకి వస్తే '100 రోజుల అజెండా'లో చేయాల్సిన పనులపై చర్చించారు.

**వరస సమీక్షలు**

రేమాల్ తుపాను బీభత్సం, సహాయక చర్యలు తదితరాలపై మోదీ సమీక్ష జరిపారు. దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలో పౌరుల మరణానికి కారణమైన హీట్‌వేవ్‌పై సమీక్ష జరిగింది. ఆస్పత్రుల్లో సరిపడ పడకలు, వైద్యులు, వైద్యసిబ్బంది, ఔషధాల లభ్యతపై చర్చించారు. జూన్ ఐదో తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. అన్నింటికన్నా ముఖ్యమైనదిగా భావిస్తున్న '100 రోజుల అజెండా'పై విడిగా మరో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారంలోకి రాగానే చేపట్టాల్సిన పనుల పురోగతిపై ప్రధాని అధికారులను ఆరాతీశారు. తొలి 100 రోజుల్లో ఎలాంటి పనులు చేస్తే బాగుంటుందో సలహాలు, సూచనలు ఇవ్వాలని గతంలో మంత్రిమండలి సభ్యులను మోదీ ఆజ్ఞాపించడం తెల్సిందే.

**ఫైర్, ఎలక్ట్రిక్ సేఫ్టీ ఆడిట్లు చేయండి**

ఎండలు, వేడి వాతావరణం కారణంగా భవనాల్లో ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదాలకు దారి తీయకుండా ఎప్పటికప్పుడు ఫైర్, ఎలక్ట్రిక్ సేఫ్టీ ఆడిట్లను చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. అధిక ఉష్ణోగ్రతల ధాటికి అటవీప్రాంతాల్లో కార్చిచ్చు ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అటవీశాఖ అధికారులకు సూచనలు చేశారు. 'మిజోరం, అస్సాం, మణిపూర్, త్రిపుర, మేఘాలయలో రేమాల్ తుపాను బాధితులకు అండగా ఉంటామని మోదీ భరోసా ఇచ్చారు' అని కేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ భేటీల్లో పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## చంద్రుని ఆవలి వైపుకు చాంగే6



**బీజింగ్:** చంద్రుని ఆవలివైపు చైనా చాంగే6 ల్యాండర్ విజయవంతంగా దిగింది. అక్కడి మట్టిని సేకరించి తిరిగి భూమికి చేరుకోనుంది. చంద్రుని దక్షిణ ధ్రువ అయిట్‌కెన్(ఎస్‌పీఏ) బేసిన్ వద్ద బీజింగ్ కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 6.23 గంటలకు విజయవంతంగా అది దిగిందని చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(సీఎన్‌ఎస్‌ఏ) ప్రకటించింది. చాంగే6లో ఒక ఆర్బిటార్, ఒక రిటర్నర్, ఒక ల్యాండర్, ఒక అసెండర్ ఉన్నాయి. మే మూడో తేదీన చాంగే6ను చైనా ప్రయోగకేంద్రం నుంచి ప్రయోగించారు. అది తొలుత భూస్థిర కక్ష్యలో, తర్వాత చంద్ర కక్ష్యలో తిరిగింది. చాంగే6లో ఆర్బిటార్-రిటర్నర్, ల్యాండర్-అసెండర్ జతలు ఉన్నాయి. ఆర్బిటార్-రిటర్నర్ జత నుంచి ల్యాండర్-అసెండర్ జత మే 30వ తేదీన విడిపోయింది. ఆర్బిటార్-రిటర్నర్ జత చంద్రుని కక్ష్యలోనే తిరుగుతోంది.

**కీలకమైన ల్యాండింగ్**

ల్యాండర్-అసెండర్ జత చంద్రుడిపై సురక్షితంగా ల్యాండ్ అవడమే ఈ మొత్తం మిషన్‌లో అత్యంత కీలకమైన దశ. దిగేటపుడు మార్గమధ్యంలో ఏమైనా అవాంతరాలు ఉంటే వాటిని గుర్తించేందుకు స్వయంచాలిత అవాంతరాల నిరోధక వ్యవస్థ, కాంతి కెమెరాను వినియోగించారు. వీటి సాయంతో సురక్షితమైన ల్యాండింగ్ ప్రదేశాన్ని ఎంచుకుని ల్యాండర్-అసెండర్ అక్కడే దిగిందని చైనా అధికారి జిన్‌హువా వార్తాసంస్థ పేర్కొంది. ఎస్‌పీఏ బేసిన్‌లోని అపోలో బేసిన్‌లో ఇది దిగింది. భూమి వైపు కంటే ఆవలి వైపు చంద్రుడి ఉపరితలం కాస్తంత గట్టిగా ఉందని సీఏఎస్‌సీ అంతరిక్ష నిపుణుడు హుయాంగ్ హావో చెప్పారు. అక్కడ దిగిన ల్యాండర్ 14 గంటల్లోపు రెండు రకాలుగా మట్టిని సేకరిస్తుంది. డ్రిల్లింగ్ చేసి కొంత, రోబోటిక్ చేయితో మరికొంత ఇలా మొత్తంగా 2 కేజీల మట్టిని సేకరిస్తుంది. ల్యాండర్ చంద్రునికి ఆవలివైపు ఉపరితలంపై ఉన్న నేపథ్యంలో భూమి నుంచి నేరుగా దానిని కమాండ్ ఇవ్వడం అసాధ్యం. అందుకే కమ్యూనికేషన్‌కు వారధిగా ఇప్పటికే చైనా క్వేకియావో-2 రిలే ఉపగ్రహాన్ని ప్రయోగించింది. ఆ శాటిలైట్ ద్వారా చాంగే-6 ల్యాండర్‌కు ఆదేశాలు ఇవ్వొచ్చు.

**మళ్లీ భూమి మీదకు**

సేకరించిన మట్టిని ల్యాండర్ అసెండర్‌లోకి చేరుస్తుంది. అసెండర్ రాకెట్‌లా నింగిలోకి దూసుకెళ్లి ఆర్బిటార్-రిటర్నర్ జతతో అనుసంధానమవుతుంది. రిటర్నర్ మాడ్యూల్‌లోకి మట్టిని మార్చాక రిటర్నర్ అక్కడి నుంచి భూమి దిశగా బయల్దేరుతుంది. అంతా అనుకున్నది అనుకున్నట్లు సవ్యంగా జరిగితే జూన్ 25వ తేదీన రిటర్నర్ భూమి మీదకు చేరుకుంటుంది. చంద్రుని ఆవలివైపు మట్టిని తీసుకొచ్చిన దేశంగా చైనా చరిత్రలో నిలిచిపోనుంది.

## ఎలక్షన్ బీట్

● మంత్రి పొలంబాట



లోక్‌సభ ఎన్నికల ప్రచార హోరు ముగియడంతో అస్సాం వ్యవసాయ మంత్రి అతుల్ బోరా ఆదివారం ఇలా సాగుబాట పట్టారు

### ముందు పోస్టల్ ఫలితాలు: విపక్షాలు

**న్యూఢిల్లీ:** జూన్ 4న లోక్‌సభ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో నిబంధనలను పాటించాలని విపక్ష ఇండియా కూటమి నేతలు ఎన్నికల సంఘాన్ని కోరారు. నిబంధనల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ ఫలితాలను ప్రకటించాకే ఈవీఎం ఫలితాలను వెల్లడించాలన్నారు. వారు ఆదివారం ఈసీతో భేటీ అయ్యారు. ఈసీకి రెండు మూడు ప్రధానాంశాలను వివరించినట్టు అనంతరం సీతారాం ఏచూరి (సీపీఎం), అభిషేక్ సింఘ్వి (కాంగ్రెస్) మీడియాకు తెలిపారు. ''ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఫలితాలను ప్రకటించాలి. ఓట్ల లెక్కింపు వేళ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించేలా అధికారులకు ఆదేశాలివ్వాలని కోరాం. ఈవీఎంలను సీసీటీవీ పర్యవేక్షణలో ఉండే కారిడార్ల గుండానే లెక్కింపు కేంద్రాలకు తీసుకెళ్లాలని, కంట్రోల్ యూనిట్లలో సమయం, తేదీలను ధ్రువీకరించాలని కోరాం. సీల్ చేసిన ఈవీఎంకు ఉండే స్లిప్పులు, ట్యాగ్‌లను కూడా వెరిఫికేషన్ సమయంలో కౌంటింగ్ ఏజెంట్ల ఎదుట ప్రదర్శించాలని కోరాం'' అన్నారు.

### అవి మోదీ మీడియా పోల్స్: రాహుల్

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుస్తుందన్న ఎగ్జిట్‌పోల్స్ అంచనాలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తోసిపుచ్చారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీసీసీ చీఫ్‌లతో ఆయన ఆదివారం వర్చువల్‌గా మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ''వాటిని ఎగ్జిట్ పోల్ కంటే మోదీ మీడియా పోల్ అంటే బాగుంటుంది. అవన్నీ ఆయన ఊహను ప్రతిబింబించే పోల్స్. బీజేపీ రిగ్గింగ్‌కు, మోదీ సైకలాజికల్ గేమ్‌కు ప్రతిరూపం. ఇదంతా విపక్షాల, 'ఇండియా' కూటమి కార్యకర్తల మనోస్థైర్యాన్ని దెబ్బతీసే కుట్ర'' అన్నారు. ఇండియా కూటమికి ఎన్ని సీట్లు వస్తాయని ప్రశ్నించగా ''సిద్ధూ మూసేవాలా '295' పాట విన్నారా? మాకు అన్నే వస్తాయి'' అని బదులిచ్చారు.

**లెక్కింపు రోజు జాగ్రత్త:** నేతలతో వర్చువల్ భేటీలో రాహుల్‌తో పాటు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కూడా మట్లాడారు. ఓట్ల లెక్కింపు రోజు రిగ్గింగ్ వంటివి జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ ముగిసేదాకా హాళ్ల నుంచి ఎక్కడికీ వెళ్లొద్దని ఏజెంట్లు, నేతలకు సూచించారు.

### ఎగ్జిట్ పోల్స్‌కు విలువే లేదు: మమత

**కోల్‌కతా:** లోక్‌సభ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేలా లేవని పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. రెండు నెలల క్రితమే సిద్ధం చేసి ఉంచిన ఆ ఫలితాలకు విలువే లేదని పేర్కొన్నారు. ''2016, 2019, 2021 ఎగ్జిట్ పోల్స్‌లో ఒక్కటీ నిజం కాలేదు. తాజా ఎగ్జిట్ పోల్స్ ప్రజల స్పందనకు తగ్గట్టుగా లేవు. ముస్లింలు బీజేపీకి ఓటేస్తారనుకోను. ఇండియా కూటమి నేతలు అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్, స్టాలిన్, ఉద్ధవ్ ఠాక్రే తదితరులు బాగా ప్రచారం చేశారు. ప్రాంతీయ పార్టీలన్నీ బాగా పనిచేశాయి. బెంగాల్‌లో మాత్రం సీపీఎం, కాంగ్రెస్ బీజేపీకి అనుకూలంగా పని చేశాయి. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ప్రభుత్వంలో చేరతాం'' అన్నారు.

## ప్యారిస్–ముంబై విమానానికి బాంబు బెదిరింపు

**ముంబై:** పారిస్ నుంచి 306 మందితో ముంబై బయల్దేరిన విస్తారా విమానానికి ఆదివారం బాంబు బెదిరింపు వచ్చింది. 'బాంబు పెట్టాం' అని రాసిన నోట్ ఎయిర్ సిక్‌నెస్ బ్యాగ్‌లో కనిపించింది. దాంతో ముంబైలో లాండవగానే అందరినీ హుటాహుటిన దించేసి తనిఖీలు చేపట్టారు. బాంబు సహా అనుమానాస్పద వస్తువులేవీ లేవని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## సందేశ్‌ఖాలిలో మళ్లీ హింస

**కోల్‌కతా:** లోక్‌సభ ఎన్నికల పోలింగ్ పూర్తవగానే పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలిలో ఆదివారం మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. పోలింగ్ సమయంలో పోలీసులపై దాడికి పాల్పడ్డ వారిని అరెస్ట్ చేసేందుకు అగర్హటి గ్రామానికి వెళ్లిన బలగాలపై మహిళలు దాడికి దిగారు. మహిళా సిబ్బంది గాయపడ్డారు. నిర్బంధంలోకి తీసుకున్న వ్యక్తిని విడిపించుకునేందుకు నిరసనకారులు చేసిన ప్రయత్నాలను బలగాలు అడ్డుకున్నాయి. జనవరి 5వ తేదీన రేషన్ కుంభకోణం కేసులో తనిఖీల కోసం సందేశ్‌ఖాలీకి వెళ్లిన ఈడీ బృందంపై దాడి, అనంతరం టీఎంసీ నేత షాజహాన్ షేక్ అరెస్టయినప్పటి నుంచి ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

# జూలియట్ మళ్లీ ఆడుకుంది!

### ఏడేళ్ల శునకానికి విజయవంతంగా గుండె ఆపరేషన్ ● ఆసియాలో ఇదే తొలిసారి

**న్యూఢిల్లీ:** హుషారుగా గెంతుతూ చలాకీగా తిరుగుతూ తమ కుటుంబంలో భాగమైపోయిన ఏడేళ్ల శునకం గుండె జబ్బుతో బాధపడటం చూసి ఆ కుటుంబం అల్లాడిపోయింది. ఎలాగైనా అది మళ్లీ హుషారుగా తిరిగితే చాలు అని మనసులోనే మొక్కుకున్నారు. వారి బాధను అధునాతన చికిత్సవిధానంతో పోగొట్టారు ఢిల్లీలోని ఒక మూగజీవాల వైద్యుడు. రెండేళ్ల క్రితం అమెరికాలో అందుబాటులోకి వచ్చిన ఒక నూతన వైద్యవిధానంతో డాక్టర్ భానుదేవ్ శర్మ నేతృత్వంలోని వైద్య బృందం ఆ శునకానికి కొత్త జీవితం ప్రసాదించింది.

**ఏమిటీ సమస్య?**

ఏడేళ్ల బీగల్ జాతి శునకం జూలియట్ రెండేళ్లుగా మైట్రల్ వాల్వ్ సమస్యతో బాధపడుతోంది. గుండెలో ఎడమ ఎగువ కర్ణిక నుంచి జఠరికకు వెళ్లాల్సిన రక్తం తిరిగి కర్ణికలోకి లీక్ అవుతోంది. దీంతో గుండె కొద్దికొద్దిగా కుంచించుకుపోయి, ఊపిరితిత్తుల్లో నీరు చేరి మృత్యువు ఒడికి చేరే ప్రమాదముంది. దీంతో విషయం తెల్సుకున్న ఢిల్లీలోని ఈస్ట్ కైలాశ్ ప్రాంతంలోని మ్యాక్స్ పెట్జ్ ఆస్పత్రిలోని డాక్టర్ భానుదేవ్ శర్మ నేతృత్వంలోని వైద్య బృందం ఆపరేషన్ చేసేందుకు ముందుకొచ్చింది. చిన్న జీవాలకు గుండె ఆపరేషన్‌లు చేయడంలో శర్మ నిష్ణాతునిగా పేరొందారు. ''అమెరికాలోని కొలర్యాడో స్టేట్ యూనివర్సిటీలో రెండేళ్ల క్రితమే ఈ కొత్త ఆపరేషన్ విధానం అమల్లోకి వచ్చింది. ట్రాన్స్‌క్యాథటర్ ఎడ్జ్ టు ఎడ్జ్ రిపేర్(టీఈఈఆర్) విధానంలో మే 30న జూలియట్‌కు గుండె ఆపరేషన్ చేశాం. ఓపెన్ హార్ట్ సర్జరీలాగా దీనికి పెద్ద కోత అక్కర్లేదు. చాలా చిన్న కోత సరిపోతుంది. గుండె ఊపిరితిత్తుల బైపాస్ మెషీన్‌తో పని ఉండదు. గుండె కొట్టుకుంటుండగానే ఆపరేషన్ చేసేయొచ్చు. ఛాతీ వద్ద అత్యల్ప రంధ్రం చేసి మెషీన్‌ను పంపి గుండె కవాటం ద్వారాన్ని సరిచేస్తాం'' అని శర్మ వివరించారు. ఆపరేషన్ చేసి రెండు రోజులకే జూలియట్‌ను డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం అది ఆరోగ్యంగా ఆటుకుంటూ కుటుంబంలో మళ్లీ సంతోషాన్ని నింపింది.



జూలియట్



డాక్టర్ భానుదేవ్ శర్మ

**ఈ తరహాలో 80 శాతం మరణాలు**

భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా శునకాలు ఎదుర్కొంటున్న హృద్రోగ సమస్యల్లో ఈ తరహావే 80 శాతం ఉండటం గమనార్హం. శునకాల మరణాలకు ప్రధాన కారణాల్లో ఈ సమస్య కూడా ఒకటి. ఆసియా ఖండంలో శునకాలకు ఈ తరహా ఆపరేషన్ చేయడం ఇదే తొలిసారి అని ఆ వెటర్నరీ ఆస్పత్రి తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తిచేసిన రెండో ప్రైవేట్ వైద్య బృందం వీళ్లదేనని ఆస్పత్రి పేర్కొంది.

## రామఫోసా గద్దెదిగే ప్రసక్తే లేదు: ఏఎన్‌సీ

**కేప్ టౌన్:** దక్షిణాఫ్రికా ఎన్నికల్లో అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌కు ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజారిటీ రాకపోయినా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా రాజీనామా చేయబోరని పార్టీ స్పష్టం చేసింది. ఐక్య కూటమి ఏర్పాటు చేసి ఆయన సారథ్యంలోనే స్థిరమైన ప్రభుత్వాన్ని అందిస్తామని పేర్కొంది. ఎన్నికల్లో ఏఎన్‌సీకి 40 శాతం, డెమొక్రటిక్ అలయెన్స్‌కు 20 శాతం, మాజీ అధ్యక్షుడు జాకబ్ జుమా సారథ్యంలోని ఎంకే పార్టీకి 14 శాతం ఓట్లు రావడం తెలిసిందే. 1994లో వర్ణ వివక్ష అంతమైన ఎన్నికలు జరిగినప్పటి ఏఎన్‌సీకి మెజారిటీ రాకపోవడం ఇదే తొలిసారి.

## పాక్‌లో బ్రిగేడియర్‌గా తొలిసారి... మైనారిటీ మహిళ

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌లో మైనారిటీ వర్గానికి చెందిన తొలి మహిళా బ్రిగేడియర్‌గా హెలెన్ మేరీ రాబర్ట్స్ చరిత్ర నెలకొల్పారు. ఆమె 26 ఏళ్లుగా సైన్యంలో పని చేస్తున్నారు. ప్రస్తుతం మెడికల్ కార్ప్స్‌లో సీనియర్ పాథాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పాక్ జనాభాలో 96.47 శాతం మంది ముస్లింలే. హిందువులు 2.14%, క్రైస్తవులు 1.27% దాకా ఉంటారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం : 3 : జూన్ : 2024



## ప్రజ్ఞానందకు సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు

• సోషల్ మీడియాలో పోస్టు

**కొరుక్కుపేట:** యువ చదరంగ క్రీడాకారుడు ప్రజ్ఞానంద ప్రపంచ దిగ్గజాలను మట్టికరిపిస్తుండడంపై ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. ఇందులో 2024 నార్వే చెస్ సిరీస్‌లో యువ ఆటగాడు ప్రజ్ఞానంద ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సెన్‌ను ఓడించడంతో పాటు, ఐదో రౌండ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ పాపియానో కరువానాను కూడా ఓడించడం నిజంగా అద్భుతమని కొనియాడారు. చెస్‌లో టాప్ 10 ర్యాంకింగ్స్‌లోకి ప్రవేశించడం ప్రజ్ఞానంద అపార నైపుణ్యాన్ని, ప్రతిభను చాటుతోందన్నారు.

## న్యూస్‌రీల్

### నాలుకతో కరుణానిధి చిత్రం

• ఈరోడ్ కళాకారుడి నైపుణ్యం



నాలుకతో కరుణానిధిని చిత్రించిన ఈరోడ్ చిత్రకారుడు షానవాజ్

**సేలం:** కలైంజ్ఞర్ కరుణానిధి చిత్రపటాన్ని ఈరోడ్ చిత్రకారుడు తన నాలుకతో చిత్రించి సంచలనం సృష్టించాడు. వివరాలు.. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జయంతి సందర్భంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈరోడ్‌లోని ఇందిరా నగర్ ప్రాంతానికి చెందిన పెయింటింగ్ ఉపాధ్యాయుడు షానవాజ్, మాజీ సీఎం కరుణానిధిపై ఉన్న ప్రేమతో గత 5 సంవత్సరాలుగా కరుణానిధి ఫొటోలను వివిధ రూపాల్లో చిత్రిస్తున్నారు. ఇదే కోవలో ఈ ఏడాది కూడా విభిన్నంగా చిత్రించాలని ప్లాన్ చేసి 3 అడుగుల పొడవు, 2 అడుగుల వెడల్పు ఉన్న తెల్ల కాగితంపై బ్లాక్ మైక్‌తో నాలుకతో కరుణానిధి చిత్రాన్ని చిత్రీకరించాడు. ఈ సందర్భంగా షానవాజ్ మాట్లాడుతూ.. ఈ విచిత్రమైన ఛాయాచిత్రాన్ని చిత్రించడానికి దాదాపు 20 నిమిషాల సమయం తీసుకున్నానని, ఇందుకోసం మూడుసార్లు ముందస్తుగా ప్రయత్నం చేశానని, అవకాశం వచ్చినప్పుడు డీఎంకే అధినేత స్టాలిన్‌కు ఈ ఫొటోను అందజేస్తానని చెప్పారు. కాగా చిత్రకారుడి ఈ కొత్త చొరవను పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు.

### వ్యాపారి ఇంట్లో రూ.4 కోట్లు స్వాధీనం

**కొరుక్కుపేట:** కోయంబత్తూరులో ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఓ వ్యాపార వేత్త ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి రూ.4 కోట్ల నగదు, ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. కేరళలోని పాలకాడుకు చెందిన ఫిరోజ్ ఖాన్ బెంగళూరులో హోటల్ వ్యాపారం చేస్తున్నాడు. కోయంబత్తూరులోని కునియాముత్తూర్ అర్చనా నగరంలో అతనికి ఇల్లు కూడా ఉంది. ఫిరోజ్ ఖాన్ హోటల్ వ్యాపారంతో పాటు సెల్‌ఫోన్ డీలర్ కూడా. ఇతడిపై ఆదాయపు పన్ను సరిగా చెల్లించడం లేదనే ఫిర్యాదులు వచ్చాయి. దీంతో శనివారం బెంగళూరులో ఆయన ఆస్తులను ఎక్సైజ్ శాఖ, ఆదాయపు పన్నుశాఖ దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కోయంబత్తూరులోని కునియాముత్తూర్‌లోని ఫిరోజ్ ఖాన్ ఇంటిపై కూడా ఐటీ అధికారులు దాడులు చేశారు. ఆ సమయంలో లెక్కల్లో చూపని రూ.4.10 కోట్లు నగదు, ఓ తుపాకీని గుర్తించి సీజ్ చేశారు.

### ఏనుగు దాడిలో విద్యార్థి మృతి

**తిరువొత్తియూరు:** కోవై జిల్లా వాల్‌పారై సమీపంలో ఏనుగు దాడిలో ఓ కళాశాల విద్యార్థి మృతి చెందాడు. వివరాలు.. కోవై జిల్లా వాల్‌పారై సమీపంలోని పుదుకాడుకు చెందిన సురేష్ కుమారుడు ముఖేష్ (18). ఇతను కోవై మలిమిచ్చంపట్టిలోని ఓ కళాశాలలో మొదటి సంవత్సరం కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. సెలవు రోజులు కారణంగా అతను తన మోటారు సైకిల్‌పై కోవై నుంచి వాల్‌పారైకి బయలుదేరాడు. శనివారం సాయంత్రం వాల్‌పారై పుదుకాడు ప్రాంతంలో మరో స్నేహితుడు కలిశాడు. ఆ సమయంలో అటవీ ప్రాంతం నుంచి రెండు అటవీ ఏనుగులు రోడ్డుకు అడ్డంగా వచ్చాయి. ఇది చూసిన ఇద్దరు విద్యార్థులూ మోటార్ సైకిళ్లను పక్కగా నిలిపారు. ఆ సమయంలో ఏనుగులు హఠాత్తుగా ముఖేష్‌పై దాడి చేసి తొండంతో కొట్టడంతో మరణించాడు. అతడి స్నేహితుడు మోటార్ సైకిల్ పై పారిపోయాడు. వాల్‌పారై పోలీసులు కేసు నమోదు చేసి ముఖేష్ మృతదేహాన్ని శవపరీక్ష కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

### కాలువలో కారు బోల్తా

• దంపతుల దుర్మరణం

**అన్నానగర్:** కాంచీపురం జిల్లా పూందమల్లికి చెందిన శశిధరన్ (41). ఇతని భార్య రాజశ్రీ (40). వీరి కుమార్తె రుదీష్ (13). ముగ్గురూ కారులో పళని బయలుదేరారు. శశిధరన్ కారు నడుపుతున్నాడు. ఆదివారం ఉదయం తిరుచ్చి దిండుక్కల్ జాతీయ రహదారిపై అన్బుమేడు సమీపంలో కారు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న బ్రిడ్జి గార్డ్ రైల్‌ను ఢీకొని కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు శిథిలాల్లో చిక్కుకున్నారు. తల్లి, కుమార్తెను స్థానికులు రక్షించి మనపరై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ శశిధరన్ శిథిలాల మధ్య చిక్కుకుపోవడంతో వెంటనే రక్షించలేకపోయారు. ఆ తర్వాత వందలాది మంది గుమిగూడారు. 108 అంబులెన్స్‌ను పిలిపించి శశిధరన్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. తర్వాత క్రేన్ సాయంతో కారును కాలువలో నుంచి బయటకు తీశారు. కారు అద్దాలను పగులగొట్టి శశిధరన్‌ను మనపారై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు. తర్వాత చికిత్స పొందుతున్న భార్య రాజశ్రీ కూడా మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రుదిషా కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

# డీఎంకే కూటమికే మొగ్గు

మరో 24 గంటల్లో ఎగ్జాట్ పోల్ ఫలితాలు వెలువడనుండగా.. రాష్ట్రంలో ప్రస్తుతం ఎగ్జిట్ పోల్స్‌పై చర్చ జోరందుకుంది. మెజారిటీ సంస్థల సర్వేలు డీఎంకేకు అనుకూలంగా తమ అంచనాలను ప్రకటించాయి. అయితే ఇదే సమయంలో అన్నాడీఎంకే భవితను ప్రశ్నార్థకం చేసే విధంగా బీజేపీ తమిళనాడులో పాగా వేయడం ఖాయం అంటూ తేలడం.. రాష్ట్రంలో కొత్త రాజకీయ సమీకరణలకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

• రాష్ట్రవ్యాప్తంగా ఎగ్జిట్ పోల్స్‌పై చర్చ
• డీఎంకేకు జై కొట్టిన మెజారిటీ సర్వేలు
• రాష్ట్రంలో ఉనికి చాటుకోనున్న బీజేపీ
• ప్రశ్నార్థకంగా అన్నాడీఎంకే భవిష్యత్



స్టాలిన్



పళణి స్వామి



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న జనం (ఫైల్)



అన్నామలై (ఫైల్)

**సాక్షి,చెన్నై:** తమిళనాడులో మొత్తం 39 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. 2019 ఎన్నికలలో డీఎంకే కూటమి ఏకంగా 38 సీట్లను కైవసం చేసుకుంది. వ్యక్తిగత పలుకుబడి, పార్టీ ఓటు బ్యాంక్‌తో తేని స్థానాన్ని మాజీ సీఎం పన్నీరు సెల్వం వారసుడు రవీంద్రనాథ్ దక్కించుకున్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడే తమ కూటమికి 38 స్థానాలు దక్కిన నేపథ్యంలో ప్రస్తుతం అధికారంలో ఉండడంతో క్లీన్ స్వీప్ నినాదంతో డీఎంకే కూటమి ముందుకు సాగింది. డీఎంకే నేతృత్వంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, కొంగునాడు దేశీయ కట్చి తదితర పార్టీలు తాజా ఎన్నికలను కూటమిగా ఎదుర్కొన్నాయి. డీఎంకే తరపున మెజారిటీ శాతం సిట్టింగ్ ఎంపీలు పోటీ చేశారు. కాంగ్రెస్‌లో కొన్ని స్థానాలలో కొత్త అభ్యర్థుల మినహా తక్కిన వారందరూ సిట్టింగ్ ఎంపీలే ఉన్నారు. వీసీకే తరపున సిట్టింగ్ ఎంపీలు ఇద్దరూ పోటీ చేశారు. సీపీఎం, సీపీఐ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తరపున కూడా సిట్టింగ్‌లు బరిలో దిగారు. ఎండీఎంకే తరపున ఆ పార్టీ నేత వైగో వారసుడు దురై వైగో తిరుచ్చి నుంచి పోటీ చేశారు. ఇక మినీ కూటమిగా డీఎండీకేతో కలిసి అన్నాడీఎంకే, మెగా కూటమిగా చిన్న పార్టీలు, పీఎంకే, తమిళ మానిల కాంగ్రెస్, అమ్మమక్కల్ మున్నేట్ర కళగం, మాజీ సీఎం పన్నీరు సెల్వం శిబిరంతో కలిసి బీజేపీ ఈ ఎన్నికలను ఎదుర్కొంది. ఇందులో అన్నాడీఎంకే తరపున కొత్త ముఖాలే అధికంగా పోటీ చేశారు. బీజేపీ కూటమిలో ఆయా పార్టీల అగ్రనేతలు బరిలోకి దిగారు. తొలి విడతలో తమిళనాట ఏప్రిల్ 19న ఎన్నికలు ముగిశాయి. 45 రోజుల పాటు ఈవీఎంలను కంటికి రెప్పగా రాజకీయ పార్టీలు నిఘాతో పరిరక్షిస్తూ వచ్చాయి. అయినా, కొన్ని చోట్ల సీసీ కెమెరాలు పనిచేయక పోవడం వంటి పరిణామాలు పెను వివాదానికే దారి తీశాయి. ఈ పరిస్థితులలో ఓట్ల లెక్కింపు మంగళవారం చేపట్టనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం తర్వాత వెలువడ్డ ఎగ్జిట్‌పోల్స్ తమిళనాట చర్చకు దారి తీశాయి.

**డీఎంకే వైపే అన్ని సర్వేల చూపు..**

రాష్ట్ర , జాతీయ స్థాయిలో జరిగిన ఎగ్జిట్ పోల్ సర్వేలో మెజారిటీ శాతం సంస్థల ఫలితాలన్నీ డీఎంకే కూటమికే జై కొట్టాయి. ఇది డీఎంకే కూటమిలో జోష్‌ను నింపినా, క్లీన్‌స్వీప్ నినాదానికి చెక్ పడడం సీఎం స్టాలిన్‌ను జీర్ణించుకోలేకుండా చేస్తున్నాయి. ఈ ఎన్నికలలో అన్నీ తానై ప్రచార బాధ్యతలను డీఎంకే తన భుజాన వేసుకుని దూసుకెళ్లింది. ఎగ్జిట్ పోల్ సర్వే మేరకు డీఎంకే అభ్యర్థులు అధికంగా గెలుస్తున్నా, మిత్ర పక్షాల రూపంలో కొన్ని స్థానాలను కోల్పోవాల్సిన పరిస్థితి ఉండడం గమనార్హం. రాష్ట్రంలోని పలు మీడియా సంస్థలతో పాటు మరికొన్ని సంస్థలు చేసిన సర్వేలతో పాటు జాతీయ స్థాయిలో జరిగిన సర్వేలో డీఎంకే కూటమికి 30కు పైగా స్థానాలు దక్కబోతున్నాయి. ఈ మేరకు ఇండియా న్యూస్ డైనమిక్స్ ఏబీపీ సీ ఓటర్స్ 37 స్థానాలు, సీఎన్ఎన్, న్యూస్ 18లు 36 స్థానాలు, మనకీ బాత్ 34 స్థానాలు, టైమ్స్ నావ్ 34 స్థానాలు డీఎంకే కూటమికి తథ్యమని ప్రకటించాయి. మిగిలిన కొన్ని సంస్థలు 30 లోపు స్థానాలు డీఎంకే కూటమి దక్కుతాయని, మిగిలినవి బీజేపీ ఖాతాలోపడనున్నట్టు ప్రకటించడం గమనార్హం. అయితే ఈ సర్వేలను డీఎంకే వర్గాలు కొట్టి పడేస్తున్నాయి. క్లీన్ స్వీప్ తథ్యమని డీఎంకే కూటమికి తిరుగులేదని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అదే సమయంలో అందర్నీ విస్మయానికి గురి చేస్తున్న అంశం అన్నాడీఎంకే భవిత ప్రశ్నార్థకం చేసే విధంగా సర్వేలు అంచనాలను ప్రకటించడమే.

### అన్నాడీఎంకే గల్లంతేనా?

దివంగత సీఎం జయలలిత మరణం తర్వాత అన్నాడీఎంకేలో చోటు చేసుకున్న పరిణామాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎట్టకేలకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మాజీ సీఎం పళణి స్వామి అన్ని బాధ్యతలను తన భుజాన వేసుకుని దూసుకెళ్తున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రధాన ప్రతిపక్షంగా విఫలమైందని బీజేపీ ఆరోపిస్తూ వచ్చింది. ఇందుకు అనుగుణంగానే ఎన్నికలలో ప్రధాన పోటీ డీఎంకే – తమ మధ్య అని బీజేపీ వర్గాలు పేర్కొంటూ వచ్చాయి. ఈ సమయంలో ఎగ్జిట్ పోల్స్ బీజేపీకి అనుకూలంగా కొన్ని స్థానాలను సూచించడం చర్చకు దారి తీసింది. బీజేపీ అధ్యక్షుడిగా అన్నామలై పగ్గాలు చేపట్టినానంతరం రాష్ట్రంలో ఆ పార్టీ బలం పెరిగిందనే చర్చకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా ఎగ్జిట్ పోల్స్ రావడం గమనార్హం. అదే సమయంలో ఈ సర్వే అన్నాడీఎంకే భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసినట్టు చెప్పవచ్చు. రాష్ట్రంలో కొన్ని సర్వేలు బీజేపీ కూటమికి ఐదు స్థానాలు, మరికొన్ని సర్వేలు మూడు లేదా నాలుగు, ఇంకొన్ని సంస్థలు రెండు లేదా నాలుగు సీట్ల కై వశం తథ్యమన్న ధీమాతో ప్రకటనలు చేశాయి. అయితే, అన్నాడీఎంకేకు అనుకూలంగా సర్వేలు పరిమిత సంఖ్యలోనే సంస్థలు వెల్లడించాయి. ఇందులో ఇండియా న్యూస్ అన్నాడీఎంకేకు ఐదు, టైమ్స్ నావ్ సర్వే రెండు స్థానాలు అన్నాడీఎంకేకు తథ్యమని ప్రకటించాయి. మిగిలిన సర్వేలన్నీ బీజేపీకి అనుకూలంగా ఉండటంతో రెండో స్థానం ఎవరికో అన్న చర్చ తెర మీదకు వచ్చింది. ఈ ఎగ్జిట్ పోల్స్ అన్నాడీఎంకే కేడర్‌ను కలవరంలో పడేసినా, బీజేపీ వర్గాలలో మాత్రం జోష్‌ను నింపింది. 2014లో ఒక స్థానం చేజిక్కించుకున్న తమకు, 2019లో డిపాజిట్లు గల్లంతు కావడం, ప్రస్తుతం బోనస్‌గా అదనపు సీట్లు దక్కనున్నదాన్ని పరిగణించిన బీజేపీ వర్గాలు రాష్ట్రంలో మున్ముందు ప్రధాన ప్రతి పక్షం తామే అన్న ధీమాను వ్యక్తం చేస్తున్నాయి. అధికార పక్షాన్ని ఢీకొట్టే రీతిలో తామున్నామని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నా, తుది ఫలితాల తర్వాత ఇది తేలనుంది.

## కరుణాస్ బ్యాగ్‌లో 40 తూటాలు

• విమానాశ్రయంలో కలకలం
• లైసెన్సులు, ఆధారాలు చూపించడంతో విడుదల
• విమాన ప్రయాణం రద్దు



స్వాధీనం చేసుకున్న తూటాలు, కరుణాస్

**సాక్షి, చెన్నై:** సినీ నటుడు, ముక్కళత్తోర్‌పులి పడై నేత కరుణాస్ చేతి బ్యాగ్‌లో 40 తుపాకీ తూటాలు బయటపడ్డాయి. విమానాశ్రయంలో తనిఖీల సమయంలో ఇవి బయటపడడంతో స్థానికంగా కలకలం రేపింది. అయితే, తనకు ఉన్న తుపాకీ లైసెన్సుతో పాటు ఇతర ఆధారాలను ఆయన సమర్పించడంతో పోలీసులు విడుదల చేశారు. అయితే, విమాన ప్రయాణాన్ని రద్దు చేసుకుని కారులో ఆయన తిరుచ్చి వెళ్లాల్సి వచ్చింది. ఆదివారం ఉదయం చెన్నై నుంచి తిరుచ్చికి ఇండిగో విమానంలో ప్రయాణం చేయడానికి కరుణాస్ టికెట్లు బుక్ చేసుకున్నారు. విమానాశ్రయంలో తనిఖీల సమయంలో ఆయన చేతి బ్యాగ్‌లో ఆయుధాలు ఉన్నట్టు అలారం మోగింది. దీంతో బ్యాగ్‌ను సీఆర్‌పీఎఫ్ బలగాలు క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఇందులో 40 తూటాలు బయటపడ్డాయి. ఇది స్థానికంగా కలకలం రేపింది. సినీ నటుడు వద్ద తుపాకీ తూటాలు లభించడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఆ తూటాలను చూసిన కరుణాస్ సైతం షాక్‌కు గురయ్యారు. అత్యవసరంగా తాను బయలు దేరడంతో హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న తూటాలను గుర్తించ లేకపోయానని వివరణ ఇచ్చుకున్నారు. తనకు తుపాకీ లైసెన్సు ఉందని, తూటాలకు సంబంధించిన ఆధారాలకు తగ్గ సర్టిఫికెట్లను ఆయన భద్రతా సిబ్బందికి చూపించారు. అత్యవసరంగా బయలుదేరడంతో వీటిని ఇంట్లో పెట్టకుండా మరిచిపోయి బ్యాగ్‌లో తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. అయితే, ఆయన వద్ద జరిపిన విచారణ కారణంగా విమానం అరగంటపాటు రన్‌వే మీద వేచి ఉండాల్సివచ్చింది. చివరకు ఆయన ప్రయాణాన్ని రద్దుచేయించారు. దీంతో విమానం తిరుచ్చికి టేకాఫ్ తీసుకుంది. అరగంట తర్వాత విచారణను భద్రతా విభాగం పూర్తి చేసింది. ఆయన సమర్పించిన ఆధారాలతో ఏకీభవించారు. అయితే, విమానం టేకాఫ్ తీసుకోవడంతో ఆయన ప్రయాణం రద్దయింది. విచారణానంతరం విమానాశ్రయం నుంచి బయటకు వచ్చిన కరుణాస్ తన మద్దతుదారులతో కలిసి రోడ్డు మార్గంలో కారులో తిరుచ్చికి బయలుదేరి వెళ్లారు.

## కౌంటింగ్‌కు భారీ భద్రత



కోయంబత్తూరులో ఫ్లాగ్ మార్చ్



తూత్తుకుడిలో..

• శరవేగంగా ఈసీ ఏర్పాట్లు

**సాక్షి, చెన్నై :** రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. సోమవారం ఒక్క రోజే సమయం ఉండడంతో రాత్రి లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం ఆదేశించింది. దీంతో లక్షలాది మంది పోలీసులతో కౌంటింగ్ కేంద్రాలు, పరిసరాలలో భద్రతా ఏర్పాట్లు చేశారు. వివరాలు.. రాష్ట్రంలో ఏప్రిల్ 19న మొత్తం 39 లోక్ సభ స్థానాలకు సార్వత్రిక ఎన్నికలు, విలవన్‌కోడు అసెంబ్లీకి ఉప ఎన్నిక జరిగిన విషయం తెలిసిందే. ఎన్నికలలో ఉపయోగించిన ఈవీఎంలు అన్నీ 39 ప్రభుత్వ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలలో 45 రోజుల పాటు నిఘా నీడలో ఉంచారు. ఇక మంగళవారం స్ట్రాంగ్ రూములకు వేసిన తాళాలను తెరవనున్నారు. ఇందుకోసం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆయా కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. పూర్తిగా నిఘా నీడలో కౌంటింగ్ జరిగే విధంగా ఎన్నికల యంత్రాంగం చర్యలు విస్తృతం చేసింది. కౌంటింగ్‌కు విధులకు హాజరయ్యే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో అన్ని కౌంటింగ్ కేంద్రాలను నిఘా నీడలోకి తీసుకొచ్చారు. పారా మిలటరీతో పాటు రాష్ట్ర పోలీసులు లక్ష మంది భద్రతా విధులలో నిమగ్నం కానున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా భద్రతంగా పరంగా చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం అన్ని కేంద్రాల పరిసరాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. ఆదివారం కూడా కొన్ని చోట్ల ఫ్లాగ్ మార్చ్ జరిగింది. కౌంటింగ్ నేపథ్యంలో సోమవారం రాత్రి నుంచి టాస్మాక్ మద్యం దుకాణాలు మూత పడనున్నాయి. ఇదిలా ఉండగా కౌంటింగ్ రోజు పార్టీల ఏజెంట్లు వ్యవహరించాల్సిన అంశాలు, విధి విధానాల గురించి ఆయా పార్టీలు ఆదివారం శిక్షణ ఇచ్చాయి. బీజేపీ ఏజెంట్లకు ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధులు పలు సూచనలు, సలహాలు అందించారు. అన్నాడీఎంకే ఏజెంట్లకు సైతం ఆపార్టీ ముఖ్య నేతలు సూచనలు ఇచ్చారు. ఇక, డీఎంకే కూటమి పార్టీల ఏజెంట్లకు సీఎం స్టాలిన్ లేఖ రాశారు. ఏజెంట్లకు ఉన్న అధికారాలను తెలియజేశారు. ఎలాంటి చిన్న అనుమానం వచ్చినా ఎన్నికల అధికారులను నిలదీయాలని సూచించారు.

## భూసేకరణలో నిబంధనల ఉల్లంఘన

• డీఆర్‌ఓ, తహసీల్దార్ సస్పెన్షన్

**కొరుక్కుపేట:** కోయంబత్తూరు విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణలో నిబంధనలు ఉల్లంఘించిన డీఆర్‌ఓ, తహసీల్దర్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. వివరాలు.. కోయంబత్తూరు అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణకు 644 ఎకరాల భూమి అవసరమని ప్రకటించారు. ఇందులో 461 ఎకరాల భూమి ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉంది. ఈ భూమిని సేకరించేందుకు ప్రత్యేక జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) అనిత, తహసీల్దార్ ప్రసన్న, సర్వేయర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. నివాస భూమికి చదరపు మీటరుకు రూ. 1,500 పరిహారం మొత్తాన్ని, వ్యవసాయ భూమికి చదరపు అడుగుకు రూ.900గా నిర్ణయించారు. అయితే ఇందులో కొన్ని అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. రూ. 10 కోట్లు గోల్‌మాల్ జరిగినట్లు తేలింది. భూమి దస్తావేజు లేకుండానే నష్టపరిహారం చెల్లించిన తహసీల్దార్ ప్రసన్నను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ ఆదేశించారు. అలాగే విమానాశ్రయ విస్తరణ భూసేకరణ రెవెన్యూ అధికారిణి అనితపై వచ్చిన ఆరోపణలను తమిళనాడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. విచారణ జరిపిన తమిళనాడు ప్రభుత్వం ఆమెను కూడా సస్పెండ్ చేసింది. కాగా అనిత శనివారం రిటైర్డ్ అయ్యారు. అయితే పదవీ విరమణ చేసే ముందే ఆమెపై సస్పెన్షన్ వేటు వేయడం గమనార్హం.

### షిరిడీ, అండమాన్ విమానాల రద్దు

**తిరువొత్తియూరు:** చెన్నై విమానాశ్రయం నుంచి ఢిల్లీ, హైదరాబాద్, షిరిడీ, గోవా, అండమాన్ సహా పలు నగరాలకు స్పైస్ జెట్ ఎయిర్‌లైన్స్ విమానాలను నడుపుతోంది. ఈ స్థితిలో శనివారం నుంచి 10వ తేదీ వరకు అన్ని నగరాలకు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు స్పైస్‌జెట్ విమానయాన సంస్థ ప్రకటించింది. ఆదివారం ఉదయం షిరిడీ, అండమాన్ వెళ్లేందుకు బుక్ చేసుకున్న ప్రయాణికులు వెళ్లారు. వారిని సెక్యూరిటీ సిబ్బంది విమానాశ్రయంలోకి అనుమతించలేదు. 10వ తేదీ వరకు స్పైస్ జెట్ విమానాన్ని రద్దు చేసినట్లు వారు తెలిపారు. దీంతో దిగ్భ్రాంతికి గురైన ప్రయాణికులు నిరాశతో వెనుదిరిగారు. సంస్థ చెన్నై విమానాశ్రయం నుంచి వివిధ నగరాలకు రోజుకు 12 విమానాలను నడుపుతోంది. 10 రోజులుగా 120 విమానాలు రద్దు అయ్యాయి. దీనికి సంబంధించి, పరిపాలనా సంస్కరణల కారణంగా విమానాలను రద్దు చేసినట్లు సంబంధిత ఎయిర్‌లైన్ యాజమాన్యం ప్రకటించింది.

## డెల్టా పులకింత

• రాష్ట్రంలో విస్తరిస్తున్న నైరుతి రుతు పవనాలు
• పలుచోట్ల ఈదురుగాలులు



తంజావూరులో నీటమునిగిన వరి పంట



తంజావూరు రైల్వే వంతెన కింద నిలిచిన వరద నీరు



నెల్లైలో నత్తనడకన వాహనాలు

**సాక్షి,చెన్నై :** డెల్టా జిల్లాలో పలు చోట్ల శనివారం రాత్రాంతా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఇక నైరుతి రుతు పవనాలు క్రమంగా విస్తరిస్తుండటంతో ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉంటాయని ఆదివారం వాతావరణ కేంద్రం ప్రకటించింది. వివరాలు.. నిర్ణీత సమయం కంటే రెండు రోజులకు ముందగానే నైరుతి రుతు పవనాలు కేరళ తీరాన్ని తాకిన విషయం తెలిసిందే. ఈ పవనాలు తొలుత తమిళనాడులోని కేరళ సరిహద్దులలో ఉన్న పశ్చిమ కనుమల వెంబడి ఉన్న జిల్లాలకు విస్తరించింది. దీంతో ఈ జిల్లాలో తెరపించి తెరపించి వర్షాలు పడుతున్నాయి. ఈ పవనాలు క్రమంగా దక్షిణ తమిళనాడులోని పలు జిల్లాలకు విస్తరించింది. తాజాగా డెల్టా జిల్లాలలోకి ఈ పవనాలు ప్రవేశించడం అన్నదాతలో ఆనందాన్ని నింపుతోంది. డెల్టాలోని తంజావూరు, తిరుచ్చి, నాగపట్నం, తిరువారూర్, పుదుకోట్టై, మైలాడుతురై జిల్లాలో అనేక చోట్ల శనివారం రాత్రి నుంచి వర్షాలు పడుతున్నాయి. నాగపట్నం జిల్లా వేలాకని, వేదారణ్యం, కీల్ వేలూరు పరిసరాలలో, తిరువారూర్ జిల్లా వలంగైమాన్, మన్నార్‌కుడి, తిరుత్తురై పూండిపరిసరాలలో, మైలాడుతురై జిల్లా శీర్గాలి, కొల్లిడం, తంజావూర జిల్లా పాపనాశనం వల్లం, తిరువయ్యారు, తిరుకాట్టు పల్లి, కుంబకోనం పరిసరాల్లో, కరూర్, తిరువారూర్, పుదుకోట్టై జిల్లాల్లో అనేక చోట్ల వర్షాలు ముసురు వర్షం కురుస్తోంది. కొన్ని చోట్ల ఈదురుగాలతో భారీ వర్షం అనేక చోట్ల పడింది. రుతు పవనాలు క్రమంగా రాష్ట్రంలో విస్తరిస్తున్నాయి. అయితే ఉత్తర తమిళనాడులోని చెన్నై, శివారులతోపాటు మరి కొన్ని జిల్లాలో భానుడి సెగ ఏమాత్రం తగ్గడం లేదు. మరో రెండు రోజులు ఎండ ప్రభావం ఉన్నా, పవనాల విస్తరణ కారణంగా వాతావరణం చల్లబడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. మరో రెండు రోజుల పాటు నీలగిరి, కోయంబత్తూరు, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాలతో పాటు 17 జిల్లాలో భారీ వర్షాలకు అవకాశం ఉందని, ఆ తదుపరి ఉత్తర తమిళనాడులో వాతావరణం చల్లబడి వర్షాలు పడుతాయని వాతావరణ కేంద్రం అధికారులు స్పష్టం చేశారు.

### సంక్షేమం కోసమే బీజేపీకి ప్రజల మద్దతు



మాట్లాడుతున్న తమిళసై సౌందర్‌రాజన్

**వేలూరు:** సంక్షేమం కోసమే దేశంలోని ప్రజలంతా ఏకపక్షంగా భారతీయ జనతా పార్టీకి ఓటు రూపంలో తెలియజేస్తున్నారని తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసై సౌందర్‌రాజన్ అన్నారు. వేలూరు జిల్లా గుడియాత్తంలోని సిద్ధ వైద్య కేంద్రంలో ఆమె తండ్రి కుమరి ఆనందన్ చికిత్స పొందుతున్నారు. దీంతో ఆయనను పరామర్శించేందుకు చెన్నై నుంచి కాట్పాడికి రైలు మార్గంలో ఆదివారం ఉదయం వచ్చారు. ఆ సమయంలో ఆ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరుకొని ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన జన్మదినోత్సవం అయిన జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం కూడా కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తమిళనాడులో బీజేపీ కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. తమిళనాడులో శాంతి భద్రతలు కరువయ్యాయని వీటితో పాటు గంజాయి మత్తులో దుండగులు హత్యలు చేయడం పెరిగిందన్నారు. వీటిని అదుపు చేయలేని డీఎంకే బీజేపీపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకుందన్నారు.

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు

**అన్నానగర్:** రాజపాలెంలో ఆదివారం ఉదయం బైక్ ప్రమాదంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ మృతి చెందాడు. వివరాలు.. విరుదునగర్ వార్డు ఎల్ రాజపాళయం సమీపం ఆలంగులం ప్రాంతానికి చెందిన నటరాజన్ (53). ఇతను రాజపాళయం సౌత్ పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ ఎస్ఐగా పనిచేస్తున్నారు. 6 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో నటరాజన్ ఎడమ కాలు ఫ్రాక్చర్ కావడంతో చికిత్స పొందుతున్నాడు. దీంతో కొడుకు ముఖేష్ తన తండ్రిని ఆలంగుళం నుంచి రోజూ బైకులో పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి పనికి వదిలి వెళ్లేవాడు. దీని ప్రకారం ఆదివారం ఉదయం ముఖేష్ తన తండ్రి నటరాజాన్‌ను డ్యూటీకి బైకులో తీసుకువస్తుండగా రాజపాళెం సొక్కలింగపురం ఎగ్జిట్ సమీపంలోకి రాగానే మరో బైక్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అదుపు తప్పి కిందపడిన నటరాజన్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతని కుమారుడు ముఖేష్, మరో బైకు నడుపుతున్న సొక్కళింగపురానికి చెందిన పెరుమాళ్ గాయపడ్డారు. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం రాజపాళ్యం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### బావిలో పడిన పశువు

- రక్షించిన అగ్నిమాపకశాఖ సిబ్బంది



పశువును కాపాడుతున్న అగ్నిమాపక సిబ్బంది

**తిరుత్తణి:** బావిలోపడి ప్రాణాలతో పోరాడిన పశువును అగ్నిమాపకశాఖ సిబ్బంది సురక్షితంగా కాపాడారు. తిరుత్తణి సమీపం తెక్కళూరు గ్రామానికి చెందిన కృష్ణన్ రైతు. ఆదివారం మధ్యాహ్నం అతని పొలం వద్ద కృష్ణన్ ఆవును మేతకు వదిలాడు. పొలం వద్ద వ్యవసాయ బావిలో పశువు ప్రమాదవశాత్తు పడిపోయింది. విషయం తెలిసి 50 అడుగుల లోతైన బావి నుంచి పశువును కాపాడేందుకు వెంటనే తిరుత్తణి అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని గంటపాటు శ్రమించి ప్రాణాలతో బయటకు తీశారు. దీంతో రైతు అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# కొండ ఆలయానికి పోటెత్తిన భక్తులు



తిరుత్తణి ఆలయంలో క్యూలో వేచివున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

**తిరుత్తణి:** వేసవి సెలవులు ముగియనుండడం, ఆదివారం సెలవుదినం కావడంతో తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నాలుగు గంటల పాటు క్యూలో వేచివుండి స్వామిని దర్శించుకున్నారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల నుంచి రోజూ వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకోవడం పరిపాటి. ఈ క్రమంలో పాఠశాలలకు వేసవి సెలవులు ముగించి జూన్ 10న తెరుచుకోనున్న క్రమంలో స్వామి దర్శనం కోసం భక్తులు తమ కుటుంబాలతో చేరుకున్నారు. కొండ ఆలయ ఘాట్‌రోడ్డు మార్గంలో పాటు, మెట్ల మార్గంలో భక్తులు ఆలయానికి భారీగా చేరుకున్నారు. దీంతో ఆలయ మాడ వీధులు పోటెత్తాయి. ఉచిత దర్శన మార్గంలో మూడు గంటలు, రూ.వంద ప్రత్యేక దర్శన మార్గంలో రెండు గంటల పాటు వేచివుండి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం అభిషేక పూజలు రద్దు చేసి ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు నిర్విరామంగా స్వామి దర్శనం కల్పించారు. ఆదివారం మొత్తం 60 వేలకు పైగా భక్తులు స్వామి సేవలో పాల్గొన్నట్లు అధికారులు ప్రకటించారు.

# ఆకట్టుకున్న దుర్యోధన వధ

**పళ్లిపట్టు:** బాలాపురంలో ద్రౌపదీదేవి ఆలయ అగ్నిగుండ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం దుర్యోధన వధ ప్రదర్శన స్థానికులను అమితంగా ఆకటటుకుంది. వివరాలు.. ఆర్కేపేట యూనియన్ బాలాపురంలోని ద్రౌపదీదేవి ఆలయంలో అగ్నిగుండ ఉత్సవాలను బాలాపురం, మహాకాళికాపురం గ్రామస్తులు సంయుక్తంగా ఏటా వేడుకగా నిర్వహించడం పరిపాటి. ఈ ఏడాది అగ్నిగుండ వేడుకలు మే 23న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు సందర్భంగా ఆలయం గ్రామవీధులు విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. రోజూ అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. పగటి సమయాల్లో మహాభారత ప్రవచనాలు, రాత్రి సమయాల్లో వీధి నాటకం ప్రదర్శించారు. ఆదివారం అగ్నిగుండ ప్రవేశం సందర్భంగా ఉదయం 600కు పైబడిన భక్తులు కంకణాలు ధరించారు. 12 గంటలకు దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. సాయంత్రం అగ్నిగుండ వేడుకలు సందర్భంగా ఆలయం వద్ద జనం పోటెత్తారు. అగ్నిగుండ ప్రవేశం చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

# బైక్ లిఫ్ట్ అడిగి నగదు అపహరణ

- ఆరునెలల తర్వాత పోలీసులకు పట్టుబడిన నిందితుడు



విఘ్నేష్

**తిరుత్తణి:** లిఫ్ట్ అడిగి వెళ్తూ బైక్ యజమానికి బ్యాకులోని నగదు అపహరించుకుని పరారైన యువకుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. చెన్నైకు చెందిన మదియళగన్ (23) ఆంధ్రాలోని తిరుపతిలో న్యాయవిద్య అభ్యసిస్తున్నాడు. జనవరి 20న కళాశాలకు వెళ్లి పరీక్షల ఫీజు చెల్లించేందుకు చెన్నై నుంచి తిరుపతికి బైక్‌లో బయలుదేరాడు. తిరుత్తణి సమీపంలోని చెన్నై తిరుపతి జాతీయ రహదారిలో వేచివున్న ఓ వ్యక్తి లిఫ్ట్ అడగ్గా తన బైకులో ఎక్కించుకున్నాడు. బైకు తిరుత్తణి బైపాస్ వద్ద వెళ్తుండగా.. లిఫ్ట్ అడిగిన వ్యక్తి అకస్మాత్తుగా బైకు నుంచి దూకి పరుగులు తీశాడు. అనుమానంతో తన బ్యాగును చూడగా అందులో వుంచిన రూ. 10,500 అపహరించుకుని పరారవుతున్నట్లు గుర్తించి వెంబడించాడు. అయితే అంతలోనే ఆ యువకుడు పరారయ్యాడు. సంఘటనకు సంబంధించి మదియళగన్ తిరుత్తణి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే నగదు అపహరించుకుని పరారైన వ్యక్తికి సంబంధించి వివరాలు తెలియక పోవడంతో తిరుత్తణి డీఎస్పీ విఘ్నేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పోలీసులు బైపాస్ రోడ్డులోని సీసీ కెమెరాల్లో నమోదైన వీడియో క్లిప్పింగ్ సాయంతో నిందితుడి కోసం గాలించారు. ఈ క్రమంలో శనివారం రాత్రి తిరుత్తణి బస్టాండ్ వద్ద ఒంటరిగా నిలిచివున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఈ క్రమంలో తిరుత్తణి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తులో జనవరి నెలలో బైకులో లిఫ్ట్ అడిగి బ్యాగులోని నగదు అపహరించినట్లు నేరాన్ని అంగీకరించాడు. దీంతో తిరుత్తణి పెరియార్ నగర్‌కు చెందిన విక్కి అలియాస్ విఘ్నేష్(22) ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

### బైక్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

**అన్నానగర్:** చెన్నైలోని తిరువొత్తియూర్ కాలడీపేట్టై బీచ్ రోడ్డుకు చెందిన సుబ్బయ్య (63). ఆదివారం ఉదయం ఆయన ఎన్నూర్ ఎక్స్‌ప్రెస్‌వే దాటేందుకు యత్నిస్తుండగా ఎన్నూరు నుంచి రాయపురం వెళ్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బయ్య మృతిచెందాడు. బైక్‌పై వచ్చిన ఎన్నూర్ తిలక్ నగర్‌కు చెందిన రవిచంద్రన్ (22) తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని స్థానికులు సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

# హోటల్‌లో గ్యాస్ సిలిండర్ పేలుడు

**కొరుక్కుపేట:** కడలూరు జిల్లా బన్రుట్టి సమీపంలోని నెల్లికుప్పం హోటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కడలూరులోని నెల్లిక్కుప్పం పోలీస్ స్టేషన్ ఎదురుగా శంకర్‌కు చెందిన హోటల్ ఉంది. ఇందులో ఉద్యోగులు మధ్యాహ్న భోజనం విక్రయానికి సిద్ధం చేస్తుండగా గ్యాస్ సిలిండర్ హోస్ అనూహ్యంగా లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో నెల్లికుప్రానికి చెందిన అహ్మద్ (56), కొత్తపల్లికి చెందిన అష్రఫ్ అలీ (55), కీల్పాది కర్పగం (40), శివగంగకు చెందిన సతీష్ కుమార్ (30), పీఎస్ పాలయం విరుదంబల్ (62) సహా మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను రక్షించి చికిత్స నిమిత్తం కడలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే నెల్లికుప్పం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పోలీసులను చూసి వంతెన పైనుంచి దూకిన దొంగ

**తిరువొత్తియూరు:** చూలైమేడులో కత్తితో పొడిచి సెల్‌ఫోన్ చోరీ చేసిన దొంగ పోలీసులను చూసి తప్పించుకోవడానికి వంతెవ పై నుంచి దూకడం సంచలనంగా మారింది. దీంతో అతని ఎడమ కాలి ఎముక విరిగిపోయింది. వివరాలు.. చెన్నై చూలైమేడులో నడిచి వెళుతున్న యువకుడిని కత్తితో పొడిచి సెల్‌ఫోన్, రూ. 5,000 నగదు అపహరించిన సంఘటన సంబంధించి చూలమేడు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులు పాల్గొన్నట్లు తెలిసింది. దీంతో వారిని పట్టుకోడానికి పోలీసులు సీసీ టీవీ కెమెరా ఫుటేజీని తనిఖీ చేయగా వారు అదే ప్రాంతానికి చెందిన కరుణ కుమార్, విగ్నేష్ అని తెలిసింది. తర్వాత వివేక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అంబత్తూరు ప్రాంతంలో దాగి వున్న కరుణ కుమార్ పోలీసులు చూసి తప్పించుకోడానికి పరిగెత్తాడు. ఆ సమయంలో వంతెన పైనుంచి కిందకి దూకాడు. దీంతో అతని ఎడమ కాలికి ఎముక విరిగిపోయింది. అతడిని ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.



తిరుత్తణి బైపాస్ రోడ్డులో భారీ వర్షం



కాశీనాథపురంలో కూలిన చెట్టు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభం

# తిరుత్తణిలో వర్ష బీభత్సం

**తిరుత్తణి:** పట్టణంలో ఆదివారం ఉదయం గాలీవాన బీభత్సం సృష్టించింది. ఫలితంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ధర్మరాజులు ఆలయం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలో వర్షపునీటితో మురుగునీరు పేరుకుపోని నిల్వ చేరడంతో రాకపోకలు స్తంభించాయి. అలాగే పట్టణ శివార్లలోని కాశీనాథపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల వద్ద గాలీవానకు చెట్టుకూలి విద్యుత్ స్తంభంపై పడింది. వర్షం పడడంతో ఆ సమయంలో గ్రామస్తులు ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే విద్యుత్‌శాఖ సిబ్బంది కరెంటు నిలిపి వేశారు. తర్వాత పంచాయతీ సిబ్బంది తెగిన విద్యుత్ తీగలు, చెట్టును తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

## కోలీవుడ్ టాక్స్

# తమిళుడు ఎందుకు పాలించకూడదు



ఇండియన్ 2 ఆడియో ఆవిష్కరణలో కమలహాసన్


**తమిళసినిమా:** లోక నాయకుడు కమలహాసన్ కథానాయకుడిగా నటించిన చిత్రం ఇండియన్ 2. శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. కాగా కమలహాసన్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేసిన ఇండియన్ చిత్రం 1996లో విడుదలై సంచలన విజయాన్ని సాధించింది కాగా 28 ఏళ్ల తర్వాత దానికి సీక్వెల్‌గా రూపొందిన చిత్రమే ఇండియన్ 2. నటుడు సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియాభవాని శంకర్ ప్రముఖ తారాగణం నటించిన ఈ చిత్రానికి 3వ సీక్వెల్ కూడా ఉంటుందని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. ఇండియన్ 2 చిత్రం జూలై 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. అనిరుధ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం చెన్నైలోని నెహ్రూ హిందూ స్టేడియంలో అభిమానుల మధ్య బ్రహ్మాండంగా నిర్వహించారు. కమలహాసన్ మాట్లాడుతూ ×నేను తమిళుడిని, నేను భారతీయుణ్ణి అన్నదే నా గుర్తింపు. ఇక్కడ విభజించి పాలించాలని ఎవరైనా భావిస్తే అది భారతదేశంలో జరగదు. అలాంటి తమిళుడు ఎందుకు భారతదేశాన్ని పాలించకూడదూ అన్నదే తన భావన. సాధారణంగా నాకు సీక్వెల్ అంటే ఇష్టం. ఎందుకంటే ఆ చిత్రంలో ఏమేమి ఆశించి రావాలన్నది ప్రేక్షకులకు తెలుసు. ఇండియన్ చాలా పెద్ద కథ అందుకే చిత్రాన్ని మూడు భాగాలుగా చేశాం. ఇలాంటి చిత్రాన్ని నేను శివాజీ గణేషన్ కథానాయకుడిగా చేయాలని భావించాను. అయితే ఆయనే ఇండియన్ చిత్రంలో తండ్రి కొడుకులుగా నన్నే చేయమని చెప్పారు¥ అని కమలహాసన్ పేర్కొన్నారు. ఈ వేడుకలో చిత్ర యూనిట్‌తో పాటు నటుడు శింబు, దర్శకుడు లోకేష్ కనకరాజ్, నెల్సన్, నటి శ్రుతిహాసన్, అదితిశంకర్, పాల్గొన్నారు.



పూజా హెగ్డే

# ఇదంతా మీ కోసమే..

**తమిళసినిమా:** ఇళయరాజా సంగీతం గలగల పారే గంగా ప్రవాహం. ప్రతి మనిషికి ఉత్సాహం. అలసిన మనసులకు ఆహ్లాదం. ఇళయరాజా 1943 జూన్ 3వ తేదీన జన్మించారు. ఇప్పడీ సంగీత పిపాసి వయసు 81 వసంతాలు. ఈయన సంగీతానికి 48 ఏళ్లు. ఇప్పటికీ సంగీతమే ఇళయరాజా ప్రపంచం. 1000 కి పైగా చిత్రాలు, 4,500 పైగా పాటలు వెరసి ఇళయరాజా. అందుకే అందరూ ఇతన్ని సంగీత జ్ఞాని అంటారు. సింఫోనీతో ఖ్యాతి అన్నది వయసు మాత్రమే. ఈయన నిత్య కృషీవలుడు, నిరంతర సంగీత శోధకుడు. అందుకే ఈయన జీవిత చిత్రంగా చరిత్ర పుటల్లోకెక్కుతోంది. పలు జాతీయ, రాష్ట్రీయ అవార్డులకు ఈయన తలమాణికం అయ్యారు. చివరికి రాజ్యసభ సభ్యుడు పదవి ఇళయరాజాను వరించింది. అలాంటి సంగీత రారాజు ఇళయరాజాకు ఆదివారం 81వ జన్మదినోత్సవం. దీంతో నటుడు కమలహాసన్ నుంచి అనేకమంది ప్రముఖులు ఇళయరాజాకు జన్మదిన శుభాకాంక్షలు ప్రత్యక్షంగాను, సామాజిక మాధ్యమాల ద్వారాను అందించారు. ఇక అభిమానులు ఈ సంగీత సరస్వతిని చూడడానికి స్థానిక టీనగర్‌లోని ఇళయరాజా రికార్డింగ్ స్టూడియోకు పోటెత్తారు. ఆయనతో ఫొటోలు దిగడానికి బారులు తీరారు. అయితే ఇళయరాజా ఎంతో సహనంతో వచ్చిన అభిమానులందరినీ సంతోషపరచడానికి వారితో చిరునవ్వులు చిందిస్తూ ఫొటోలు దిగడం విశేషం. ఆయన మీడియాతో మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా మీరే తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారని, తాను మాత్రం తన కుమార్తెను కోల్పోవడం వల్ల ఎలాంటి పుట్టినరోజు వేడుకలను జరుపుకోవడం లేదని పేర్కొన్నారు. అయితే ఇదంతా మీ కోసమే కానీ తన కోసం కాదని ఇళయరాజా అన్నారు.



ఇళయరాజా

# నా లక్ష్మి కనిపించ లేదు!



విజయ్‌సేతుపతి

**తమిళసినిమా:** విలక్షణ నటుడు విజయ్‌సేతుపతి కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం మహారాజా. ఇది ఆయన 50వ చిత్రం కావడం విశేషం. ఫ్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుదన్ సుందరం, జగదీష్ పళనిస్వామి కలిసి నిర్మించిన ఈ చిత్రానికి కురంగు బొమ్మై చిత్రం ఫేమ్ నితిలన్ స్వామినాథన్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించారు. ఇందులో బాలీవుడ్ నటుడు దర్శకుడు అనురాగ్ కశ్యప్, నటి మమతామోహన్‌దాస్, నట్టి, మునిష్కాంత్, భారతీయ రాజా, సింగం పులి, వినోద్‌సాగర్, పీఎల్ తేనప్పన్ ముఖ్యపాత్రలు పోషించారు. అజనీష్ లోకనాథ్ సంగీతాన్ని అందించిన మహారాజా చిత్రం ఈనెల 14వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు నితిలన్, మమతామోహన్‌దాస్ శనివారం సాయంత్రం చెన్నైలో విలేకరులతో ముచ్చటించారు. నితిలన్ మాట్లాడుతూ ఈ చిత్రం కథను ఏడేళ్లుగా రాసుకున్నానని చెప్పారు. అయితే ఇది విజయ్‌సేతుపతికి 50వ చిత్రం అవుతుందని ముందుగా ఊహించలేదన్నారు. ఆయన ఈ చిత్రంలో నటించడానికి అంగీకరించిన తర్వాత కథను ఆయనకు తగ్గట్టుగా మరింత డెవలప్ చేసినట్లు చెప్పారు. చిత్రంలో విజయ్‌సేతుపతి ఒక సెలూన్ షాప్ నిర్వాహకుడిగా నటించారని చెప్పారు. ఆయన ఒకసారి పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి తన లక్ష్మి కనిపించకుండా పోయిందని, ఎఫ్ఐఆర్ రాసి దాన్ని కనుగొనాల్సిందిగా చెబుతారన్నారు. ఇంతకీ కనిపించకుండా పోయిన లక్ష్మి ఎవరనేదే సస్పెన్స్ అని చెప్పారు. మమతామోహన్‌దాస్ మాట్లాడుతూ నా పాత్ర చాలా ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. పాత్ర గురించి ఇప్పుడు చెప్పకూడదు కానీ చిత్రానికి చాలా కీలకమని మాత్రమే చెప్తానన్నారు. చిత్రంలో ఎంటర్‌టైన్‌మెంట్ ఏదైనా ఉందంటే అది తన పాత్రేనని చెప్పారు. విజయ్‌సేతుపతి సరసన నటించడం మంచి అనుభవంగా పేర్కొన్నారు.


# సూర్య చిత్రంలో పూజాహెగ్డే

**తమిళసినిమా:** నటుడు సూర్య ప్రస్తుతం కథానాయకుడిగా నటిస్తున్న చిత్రాలన్నీ భారీ బడ్జెట్‌తో రూపొందుతున్నవే. అందులో కంగువ చిత్రం ఒకటి. పీరియాడికల్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని పూర్తిచేసిన సూర్య ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రాన్ని 2డీ ఎంటర్‌టెయిన్‌మెంట్ సంస్థ, స్టోన్ బెంచ్ సంస్థ కలిసి నిర్మిస్తున్నాయి. కాగా జనరంజకమైన యాక్షన్ ఎంటర్‌టైనర్ కథా చిత్రంగా తెరకెక్కనున్న ఇందులో సూర్య ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు సమాచారం. ఇది ఆయన నటిస్తున్న 44 చిత్రం అవుతుంది. దీనికి సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందించనున్నారు. షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానుంది. తొలి షెడ్యూల్ అండమాన్‌లో నిర్వహించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. కాగా ఇందులో సూర్యతో నటించే నటి ఎవరన్న సస్పెన్స్ ఇప్పటివరకు కొనసాగుతూ వచ్చింది. అయితే పూజాహెగ్డే ఇందులో కథానాయకిగా నటిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. కాగా ఆ విషయాన్ని ఆదివారం చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించారు. పూజా హెగ్డేకు ఈ చిత్రం చాలా కీలకం కానుంది. ఎందుకంటే 12 ఏళ్ల క్రితం ముగముడి అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చారు. ఆ చిత్రం పూర్తిగా నిరాశపరిచింది. కాగా చాలా కాలం తర్వాత ఈ మధ్య విజయ్ సరసన బీస్ట్ చిత్రంలో నటించారు. ఆ చిత్రంపై పూజాహెగ్డే చాలా ఆశలు పెట్టుకున్నారు. అయితే ఆ చిత్రం ఫ్లాప్ కావడంతో ఆమెపై ఐరన్ లెగ్ అనే ముద్రపడింది. అదేసమయంలో తెలుగులో కూడా పూజాహెగ్డే నటించిన చిత్రాలు బాగా ఆడలేదు. ఇంకా చెప్పాలంటే ప్రస్తుతానికి ఆమె చేతుల్లో ఒక్క చిత్రం కూడా లేదు. ఇలాంటి కష్టకాలంలో సూర్య సరసన నటించే అవకాశం రావడం నిజంగా ఆమెకు లక్కే.

# ధనుష్‌తో కియారా రొమాన్స్



కియారా అద్వాని



ధనుష్

**తమిళసినిమా:** బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషా నటుడు ధనుష్. ఈయన నటుడు మాత్రమే కాకుండా గాయకుడు, గీత రచయిత, కథకుడు, దర్శకుడు, నిర్మాతగా కూడా ఉన్నారు. ఇక తమిళంతోపాటు తెలుగు, హిందీ భాషల్లోనూ నటిస్తూ పాన్ ఇండియా కథానాయకుడుగా రాణిస్తున్నారు. తాజాగా ఈయన తమిళంలో రాయల్ అనే చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో కథానాయకుడిగా నటించారు సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్ర నిర్మాణ కార్యక్రమం పూర్తిచేసుకుని త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఇది కథానాయకుడుగా ధనుష్ 50వ చిత్రం కావడం గమనార్హం. అదేవిధంగా తెలుగులో కుబేర అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో టాలీవుడ్ నటుడు నాగార్జున ముఖ్యపాత్రను పోషిస్తుండగా, రష్మికమందన్న నాయకిగా నటిస్తున్నారు. కాగా ధనుష్ ఇంతకుముందు రంజనా, షమితాబ్, అంత్రాగి గే హిందీ చిత్రాల్లో నటించి అక్కడ ప్రేక్షకుల ఆదరణను చూరగొన్న విషయం తెలిసింది. తాజాగా మరోసారి బాలీవుడ్ చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారన్నది తాజా సమాచారం. దీనికి బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించడానికి రెడీ అవుతున్నారని తెలిసింది. ఈ చిత్రం అక్టోబర్ లేదా నవంబర్‌లో ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. ఇందులో కథానాయకిగా బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీని నటింపజేయడానికి చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. ఈమె ప్రస్తుతం తెలుగులో రామ్‌చరణ్ సరసన నటిస్తున్న గేమ్ చేంజర్ చిత్ర షూటింగ్ చివరి దశకు చేరుకుంది.

## క్లుప్తంగా

### రూ. 7.50 లక్షల చోరీ

తిరువొత్తియూరు: ఈరోడ్డులో ఉత్తరాది రాష్ట్రానికి చెందిన వారి ఇంటి తలుపులు పగులగొట్టి రూ. 7.50 లక్షలు దుండగులు చోరీ చేశారు. రాజస్థాన్‌కు చెందిన రమేష్ కుమారు (45), మిశ్రరామ్ (44). వీరిద్దరూ ఈరోడ్‌లోని శక్తి రోడ్డు సరిహద్దులో మారియమ్మన్ ఆలయం సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. వీరిద్దరూ అల్యూమినియం బాక్సుల తయారీ కంపెనీని సొంతంగా నడుపుతున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు వీరు ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ. 7.50 లక్షలు నగదును చోరీ చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చెట్టు ఎక్కిన వ్యక్తి ఊపిరాడక మృతి

అన్నానగర్: దిండుక్కల్ సమీపంలో ఆదివారం ఆలయ ఉత్సవాల్లో చెట్టు ఎక్కిన వ్యక్తి ఊపిరాడక మృతి చెందాడు. వివరాలు.. వడమదురై సమీపంలో ఇటీవల ముత్తాలమ్మన్, భగవతియమ్మన్, కాళియమ్మన్, మారియమ్మన్ ఆలయ ఉత్సవం జరిగింది. పండుగ సందర్భంగా గ్యాంట్రీ క్లైంబింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో 60 అడుగుల ఎత్తున్న చెట్టు ఎక్కే పోటీల్లో పరిసర ప్రాంతాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆ సమయంలో తనవాయిపట్టికి చెందిన కూలీ సుబ్రమణి (30) అస్వస్థతకు గురయ్యాడు. చుట్టుపక్కల వారు అతడిని రక్షించి చికిత్స నిమిత్తం దిండుక్కల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే సుబ్రమణి మృతి చెందాడు. వడమదురై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ద్విచక్రవాహనాల ఢీ

- ఎస్‌ఐ మృతి

కొరుక్కుపేట: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ ఎస్‌ఐ మృతిచెందాడు. కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. రాజపాళయం సమీపంలోని అలంకులం ప్రాంతానికి చెందిన నటరాజన్ (53). రాజపాళయం సౌత్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ. ఆదివారం ఉదయం నటరాజన్ కుమారుడు ముఖేష్‌తో కలిసి ద్విచక్రవాహనంలో అలంకులం నుంచి బయలుదేరారు. అలంకుళం-రాజపాలయం మెయిన్ రోడ్డులో వెళుతున్నారు. మార్గమధ్యంలో సొక్కలింగపురం ఎత్తిపోతల మండలం వద్దకు రాగానే పక్కరోడ్డు నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులిద్దరూ రోడ్డుపై పడిపోయారు. నటరాజన్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ముఖేష్‌ను రాజపాళయం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### అంబత్తూర్‌లో భారీ అగ్నిప్రమాదం

తిరువొత్తియూరు: అంబత్తూరు భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. చెన్నై, అంబత్తూర్‌లో ఆటవస్తువుల విక్రయదుకాణం, ఇనుప కర్మాగారంలో ఏర్పడిన అగ్నిప్రమాదంలో లక్షల విలువచేసే వస్తువులు మంటల్లో కాలిబూడిదయ్యాయి. అంబత్తూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపం సీటీహెచ్ రోడ్డులో యువరాజ్‌కు చెందిన క్రీడా వస్తువుల దుకాణం ఉంది. శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో ఇతని దుకాణానికి సమీపంలో వివాహ కార్యక్రమానికి బాణసంచా పేల్చారు. నిప్పురవ్వలు దుకాణంలో పడడంతో మంటలు అంటుకున్నాయి. ఈ మంటలు దుకాణం వెనుక ఉన్న ఇనుప వస్తువుల తయారీ ఫ్యాక్టరీకి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని గంటలపాటు శ్రమించి మంటలు ఆర్పారు. ఈప్రమాదంలో లక్షలు విలువ చేసే వస్తువులు కాలిపోయాయి. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### ప్రాథమిక సభ్యత్వం నుంచి ఓపీఎస్ మహిళ తొలగింపు

తిరువొత్తియూరు: ఏనుగు దంతం విక్రయించడానికి ప్రయత్నించిన కేసులో అరెస్ట్ అయిన ఓపీఎస్ విభాగం మహిళా నిర్వాహకురాలిని ఆ పార్టీ నుంచి తొలగించారు. నీలగిరి జిల్లా పందలూరు సమీపం బీదర్ అడవుల్లో నివాసముంటున్న మహిళ సంగీత (41). ఈమె అన్నాడీఎంకే ఓపీఎస్ విభాగం నీలగిరి జిల్లా జాయింట్ కార్యదర్శిగా, సామాజిక సేవకురాలుగా వున్నారు. శుక్రవారం సంగీత ఏనుగు దంతం విక్రయించేందుకు ప్రయత్నించింది. విషయం తెలిసి ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో పార్టీ కార్యాలయం ఆమెను ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్లు ఈ నిబంధన శనివారం నుంచి అమలవుతుందని మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం ప్రకటించారు.

### విద్యార్థిని ఫొటో మార్ఫింగ్

- ఇద్దరు యువకులపై పోక్సో కేసు

తిరువొత్తియూరు: పాఠశాల విద్యార్థిని ఫొటోను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో చిత్రీకరించిన ఇద్దరు యువకులపై పోలీసులు పోక్సో చట్టం కేసు నమోదు చేశారు. నెల్‌లై జిల్లా వల్లియూరు సమీపంలోని ఊటపులికి చెందిన నవీన్ (24). ఇతనికి ప్లస్‌టూ చదువుతున్న 17 ఏళ్ల బాలికతో పరిచయం ఏర్పడింది. ఇటీవల ఆ బాలిక నవీన్‌తో గొడవ పడి మాట్లాడకుండా ఉంటోంది. దీంతో ఆగ్రహం చెందిన నవీన్ అదే ప్రాంతానికి చెందిన తన స్నేహితుడు రాహుల్ (19)తో కలిసి బాలికపై కక్ష తీర్చుకోవడానికి ఆమె ఫొటోను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెట్టాడు. ఇది చూసిన బాలిక తల్లిదండ్రులు వల్లియూరు మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నవీన్, రాహుల్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

# గరుడ విహారి గోపాల

- గరుడ వాహనంపై దర్శనమిచ్చిన వేణుగోపాలుడు
- కార్వేటినగరంలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



వేణుగోపాలుడికి తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు



పుష్పపలకీపై విహరిస్తున్న వేణుగోపాలుడు

కార్వేటినగరం: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆదివారం రాత్రి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. టీటీడీ అనుబంధంగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ఐదో రోజు అశేష భక్తుల గోవింద నామస్మరణ, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, భక్త బృందాల నృత్య ప్రదర్శనల నడుమ స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. అర్చకులు తెల్లవారుజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 7.30 నుంచి 9.30 వరకు మోహినీ అవతారంలో పల్లకిలో నగర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం 10 నుంచి 11 గంటల వరకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులకు వేద పండితులు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు విశేషాలంకృతుడైన వేణుగోపాలుడు గరుడ వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో 10 గంటల వరకు విహరించారు. ఈ సందర్భంగా గరుడ వాహన గోవిందా.. వేణుగోపాల గోవిందా అంటూ భక్తులు స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు.

**నేడు వసంతోత్సవం**

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం ఉదయం 7.30 నుంచి 9.30 వరకు స్వామివారు హనుమంత వాహనంపై స్వామివారు ఊరేగుతారని ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు స్వామివారికి వసంతోత్సవం జరుగుతుందని, అలాగే సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రికి స్వామివారు గజవాహనంపై పురవీధుల్లో విహరిస్తారని తెలిపారు.



గరుడ వాహనంపై వేణుగోపాలుడి విహారం



గోవింద నామస్మరణతో జనసందోహం

# బోయకొండకు భారీ ఆదాయం

- 30 వేలకు పైగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు
- ప్రత్యేక పూజలందుకున్న గంగమ్మ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయానికి ఆదివారం ఒక్కరోజే వివిధ సేవా టికెట్లు, ప్రసాదాల కొనుగోలుతో రూ.11.60 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి ఈ ఓ చంద్రమౌళి తెలిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో పాటు పరీక్షల ఫలితాలు వెలువడడంతో యువతతో పాటు కోరిన కోర్కెలు ఫలించిన భక్తులు సుమారు 30 వేలమందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబు చేసి దర్శనభాగ్యం కల్పించారు. చైర్మన్, ఈఓల పర్యవేక్షణలో ఉచిత తీర్థప్రసాదాలను అందజేశారు.



ఆలయంలో భక్తుల రద్దీ

### రాళ్ల గంగమాంబకు వెండి కిరీటం సమర్పణ



గుడుపల్లె: శ్రీ రాళ్లగంగమాంబ అమ్మవారికి తమిళనాడు భక్తులు వెండి కిరీటం సమర్పించారు. ఆదివారం తమిళనాడు రాష్ట్రం కందికుప్పం గ్రామానికి చెందిన మార్‌శెట్టి, చిన్నతాయమ్మ కుటుంబీకులు 600 గ్రాముల వెండి కిరీటం, రెండు గ్రాముల బంగారం తాళిబొట్టును అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. తమ కోర్కెలు ఫలించడంతో మొక్కుబడిగా వీటిని సమర్పించినట్టు చెప్పారు.

# పవిత్రం.. ప్రీతికరం

కాణిపాకం క్షేత్రంలో స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామికి దేవస్థానం పలురకాల నైవేద్యాలను నివేదిస్తోంది. వీటిలో లడ్డూ ప్రసాదానికి భక్తకోటి నుంచి విశేష ఆదరణ ఉంది. అలాగే పులిహోర.. వడ సైతం భక్తులకు మరింత ప్రీతికరంగా మారాయి. ఆయా ప్రసాదాల్లో ఎన్నో ప్రత్యేకత లున్నాయి. దేశం నలుమూలల నుంచి తరలివచ్చే యాత్రికులు గణనాథుని ప్రసాదాలను అపురూపంగా భావిస్తారు. ఈ క్రమంలో దేవస్థానం వారు ప్రసాదాలను నాణ్యతగా తయారు చేయిస్తున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సామాన్యులకు సైతం అందుబాటు ధరలకే అందిస్తున్నారు.

- కాణిపాకం ప్రసాదాలకు విశేష ఆదరణ
- లడ్డూ, వడ, పులిహోరకు భక్తులు క్యూ
- నాణ్యతతో పాటు లాభపేక్ష లేకుండా విక్రయాలు
- అద్భుతంగా.. రుచికరంగా ఉన్నాయంటున్న భక్తులు



కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ప్రసాద విక్రయ కేంద్రం





కాణిపాకం : కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రసాదమంటే భక్తులకు అమితమైన ప్రీతి. ఆలయం పేరు చెప్పగానే టక్కుమని గుర్తుకొచ్చేది లడ్డూ ప్రసాదం. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు మూడు రకాల ప్రసాదాలు గుర్తుకొస్తున్నాయి. లడ్డూ, పులిహోర, వడ, భక్తులకు మరింత ప్రీతికరంగా మారాయి. స్వామి దర్శనార్థం వచ్చే భక్తజనం స్వామి ప్రసాదంను అపురూపంగా భావిస్తారు. ఆలయాన్ని నిత్యం వేలాది మంది భక్తులు సందర్శిస్తున్నారు. శని, ఆదివారాల్లో 30 వేలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకుంటున్నారు. దర్శనం పూర్తవగానే భక్తులు ప్రసాదం కోసం ఆసక్తి చూపుతుంటారు. ఇక్కడ మూడు రకాల ప్రసాదాలు భక్తులకు లభిస్తున్నాయి.

**లడ్డూ తయారీ ఇలా..**

కాణిపాకంలో లడ్డూను నాణ్యతగా తయారు చేస్తున్నారు. లాభాపేక్ష లేకుండా భక్తులు సంతృప్తి చెందేలా చూస్తున్నారు. ఈ లడ్డూ తయారీకి శెనగపిండి, చక్కెర, ఆవు నెయ్యి, జీడిపప్పు, ద్రాక్ష, యాలకలు, పచ్చకర్పూరం, జాజికాయ వంటి వాటిని ఉపయోగిస్తున్నారు. 80 గ్రాములు, 400 గ్రాముల బరువులతో రెండు రకాల పరిమాణాలతో లడ్డూలను తయారు చేస్తున్నారు. ఉగ్రాణం నుంచి ప్రతి బ్యాచ్‌కు 1,290 చిన్న లడ్డూలు, 100పైగా పెద్ద లడ్డూలు తయారు చేసి విక్రయాల కౌంటర్‌కు పంపుతున్నారు. దీంతో పాటు 35 గ్రాములు వడ, 150 గ్రాముల పులిహోరను మహా ప్రసాదంగా భక్తులకు అందజేస్తున్నారు. ప్రతిరోజు 10వేలకు పైగా చిన్న లడ్డూ, 1000 పెద్ద లడ్డూ, 575 ప్యాకెట్ల పులిహోర, 1250 వరకు వడలు తయారు చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.

**ప్రసాదం వ్యయం...**

80 గ్రాముల పరిమాణం లడ్డూ తయారీకి రూ.14.46 వ్యయం అవుతుండగా..రూ.15లకు అమ్ముతున్నారు. 400 గ్రాముల పరిమాణం లడ్డూకు రూ. 66.68 ఖర్చు అవుతుండగా రూ.75కు విక్రయిస్తున్నారు. 35 గ్రాముల వడ తయారీకి రూ.9.22కు ఖర్చు అవుతుండగా రూ.10కి అమ్ముతున్నారు. 150 గ్రాముల పులిహోరా తయారీకి రూ.9.07 వ్యయం అవుతుండగా రూ.10లకే భక్తులకు అందిస్తున్నారు. ఇందులో ఎలాంటి లాభాపేక్ష లేకుండా రుచికరంగా, నాణ్యతగా ప్రసాదాలను తయారు చేస్తున్నారు.

**క్యూకడుతున్న భక్తులు...**

ఆలయం తెరిచినప్పటి నుంచి రాత్రి 9గంటల వరకు లడ్డూలను విక్రయిస్తున్నారు. పులిహోర ఉదయం 6 నుంచి ఉదయం 10 గంటల వరకు, వడ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు కౌంటర్‌లో భక్తులకు అందిస్తున్నారు. దీంతో పాటు దర్శనంతరం ఉచిత ప్రసాదం కూడా ఇస్తుంటారు. ఇందు కోసం ఉదయం నుంచి కూడా భక్తజనం అధిక సంఖ్యలో క్యూలో వేచి ఉంటారు. ఉచిత ప్రసాదం పాటు ప్రసాద విక్రయ కౌంటర్ వద్ద కూడా క్యూడుతుంటారు. దీంతో మహా ప్రసాదంకు భలే గిరాకీ ఏర్పడింది.

**ఎంతో ఇష్టం**



ఏటా ఆలయ దర్శనానికి వస్తుంటాను. ఇక్కడ పవిత్రమైన స్వామి ప్రసాదం రుచి చూడకుండా వెళ్లం. మాకు పులిహోర, లడ్డూలంటే భలే ఇష్టం. కుటుంబ సభ్యులకు, బంధువులకు తీసుకెళుతుంటాం. లడ్డూ, పులిహోర, వడ రుచికరంగా ఉన్నాయి. కౌంటర్ వద్ద కూడా ఇబ్బంది లేకుండా ప్రసాదం అందిస్తున్నారు.

–ఈశ్వర్, భక్తుడు, కర్నూలు

**నాణత్యగా ఇస్తున్నారు..**



నేనే కూడా కర్నూలు నుంచే వచ్చాను. ప్రతిసారి కుటుంబ సభ్యులు, స్నేహితులతో పాటు వస్తుంటాను. దర్శనం పూర్తయిన తర్వాత ప్రసాదం తీసుకుంటాను. ఇక్కడ ప్రసాదమంటే మా కుటుంబ సభ్యులకు చాలా ఇష్టం. ఇక్కడ లడ్డూలు నాణ్యత ఉంటాయి. పులిహోర, వడ కూడా రుచికరంగా ఉన్నాయి. మేమైతే అత్యంత ప్రీతికరంగా భావిస్తాం.

–రఘు, భక్తుడు, కర్నూలు

# టోల్‌గేట్ చార్జీల పెంపు

కొరుక్కుపేట: రాష్ట్రంలోని 36 టోల్‌గేట్లలో ఆదివారం అర్ధరాత్రి నుంచి చార్జీలు పెంచుతున్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా తెలియజేసింది. టన్నుకు రూ.5 నుంచి రూ.20కి పెంచారు. నెలవారీ కస్టమ్స్ టోల్ చార్జీలు కూడా రూ.100 నుంచి రూ.400కి పెంచనున్నారు. ప్రధాన టోల్‌గేట్లలో ఏప్రిల్ నెలలో మిగిలిన టోల్‌గేట్లలో సెప్టెంబర్‌లో చార్జీలు సవరిస్తారు. ఈ పరిస్థితిలో గత ఏప్రిల్ 1 టోల్ ఫీజులో మార్పు చేయనున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల ప్రకటన తర్వాత, టోల్ ఫీజుల మార్పును రెండు నెలల పాటు నిలిపి వేస్తున్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ దశలో, లోక్‌సభ ఎన్నికల చివరి రౌండ్ ముగిసిన తర్వాత ఇవాళ అర్ధరాత్రి 12 గంటల నుంచి టోల్‌గేట్ చార్జీలు వర్ధన ఉంటుంది. తమిళనాడు జాతీయ రహదారులపై 55 టోల్ గేట్లు ఉండగా, ముందుగా కల్లగం కరుప్పూర్ హైవేలోని మనకేతి, తిరుచ్చి కరుప్పూర్ హైవేలోని సుల్లక్కుడి, వేలూరు–విల్లుపురం హైవేలోని వల్లం, ఈనామ్ కరియాతల్, తెన్నమడెల్లి వద్ద టోల్ చార్జీలను పెంచనున్నారు. అలాగే చెన్నై శివార్లలోని పరనూర్, ఆత్తూరు టోల్‌గేట్లలో కూడా చార్జీలు పెంచారు. ఈమేరకు పరనూర్ టోల్‌గేట్ వద్ద కార్లు, జీపులు, వ్యాన్లు, త్రీవీలర్లు ఒక్కసారి ప్రయాణించవచ్చు. ప్రభుత్వం టోల్‌గేట్ చార్జీల పెంపుపై లారీ యజమానులు, వాహనదారులు మండిపడుతున్నారు.

## కుటుంబకలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అన్నానగర్: భార్య తన నుంచి విడిపోయిందని మనస్తాపం చెంది ఓ వ్యక్తి గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. చెన్నై ఐనావరం కుప్పుసామి వీధికి చెందిన దిలీప్‌కుమార్ (25) మినీ వ్యాన్‌డ్రైవర్. ఇతని భార్య ప్రీతి. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. దిలీప్‌కుమార్‌పై పలు క్రిమినల్ కేసులు ఉన్నాయి. గతనెల దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా ప్రీతి భర్తతో విడిపోయి పుట్టింట్లో ఉంటోంది. దీంతో పలుమార్లు దిలీప్‌కుమార్ ప్రీతి వద్దకు వెళ్లి ఇంటికి రమ్మని పిలిచాడు. ఆమె రావడానికి నిరాకరించింది. దీంతో శనివారం రాత్రి మద్యం మత్తులో వచ్చిన దిలీప్‌కుమార్ బ్లేడుతో గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఇది చూసి షాక్ తిన్న దిలీప్‌కుమార్ తల్లి వెంటనే కీల్పాకం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

## ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో



ధర్నా చేస్తున్న మహిళలు

వేలూరు: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వేలూరు కార్పొరేషన్ పరిధిలోని 35 వార్డు పరిధిలోని మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం రాస్తారోకో చేశారు. స్థానిక పోలీసులు మహిళలతో చర్చించారు. ఆ సమయంలో మహిళలు మాట్లాడుతూ తమ ప్రాంతంలో గత పది రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని వీటిపై పలుమార్లు కార్పొరేటర్‌తో పాటు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ఫలితం లేదన్నారు. తాము ఈ ప్రాంతంలో కూలీ చేసుకొని జీవనం చేసుకుంటున్నామని తాము సంపాదించే సంపాదన పూర్తిగా తాగునీటి క్యాన్‌లకే సరి పోతుందన్నారు. అధికారులు స్పందించక పోవడంతోనే తాము ఖాళీ బిందెలతో రాస్తారోకో చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. కార్పొరేషన్ అధికారులు వచ్చి సమాధానం చెప్పేంత వరకు రాస్తారోకోను విరమించబోమని తేల్చి చెప్పారు. దీంతో పోలీసులు అధికారులతో ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం మహిళలతో చర్చలు జరిపి రాస్తారోకోను విరమింపజేశారు. దీంతో వేలూరు– ఆర్కాడు రోడ్డులో సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది.

## మామను హత్య చేసిన అల్లుడి అరెస్ట్

కొరుక్కుపేట: మామ తలపై రాయితో కొట్టి చంపిన అల్లుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. మధురవాయల్, పిల్లయార్ కోవిల్ వీధికి చెందిన కన్నన్ (65) కూతురు లక్ష్మి, అల్లుడు మహేశ్వరన్. వీరికి ఓ కుమార్తె, ఓ కొడుకు ఉన్నారు. వీరంతా ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్నారు. కన్నన్ ఇంటికి సమీపంలోని శక్తి వినాయగర్ గుడిలో రాత్రి పడుకోవడం ఆనవాయితీ. ఈ స్థితిలో కన్నన్ గత 23వ తేదీన ఎప్పటిలాగే ఇంటి సమీపంలోని గుడిలో నిద్రపోయాడు. రెండు రోజుల క్రితం కోయంబేడు సబ్ ఇన్స్పెక్టర్ చెల్లదురై, పోలీసులు ఆ దారిలో పెట్రోలింగ్ చేస్తుండగా కన్నన్ తలకు బలమైన గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు కన్నన్ తలపై రాయి వేసి హతమార్చినట్లు గుర్తించారు. విచారణలో మామ తలపై మహేశ్వరన్ రాయి వేసి హత్య చేసినట్లు తేలింది. కుటుంబ కలహాల కారణంగా ఈ దారుణానికి పాల్పడినట్లు నిందితులు అంగీకరించాడు.

## పెయిన్ కిల్లర్ మాత్రలు వాడుతున్న ముగ్గురి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నైలోని పులియంతోప్పు, ఒట్టేరి, బేసిన్ బ్రిడ్జి ప్రాంతాల్లో కొందరు యువకులు మత్తుకు బానిసై నొప్పి నివారణ మాత్రలు వాడుతున్నట్లు పులియంతోపు అసిస్టెంట్ కమిషనర్ రాజాకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో శనివారం పోలీసులు కన్నికాపురం మెయిన్ రోడ్డు ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద భారీగా నొప్పి నివారణ మాత్రలు ఉన్నాయి. దీంతో వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లి విచారించారు. నిందితులు పులియంతోప్పులోని మూర్తింగార్ అపార్ట్‌మెంట్‌కు చెందిన సుభ నేష్ (21), తిరువిక్ నగర్ ప్రాంతానికి చెందిన భూపాలన్ (24), పులియంతోప్పులోని నరసింనగర్ ప్రాంతానికి చెందిన నిత్యానందం (19)గా గుర్తించారు. రెడ్ హిల్స్ ప్రాంతం నుంచి పెయిన్ కిల్లర్ మాత్రలు కొనుగోలు చేసి వాడినట్లు గుర్తించారు. అనంతరం ముగ్గురిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

# ఎగ్జిట్‌పోల్స్‌ను నేను నమ్మన్రా సామీ !

- రేపు చూడబ్బా కథ వేరేగా ఉంటాది
- ఆడోళ్లంతా ఫ్యాన్‌కు దంచేశారప్పా సామీ
- టీకొట్లలో హాట్‌టాపిక్‌గా మారిన సర్వేల కొట్లాట

పలమనేరు: ఏమినా శీనప్పన్నా ఓ పేపర్లో వైఎస్సార్‌సీపీదే అధికారమని, కాదు కూటమిదేనని మరో పేపర్లో వేశారు.. నేనైతే ఈ ఎగ్జిట్‌పోల్స్‌ను అసలు నమ్మనునా, ఏమంటావునా శీనప్పన్నా అన్నాడు రాజప్ప. రే రాజా నీవు అట్టంటావు, నాకైతే ఫోన్‌లో చూశాక సరిగ్గా నిద్రేరావడం లేదన్నాడు రాజప్ప. కాదునా ఇంతకు ముందెప్పుడూ ఇట్టాలేదబ్బా.. ఓరేసామీ సెంట్రల్‌లో బీజేపీ గెలుస్తుందని అక్కడి జాతీయ మీడియా, ఇక్కడేమో వైఎస్సార్‌సీపీ, టీడీపీలు గెలుస్తాయని చెరో ఏడు సర్వే సంస్థలు చెబుతుంటే నాయకులేమో గానీ మనలాంటి వాళ్లకు టెన్షన్ తప్పలేదబ్బా అన్నాడు. నువ్వు ఎలా డిసైడ్ చేస్తావునా అంటే ఏదో ఓ పార్టీ గ్యారెంటీగా గెలుస్తుందని జనం నాడి బయట పట్టలేదురా సామీ, ముఖ్యంగా మన ఆడోళ్లు ఏ పార్టీకైతే ఓటేశారో అదే గెలుస్తుందని నా నమ్మకం అన్నాడు శీనప్ప. ఓరే రాజా ఇప్పటిదాకా సర్వేచేసి వెల్లడించేవాళ్ల మాటలు నిజం అయ్యేవిరా.. కానీ ఈ ఎన్నికల్లో సర్వే వాళ్లు డబ్బుల కోసం కక్కుర్తి పడి వారికి అనుకూలమైన పార్టీలకు అనుకూలంగా చెబుతాండరని జనానికి తెలిసిందిరా సామీ అన్నాడు. అవును నిజమేనన్నా గతంలో తెలంగాణాలోనూ ఇట్టాగే, అంతకుందుకు లగడపాటిని నమ్మి జనం మోసపోలేదా అన్నాడు రాజప్ప. ఓరేసామీ ఈ దఫా సర్వే చేసిన వాళ్ల మాటలు నీటిమూటలు కావడం ఖాయం.. మరోసారి ఎన్నికల్లో ఎవరైనా సర్వేల కోసం వస్తే మూతి పగలడం ఖాయంరా సామీ అన్నాడు. టీకొట్టులో వీరి మాటలు విన్న మిగతావారు మీకెందుకయ్యా గొడవ సామీ.. ఇంకో 24 గంటలు తట్టుకోలేరా..? సర్వే వాళ్లే చెప్పింది జరిగేటట్టుంటే ఇంకా ఎన్నికల ఫలితాలు ఎవరికోసమయ్యా బాబు అంటూ వారిద్దరికీ సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించారు.

## వేడుకగా అర్జున తపస్మాన్

ఐరాల: మండలంలోని బెస్తపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల వారి మహాభారత ఉత్సవాల్లో అట్టహాసంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన అర్జున తపస్మాన్ భక్తులను ఆకట్టుకుంది. ఉదయం అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ద్రౌపదీదేవి ఉత్సవమూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి తపస్సుమాను మెట్టు మెట్టునూ అధిరోహిస్తూ శివుడి పాటలు, పద్యాలు ఆలపిస్తూ పైభాగానికి చేరుకున్నాడు. అక్కడి నుంచి అర్జున వేషధారి విసిరిన పండ్లు, పూలు మొదలైన వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం లేని మహిళలు తపస్సుమాను కింద వరపడి స్వామివారిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఉభయదారులుగా గజేంద్ర, వసంత కుటుంబసభ్యులు వ్యవహరించారు.



తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

■ తెలంగాణ

## ‘స్థానిక’ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి గెలుపొందారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఉప ఎన్నిక కౌంటింగ్ చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిపై నవీన్‌కుమార్‌రెడ్డి 109 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. దీంతో బీఆర్‌ఎస్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకున్నట్టయింది. గత ఎన్నికల్లో ఈ స్థానం నుంచి గెలుపొందిన బీఆర్‌ఎస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే గత మార్చి 28న ఉప ఎన్నిక జరిగింది. స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్ గౌడ్ సైతం ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 1,439 మంది ఓటర్లు ఉండగా, 1,437 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇద్దరు ఎంపీటీసీలు ఓటు వేయలేదు. ఓట్ల లెక్కింపును ఏప్రిల్ 2నే చేపట్టాల్సి ఉండగా, లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జూన్ 2 తేదీకి వాయిదా పడింది.

## కెసెట్ ఫలితాల్లో నారాయణ ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కెసెట్ ప్రవేశ పరీక్షలో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. కెసెట్‌లో రాష్ట్రస్థాయిలో 1, 2, 2, 2, 2, 3, 3, 4, 4, 4, 4, 6, 6, 7, 7, 9, 9, 10, 10 వంటి పది లోపు 19 అత్యుత్తమ ర్యాంకులతో 100 లోపు 92 ర్యాంకులు కైవసం చేసుకుని విజయ దుందుభి మోగించారు. వివిధ కేటగిరీల్లో రెండు విభాగాల్లో 1000 లోపు 399 అత్యుత్తమ ర్యాంకులతో నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుందని నారాయణ విద్యాసంస్థ డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి తెలిపారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ నారాయణ విజయ ప్రస్థానం నిరంతరాయంగా కొనసాగుతోందని చెప్పారు.

### నాలుగేళ్లలో ప్యాకేజ్డ్ ఫుడ్ వినియోగం రెట్టింపు

నిత్యం తీసుకుంటున్న ఆహారంలో అధిక కేలరీలు గలవి, తక్కువ పోషకాలు గలవి ఎక్కువగా ఉంటున్నాయని నివేదిక పేర్కొంది. అంతేకాకుండా కూరగాయలు, ఇతర సూక్ష్మపోషకాలు అధికంగా ఉండే ఆహారాల వినియోగం తగ్గిపోతున్నట్టు కూడా హెచ్చరించింది. భారతదేశం, ఇతర దక్షిణాసియా దేశాల్లో ప్రాసెస్ చేసిన ఆహారాలు (చాక్లెట్లు, చక్కెర మిఠాయిలు, ఉప్పగా ఉండే స్నాక్స్, పానీయాలు, రెడీమేడ్ ఫుడ్) వినియోగం పెరుగుతోంది. ఆహార బడ్జెట్‌లో ఎక్కువ భాగం ప్యాకేజ్డ్ పాలు, స్నాక్స్ రెడీమేడ్ ఫుడ్‌కే ప్రాధాన్యం ఇస్తున్నట్టు తేల్చింది. భారతదేశంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న వారు పెరుగుతున్నట్టు నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. పెద్దవారిలో అధిక బరువు పెరుగుదల 2006లో 12.9 శాతం నుంచి 2016 నాటికి 16.4 శాతానికి పెరిగింది.



# రుచిగా ఉంటే తినేయడమే!

## దేశంలో 38 శాతం మంది ప్రాసెస్డ్ ఫుడ్ వైపే మొగ్గు

- 28 శాతం మందికే ఆరోగ్యకరమైన ఆహారంపై ఆసక్తి
- ప్రజల్లో పెరుగుతున్న ఉప్పు వినియోగం
- 16.6 శాతం మందిలో పోషకాహార లోపం
- అనూహ్యంగా పెరుగుతున్న ప్యాకేజ్డ్ ఫుడ్ వినియోగం
- గ్లోబల్ ఫుడ్ పాలసీ రిపోర్టు–2024 తాజా నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: భారతీయుల ఆహార అలవాట్లు వేగంగా మారుతున్నాయి. ప్రపంచానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని పరిచయం చేసిన వేద భూమి.. అనారోగ్యకర వంటకాల వైపు పరుగులు పెడుతోంది. దేశంలో 38 శాతం మంది వేయించిన, ప్రాసెస్ చేసిన పదార్థాలను అధికంగా ఆరగించేస్తున్నారు. కేవలం 28 శాతం మంది మాత్రమే ఆరోగ్యకరమైన పిండి ప్రధాన ఆహారం, కూరగాయలు, పండు, పప్పు, గింజ, మాంసాన్ని ఆహారంగా తీసుకుంటున్నారు. దేశ జనాభాలో 16.6 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎఫ్‌పీఆర్‌ఐ) తాజాగా ప్రపంచ దేశాల్లోని ఆహార అలవాట్లపై సర్వే చేసి విడుదల చేసిన ‘గ్లోబల్ ఫుడ్ పాలసీ రిపోర్టు–2024’ పేర్కొంది. భారతదేశంలో ఆహారపు అలవాట్లపై ఈ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. పోషకాహారంతో పోలిస్తే అనారోగ్యకరమైన ఆహార వినియోగంలో గణనీయమైన పెరుగుదల నమోదైందని పేర్కొంది. కూరగాయలు, పండ్లు, ఇతర సూక్ష్మపోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకునే వారితో పోలిస్తే భారతదేశంలో ఎక్కువ మంది ఉప్పు లేదా వేయించిన స్నాక్స్ వంటి అనారోగ్యకరమైన ఆహారాన్నే ఇష్టపడుతున్నారని ప్రకటించింది.

### ప్రపంచంలో పెరుగుతున్న పోషకాహార లోపం

చాలా దేశాలు రెట్టింపు పోషకాహార లోప భారాన్ని ఎదుర్కొంటున్నాయని గ్లోబల్ ఫుడ్ పాలసీ నివేదిక నొక్కి చెప్పింది. ఆఫ్రికా, దక్షిణాసియాలో చాలామంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేకపోతున్నారని.. రెండు బిలియన్ల కంటే ఎక్కువ మంది ప్రజలపై చేసిన పరిశోధన ద్వారా అంచనా వేసింది. ఐదేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లల్లో సగానికి పైగా, వయోజన మహిళల్లో మూడింట రెండొంతుల మంది సూక్ష్మ పోషకాల లోపంతో బాధపడుతున్నట్టు ఐక్యరాజ్య సమితి ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ తేల్చింది. భారత్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దక్షిణాసియా దేశాల్లో పోషకాహార లోపంతో అధిక బరువు, ఊబకాయంతో పాటు సంబంధిత నాన్ కమ్యూనల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) ప్రాబల్యం పెరుగుతున్నట్టు వెల్లడించింది. దక్షిణాసియాలో సూక్ష్మ పోషకాలు అధికంగా ఉండే ఆహారాలు ఖరీదైనవి కాగా.. ధాన్యాలు, కొవ్వులు, నూనె, చక్కెర, స్వీట్ అండ్ సాల్ట్ ఉండే చిరుతిళ్లు చౌకగా లభిస్తున్నట్టు నివేదిక పేర్కొంది. దాంతో ప్రజలు ఈ తరహా ఆహార వినియోగంపై మక్కువ చూపుతున్నట్టు తేల్చింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఇటీవల విడుదల చేసిన ఆహార మార్గదర్శకాల ప్రకారం ప్యాకేజ్డ్ ఫుడ్‌పై అందించిన సమాచారం కూడా ప్రజలు పట్టించుకోవడం లేదని హెచ్చరించింది. సంస్థ అందించిన 17 ఆహార మార్గదర్శకాలలో సమాచారం, ఆరోగ్యకరమైన ఆహార ఎంపిక చేయడానికి ఆహార లేబుల్స్‌పై సమాచారాన్ని చదవమని ఐసీఎంఆర్ వినియోగదారులకు విజ్ఞప్తి చేసింది. అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు, అల్ట్రా–ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగాన్ని తగ్గించాలని కూడా సూచించింది. రోజువారీగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకపోతే సమీప భవిష్యత్‌లో అనారోగ్య భారతదేశాన్ని చూడాల్సి ఉంటుందని ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తన నివేదికలో హెచ్చరించింది.

### పోషకాహార లోపంతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది

పోషకాహార లోపంతో బాధపడే వారు 2011లో 15.4 శాతం ఉంటే.. 2021 నాటికి 16.6 శాతానికి పెరిగింది. జనాభాలో దాదాపు 17 శాతం మందికి జీవించేందుకు అవసరమైన ఆహారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంటికి దూరంగా ఉంటున్నవారు ఆహారం, గృహావసరాల కోసం చేస్తున్న వార్షిక ఖర్చు 2015లో రూ.619 బిలియన్స్ ఉంటే, 2019లో అది రూ.820 బిలియన్లకు పెరిగింది. అంటే నాలుగేళ్లలో రూ.201 బిలియన్ల మేర పెరిగింది. అలాగే గృహ ఆహార బడ్జెట్‌లో ప్యాకేజ్డ్ (అత్యధికంగా ప్రాసెస్ చేసిన, అత్యధిక క్యాలరీలు ఉండేవి) ఆహార పదార్థాల వాటా 6.5 శాతం నుంచి 12 శాతానికి పెరిగింది. అంటే నాలుగేళ్లలో దాదాపు రెండింతలు పెరిగింది. సంపన్న కుటుంబాలు తమ ఆహార బడ్జెట్‌లో ఎక్కువ భాగం ప్రాసెస్ ఫుడ్‌పైనే ఖర్చు చేస్తున్నట్టు నివేదిక పేర్కొంది.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

**పరేడ్ మైదానంలో వేడుకలు**
**రాష్ట్ర అధికార గీతాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి**



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఆదివారం ఉదయం సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ప్రభుత్వం అధికారికంగా కార్యక్రమాన్ని నిర్వహించింది. తొలుత అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం ఉదయం 9.55కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరేడ్ మైదానం చేరుకున్నారు. వెంటనే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి యూసుఫ్‌గూడలోని ఒకటో బెటాలియన్, ఇబ్రహీంపట్నంలోని మూడో బెటాలియన్, కొండాపూర్ ఎనిమిదో బెటాలియన్, రాచకొండ పన్నెండో బెటాలియన్, పోలీసు ఆక్టోపస్ బృందం, జీహెచ్ఎంసీ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం, జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేసిన అందెశ్రీ రచించిన ‘జయజయహే తెలంగాణ..’ గీతాన్ని(అధికారిక కార్యక్రమాల్లో వినిపించే సంక్షిప్తరూపం) ఆవిష్కరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజల కరతాళధ్వనుల మధ్య ఈ రెండున్నర నిమిషాల నిడివితో ఉన్న గీతం వినిపించారు. దానిని స్వరపరిచిన సంగీత దర్శకులు ఎంఎం కీరవాణి, గీత రచయిత అందెశ్రీలు ఆ సమయంలో సభలోనే ఉన్నారు. గీతాన్ని వినిపిస్తున్న తరుణంలో అందెశ్రీ భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలా ఉండగా, తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ సోనియాగాంధీ ఢిల్లీ నుంచి వీడియో సందేశాన్ని పంపించారు.

**కేసీఆర్ కోసం ప్రత్యేకంగా సోఫా.. ఆయన మాత్రం గైర్హాజరు..**

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి హాజరు కావాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆహ్వానించారు. దీనిపై కేసీఆర్ భిన్నంగా స్పందిస్తూ సీఎంకు లేఖ రాశారు. అయితే ఆదివారం ఆవిర్భావ దినోత్సవ సభలో ముందువరుసలో కేసీఆర్ కోసం ప్రత్యేకంగా సోఫా ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కేసీఆర్ గైర్హాజరవటంతో ఆ స్థానం ఖాళీగానే ఉండిపోయింది. బీఆర్‌ఎస్‌లో ఉన్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాత్రం హాజరయ్యారు. కార్యక్రమంలో మంత్రులు, శాసనసభ స్పీకర్, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, పలు విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ముగిసిన ఉమ్మడి రాజధాని గడువు

- 2015లోనే రాజధానిని ఏపీకి తరలించిన చంద్రబాబు
- ఓటుకు కోట్లు కేసు నేపథ్యం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ఇక తెలంగాణకు మాత్రమే రాజధాని. రాష్ట్ర విభజన జరిగి పదేళ్ల పూర్తి కావడంతో, ఇప్పటివరకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌తో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న బంధం విడిపోయింది. ఇకపై హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర రాజధానిగా మాత్రమే కొనసాగనుంది. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 5 ప్రకారం 2014 జూన్ 2 నుంచి పదేళ్ల పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కొనసాగింది. అయితే 2015లో వెలుగులోకి వచ్చిన ఓటుకు కోట్లు కేసులో సూత్రధారిగా అప్పటి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన ఏపీ రాజధానిని హైదరాబాద్ నుంచి సొంత రాష్ట్రానికి తరలించారు. ఏపీ రాష్ట్రపాలన అవసరాల కోసం హైదరాబాద్‌లోని సచివాలయంలో కేటాయించిన భవనాలను కూడా ఆ తర్వాత కొంత కాలానికే తెలంగాణ ప్రభుత్వానికి తిరిగి అప్పగించారు.

### ఏపీ ఆధీనంలో మూడు భవనాలు

రాజ్‌భవన్ రోడ్డులోని లేక్‌వ్యూ అతిథి గృహాన్ని ఏపీ ముఖ్యమంత్రి అధికారిక నివాసంగా కేటాయించినప్పటికీ చంద్రబాబు వాడుకోలేదు. ఏపీ సాధారణ పరిపాలన శాఖ అవసరాలకు ఈ భవనాన్ని వినియోగిస్తున్నారు. లక్డీకాపూల్‌లో పోలీసు శాఖకు చెందిన సీఐడీ భవనం, ఆదర్శనగర్‌లోని హెరిటేజ్ కాంప్లెక్స్ భవనాలను సైతం ఏపీ అవసరాలకు కేటాయించారు. ఈ మూడు భవనాలు ఇంకా ఏపీ ఆధీనంలోనే ఉన్నాయి. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ గడువు ముగియనున్న నేపథ్యంలో ఏపీ ఆధీనంలో ఉన్న భవనాలను స్వాధీనం చేసుకోవాలని ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో భవనాలను స్వాధీనం చేసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు ప్రారంభించగా, మరికొంత కాలం పాటు వాడుకోవడానికి అవకాశం కల్పించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఏపీ విజ్ఞప్తిపై తెలంగాణ సర్కారు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

**ప్రజల జీవన శైలిలో అనేక మార్పులు వచ్చాయి.. ఆహారపు అలవాట్లు కూడా చాలా వరకు మారిపోయాయి. ఇంటి భోజనం కంటే హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, బేకరీ ఫుడ్‌కు చాలా మంది ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇదే ప్రధాన సమస్యగా మారుతోంది. నిల్వ ఉన్న పదార్థాలు, పలు రసాయనాలతో చేసిన వంటకాలు తిని రోగాల బారిన పడుతున్నారు. క్యాన్సర్ రోగుల్లో 53 శాతం మంది కల్తీ ఆహారంతోనే సమస్య తెచ్చుకున్నారని పలు సర్వే వెల్లడించడం ప్రమాద తీవ్రతను తెలియజెబుతోంది.**

# ‘కల్తీ’ కలవరం

## బయట దొరకని నాణ్యమైన ఆహారం

- అపరిశుభ్ర వాతావరణంలో వంటల తయారీ
- రంగు, రుచికోసం ప్రమాదకర రసాయనాల వాడకం
- స్వాగతం పలుకుతున్న సరికొత్త రోగాలు
- హోటళ్లలో అధికారుల నామమాత్రపు తనిఖీలు



కర్నూలు(హాస్పిటల్)/కర్నూలు(టౌన్): పాతికేళ్ల కిందట వరకూ ఆకలికోసం ఆహారం తీసుకునేవారు. ఎక్కడికైనా వెళ్లినా భోజనం సమయానికి ఇంటికి రాలేని పరిస్థితులు ఉన్నపుడే హోటళ్లలో తినేవారు. కొందరు ఎంత సమయమైనా ఇంటికి వచ్చే భోజనం చేసేవారు. బయటి ఆహారాన్ని తీసుకునేవారు కాదు. సంపాదనలో తక్కువ ఖర్చు చేసి, ఎక్కువ దాచుకునేవారు. ఇది ఆర్థికంగానూ, ఆరోగ్యంగానూ మంచి లక్షణమే. ఇప్పుడు ‘కల్చర్’ మారింది. ‘సోషియల్ బిహేవియర్’లో తేడా వచ్చింది. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ‘పార్టీ కల్చర్’ వచ్చింది. బర్త్‌డే, మ్యారేజ్‌డే, ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్...సందర్భం ఏదైనా ‘పార్టీలు’ ఇస్తున్నారు. ఇంటి భోజనం కంటే రెస్టారెంట్లలోని ఆహారం తినడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. నలుగురు స్నేహితులు కలిస్తే డిన్నర్ బయట చేస్తున్నారు. ఖరీదైన ఆహారం తింటున్నామనే భ్రమలో ఉన్నారు కాని, ఆరోగ్యకర, పోషకాహారాన్ని తింటున్నామా? లేదా? అనేది గ్రహించలేకపోతున్నారు. నిల్వ ఉంచిన ఆహారం, ప్రమాదకర రసాయనాలు కలిపిన ఆహారాన్ని తీసుకుంటున్నారు. అప్పటికప్పుడు వీటివల్ల నష్టం లేకపోయినా దీర్ఘకాలంలో ప్రాణాంతక వ్యాధులబారిన పడే ప్రమాదం ఉంది.

**తనిఖీలేవీ?**

జిల్లాలో చిన్నా, పెద్ద హోటల్స్, రెస్టారెంట్స్, దాబాలు, చాట్, నూడుల్ షాపులు అన్ని కలుపుకుని 7 వేలకు పైగా ఉంటాయి. ఒక్క కర్నూలు నగరంలోనే 1,500 దాకా హోటల్స్ ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి హోటళ్లు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. ఆ శాఖ పరిధిలో జిల్లా స్థాయి అధికారితో పాటు ఓ గజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మరో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరు నెలకు 12 శాంపిల్స్ సేకరించాలని ఉంది. వీరు సేకరించిన శ్యాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపి, పరిశీలన తర్వాత కేసులు నమోదు చేయాల్సి ఉంది. కల్తీని బట్టి క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించే వీలుంది. కానీ ఇవి జరగడం లేదు. ఇంత పెద్ద జిల్లాలో కేవలం 12 శాంపిల్స్ తీసి ఊరుకుంటే మిగిలిన వారి పరిస్థితి ఏమిటి? దీన్ని ఆసరగా చేసుకుని తమ వద్దకు ఎవ్వరూ రారన్న ధీమాతో వ్యాపారులు చెలరేగిపోతున్నారు. విచ్చలవిడిగా ఆహారాన్ని కల్తీ చేస్తున్నారు.

**పర్మిషన్‌లేని వ్యాపారాలు**

హోటల్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. పరిశుభ్రత విషయంలో గెజిటెడ్ ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌కు దరఖాస్తు చేయాలి. ఈ శాఖలో నిర్ణీత రుసుము చెల్లించి అనుమతి పొందాలి. కానీ జిల్లాలో ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు నూటికి 25 శాతానికి మించి ఉండవనేది బహిరంగ రహస్యం. ఇదిలా ఉండగా పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డుసైడు హోటళ్లలో పరిశుభ్రత గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. నాసిరకం ఆహార పదార్థాలు వాడటం, రోజుల తరబడి ఫ్రిడ్జిలో నిల్వ ఉంచిన వాటిని వేడి చేసి విక్రయిస్తున్నారు. ఆహారం వండే ప్రాంతాలూ తీవ్ర అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు. పట్టణాల్లో అధిక శాతం మురుగుకాల్వలు, చెత్తకుప్పల పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు దర్శనమిస్తున్నా అడిగే వారు కరువయ్యారు.

**నామమాత్రంగా తనిఖీలు**

జిల్లాలో ఏడాదికి 360 శ్యాంపిల్స్ అధికారులు తీసి ల్యాబ్‌కు పంపించాల్సి ఉంది. ఈ మేరకు అధికారులు జిల్లాలో నెలకు 12 శాంపిల్స్ మాత్రమే తీసి ల్యాబ్‌కు పంపిస్తున్నారు. ఇందులో ఒక్కో నెల కేవలం రెండు, మూడు మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. సీజన్‌ను బట్టి పండ్ల దుకాణాలపైనా నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. కల్తీ జరిగిన, ఆహారాల్లో రంగులు వేసిన పదార్థాలకు నాన్ స్టాండర్డ్ పేరిట ల్యాబ్ నుంచి రిపోర్ట్ వస్తే వారికి నామమాత్రపు జరిమానా వేసి చేతులు దులుపుకుంటున్నారు.

### కల్తీ ఇలా జరుగుతుంది ఇలా..

- పాలల్లో మున్సిపల్ కుళాయిలు, బోరు నీటిని కలుపుతారు. పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాలపొడర్లు, యూరియా, పిండి, నూనె కలిపి విక్రయిస్తున్నారు.
- టీ పొడిలో ఇనుప రజను, రంపపు పొట్టును మిశ్రమం చేస్తున్నారు. దీనివల్ల ఊపిరితిత్తులు పాడై పోయే ప్రమాదం ఉంది.
- పశువుల ఎముకలను సేకరించి, వాటిని బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి ద్రావణాన్ని తీస్తున్నారు. ఆ ద్రావణాన్ని సాధారణ నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీనివల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్‌లలో ఆకట్టుకునేందుకు గాను ఎక్కువగా హానికరమైన రంగులను వాడుతున్నారు. అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకలతో పాటు అనారోగ్యానికి గురైన వాటిని వధించి వినియోగదారులకు విక్రయిస్తున్నారు.
- నిషేధానికి గురైన క్యాట్‌ఫిష్‌లను సైతం చేపల విక్రయదారులు అమ్ముతున్నా అడిగే నాథుడు లేరు. వీటిని చికెన్, మటన్ వ్యర్థాలతో చెరువులు, నదుల్లో పెంచి పోషిస్తారు.
- మిరపకాయల్లో ఎరుపు రంగు రావడానికి సూడాన్ రంగులు వాడుతుంటారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. వీటిని వంటలో వినియోగిస్తే క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆహారాన్ని వండే సమయంలోనూ వండిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వండుతున్నారు. దీనివల్ల క్యాన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదమున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.
- చిన్న చిన్న హోటళ్లు, కర్రీ పాయింట్లలో వేడి వేడి కూరలు, పప్పు, సాంబారు వంటి ఆహార పదార్థాలు పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగి వాటిని తినే వారికి అనారోగ్యాన్ని కలిగిస్తున్నాయి.
- అల్లం, వెల్లుల్లి పేస్టులను సైతం అక్రమార్కులు కల్తీ చేస్తున్నారు. వీటి ధర ఎక్కువగా ఉండటంతో అందులో ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పేస్ట్‌ను కలుపుతున్నారు.

### ఇవి ప్రమాదకరం

- మెటానియల్ ఎల్లో వాడకం నిషేధం! కానీ వినియోగిస్తున్నారు. ఇది ఆరోగ్యంపై వెంటనే దుష్ప్రభావం చూపించదు. నెమ్మదిగా క్యాన్సర్‌కు కారకమవుతుంది. చిన్నారుల్లో నిద్రలేమి, నరాల సంబంధిత వ్యాధులు వస్తాయి.
- వంటకాల్లో రంగుకోసం వాడే నిషేధిత టార్‌ట్రాజిన్ చాలా ప్రమాదకరం. దీంతో మానసిక వ్యథ, థైరాయిడ్, క్యాన్సర్, ఎలర్జీ, దద్దుర్లు, తామర, రక్తకణజాలంలో హానికర కణజాలాల వృద్ధి చెందడం, డీఎన్ఏ నష్టపోవడం, నిద్రలేమి, నీరసం వస్తాయి.
- స్వీట్లు, బిస్కెట్లలో ఆరెంజ్ రంగు కోసం వాడే సన్‌సెటన్, పసుపు రంగు కోసం వాడే కాట్రాజ్, గ్రీన్ కలర్ కోసం వాడే బ్రిలియంట్ బ్లూ, టార్ట్రాజిన్‌లు ప్రమాదకరమే!
- చాక్లెట్లలో వాడే రోడ్‌మన్–బి కూడా ప్రాణాంతకమే! అయినా చాక్లెట్లు, చిన్నపిల్లలు తినే రంగుల ఆహారపదార్థాల్లో వీటిని వినియోగిస్తున్నారు.
- రెస్టారెంట్లు, బేకరీ ఆహారాన్ని వరుసగా 40రోజులు తింటే కీళ్లనొప్పులు, జీర్ణసంబంధిత వ్యాధులు వస్తాయి. మరింత అధికమైతే క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది.

### నెలకు 12 శాంపిల్స్ తీస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా తప్పనిసరిగా 12 శాంపిల్స్ సేకరించి పంపిస్తున్నాం. ఇంకా ఎక్కడైనా ఆహారంలో కల్తీ జరిగిందని తెలిసి ఎవ్వరైనా ఫిర్యాదు చేస్తే అక్కడకు వెళ్లి శాంపిల్స్ సేకరిస్తున్నాం. ఆహారం కల్తీ జరగకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. వ్యాపారులను పిలిచి హెచ్చరిస్తున్నాం. సామాజిక మాధ్యమాల్లో చూసి కల్తీ ఎక్కువగా జరుగుతోందని భావిస్తున్నారు. ఎక్కడో కొన్ని చోట్ల అలా జరగవచ్చు గానీ ప్రతిచోటా అలా జరగదు. ఎవ్వరికైనా అనుమానం వస్తే బి.క్యాంపులోని మా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు.

– కూర్మానాయకులు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, కర్నూలు

# ప‘వరి’ఫుల్

- ఖరీఫ్‌కు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేలా ఏర్పాట్లు
- పగటి పూట తొమ్మిది గంటల సరఫరా
- ముమ్మరంగా కొత్త సబ్‌స్టేషన్లు, కొత్త లైన్లు
- మొత్తంగా 55వేల వ్యవసాయ కనెక్షన్లు



మెట్ట ప్రాంతంలో విద్యుత్ బోర్లపై సాగవుతోన్న దృశ్యం

సాక్షిప్రతినిధి, కాకినాడ: కేరళలో నైరుతి రుతుపవనాల ప్రవేశంతో చినుకు కోసం ఎదురుచూస్తోన్న మెట్ట ప్రాంత రైతుల్లో ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి. ఈ సీజన్‌లో విద్యుత్ బోర్లపై ఆధారపడి సాగుచేసే రైతులకు పగటి పూట నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సంబంధిత శాఖ కసరత్తు పూర్తిచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని మెట్ట ప్రాంతంలో వ్యవసాయ బోర్లు ఆధారంగా వరి సాగు జరుగుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జగ్గంపేట, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, అనపర్తి, గోపాలపురం, మండపేట తదితర నియోజకవర్గాల్లో అత్యధికంగా వ్యవసాయ బోర్ల ఆధారంగానే ఖరీఫ్ సాగు జరుగుతోంది. ఇందుకు తగ్గ ఏర్పాట్లు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే ప్రభుత్వం చేస్తుంటుంది. బోర్లపై సాగయ్యే పొలాలకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో రైతులకు నిర్దిష్టంగా సమాచారం ఉండేది కాదు. ఈ కారణంగా పంట సాగుకు రైతులు నానా కష్టాలు ఎదుర్కొనేవారు. అందునా వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్ కూడా రాత్రి పూట మాత్రమే ఇచ్చేవారు. అటువంటి పరిస్థితిని చక్కదిద్దిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతు పక్షపాతిగా రైతుల తలరాతలు మార్చేలా పగటి పూట నిరంతరాయంగా తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టారు. రాజశేఖరరెడ్డి రాజకీయ వారసుడిగా అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే ఒరవడిని కొనసాగించారు.


**అడిగిన ప్రతి రైతుకూ కనెక్షన్**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం విద్యుత్ సర్కిల్ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో అడిగిన ప్రతి రైతుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశారు. గత ఏడాది మార్చి 31 వరకూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 51,92 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఈ ఏడాది కొత్తగా కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న 2,604 మంది రైతులకు అడిగిన వెంటనే మంజూరు చేశారు. మొత్తంగా సర్కిల్ పరిధిలో 53,996 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటన్నింటికీ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే దిశగా ఏపీఈపీడీసీఎల్ యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసింది. మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో ఎక్కడా ఏ ఒక్క రైతుకు ఇబ్బంది లేకుండా ముందుగానే నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సబ్‌స్టేషన్‌ల సామర్థ్యం పెంచి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. గతంలో వ్యవసాయంతో పాటు ఇతర రంగాలకు కలిపి ఉన్న విద్యుత్ లైన్‌లను విభజించి వ్యవసాయానికి ప్రత్యేకంగా లైన్‌లు వేశారు. రాజమహేంద్రవరం రూరల్, అర్బన్, రామచంద్రపురం, జగ్గంపేట తదితర డివిజన్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.కోట్లు వెచ్చించి 220/133/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లను కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

### అదనంగా 28 విద్యుత్ సబ్ స్టేషన్లు

పూర్తిగా మెట్ట ప్రాంతమైన జగ్గంపేట డివిజన్ పరిధిలో వ్యవసాయానికి తొమ్మిది గంటలపాటు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందజేసేందుకు ఏపీఈపీడీసీఎల్ పకడ్బందీగా చర్యలు తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 130 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ సామర్థ్యాన్ని పెంచారు. ఇందుకోసం రూ.24.64 కోట్లు వెచ్చించి మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు సిద్ధం చేశారు. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, గృహ అవసరాలకు ఇప్పుడున్న విద్యుత్ సామర్థ్యం సరిపోదనే ముందుచూపుతో సర్కిల్ పరిధిలో రూ.84.14 కోట్లు వెచ్చించి అదనంగా 33/11కేవీ 28 విద్యుత్ సబ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం రూరల్‌లో ఎనిమిది, రాజమహేంద్రవరం అర్బన్‌లో ఒకటి, కాకినాడ డివిజన్‌లో ఆరు, అమలాపురం డివిజన్‌లో మూడు, రామచంద్రపురం డివిజన్‌లో రెండు, జగ్గంపేట, పెద్దాపురం డివిజన్‌ల పరిధిలో నాలుగేసి అదనపు సబ్ స్టేషన్లను నెలకొల్పారు. విద్యుత్ సరఫరాలో లైన్‌లాస్‌లను తగ్గించి లోపాలను చక్కదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో రెండు, అమలాపురంలో మూడు, జగ్గంపేటలో ఒకటి మొత్తంగా ఆరు అదనపు సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు రూ.34.75 లక్షలు వెచ్చించారు. కాకినాడ డివిజన్ పరిధిలోరూ.11.23 లక్షల వ్యయంతో సబ్‌స్టేషన్ విస్తరణ చేపట్టారు. సర్కిల్ పరిధిలో రూ.59.55 లక్షలు వెచ్చించి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల సామర్థ్యాన్ని పెంచారు.

### నిరాటంకంగా సరఫరాకు ఏర్పాట్లు



ఖరీఫ్ సీజన్‌లో సాగుకు ఎటువంటి ప్రతిబంధకాలు ఎదురుకాకుండా చర్యలు తీసుకున్నాం. వ్యవసాయానికి పగటిపూట తొమ్మిది గంటల పాటు నిరాటంకంగా సరఫరా చేసేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశాం. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల సామర్థ్యాన్ని పెంచాం. బోర్లపై ఆధారపడ్డ ఏ ఒక్క ఎకరంలోను సాగుకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయనున్నాం.

– పీఎస్ఎన్ మూర్తి, సూపరింటెండెంట్ ఇంజనీర్, ఏపీఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం

మంచిమాట

# చీరకొంగు

చీరలు కట్టే రోజుల్లో వాటికి కొంగు ఉండేది. దానికి ఎన్నో ప్రయోజనాలు ఉండేవి. గుండెలని కప్పటంతోపాటు, అవసరమైతే తన చేతులు తుడుచుకోవటం, దేనినైనా గబగబా తుడిచి శుభ్రం చేయటం, కోపం లేదా పౌరుషాన్ని ప్రదర్శించటానికి కొంగుని చీరకట్టులో దోపి ముందుకు రావటం తరచుగా కనపడే ప్రయోజనాలు. అలసిపోతే మొహం తుడుచుకోవటానికి, చెమట పడితే విసురుకోవటానికి, వీలైతే పక్కనున్న భర్తకో, అత్తగారికో, పిల్లలకో కూడా ఆ భోగాన్ని కలిగించటానికి కొంగు పనికి వస్తుంది. పిల్లలు మొహం తుడుచుకోవటానికి, అన్నం తిని చేతులు కడుక్కున్నాక తుడుచుకోటానికి కూడా ఉపయోగ పడుతుంది. అయితే మగవారికో? వారు కూడా ఉత్తరీయం పైన వేసుకునే వారు. లేదంటే కనీసం తుండుగుడ్డ. ఇప్పుడు రెండూ కనపడటం అపురూపమైపోయాయి. ఇవి రెండు చేసే పనులు ఒకటే అయినా, చీర కొంగు చేసే పనులు ప్రత్యేకంగా కొన్ని ఉన్నాయి.



ఇంటితాళాలు, ఇనుపపెట్టె తాళాలు ఒకప్పుడు ఇంటావిడ కొంగుచివర ఉండేవి. ముఖ్యంగా బెంగాలీ స్త్రీలకి పెద్ద తాళాల గుత్తి కొంగు చివర కట్టి ఉంటుంది. అది వారు వంగ దేశపు వారు అనటానికి గుర్తు. కొంగున కట్టారు అంటే ఎంతో ముఖ్యమైనది అని అర్థం. గుడిలో ఇచ్చిన అక్షతలు కావచ్చు, ప్రసాదం కావచ్చు, ఏదైనా విలువైన తాయెత్తో, రక్షరేకో, మరేదైనా కావచ్చు ఇల్లాలి కొంగులో ఒదిగి దాక్కుంటాయి.


అంతేకాదు, పనికి రానివి, ఉన్నచోట పడేయ కూడనివి ఉంటే కొంగులో దాక్కుంటాయి. అంటే, విరిగిన గోళ్ళు, రాలి పడిన వెంట్రుకలు, చిన్న చిన్న గాజుముక్కలు, ముళ్ళు... ఇట్లాంటి వాటిని కూడా కొంగు భద్రంగా జాగ్రత్త చేస్తుంది చెత్తలో వేసేవరకు.

కొంగుకి ఎంతటి ప్రాముఖ్యమో చూడండి – వివాహ సమయంలో బ్రహ్మముడి వేయటానికి ఇద్దరి కొంగులని కలుపుతారు. అంటే, ఒకరి కొంగులో మరొకరు ఉండమని. ఒకరికొకరు కొంగు బంగారం. కొంగు బంగారం అంటే అందుబాటులో ఉండే విలువైన, అవసరానికి ఆదుకొనేది అని అర్థం. ఒకరి అవసరాలు, కష్టసుఖాలు మరొకరు అడగనవసరం లేకుండానే పంచుకుంటూ, తీర్చుకుంటూ జీవితం గడపాలన్నది సూచన. అందుకే ఎవరైనా భార్యని అపురూపంగా చూస్తుంటే – ఆవిడ భర్తని కొంగున కట్టుకుంది అంటారు. లక్ష్మీదేవే దానికి పెద్ద ఉదాహరణ. గజేంద్రుడి కుయ్యాలించిన విష్ణువు ఉన్న వాడు ఉన్నట్టుగా బయలుదేరితే లక్ష్మీదేవి వెంట వెళ్ళవలసి వచ్చింది. ఎందుకంటే ఆవిడ కొంగు ఆయన చేతిలో ఉన్నది అని వర్ణించారు. ''వివాద ప్రోత్థిత శ్రీ కుచోపరి చేలాంచల మైన వీడడు'' అన్నారు పోతన గారు. అసలు విషయం అది కాదు. విష్ణువుని లక్ష్మీదేవి కొంగున కట్టుకుంది. ఆయన కదిలితే తానున్న కొంగు కూడా కదిలింది. పోనీ, ఆయనే పట్టుకున్నాడు అనుకుందాం. అప్పుడైనా విష్ణువు లక్ష్మీదేవి కొంగు విడవడు అనే కదా అర్థం.

భర్తని తానే కొంగున కట్టుకున్నా, కొంగుని వదలని వారూ ఉన్నారు. వారే సంతానం. కొంగు పట్టుకుని తిరుగుతూ ఉంటారు. ఎవరైనా కొత్తవారు వచ్చినా, సిగ్గు కలిగినా అమ్మ కొంగు చాటున దాక్కుంటూ ఉంటారు. అది వారికి రక్షణ. పసితనంలో పాలు తాగుతున్నపుడు, (తల్లిపాలు అయినా, పోతపాలు అయినా) అందరి చూపు పడకుండా అడ్డుగా ఉండే అమ్మ కొంగు, ఎండ, వాన, చలి, గాలి మొదలైనవి రాగానే తమ పైన చేరి వాటి బాధ నుండి రక్షణ కలిగించే అమ్మ చీర కొంగు తమకి ఎప్పుడు భద్రతా భావన కలిగిస్తుంది అని నమ్మకం. ''కొంగు చాటు బిడ్డ'' అనే నానుడి అందుకే వచ్చి ఉంటుంది.

– డా. ఎన్. అనంతలక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం



# రుషిరుణం

మనం ఏ విషయాన్ని నిర్ణయించాల్సి వచ్చినా ''తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్యవ్యవస్థితౌ...'' శాస్త్రమే ప్రమాణం. మనకు బుద్ధికి తోచిన దానితో నిర్ణయం చేయడం సనాతన ధర్మంలో భక్తి అనిపించుకోదు. మనం ఎన్ని చదివాం, ఎన్ని విన్నాం... అని కాదు ఎన్ని ఏ మేరకు పాటిస్తాం అన్నది ప్రధానం. ఈ విషయాన్నే రామాయణంలో సీత 'ఇహ సంతో న వా సంతి సతో వా నానువర్తసే / తథా హి విపరీతా తే బుద్ధిరాచార వర్జితా..' అంటూ రావణాసురుడికి బోధ చేస్తుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అలా మనం ఏదయినా ఒక పని చేయాలనుకున్నప్పుడు మనకు ప్రమాణం శాస్త్రం. పుట్టుకతో ప్రతివారికీ మూడు రుణాలుంటాయి.. అని శాస్త్రం అంటుంది. అవి రుషి రుణం, దేవరుణం, పితృరుణం. 'నేనెప్పుడు చేశానండీ ఈ రుణాలు, నేనెలా రుణగ్రస్తుడనయ్యాను' అన్న ప్రశ్న అన్వయం కాదు. శాస్త్రవాక్కు కనుక అందరికీ ఉంటుంది. వీటిలో ఒక రుణం విషయంలో మాత్రం దానిని తీర్చుకోవడానికి గృహస్థాశ్రమ అవసరం ఉండదు. అది రుషి రుణం. సనాతన ధర్మంలో మనందరం రుణపడిపోయింది రుషులకు. మంత్రానికి రుషి ద్రష్ట. వేదమంత్రాలను ధ్యానంతో దర్శించి, విని మనకు స్వరంతో అందించాడు. ఆయన కూడా మనలాగే జీవించినవాడే అయినా రుషి తర్పణం అని... రుషికి వేరు తర్పణం ఉంటుంది.

రుషి మన నుంచి ఏ విధమైన ఫలాన్ని ఆశించలేదు, ఏ సత్కారాన్నీ, ఏ బిరుదునూ కోరుకోలేదు. కేవలం మనల్ని ఉద్ధరించడం కోసమని, మనందరికీ కటికచీకటిలో కాంతిరేఖ కనపడాలని, మన జీవితాలు సుసంపన్నం కావాలని, మార్గం చూపించాలని వేదాల ద్వారా అందించి ధర్మానుష్ఠానికి ప్రమాణాన్ని కల్పించాడు. అలాగే ఒకవేళ మనం ఇవన్నీ చదవగలమో లేదో, స్వరంతో మంత్రం చెప్పగలమో లేదో, మంత్రభాష్యాన్ని అర్థం చేసుకోగలమో లేదో, అసలు ఇది అందరికీ అందుబాటులో ఉంటుందో ఉండదో అన్న అనుమానంతో రుషులు పురాణాలను ఇతిహాసాలుగా అందించారు.

వ్యాసభగవానుడు 18 పురాణాలను అందించాడు. ''నమోఽస్తు తే వ్యాస విశాల-బుద్ధే/ఫుల్లరవిందయత -పత్ర-నేత్ర/యేన త్వయా భారత-తైల-పూర్ణః/ప్రజ్వలితో జ్ఞాన-మయః ప్రదీపః'' అంటారు. అంతటితో ఆగకుండా ఆయన పరమ దయాళువై వేదాల సారాన్ని అందరూ చదువుకుని అనుష్ఠించడానికి వీలుగా పంచమ వేదంగా మహాభారతాన్ని రచించి లోకానికి అందించారు. వేదం చదువుకుంటే ఏది తెలుస్తుందో మహాభారతం చదువుకున్నా అదే తెలుస్తుంది.

సూర్యవంశాన్ని అంతటినీ కూడా శ్రీరామాయణం ద్వారా వాల్మీకి మహర్షి వర్ణించాడు. ''వేద వేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే /వేదః ప్రచేతస దాచిత్ సాక్షాత్ రామాయణాత్మనాః'' వేదములు ప్రతిపాదించిన బ్రహ్మము రామచంద్రమూర్తిగా వస్తే ఆ వేదమే రామాయణ కావ్యంగా వచ్చింది. వేదం ఏం చెప్పిందో తెలియనప్పుడు రామాయణం చదువుకుంటే చాలు. మనకు ఆ ప్రయోజనం నెరవేరుతుంది. రాముడు ఏ పరిస్థితుల్లో ఏం చేసాడో, మానవాళికి అదే వేదం విధించిన కర్తవ్యం కూడా.

అందుకే ఎవరయినా అత్యంత విశ్వాసంతో ఒక విషయాన్ని తదేక దృష్టితో నమ్మి ఆచరించేవారయితే 'రుషి సమానులు' అంటారు. ఆయన ఒక 'రుషి' అంటారు.

బౌద్ధవాణి



# మణి-దీపం

వేసవి ఎండ తీవ్రంగానే ఉంది. కానీ ఆ మామిడి తోటలో చల్లగానే ఉంది. ఆ మామిడితోట వేణువనానికి ఒక మూలన ఉంది. ఆ తోట మధ్యలో ఒక పెద్ద మామిడి చెట్టు కింద విశాలమైన అరుగు. ఆ అరుగు దగ్గరకు నెమ్మదిగా, మందహాసంతో నడిచి వచ్చాడు బుద్ధుడు. ఆయన రాకను గమనించాయి తోటలో ఉడతలు.

మనిషి అలికిడి తగిలితే పారిపోయే ఉడతలు, బుద్ధుణ్ణి చూస్తే దగ్గరకు వచ్చేస్తాయి.

అది ఎప్పటినుండో వాటికి అలవాటు. భిక్షాపాత్రలోంచి కొన్ని పళ్ళు తీసి అరుగు పైన ఒక పక్కన చల్లాడు. అవి కుచ్చుతోకలు విప్పుకుని, పైకెత్తుకుని వచ్చి, పండ్లు ఏరుకుని తినసాగాయి.

కొంత సమయం గడిచింది.

సకుల ఉదాయి అనే పరివ్రాజకుడు వచ్చాడు. బుద్ధునికి నమస్కరించి కూర్చున్నాడు. అతను రాగానే కొన్ని ఉడతలు చెట్టెక్కాయి. వాటిని చూసి–

''భగవాన్! మీ కరుణ అమోఘం. ఉడతలు కూడా మిమ్మల్ని మిత్రునిగా భావిస్తాయి. ఇది విచిత్రం. మీ జీవ కారుణ్యానికి మచ్చుతునక. మీకు మరోమారు ప్రణమిల్లుతాను'' అని వంగి నమస్కరించాడు.

''సకుల ఉదాయీ! వచ్చిన విషయం?'' అని అడిగాడు బుద్ధుడు.

''మా గురువుగారు నిగంఠ నాథుల వారు నిన్న 'పరమ సత్యం, పరమ వర్ణం'' అంటూ ''పరమం'' గురించి చెప్పారు. మీ దృష్టిలో పరమ వర్ణం ఏది? అని అడిగాడు.

''ఉదాయీ! పరమం అంటే?''

''మీకు తెలియంది కాదు. దేని కంటే ఉన్నతమైంది మరొకటి ఉండదో... అదే పరమం''

''నీకు ఈ లోకం ఎంత తెలుసు. అందులో ఇదే పరమం అని ఎలా నిర్ణయిస్తావు? నూతిలోని కప్పకి నుయ్యే ప్రపంచం. చెరువులోని చేపకి చెరువే ప్రపంచం. ఈ అనంతమైన విశ్వానికి హద్దులు ఎలా గీస్తావు?'' అని అడిగాడు భగవానుడు. సకుల ఉదాయి మౌనం వహించాడు.

''ఉదాయీ! ఒక చీకటి గదిలో ఒక పసుపురంగు కంబళిలో ఒక సానబెట్టిన మణి ఉంది. అది ఆ చీకటిలో ప్రకాశిస్తుంది. అంతలో ఆ గదిలోకి ఒక మిణుగురు పురుగు వచ్చింది. అప్పుడు ఆ మణి వెలుగు ఎక్కువ ప్రకాశంగా ఉంటుందా? మిణుగురు వెలుగా?'' అని అడిగాడు.

''భగవాన్! మిణుగురు వెలుగే మిగుల ప్రకాశం'' అన్నాడు ఉదాయి.

''ఇందులో ఒక వ్యక్తి నూనె దీపం తెచ్చాడు. అప్పుడు ఏ వెలుగు ప్రకాశం?''

''దీపం వెలుగే భగవాన్!''

'అలా ఉదాయీ! దీపం వెలుగు కంటే నెగడు వెలుగు ప్రకాశం. దాని కంటే వేగుచుక్క వెలుగు, దానికంటే చంద్రుని వెలుగు, దానికంటే సూర్యుని వెలుగు ప్రకాశం.... ఉదాయీ! సూర్యుని కంటే ప్రకాశవంతమైన వెలుగులు కూడా ఉంటాయి.'' అన్నాడు. ఉదాయి మనస్సు తేటబడింది. ఆ తేటదనం అతని ముఖం లోంచి తొంగి చూస్తోంది!

ఉడతలు కిచకిచ మంటూ బుద్ధుని దగ్గరకు వచ్చాయి. ఆయన పాత్రలో నుంచి మరికొన్ని పళ్ళను వాటిముందు పోశాడు. అవి వాటి పనిలో మునిగి పోయాయి.

''ఉదాయీ! మిణుగురు పురుగు కంటే తక్కువ ప్రకాశించే మణి వెలుగునే 'పరమం' అనుకుంటున్నావు? అన్నాడు.

'విజ్ఞానం, విశ్వం, అన్నీ అనంతాలే' అని గ్రహించాడు. సకుల ఉదాయీ! బుద్ధునికి ప్రణమిల్లాడు! అతని ముఖంలో అనుమాన ఛాయలు తొలిగాయి. సంతోష కాంతులు వెలిగాయి! దోసిలి చాచాడు. బుద్ధుడు కొన్ని పండ్లను అతని దోసిట్లో పోశాడు.

ఉదాయి, కొద్దిగా ముందుకు వంగి ఉడతలకు దోసిలి చూపాడు. అవి అతని ముఖం కేసి చూశాయి. ధైర్యంగా దోసిలి లోని పండ్లు అందుకున్నాయి.

– డా. బొర్రా గోవర్ధన్

# సినిమా



● ఎన్టీఆర్

## చలో మెక్సికో

మెక్సికోలో యాక్షన్ చేయనున్నారట ఎన్టీఆర్. ఆయన హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ ఆగస్టులో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ సినిమాకు చెందిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ సినిమా తొలి షెడ్యూల్ మెక్సికోలో ప్రారంభం కానుందని సమాచారం. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తారట. అంతేకాదు.. ఈ సినిమాకి సంబంధించిన ఎక్కువ శాతం షూటింగ్ విదేశాల్లోనే జరుగుతుందని, దాదాపు పదిహేను దేశాల్లో చిత్రీకరణ జరిపేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ టాక్.

## అప్పుడే ఇండియన్ 2 గురించి శంకర్‌తో మాట్లాడా! – కమల్‌హాసన్



● అనిరుధ్, గుల్షన్, సుభాస్కరన్, జ్ఞానాంబిగై, కమల్‌హాసన్, శంకర్

''ఇరవైఎనిమిదేళ్ల క్రితం నేను శివాజీ గణేశన్ గారితో ఓ సినిమా చేయాల్సింది. అదే సమయంలో 'ఇండియన్' కథతో దర్శకుడు శంకర్ వచ్చారు. ఈ రెండు చిత్రాల కథలు దగ్గర దగ్గరగా ఉన్నాయని శివాజీగారితో చెప్పాను. 'శంకర్‌గారితోనే సినిమా చేయండి. మనం ఇప్పటికే ఎన్నో సినిమాలు కలిసి చేశాం' అని నాతో ఆయన అన్నారు. శివాజీగారు అన్న ఒక్క మాటతో, ఆ నమ్మకంతో శంకర్‌గారితో 'ఇండియన్ ' సినిమా చేశాను. నిర్మాత ఏఎం రత్నం గారు ఈ సినిమాను అద్భుతంగా నిర్మించారు. ఆ సమయంలోనే 'ఇండియన్'కు సీక్వెల్ గురించి శంకర్‌గారితో మాట్లాడాను. కథ రెడీగా లేదన్నారు. 28 ఏళ్ల తర్వాత 'ఇండియన్ 2' చేశాం. అనిరుధ్ సంగీతంలో ఎప్పుడూ ఎనర్జీ ఉంటుంది'' అన్నారు కమల్‌హాసన్. హీరో కమల్ హాసన్– దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఇండియన్ 2'. కమల్‌హాసన్–శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్'కు సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' చిత్రాలు రూపొందాయి. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించిన 'ఇండియన్ 2' జులై 12న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. 'భారతీయుడు 2' మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పి, సీడెడ్ హక్కులను శ్రీలక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా చెన్నైలో జరిగిన ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ వేడుకలో శంకర్ మాట్లాడుతూ– ''కమల్‌హాసన్ వంటి నటులు ఈ ప్రపంచంలోనే లేరు. ఆయనతో 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''ఇండియన్ 2' పెద్ద విజయాన్ని సాధిస్తుంది'' అన్నారు బ్రహ్మానందం. ''ఇండియన్' సినిమాకు ఏఆర్ రెహమాన్‌గారు గొప్ప సంగీతం ఇచ్చారు. 'ఇండియన్ 2'కి నేను సంగీతం ఇచ్చాను. శంకర్‌గారు నా పై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను'' అన్నారు అనిరుధ్ రవిచందర్.



● నాగార్జున

## యాక్షన్ కుబేర

'కుబేర అండ్ కో యాక్షన్ మోడ్‌లోకి వెళ్లారు. ధనుష్, నాగార్జున లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం తయారు చేయించిన ఓ స్పెషల్ సెట్‌లో ధనుష్–నాగార్జున పాల్గొంటుండగా, యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌తో 'కుబేర' చిత్రీకరణ దాదాపు పూర్తవుతుందట. ''చాలా వరకు టాకీ పార్టును పూర్తి చేశాం. ఒక వైపు షూటింగ్ చేస్తూనే, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

## డేట్ ఫిక్స్



● చాందిని

చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, భరత్ రాజ్, ఆషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'యేవమ్'. ఈ చిత్రంలో ఎస్ఐ సౌమ్య పాత్రలో కనిపిస్తారు చాందినీ చౌదరి. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మించిన ఈ చిత్రం రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. జూన్ 14న రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రకాశ్ దంతులూరి మాట్లాడుతూ– ''మహిళా సాధికారతను చాటి చెప్పేలా ఈ సినిమా కథనం ఉంటుంది'' అని పేర్కొన్నారు.

## మనమే నా గ్రాఫ్ పెంచుతుంది

– దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య



''ఇండస్ట్రీలో సక్సెస్ ఉంటేనే మన కెరీర్ గ్రాఫ్ పెరుగుతుంటుంది. నా గత చిత్రం 'హీరో' ఎక్కువమంది ప్రేక్షకులకు రీచ్ కాలేదు. కొంత కరోనా ప్రభావం కూడా ఉంది. ఇప్పుడు 'మనమే' సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాను. నా కెరీర్ గ్రాఫ్ మళ్లీ పెరుగుతుంది'' అన్నారు దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య. శర్వానంద్, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా, చైల్డ్ ఆర్టిస్టు విక్రమాదిత్య ఓ కీలక పాత్రలో నటించిన చిత్రం 'మనమే'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ –

''పేరెంటింగ్ ఎమోషన్స్ గురించి కొంచెం వినూత్నంగా చెప్పాలన్న ఉద్దేశం నాకు ఎప్పట్నుంచో ఉంది. కాకపోతే ఈ ఎమోషన్స్‌కు ఫన్ జోడించి, ఫుల్ ఎనర్జీతో చెప్పాలనుకున్నాను. అదే 'మనమే' కథ. ఈ సినిమాలో శర్వానంద్–కృతీ శెట్టిల క్యారెక్టర్స్ టామ్ అండ్ జెర్రీలా ప్రేక్షకులను అలరిస్తాయి. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో 'మనమే' నా ఫేవరెట్. ఈ సినిమాలో నా కొడుకు చైల్డ్ ఆర్టిస్టుగా చేశాడని నేను ఇలా చెప్పడం లేదు. అందమైన భావోద్వేగాలు ఉన్న మంచి సినిమా ఇది. ఈ సినిమాలో శివ కందుకూరి పాత్ర సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. 'మనమే'లో 16 పాటల వరకూ ఉన్నాయి. ఇవి సినిమా ఫ్లోకు ప్లస్‌గానే ఉంటాయి కానీ అడ్డుగా అనిపించవు. హేషమ్ మంచి సంగీతం అందించారు'' అని చెప్పుకొచ్చారు.

## ఎన్నో కష్టాలు దాటి..



● హరీష్, మాన్య

హరీష్ బొంపెల్లి, మాన్య సలాడి జంటగా నటించిన చిత్రం 'ఓసీ'. విష్ణు బొంపెల్లి దర్శకత్వంలో బీవీఎస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ కానుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కామారెడ్డి ఎమ్మెల్యే కాటపల్లి వెంకటరమణారెడ్డి ఈ చిత్రం మొదటి టికెట్‌ను లాంచ్ చేసి, ఈ సినిమా విజయం సాధించాలన్నారు. ఈ వేడుకలో హీరో హరీష్ బొంపెల్లి మాట్లాడుతూ– ''ఈ సినిమా ప్రయాణంలో ఎన్నో కష్టాలు పడ్డాం. మా డాడీ ఇల్లుతో పాటు అమ్మ నగలు కూడా తాకట్టు పెట్టాల్సి వచ్చింది. అన్ని అవమానాలను మరిచిపోయేలా డిస్ట్రిబ్యూటర్ ప్రశాంత్ గౌడ్ మాకు అండగా నిలిచారు'' అంటూ ఎమోషనల్‌గా మాట్లాడారు. ''సినిమా అంటేనే వైకుంఠపాళి ఆట. ఈ సినిమా మొదలు పెట్టినప్పటి నుంచి నేటి వరకు చాలా అప్ అండ్ డౌన్స్ చూశాం. అన్ని కష్టాలనూ దాటుకుని విడుదల వరకూ వచ్చాం'' అన్నారు విష్ణు బొంపెల్లి.

## సింహాసనం దక్కాలి కానీ...



● మీరా జాస్మిన్

ఉత్పలదేవిగా మారిపోయారు మీరా జాస్మిన్. ఉత్పలదేవి దయాగుణం వల్ల రాణి కావాల్సిన ఆమెకు సింహాసనం దక్కదు. ఆ తర్వాత ఏం జరిగిందనేది 'శ్వాగ్' సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. శ్రీవిష్ణు హీరోగా హసిత్ గోలీ దర్శకత్వంలో 'శ్వాగ్' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో వింజమర వంశంలోని రాణి రుక్మిణి దేవిగా రీతూ వర్మ ఓ లీడ్ రోల్‌లో నటిస్తుండగా, మరో లీడ్ రోల్‌లో ఉత్పలదేవిగా మీరా జాస్మిన్ కనిపిస్తారు. ఆదివారం ఆమె ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.

## ప్రేమ... ఆకర్షణ



● అంకిత, సుధీష్

సుధీష్ వెంకట్, అంకితా సాహా, శ్రేయాసి షా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ప్యాషన్'. ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజ్ నేపథ్యంలో సాగే ఈ ప్రేమ కథా చిత్రానికి ఫ్యాషన్ డిజైనర్ అరవింద్ జోషువా దర్శకుడు. డా. అరుణ్ కుమార్ మొండితోక, నరసింహ యేలె, ఉమేష్ చిక్కు నిర్మాతలు. ''తొలి షెడ్యూల్ పూర్తయింది. ప్రేమ, ఆకర్షణలకి సంబంధించి యువతలో ఉత్పన్నమయ్యే అనేక ప్రశ్నలకు సమాధానంగా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు అరవింద్ జోషువా.

## నాని ప్రేమకథ



● సాహిబా, పవన్

'మెరిసే మెరిసే' చిత్రంతో దర్శకుడిగా విజయాన్ని అందుకున్న పవన్ కుమార్ కొత్తూరి హీరోగా మారారు. ఆయన హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. సాహిబా భాసిన్, స్నేహ మాల్వియ, వివియా సంత్ హీరోయిన్లు. శ్రీ నీలకంఠ మహాదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీపై రూపొందిన ఈ సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. ''మంచి ఫీల్ గుడ్ లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న చిత్రం ఇది'' అన్నారు పవన్ కుమార్ కొత్తూరి. ఈ చిత్రానికి నిర్మాతలు: పవన్ కుమార్ కొత్తూరి, బిషాలీ గోయెల్.

## విల్లాలో సస్పెన్స్



● శీతల్

విజయ్, శీతల్ భట్ జంటగా విగన్ క్రియేషన్ సమర్పణలో విద్యా గణేశ్ నిర్మించిన చిత్రం 'విల్లా 369'. సురేశ్ ప్రభు దర్శకుడు. ''ఒక విల్లాలో ఏం జరిగింది? అనే థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందించాం. ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. అతి త్వరలో టీజర్, ట్రైలర్ విడుదల చేస్తాం'' అని దర్శక–నిర్మాతలు తెలిపారు.

## వందేళ్ల తర్వాత...



● స్టీఫెన్, కబీర్

యానియా, అంకిత, అజయ్, కబీర్ సింగ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఇంద్రాణి ఎపిక్1: ధరమ్ వర్సెస్ కరమ్'. స్టీఫెన్ పల్లం స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ చిత్రం విలేకర్ల సమావేశంలో స్టీఫెన్ మాట్లాడుతూ– ''వందేళ్ల తర్వాత ప్రపంచంలో భారతదేశం ఎలాంటి పాత్ర వహిస్తుందో ఇందులో సరికొత్తగా చూపించడం జరిగింది. ఈ సినిమా కోసం ఒక రోబోని కూడా క్రియేట్ చేశాం. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ ఉంది. ఇండియన్ సూపర్ ఉమెన్‌గా యానీయా అద్భుతంగా నటించింది'' అన్నారు. ''ఇందులో సూపర్ విలన్‌గా కనిపిస్తాను'' అన్నారు కబీర్ సింగ్.



## ప్రపంచ రెండో ర్యాంకర్‌పై ప్రజ్ఞానంద... ప్రపంచ మూడో ర్యాంకర్‌పై వైశాలి సంచలన విజయాలు

నార్వే చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు, తోబుట్టువులైన ప్రజ్ఞానంద, వైశాలి సంచలన ప్రదర్శన కొనసాగిస్తున్నారు. స్టావెంజర్ నగరంలో జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక టోర్నీ పురుషుల విభాగం ఐదో రౌండ్‌లో ప్రజ్ఞానంద 77 ఎత్తుల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)పై గెలిచాడు. ఇదే టోర్నీ మూడో రౌండ్‌లో ప్రజ్ఞానంద ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. ఇదే వేదికపై జరుగుతున్న మహిళల టోర్నీ ఐదో రౌండ్ గేమ్‌లో ప్రజ్ఞానంద సోదరి వైశాలి తెల్ల పావులతో ఆడి 'అర్మగెడాన్' గేమ్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ టింగ్జీ లె (చైనా)పై 76 ఎత్తుల్లో గెలిచింది. వీరిద్దరి మధ్య క్లాసికల్ గేమ్ 'డ్రా' కావడంతో విజేతను నిర్ణయించేందుకు 'అర్మగెడాన్' గేమ్ నిర్వహించారు. ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా), భారత స్టార్ కోనేరు హంపి మధ్య క్లాసికల్ గేమ్ 31 ఎత్తుల్లో 'డ్రా' అయింది. విజేతను నిర్ణయించేందుకు 'అర్మగెడాన్' గేమ్ నిర్వహించగా జు వెన్‌జున్ 64 ఎత్తుల్లో హంపిపై గెలిచింది.



## పారిస్ ఒలింపిక్స్‌కు అమిత్, జైస్మిన్ అర్హత



బ్యాంకాక్: భారత బాక్సర్లు అమిత్ పంఘాల్, జైస్మిన్ లంబోరియా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. వరల్డ్ క్వాలిఫయింగ్ చివరి టోర్నీలో ఆదివారం పురుషుల 51 కేజీల విభాగంలో అమిత్... మహిళల 57 కేజీల విభాగంలో జైస్మిన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి 'పారిస్' బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. పురుషుల 57 కేజీల విభాగంలో సచిన్ సివాచ్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో అమిత్ 5–0తో చువాంగ్ లియు (చైనా)పై... జైస్మిన్ 5–0తో మరీన్ కమారా (మాలి)పై గెలుపొందారు. మరోవైపు 'బాక్స్ ఆఫ్' మ్యాచ్‌లో సచిన్ సివాచ్ 0–5తో మునార్‌బెక్ (కిర్గిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. హరియాణాకు చెందిన 28 ఏళ్ల అమిత్ వరుసగా రెండోసారి ఒలింపిక్స్‌కు అర్హత పొందాడు. టోక్యో ఒలింపిక్స్‌లో అమిత్ 52 కేజీల విభాగంలో పాల్గొని రెండో రౌండ్‌లో ఓడిపోయాడు. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం, 2019 ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన అమిత్ 2018 ఆసియా క్రీడల్లో, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో పసిడి పతకాలు గెలిచాడు. గత టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ నుంచి మొత్తం తొమ్మిది మంది బాక్సర్లు బరిలోకి దిగగా... ఈసారి పారిస్ ఒలింపిక్స్‌లో ఆరుగురు భారత బాక్సర్లు మాత్రమే పోటీపడనున్నారు. మహిళల విభాగంలో నిఖత్ జరీన్ (50 కేజీలు), ప్రీతి (54 కేజీలు), జైస్మిన్ (57 కేజీలు), లవ్లీనా (75 కేజీలు)... పురుషుల విభాగంలో అమిత్ పంఘాల్ (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు.


## భారత హాకీ జట్ల ఓటమి

లండన్: ప్రొ హాకీ లీగ్ యూరోప్ అంచె పోటీల్లో ఆదివారం భారత పురుషుల, మహిళల జట్లకు బ్రిటన్ జట్ల చేతిలో పరాజయం ఎదురైంది. భారత పురుషుల జట్టు 1–3 గోల్స్ తేడాతో ఓడిపోగా... భారత మహిళల జట్టు 2–3 గోల్స్ తేడాతో ఓటమి పాలైంది. భారత పురుషుల జట్టు తరఫున అభిషేక్ (35వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. భారత మహిళల జట్టుకు నవ్‌నీత్ కౌర్ (34వ ని.లో), షర్మిలా దేవి (56వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. శనివారం జర్మనీతో జరిగిన మ్యాచ్‌ల్లో ముందుగా భారత పురుషుల జట్టు 0–3తో... అనంతరం మహిళల జట్టు 1–3తో ఓడిపోయాయి.

## విండీస్ శ్రమించి...

- ఐదు వికెట్లతో పపువా న్యూగినీ జట్టుపై గెలిచింది
- ఆకట్టుకున్న పపువా బౌలర్లు
- విండీస్‌ను గెలిపించిన చేజ్

గయానా: టి20 ప్రపంచకప్‌కు ఆతిథ్యమిస్తున్న రెండో దేశం వెస్టిండీస్ కూడా టోర్నీలో శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో రెండుసార్లు చాంపియన్ విండీస్ ఓటమి అంచుల్లోంచి బయటపడి 5 వికెట్ల తేడాతో పపువా న్యూగినీ జట్టుపై గెలిచి ఊపిరి పీల్చుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పపువా న్యూగినీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు టోని వుర (2), అసద్ వాలా (21), లెగా సియాక (1) నిరాశ పరచడంతో 34 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సెసె బావు (43 బంతుల్లో 50; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. చార్లెస్ అమిని (12)తో ఐదో వికెట్‌కు 44 పరుగులు జోడించాడు. జట్టు స్కోరు 98 వద్ద ఆరో వికెట్‌గా సెసె బావు నిష్క్రమించగా, కిప్లిన్ డొరిగా (18 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడటంతో పపువా ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. విండీస్ బౌలర్లలో రసెల్, జోసెఫ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం వెస్టిండీస్ 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోస్టన్ చేజ్ (27 బంతుల్లో 42 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) విండీస్‌ను ఒడ్డున పడేసే ఆట ఆడాడు. సులువైన ప్రత్యర్థే అయినా... ఏమంత కష్టం కానీ లక్ష్యమే ఎదురైనా... వెస్టిండీస్ గెలిచేందుకు ఆపసోపాలు పడింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్, పూరన్ ఉన్నంత వరకు 8 ఓవర్లలో విండీస్ 61/1 స్కోరు చేసింది. గెలిచేందుకు 72 బంతుల్లో 76 పరుగులు చేస్తే సరిపోతుంది. కానీ తర్వాతి వరుస ఓవర్లలో పూరన్ (27 బంతుల్లో 27; 1 ఫోర్, 2 సిక్స్‌లు), కింగ్ (29 బంతుల్లో 34; 7 ఫోర్లు) అవుటయ్యాక పరిస్థితి మారింది. కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ (15), రూథర్‌ఫోర్డ్ (2) వికెట్లు పారేసుకోవడంతో సమీకరణం 24 బంతుల్లో 40 పరుగుల వద్ద కష్టంగా కనిపించింది. ఈ దశలో రసెల్ (9 బంతుల్లో 15 నాటౌట్; 1 సిక్స్) వచ్చాక చేజ్ ధాటిగా ఆడాడు. 18వ ఓవర్లో 2 బౌండరీలు, ఓ సిక్స్ బాది 18 పరుగులు పిండుకున్నాడు. మరుసటి ఓవర్లోనూ చేజ్ 2 ఫోర్లు కొట్టడంతో 19వ ఓవర్ ఆఖరి బంతికి లక్ష్యాన్ని చేరుకుంది.


రోస్టన్ చేజ్

## స్వియాటెక్ ఫటాఫట్...

**ప్రిక్వార్టర్ ఫైనల్లో రష్యా ప్లేయర్‌పై 6-0, 6-0తో విజయం**

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో 'హ్యాట్రిక్' టైటిల్‌పై గురి పెట్టిన ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ ఆ దిశగా మరో అడుగు వేసింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ అదరగొట్టింది. రష్యా ప్లేయర్ అనస్తాసియా పొటపోవాతో జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ స్వియాటెక్ (పోలాండ్) 6–0, 6–0తో ఘనవిజయం సాధించింది. కేవలం 40 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ మూడు ఏస్‌లు సంధించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. 13 విన్నర్స్ కొట్టిన ఆమె నెట్ వద్ద ఆరు పాయింట్లు గెలిచింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–1, 6–2తో ఎలిసబెట్టా కొక్సియారెట్టో (ఇటలీ)పై, ఐదో సీడ్ వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6–4, 6–2తో ఓల్గా డానిలోవిచ్ (సెర్బియా)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

**అల్‌కరాజ్ ముందంజ**

పురుషుల సింగిల్స్ విభాగంలో మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), తొమ్మిదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అల్‌కరాజ్ 6–3, 6–3, 6–1తో అగర్ అలియాసిమ్ (కెనడా)పై, సిట్సిపాస్ 3–6, 7–6 (7/4), 6–2, 6–2తో మాటియో అర్నాల్డి (ఇటలీ)పై గెలుపొందారు. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ (సెర్బియా) మూడో రౌండ్ మ్యాచ్‌లో విజయం కోసం తీవ్రంగా శ్రమించాడు. 4 గంటల 29 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ 7–5, 6–7 (6/8), 2–6, 6–3, 6–0తో లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు.

**ప్రిక్వార్టర్స్‌లో బోపన్న జోడీ**



పురుషుల డబుల్స్‌లో రెండో సీడ్ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్ జోడీ 7–5, 4–6, 6–4తో ఒర్లాండో లుజ్–మార్సెలో జొర్మాన్ (బ్రెజిల్) జంటను ఓడించింది. రెండో రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్‌లతో ఆడాల్సిన సెబాస్టియన్ బేజ్ (అర్జెంటీనా)–థియాగో వైల్డ్ (బ్రెజిల్) టోర్నీ నుంచి వైదొలిగారు. దాంతో బోపన్న–ఎబ్డెన్ రెండో రౌండ్ మ్యాచ్ ఆడకుండానే నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీరామ్ బాలాజీ (భారత్)–మిగెల్ వరేలా (మెక్సికో)లతో బోపన్న–ఎబ్డెన్ ఆడతారు.



## అమెరికా ధనాధన్...

**మెరుపులతో టి20 ప్రపంచకప్ టోర్నీ ఆరంభం**

- 10 సిక్స్‌లతో విరుచుకుపడ్డ జోన్స్
- తొలి పోరులో కెనడాపై 7 వికెట్లతో అమెరికా గెలుపు


ఆరోన్ జోన్స్

డాలస్: అమెరికా ఆతిథ్య హోదాలో ఆడిందంతే! టి20 ప్రపంచకప్ ఆడే సత్తా ఆ జట్టుకెక్కడిది అని తేలిగ్గా తీసిపారేసే వారికి మెగా మెరుపులతో టోర్నీకే గొప్ప ఆరంభం ఇచ్చింది అమెరికా. రెండు కొత్త జట్లు (కెనడా, అమెరికా) ప్రపంచకప్‌లో ఆడటం తొలిసారే అయినా... ధనాధన్ షోతో సిసలైన క్రికెట్ వినోదాన్ని పంచాయి. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం జరిగిన గ్రూప్ 'ఎ' మొదటి మ్యాచ్‌లో అమెరికా 7 వికెట్ల తేడాతో కెనడాపై ఘనవిజయం సాధించింది. టాస్ నెగ్గిన అమెరికా ఫీల్డింగ్ ఎంచుకోగా, ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 194 పరుగుల భారీస్కోరు చేసింది. ఓపెనర్ నవ్‌నీత్ ధలివాల్ (44 బంతుల్లో 61; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), నికోలస్ కిర్టన్ (31 బంతుల్లో 51; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించారు. శ్రేయస్ మొవ్వ (16 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆరోన్ జాన్సన్ (16 బంతుల్లో 23; 5 ఫోర్లు) ధాటిగా ఆడారు. అలీఖాన్, హర్మీత్‌సింగ్, కోరె అండర్సన్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్యాన్ని అమెరికా 17.4 ఓవర్లలోనే మూడే వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసి ఛేదించింది. జట్టు ఖాతా తెరువకముందే స్టీవెన్ టేలర్ (0) డకౌటయ్యాడు. మరో ఓపెనర్, కెప్టెన్ మోనంక్ పటేల్ (16) తక్కువే చేశాడు. 42/2 స్కోరు వద్ద కష్టాల్లో ఉన్న అమెరికాను 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆరోన్ జోన్స్ (40 బంతుల్లో 94 నాటౌట్; 4 ఫోర్లు, 10 సిక్స్‌లు) అసాధారణ బ్యాటింగ్‌తో గెలిపించాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన జోన్స్... మూడో వికెట్‌కు ఆండ్రీస్ గౌస్ (46 బంతుల్లో 65; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కలిసి 131 పరుగులు జోడించి విజయాన్ని ఖాయం చేశాడు. ఈ క్రమంలో ఆరోన్ 22 బంతుల్లో, గౌస్ 39 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. 16వ ఓవర్లో 173 పరుగుల వద్ద ఆండ్రీస్ నిష్క్రమించగా... మరో రెండు ఓవర్లలోనే కోరె అండర్సన్ (3 నాటౌట్)తో కలిసి ఆరోన్ జోన్స్ 14 బంతులు మిగిలుండగానే అమెరికాను గెలిపించాడు. అమెరికా తమ తదుపరి మ్యాచ్‌లో ఈనెల 6న పాకిస్తాన్ జట్టుతో, కెనడా తమ తదుపరి మ్యాచ్‌లో ఈనెల 7న ఐర్లాండ్‌తో ఆడతాయి.


ఆండ్రీస్ గౌస్

**టి20 ప్రపంచకప్‌లో నేడు**

నమీబియా X ఒమన్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; ఉదయం గం. 6 నుంచి

శ్రీలంక X దక్షిణాఫ్రికా
వేదిక: న్యూయార్క్; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం





**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# విద్య, ఉద్యోగ సమాచారం

### డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో పశ్చిమ గోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం.. 2024–25 విద్యా సంవత్సరానికి యూనివర్సిటీతోపాటు అనుబంధ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 500

**కోర్సు వివరాలు**

» డిప్లొమా ఇన్ హార్టికల్చర్: 480 సీట్లు (ప్రభుత్వ-200, అనుబంధ-280).
» డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ఫుడ్ ప్రాసెసింగ్: 20 సీట్లు (ప్రభుత్వ).
» కోర్సు కాలవ్యవధి: రెండేళ్లు
» అర్హత: పదో తరగతిలో ఉత్తీర్ణతసాధించాలి
» వయసు: 31.08.2024 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక ప్రక్రియ: పదో తరగతి మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఉంటుంది.

**ముఖ్య సమాచారం**

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 25.05.2024
» ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది: 18.06.2024
» వెబ్‌సైట్: https://drysrhu.ap.gov.in/home.html

### నల్సార్ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా.. 2024–25 విద్యా సంవత్సరానికి ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

**ప్రోగ్రామ్ వివరాలు**

» ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్ (ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకప్టసీ లాస్).
» కోర్సు వ్యవధి: రెండేళ్ల ఫుల్‌టైం ప్రోగ్రామ్
» మొత్తం సీట్ల సంఖ్య: 19
» అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక ప్రక్రియ: ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**ముఖ్యసమాచారం**

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 15.06.2024
» హాల్‌టికెట్ డౌన్‌లోడింగ్ ప్రారంభం:20.06.2024
» ప్రవేశ పరీక్ష తేదీ: 23.06.2024
» ఇంటర్వ్యూ తేదీ(ఆన్‌లైన్): 24.06.2024
» వెబ్‌సైట్: https://apply.nalsar.ac.in/llmiblapplicationform

### నల్సార్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా.. 2024–25 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» ప్రోగ్రామ్ వివరాలు: పీహెచ్‌డీ (విభాగాలు: లా, సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్)
» మొత్తం సీట్ల సంఖ్య: 15
» అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీ లేదా కంపెనీ సెక్రటరీ ఎగ్జామ్/ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు.

**ముఖ్యసమాచారం**

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 14.07.2024
» ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష తేదీ: 20.07.2024
» వెబ్‌సైట్: https://apply.nalsar.ac.in/phdapplicationform

### కేంద్ర శాఖల్లో 312 ఉద్యోగాలు

దేశవ్యాప్తంగా వివిధ కేంద్ర విభాగాలు/శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 312 పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 312

**పోస్టుల వివరాలు**

» డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియలాజికల్ కెమిస్ట్: 4 పోస్టులు
» డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్: 67 పోస్టులు
» సివిల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీసర్: 4 పోస్టులు
» స్పెషలిస్ట్ గ్రేడ్-3 అసిస్టెంట్ ప్రొఫెసర్: 132 పోస్టులు »స్పెషలిస్ట్ గ్రేడ్-3: 35 పోస్టులు
» డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్: 09 పోస్టులు
» అసిస్టెంట్ డైరెక్టర్: 04 పోస్టులు
» అసిస్టెంట్ డైరెక్టర్ గ్రేడ్-2: 46 పోస్టులు
» ఇంజనీర్, షిప్ సర్వేయర్ కం డిప్యూటీ డైరెక్టర్ జనరల్: 02 పోస్టులు
» ట్రైనింగ్ ఆఫీసర్: 08 పోస్టులు
» అసిస్టెంట్ ప్రొఫెసర్: 01 పోస్టులు
» అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 13.06.2024
» వెబ్‌సైట్: https://upsc.gov.in

# వాయు సేనలో ఆఫీసర్ కొలువు

» ఏఎఫ్‌క్యాట్ (2)-2024 నోటిఫికేషన్ విడుదల
» ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ ఆఫీసర్ జాబ్స్
» ఏఎఫ్‌క్యాట్, ఏఎఫ్‌ఎస్‌బీతో నియామకం
» ప్రారంభ వేతన శ్రేణి రూ.56,100–రూ.1,77,500

**త్రివిధ దళాల్లో ఉన్నత స్థాయి కెరీర్ కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్‌క్యాట్)కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఎయిర్‌ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీ, ఫ్లయింగ్ బ్రాంచ్‌లలో.. ఆఫీసర్ కొలువు సొంతం చేసుకోవచ్చు. ప్రారంభంలోనే పే లెవల్-10తో వేతనం పొందే అవకాశం లభిస్తుంది! ఈ నేపథ్యంలో.. ఏఎఫ్‌క్యాట్ (2)/2024 ద్వారా భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..**


ఏఎఫ్‌క్యాట్(2)-2024

ఎయిర్‌ఫోర్స్‌లోని పలు విభాగాల్లో (గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, నాన్-టెక్నికల్, ఫ్లయింగ్ బ్రాంచ్)లలో ఉన్నత పోస్టుల భర్తీ కోసం ఎయిర్‌ఫోర్స్ సొంతంగా నియామక ప్రక్రియ చేపడుతోంది. ఇందు కోసం ముందుగా నిర్వహించే రాత పరీక్షనే ఏఎఫ్‌క్యాట్ అంటారు. సాధారణంగా ఎయిర్‌ఫోర్స్‌లో ఖాళీలను ఎన్‌డీఏ, సీడీఎస్‌ఈల ద్వారా భర్తీ చేస్తారు. వీటికి అదనంగా ఏఎఫ్‌క్యాట్ విధానంలోనూ పోస్టుల భర్తీ చేపడుతున్నారు. దీంతో ఎన్‌డీఏ, సీడీఎస్‌ఈ ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోలేని వారికి ఇది మరో చక్కటి మార్గంగా నిలుస్తోంది.

**ఏటా రెండుసార్లు**

ఏఎఫ్‌క్యాట్‌ను ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు. తాజాగా 2024కు సంబంధించి రెండో దశ నోటిఫికేషన్ (2/2024) విడుదలైంది. ఇందులో విజయం సాధించినవారికి 2025 జూలై నుంచి శిక్షణ తరగతులు ఉంటాయి.

**మొత్తం 304 పోస్టులు**

ఏఎఫ్‌క్యాట్ (2)–2024 ద్వారా మొత్తం 304 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో ఎఎఫ్‌క్యాట్ ఎంట్రీ ద్వారా ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్, అలాగే ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ ఫ్లయింగ్ ఆఫీసర్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు.

**ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ**

ఏఎఫ్‌క్యాట్‌లో భాగంగానే ఫ్లయింగ్ బ్రాంచ్‌లో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్‌లో పేర్కొన్న ఖాళీలు, అదే విధంగా ఏఎఫ్‌క్యాట్‌లో పేర్కొన్న సీట్లకు పది శాతం చొప్పున ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌కు కేటాయిస్తారు. ఈ విధానంలో దరఖాస్తు చేసుకోవాలంటే.. ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ విభాగంలో 'సి' సర్టిఫికెట్ పొంది ఉండాలి.

**అర్హతలు**

ఆయా పోస్టులను అనుసరించి ఇంటర్మీడియెట్ (మ్యాథ్స్, ఫిజిక్స్), సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, నిర్దేశిత బ్రాంచ్‌లలో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్,బీఎస్సీ, బీబీఏ/బీబీఎం/సీఎఫ్‌ఏ/పీజీ తదితర అర్హతలు ఉండాలి.

**వయసు**

- ఫ్లయింగ్ బ్రాంచ్: జూలై 1, 2025 నాటికి 20–24 ఏళ్లు ఉండాలి.
- ఫ్లయింగ్ బ్రాంచ్‌కు సంబంధించి కమర్షియల్ పైలట్ లైసెన్స్ కలిగి ఉన్న వారికి గరిష్ట వయోపరిమితిలో రెండేళ్ల సడలింపు లభిస్తుంది.
- గ్రౌండ్ డ్యూటీ: జూలై 1, 2025 నాటికి 20–26 ఏళ్లు ఉండాలి.
- అన్ని విభాగాలకు అవివాహితులు మాత్రమే అర్హులు.

**ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్(ఫ్లయింగ్ బ్యాచ్)**

ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సీనియర్ డివిజన్ 'సి' సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు అందుబాటులో ఉన్న అవకాశం ఇది. ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తోపాటు కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉండాలి. ఇంటర్‌లో(మ్యాథ్స్, ఫిజిక్స్) కనీసం 60 శాతం మార్కులు సాధించాలి.

**ఏఎఫ్‌క్యాట్‌తోపాటు ఏఎఫ్‌ఎస్‌బీ**

ఎయిర్ ఫోర్స్‌లో పలు విభాగాల్లో పోస్టుల భర్తీకి చేపట్టే ఎంపిక ప్రక్రియలో భాగంగా ముందుగా ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికి మలి దశలో ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డ్ (ఏఎఫ్‌ఎస్‌బీ) పరిధిలో తుది దశ ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

**300 మార్కులకు ఏఎఫ్‌క్యాట్**

ఏఎఫ్‌క్యాట్ పరీక్ష మొత్తం నాలుగు విభాగాల్లో (జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ వెర్బల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్) 100 ప్రశ్నలు–300 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షకు నిర్దేశించిన సమయం రెండు గంటలు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

**ఏఎఫ్‌ఎస్‌బీ**

- ఎంపిక ప్రక్రియలో తొలిదశ ఏఎఫ్‌క్యాట్‌లో అర్హత సాధించిన వారికి రెండో దశలో ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో ఏఎఫ్‌ఎస్‌బీ టెస్టింగ్ నిర్వహిస్తారు. ఈ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడంచెల్లో ఉంటుంది. ఆ వివరాలు..
- తొలి దశ.. స్టేజ్–1: ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్ నిర్వహిస్తారు.
- రెండో దశ.. స్టేజ్–2:ఇందులో సైకలాజికల్ టెస్ట్ ఉంటుంది.ఇందులో భాగంగా అయిదు రోజుల పాటు పలు అంశాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. అదే విధంగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది.
- ఫ్లయింగ్ బ్రాంచ్ అభ్యర్థులకు ప్రత్యేకంగా కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్(సీపీఎస్‌ఎస్) విధానంలో మరో పరీక్ష కూడా నిర్వహిస్తారు.
- ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ 'సి' సర్టిఫికెట్ ద్వారా ఎన్‌సీసీ ఎంట్రీకి దరఖాస్తు చేసుకున్న వారికి ఏఎఫ్‌క్యాట్ నుంచి మినహాయింపు ఉంటుంది.
- రెండు దశల్లోనూ విజయం సాధించి తుది విజేతల జాబితాలో నిలిచిన వారిని శిక్షణకు ఎంపిక చేస్తారు.

**74, 52 వారాల శిక్షణ**

- తుది విజేతలుగా నిలిచిన వారికి ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (హైదరాబాద్)లో శిక్షణనిస్తారు. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ–టెక్నికల్ విభాగాలకు ఎంపికైన వారికి 74 వారాలు, గ్రౌండ్ డ్యూటీ (నాన్–టెక్నికల్) బ్రాంచ్‌లకు 52 వారాల పాటు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి సంబంధిత విభాగాల్లో ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా కొలువు ఖరారు అవుతుంది.

**ప్రారంభ వేతనం**

ఎంపికైన వారికి ప్రారంభంలో నెలకు రూ.56,100–రూ.1,77,500 వేతన శ్రేణి అందుతుంది. శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్ ఇస్తారు. ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికైన వారికి షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పదేళ్ల పాటు విధులు నిర్వర్తించే అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత ఆసక్తి, ప్రతిభను అనుసరించి మరో నాలుగేళ్లపాటు పొడిగించుకునే అవకాశం ఉంటుంది. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో మొత్తం 14 ఏళ్లు పూర్తి చేసుకున్న తర్వాత పర్మనెంట్ కమిషన్ హోదా పొందే అవకాశాన్ని కూడా ఎయిర్‌ఫోర్స్ కల్పిస్తోంది.

**ముఖ్య సమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 30.05.2024
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జూన్ 28
- ఏఎఫ్‌క్యాట్ పరీక్ష తేదీలు: 2024, ఆగస్టు 9, 10, 11 తేదీల్లో
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://afcat.cdac.in

### రాత పరీక్షలో రాణించేలా

ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ కొలువులకు అవకాశం కల్పించే ఏఎఫ్‌క్యాట్‌లో రాణించడానికి సిలబస్ అంశాలపై పూర్తి పట్టు సాధించాలి. ముఖ్యంగా ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్ అండ్ మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్ అంశాలను అధ్యయనం చేయడంతోపాటు ప్రాక్టీస్ చేయాలి.

**ఇంగ్లిష్**

ఈ విభాగంలో స్కోర్ కోసం కాంప్రహెన్షన్, ఇంగ్లిష్ గ్రామర్, సెంటెన్స్ కంప్లీషన్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్, యాంటానిమ్స్, సినానిమ్స్, క్లోజ్ టెస్ట్, ఇడియమ్స్, ఫ్రేజెస్, అనాలజీ, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై దృష్టి పెట్టాలి.

**జనరల్ అవేర్‌నెస్**

చరిత్ర, జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీలతోపాటు జాతీయ, అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న అంశాలు, సంఘటనలు, సైన్స్ అండ్ టెక్నాలజీ తాజా పరిణామాలు, రక్షణ రంగంలోని పరిణామాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

**న్యూమరికల్ ఎబిలిటీ**

టైమ్ అండ్ వర్క్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్, సింపుల్ అండ్, కాంపౌండ్ ఇంట్రస్ట్, టైమ్ అండ్ డిస్టెన్స్, నంబర్ సిరీస్, పెరిమీటర్, ఏరియా, ప్రాబబిలిటీ అంశాలపై అవగాహన పొందాలి.

**రీజనింగ్, మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్**

ఇందులో మంచి స్కోర్ కోసం వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలతోపాటు.. సీటింగ్ అరేంజ్‌మెంట్, రొటేటెడ్ బ్లాక్స్, హిడెన్ ఫిగర్స్, అనాలజీపై అవగాహన పెంచుకోవాలి.

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 76 | 42 |
| 73,961 | 22,531 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 16,735 | ▽ | 2 |
| డోజోన్స్ | 38,686 | ▲ | 575 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,275 | ▲ | 44 |
| డాక్స్ | 18,498 | ▲ | 1 |
| షాంఘై | 3,087 | ▽ | 5 |
| నికాయ్ | 38,488 | ▲ | 434 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 82.85 | 83.87 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 104.76 | 107.31 |
| € | యూరో | ఎస్‌బీఐ | 89.01 | 91.37 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 52.39 | 53.55 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 54.23 | 56.17 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 59.59 | 63.56 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.34 | 22.88 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.81 | 23.58 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.36 | 12.36 |

# బఫెట్ సంపద రహస్యం అదే

తెలెండరీ హెడ్జ్ ఫండ్ మేనేజర్ జిమ్ సిమన్స్ సంపద విలువ 31.4 బిలియన్ డాలర్లు. విఖ్యాత ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ నెట్‌వర్త్ 139 బిలియన్ డాలర్లు. బఫెట్ కంటే సిమన్స్ సంపద 77 శాతం తక్కువ. వీరిద్దరి మధ్యనున్న సూక్ష్మ వైరుధ్యాన్ని ప్రతి ఇన్వెస్టర్ తప్పకుండా తెలుసుకోవాలి. జిమ్ సిమన్స్ స్థాపించిన హెడ్జ్ ఫండ్ 'రెనైసెన్స్ టెక్నాలజీస్' ఒకటి రెండేళ్లు కాదు.. 1988 నుంచి ఏటా 66 శాతం చొప్పున, నిరంతరాయంగా మూడు దశాబ్దాలకు పైనే ఇన్వెస్టర్లకు పెట్టుబడులపై ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది. అదే వారెన్ బఫెట్ స్థాపించిన బెర్క్‌షేర్ హాథవే ఏటా 19.8 శాతం కాంపౌండింగ్ వృద్ధినే నమోదు చేసింది. సిమన్స్ కంటే బఫెట్ సంపదే నాలుగు రెట్లు అధికం. ఏటా ఎంత అధికంగా రాబడి తెచ్చుకున్నారనే దానికంటే.. ఎంత ముందుగా పెట్టుబడులు మొదలు పెట్టారు, వాటిని ఎంత కాలం పాటు కొనసాగించారు? అన్నవే సంపదను నిర్ణయిస్తాయని సిమన్స్–బఫెట్ జర్నీ చెబుతోంది. అందుకే ప్రతి ఒక్కరూ వీలైనంత ముందుగా ఇన్వెస్ట్‌మెంట్ ఆరంభించి, దీర్ఘకాలం పాటు కొనసాగించినప్పుడే కాంపౌండింగ్ ప్రయోజనాన్ని గరిష్టంగా అందుకోగలరు.

## ముందుగా పెట్టుబడులు ఆరంభించాలి

- కాంపౌండింగ్‌తో దీర్ఘకాలంలో గొప్ప రాబడి
- స్వల్ప మొత్తమే అయినా చెప్పుకో తగినంత నిధి
- బఫెట్–జిమ్ సిమన్స్ మధ్య వైరుధ్యమే అది





### ఏటా 12 శాతం రాబడి

సంపద సృష్టించాలనుకునే ప్రతి ఒక్కరూ ముందుగా చేయాల్సిన పని.. సంపాదనను తీసుకెళ్లి వృద్ధి చెందే చోట పెట్టడం. ఎంత ముందుగా ఆరంభిస్తే, దీర్ఘ కాలంలో అంత అధికంగా ప్రయోజనం పొందొచ్చు. బఫెట్ పెట్టుబడుల ప్రయాణాన్ని గమనించినా ఇదే బోధపడుతుంది. ముందుగా మొదలు పెట్టడం వల్ల అప్పుడు కాంపౌండింగ్ ప్రయోజనం గరిష్ఠ స్థాయిలో పొందడానికి కావాల్సినంత వ్యవధి ఉంటుంది. 25 ఏళ్ల మహిమ ప్రతి నెలా రూ.1,000 చొప్పున తనకు 50 ఏళ్లు వచ్చే వరకు.. అంటే 25 ఏళ్లపాటు ఇన్వెస్ట్ చేసిందని అనుకుందాం. అప్పుడు 25 ఏళ్లలో మహిమ అసలు పెట్టుబడి రూ.3 లక్షలు అవుతుంది. ఏటా 12 శాతం రాబడి (ఈక్విటీలలో దీర్ఘకాల సగటు) అంచనా ప్రకారం సమకూరే మొత్తం రూ.18 లక్షలు. కేవలం వెయ్యి రూపాయలే.. 25 ఏళ్లలో రూ.18 లక్షలుగా మారడం కాంపౌండింగ్ వల్లే. ఇలా కాకుండా మహిమ కేసులో కాంపౌండింగ్ ప్రయోజనం తీసేసి చూస్తే.. అంటే అసలుతోపాటు, దానిపై వచ్చిన వడ్డీని ఇన్వెస్ట్ చేయకుండా ఉంటే సమకూరే మొత్తం రూ.7.5 లక్షలుగానే ఉండేది. మొత్తం రూ.18 లక్షల్లో మిగిలిన రూ.10.5 లక్షలు కేవలం కాంపౌండింగ్ వల్లే సమకూరినట్టు అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ పెట్టుబడికి ఇప్పుడేం తొందరొచ్చింది లే.. తర్వాత చూద్దామనుకుని, మహిమ పదేళ్లు ఆలస్యంగా తన 35వ ఏట నుంచి ఇన్వెస్ట్ చేయడం మొదలు పెట్టి ఉంటే ఏమయ్యేది? పైన చెప్పుకున్నట్టు 50 ఏళ్ల వయసుకు రూ.18 లక్షలు రావాలంటే అప్పటి నుంచి 15 ఏళ్ల పాటు ప్రతి నెలా ఆమె రూ.1,700 ఇన్వెస్ట్ చేయాల్సిందే. పదేళ్లు వృథా చేయడం వల్ల 70 శాతం అదనపు పెట్టుబడి అవసరం అవుతుందని ఇక్కడి ఉదాహరణ చెబుతోంది. పెట్టుబడి విషయంలో కాలం వృథా అవుతున్న కొద్దీ కాంపౌండింగ్ ప్రయోజనం అదే స్థాయిలో కోల్పోతారు.

### కాంపౌండింగ్



పెట్టుబడిపై వడ్డీ వస్తుందని తెలుసు. దీన్ని వడ్డీ రాబడిగా చెబుతారు. ఈ వడ్డీ కూడా తిరిగి పెట్టుబడిగా మారి దానిపైనా వడ్డీ సమకూరడమే కాంపౌండింగ్. దీన్నే చక్రవడ్డీ అని కూడా చెబుతారు. బ్యాంకులో వ్యక్తిగత రుణం, బంగారంపై రుణం తీసుకున్నప్పుడు ప్రతి నెలా వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఏదైనా కారణంతో ఒక నెల ఈఎంఐ చెల్లించడంలో విఫలమై, మరుసటి నెలలో చెల్లిస్తున్నప్పుడు నెల బకాయిపై వడ్డీని కూడా బ్యాంక్ రాబడుతుంది. దీన్నే వడ్డీ మీద వడ్డీగా చెబుతారు. రూ.100 ఇన్వెస్ట్ చేస్తే 10 శాతం రాబడి ప్రకారం ఏడాది తర్వాత రూ.110గా మారుతుంది. ఇందులో రూ.10 వడ్డీ రూపంలో సమకూరింది. రెండో ఏడాది రూ.110 కాస్తా రూ.121గా మారుతుంది. మొదటి ఏడాది వడ్డీ రూ.10పైనా రెండో ఏడాది రూపాయి వడ్డీ వచ్చినట్టు. ఇలా వడ్డీపై వడ్డీ రాబడి జమవుతుంది కనుకనే దీర్ఘకాలంలో భారీ మొత్తం సమకూరుతుంది.

## బఫెట్ పంచ సూత్రాలు

- పెట్టుబడుల విషయంలో దీర్ఘకాల దృష్టి ఉండాలి. అవసరమైతే ఎప్పటికీ కొనసాగించాలి.
- పెట్టుబడుల్లో ఉండే రిస్క్ తెలుసుకోవాలి. మీరు ఏం చేస్తున్నారో తెలియనప్పుడే రిస్క్ ఎదురవుతుంది.
- నాణ్యత విషయంలో రాజీ పడొద్దు. ఇక్కడ పరిమాణం కంటే నాణ్యత ముఖ్యం. మంచి కంపెనీని అద్భుతమైన ధరలో (చాలా ఖరీదైన వ్యాల్యుయేషన్‌లో) కొనడం కంటే.. అద్భుతమైన కంపెనీని సరసమైన ధరలో కొనుక్కోవాలి.
- వ్యాపారంపై పెట్టుబడి పెడుతున్నారు. అసాధారణ యాజమాన్యం, అద్భుతమైన వ్యాపారంతో ఉంటే ఆ కంపెనీలో మీరు పెట్టే పెట్టుబడి కాల వ్యవధి జీవితకాలంగానే భావించాలి.
- ఈక్విటీ మార్కెట్లో ఓపిక ఉన్నవారికే అధిక రాబడులు సొంతమవుతాయి. దూకుడైన ఇన్వెస్టర్ నుంచి ఓపికగా వేచి చూసే ఇన్వెస్టర్‌కు సంపదను బదిలీ చేసే విధంగా స్టాక్ మార్కెట్ పనితీరు ఉంటుంది.

### పెట్టుబడుల జర్నీ..



బఫెట్ ప్రస్తుత వయసు 90 ఏళ్లు. ఆయన సంపద విలువ 139 బిలియన్ డాలర్లు. నిజానికి బఫెట్ సంపదలో 99 శాతం ఆయనకు 65 ఏళ్లు వచ్చిన తర్వాత సమకూరిందేనని ప్రముఖ రచయిత మోర్గాన్ హౌసెల్ 'ద సైకాలజీ ఆఫ్ మనీ' అనే పుస్తకంలో పేర్కొన్నారు. ఒకవేళ బఫెట్ 65 ఏళ్లకే రిటైర్ అయి ఉంటే నేడు ఆయన గురించి అంతగా మాట్లాడుకునే వాళ్లం కాదని ఓ ఇంటర్వ్యూలో భాగంగా హౌసెల్ పేర్కొన్నారు. బఫెట్ 30 ఏళ్ల వయసులో పెట్టుబడులు మొదలు పెట్టి, 60 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకున్నాడన్నది చాలా మంది ఇన్వెస్టర్లకు తెలిసిన విషయం. కానీ, నిజానికి బఫెట్ 10 ఏళ్ల వయసులోనే పెట్టుబడి ఆరంభించారు. 30 ఏళ్ల నాటికి ఆయన 9.3 మిలియన్ డాలర్లు సమకూర్చుకున్నారు. వెనక్కి తీసుకోకుండా అలాగే జీవితకాలం పాటు కొనసాగించారు. సంపాదిస్తున్న మొత్తంలో కనీస అవసరాలకే తప్ప ఎప్పుడూ లగ్జరీ వ్యయాలకు పోలేదు. వీలైనంత పెట్టుబడి పెట్టడమే ఆయన చేసిన పని. నిజానికి దీన్నే బఫెట్ స్కిల్ (నైపుణ్యం)గా హౌసెల్ అభివర్ణిస్తారు. ఏటా 20 శాతం చొప్పున బఫెట్ సంపద కాంపౌండ్ అయింది. జిమ్ సిమన్స్ 1988 నుంచి పెట్టుబడులు ఏటా 66 శాతం చొప్పున వృద్ధి చెందేంత గొప్ప వ్యూహాలు అమలు చేసినప్పటికీ.. తక్కువ సంపద కలిగి ఉండడానికి కారణం పెట్టుబడుల ప్రపంచంలోకి ఆలస్యంగా ప్రవేశించడమే. నిజానికి సిమన్స్ వార్షిక రాబడి 66 శాతంలో బఫెట్ వార్షిక రాబడి మూడింట ఒక వంతే. బఫెట్ ఎంతో ముందుగా మొదలు పెట్టడం వల్ల కాంపౌండింతో ఎక్కువ సంపద సమకూరింది. ప్రపంచంలో మరెవరికీ సాధ్యం కానంత వార్షిక రాబడులను సిమన్స్ తెచ్చుకున్నా కానీ, ఆస్తుల్లో బఫెట్ కంటే దిగువన ఉండడానికి కారణం 50 ఏళ్లు వచ్చిన తర్వాతే తన ఇన్వెస్ట్‌మెంట్ జర్నీ ఆరంభించడం. అందుకే ప్రతి ఇన్వెస్టర్ ముందుగా పెట్టుబడులు మొదలు పెట్టి, ఎక్కువ కాలం పాటు కొనసాగించడం ఆచరించాలని బఫెట్ విజయ గాథ తెలియజేస్తోంది. బఫెట్ మాదిరే సిమన్స్ కూడా 70 ఏళ్ల పాటు ఏటా 66 శాతం చొప్పున రాబడులు తెచ్చుకుని ఉంటే.. ఆ మొత్తం కొన్ని వందల రెట్లు అధికంగా ఉంటుంది.

## జిమ్ సిమన్స్ ఏమి చెప్పారంటే..?

- ఒక గొప్ప సిద్ధాంతం అందంగా ఎలా ఉంటుందో.. గొప్పగా, సమర్థవంతంగా పనిచేసే కంపెనీ కూడా అంతే అందంగా ఉంటుంది.
- వీలైనంత వరకు మీ చుట్టూ తెలివైన, ఉత్తమమైన వ్యక్తులు ఉండేలా చూసుకోవాలి. వారు మీకంటే తెలివైన వారు అయితే ఇంకా మంచిది.
- ఏదో ఒకటి వాస్తవికంగా చేయండి. మిగిలిన వారిని అనుసరించొద్దు. ఒకే సమస్యను పరిష్కరించేందుకు ఎక్కువ మంది ప్రయత్నిస్తుంటే మీరు దాన్ని చేయొద్దు.
- అంత సులభంగా వదిలేసుకోవద్దు. దానికే కట్టుబడి ఉండాలి. అలా అని శాశ్వతంగా కాదు. కానీ, ఫలితమిచ్చేంత సమయం దానికి ఇవ్వాలి.
- చివరిగా అదృష్టం కలసిరావాలి. ఇది చాలా ముఖ్యమైన సూత్రం.
- జేమ్స్ హారిస్ సిమన్స్ (జిమ్ సిమన్స్) గణితంలో దిట్ట. తనకున్న అసాధారణ ప్రతిభతో మార్కెట్ల తీరును కచ్చితంగా అంచనా వేసి, పెట్టుబడులపై అధిక ప్రతిఫలం పొందే దిశగా ఆయన అమలు చేసిన విధానాలు అద్భుత ఫలితాలను ఇచ్చాయి. 1980లోనే క్వాంట్ ఇన్వెస్టింగ్ విధానాన్ని ఆవిష్కరించి బఫెట్, జార్జ్ సోరోస్ వంటి దిగ్గజ ఇన్వెస్టర్లను అధిగమించారు.




## రిలయన్స్ పర్సనల్ యాక్సిడెంట్ 360 షీల్డ్ పాలసీ




రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ తాజాగా రిలయన్స్ పర్సనల్ యాక్సిడెంట్ 360షీల్డ్ పాలసీని ఆవిష్కరించింది. ప్రమాదంపరంగానే కాకుండా ఆ తర్వాత ఎదురయ్యే ఆర్థిక పరిణామాల నుంచి పాలసీదారుకు, వారి కుటుంబానికి భద్రత కల్పించేందుకు ఇది తోడ్పడుతుంది. చికిత్స వ్యయాలు, అలాగే ఆ సమయంలో పాలసీదార్లకు గృహ, వాహన, విద్యా రుణాల ఈఎంఐలు మొదలైన బాధ్యతలేమైనా ఉంటే వాటికి కూడా కవరేజీని ఇవ్వడంతో పాటు లీగల్ అసిస్టెన్స్‌లాంటివి సైతం ఏర్పాటు చేసే విధంగా ఇది సమగ్రంగా ఉంటుంది. తద్వారా కష్ట సమయంలో పాలసీదారుల కుటుంబం ఆర్థికంగా ఒత్తిడికి లోను కాకుండా ఈ పాలసీ తోడ్పడుతుంది. రూ. 5 లక్షల నుంచి రూ. 25 కోట్ల వరకు కవరేజీ తీసుకోవచ్చు. అడ్వెంచర్ స్పోర్ట్స్ కవరేజీ వంటి యాడ్–ఆన్ ఫీచర్లను కూడా తీసుకోవచ్చు.

### కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

| 3-6-2024 | |
|---|---|
| విశాఖ | 500–00 |
| చిత్తూరు | 563–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 485–00 |
| విజయవాడ | 490–00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| హైదరాబాద్ | 505–00 |
| వరంగల్ | 507–00 |
| రిటైల్ ధర | 5.65 |

## ఫండ్ స్ట్రీట్

### బరోడా బీఎన్‌పీ పారిబా నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్

బరోడా బీఎన్‌పీ పారిబా మ్యుచువల్ ఫండ్ తాజాగా దీర్ఘకాలానికి నిఫ్టీ బ్యాంక్ ఈటీఎఫ్‌ను ఆవిష్కరించింది. సరళంగా, తక్కువ వ్యయాలతో దేశీ బ్యాంకింగ్ రంగంలో ఇన్వెస్ట్ చేసేందుకు ఇది ఉపయోగపడగలదని సంస్థ సీఈవో సురేష్ సోనీ తెలిపారు. నిఫ్టీ బ్యాంక్ టోటల్ రిట ర్న్ ఇండెక్స్ పనితీరును ఈ ఫండ్ ప్రతిబింబించేదిగా ఉంటుంది. ఇందులో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. 95–100 శాతం నిధులను నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్‌లోని ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తారు.

### మహీంద్రా మాన్యులైఫ్ మాన్యుఫాక్చరింగ్ ఫండ్..

మహీంద్రా మాన్యులైఫ్ మ్యుచువల్ ఫండ్ కొత్తగా మాన్యుఫాక్చరింగ్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జూన్ 14తో ముగుస్తుంది. దీని ద్వారా సేకరించిన నిధుల్లో 80–100 శాతం మొత్తాన్ని వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్‌వ్యాప్తంగా తయారీ రంగ సంస్థల్లో ఇన్వెస్ట్ చేస్తారు. ఎస్అండ్‌పీ బీఎస్‌ఈ ఇండియా మాన్యుఫాక్చరింగ్ ఇండెక్స్‌కి సంబంధించి ఏషియా ఇండెక్స్ రూపొందించే జాబితాలోని 10 పైచిలుకు రంగాల సంస్థలు ఈ పోర్ట్‌ఫోలియోలో ఉంటాయి. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. వీక్లీ, మంత్లీ సిప్‌లకు సంబంధించి కనీస వాయిదా రూ. 500గా ఉంటుంది.

# మార్కెట్లకు ఫలితాల జోష్!

- ఎన్‌డీఏదే విజయం: ఎగ్జిట్ పోల్స్
- శుక్రవారం ఆర్‌బీఐ పాలసీ సమీక్ష
- విదేశీ పెట్టుబడులు, గణాంకాలు కీలకమే
- ఈ వారం ట్రెండ్‌పై స్టాక్ నిపుణులు



**న్యూఢిల్లీ:** ప్రధానంగా సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు జోష్‌నివ్వనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే శనివారం(1న) వెలువడిన ఎగ్జిట్ పోల్స్‌లో అధికార బీజేపీ అధ్యక్షతన ఏర్పాటైన ఎన్‌డీఏ భారీ విజయాన్ని సాధించనున్నట్లు అంచనాలు వెలువడ్డాయి. దీంతో మంగళవారం(4న) వెలువడనున్న లోక్‌సభ ఫలితాలలో తిరిగి బీజేపీ కూటమి అధికారాన్ని అందుకుంటుందన్న అంచనాలు బలపడినట్లు రాజకీయ వర్గాలు తెలియజేశాయి. వరుసగా మూడోసారి భారీ మెజారిటీతో నరేంద్ర మోదీ ప్రధాని పదవిని చేపట్టే వీలున్నట్లు పేర్కొన్నాయి. వెరసి స్టాక్ మార్కెట్లలో ప్రోత్సాహకర సెంటిమెంటుకు తెరలేవనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ ప్రభావంతో నేడు(3న) మార్కెట్లు జోరు చూపే అవకాశమున్నట్లు అభిప్రాయపడ్డారు. అయితే 4న ప్రకటించనున్న వాస్తవిక ఫలితాలు భిన్నంగా వెలువడితే.. మార్కెట్లలో దిద్దుబాటుకూ అవకాశమున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా తెలియజేశారు. కాగా.. గత వారం సెన్సెక్స్ చరిత్రాత్మక గరిష్టం 76,010కు, నిఫ్టీ 23,111కు చేరినప్పటికీ సెన్సెక్స్ 1,449 పాయింట్లు(1.9 శాతం) కోల్పోయి, నిఫ్టీ 426 పాయింట్లు(1.9 శాతం) పతనమై ముగిశాయి. ఈ బాటలో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ సైతం 1.5 శాతం చొప్పున డీలా పడ్డాయి.

**జీడీపీ దన్ను**

గత వారాంతాన వెలువడిన జీడీపీ గణాంకాలు సైతం ఇన్వెస్టర్లకు జోష్‌నివ్వనున్నట్లు స్టాక్ నిపుణులు తెలియజేశారు. గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో ఆర్థిక వ్యవస్థ 7.4 శాతం పురోగతిని సాధించగా.. పూర్తి ఏడాదికి అంచనాలను మించుతూ 8.2 శాతం వృద్ధి చూపింది. ప్రోత్సాహకర ఎగ్జిట్ పోల్స్, జీడీపీ గణాంకాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌ఐఐలు) సైతం కొనుగోళ్లకు ఆసక్తి చూపే వీలున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా తెలియజేశారు. ఎగ్జిట్ పోల్స్ పరిధిలోనే వాస్తవిక ఫలితాలు సైతం వెలువడితే.. రాజకీయ, పాలసీ కొనసాగింపుపై ఇన్వెస్టర్లలో నెలకొన్న ఆందోళనలకు చెక్ పడుతుందని ఎమ్‌కే రీసెర్చ్ నివేదికలో పేర్కొంది.

### రెపో యథాతథం




లోక్‌సభ ఫలితాల తదుపరి దేశీ స్టాక్ మార్కెట్లను శుక్రవారం(7న) వెలువడనున్న ఆర్‌బీఐ పాలసీ సమీక్షా నిర్ణయాలు ప్రభావితం చేయనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. 5న ప్రారంభంకానున్న ఆర్‌బీఐ పాలసీ సమావేశం 7న ముగియనుంది. 2024 ఏప్రిల్‌లో నిర్వహించిన పాలసీ సమీక్షలో ఆర్‌బీఐ కమిటీ వరుసగా ఏడోసారి వడ్డీ రేట్లకు కీలకమైన రెపో రేటును 6.5 శాతం వద్ద స్థిరంగా కొనసాగించేందుకే నిర్ణయించింది. ఇక ఈ వారంలో మే నెలకు తయారీ(3న), సర్వీసెస్ పీఎంఐ(5న) గణాంకాలు వెలువడనున్నాయి. చైనా, యూఎస్ తయారీ, ఉపాధి గణాంకాలు సైతం 3, 5న వెల్లడికానున్నాయి. వీటికితోడు ఎఫ్‌ఐఐల పెట్టుబడుల తీరు, విదేశీ మార్కెట్లలో ముడిచమురు ధరలు, డాలరుతో మారకంలో రూపాయి కదలికలు వంటి అంశాలు సైతం సెంటిమెంటును ప్రభావితం చేయగలవని మార్కెట్ నిపుణులు ప్రస్తావించారు.

## ఆసియా కుబేరుడిగా మళ్లీ అదానీ

- అంబానీని దాటి అగ్రస్థానం
- 111 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలో 11వ ర్యాంకు

**న్యూఢిల్లీ:** ఆసియాలోనే అత్యంత సంపన్నుల జాబితాలో అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ మరోసారి రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీని అధిగమించారు. 111 బిలియన్ డాలర్ల సంపదతో అగ్రస్థానం దక్కించుకున్నారు. అంతర్జాతీయంగా కుబేరుల లిస్టులో 11వ స్థానంలో నిల్చారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ రిపోర్టు ప్రకారం అంబానీ 109 బిలియన్ డాలర్ల సంపదతో అంతర్జాతీయంగా 12వ స్థానంలో ఉన్నారు. అదానీ 2022లోనే ఆసియాలో నంబర్ వన్ సంపన్నుడిగా ఎదిగారు. అంతే కాదు స్వల్ప సమయం పాటు ప్రపంచంలోనే రెండో స్థానంలో నిల్చారు. అయితే, ఆయన గ్రూప్ కంపెనీల ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ ఆరోపించడంతో 2023 జనవరిలో అదానీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ తర్వాత పరిణామాలతో గ్రూప్ సంస్థల షేర్లన్నీ కుదేలై ఏకంగా 150 బిలియన్ డాలర్ల విలువ కరిగిపోయింది. దీంతో ఆసియాలో అత్యంత సంపన్నుడిగా అంబానీ మళ్లీ అగ్రస్థానం దక్కించుకున్నారు. మరోవైపు, ఆరోపణలను దీటుగా ఎదుర్కొని, అదానీ క్రమంగా దిద్దుబాటు చర్యలు తీసుకుంటూ గ్రూప్‌ను మళ్లీ నిలబెట్టుకున్నారు. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 10 గ్రూప్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 17.51 లక్షల కోట్లకు చేరడంతో ఆయన సంపద కూడా పెరిగింది. మొత్తం మీద 2024లో అదానీ నికర విలువ 26.8 బిలియన్ డాలర్లు పెరగ్గా, అంబానీ సంపద 12.7 బిలియన్ డాలర్లు పెరిగింది.



## హోనసా కన్జూమర్ — ఎమ్‌కే గ్లోబల్ — కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ. 440 **టార్గెట్:** రూ. 500

**ఎందుకంటే:** బ్యూటీ, వ్యక్తిగత సంరక్షణ ప్రొడక్టుల కంపెనీ హోనసా కన్జూమర్ దేశీయంగా అమ్మకాల విస్తరణ బాటలో సాగుతోంది. మామాఎర్త్ బ్రాండుతో సుప్రసిద్ధమైన సంస్థ ద డెర్మా కో పేరుతో రెండో లాభదాయక బ్రాండుకు ఊపిరిపోసింది. వార్షికంగా రూ. 500 కోట్లకుపైగా ఆదాయాన్ని ఆర్జిస్తోంది. 2020లో ఏర్పాటైన డెర్మా కో సైన్స్ ఆధారిత ఉత్పత్తులను రూపొందిస్తోంది. ఇందుకు యాక్టివ్ ఇన్‌గ్రెడియంట్స్ తోడ్పాటునిస్తున్నాయి. వెరసి రూ. 2,000 కోట్ల విలువైన మార్కెట్‌ను లీడ్ చేస్తోంది. 20 శాతం మార్కెట్ వాటాతో అగ్రపథాన నిలుస్తోంది. యాక్టివ్ ఇన్‌గ్రెడియంట్స్‌తో విస్తరించిన ప్రొడక్టులకు కనిపిస్తున్న డిమాండ్‌రీత్యా పలు సంప్రదాయ స్టార్టప్ కంపెనీలు ఈ విభాగంలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో మరిన్ని ప్రాంతాలలోకి ఉత్పత్తులు విస్తరించే వీలుంది. తద్వారా మార్కెట్, అమ్మకాలు పుంజుకునే అవకాశముంది. ఈ బాటలో ప్రస్తుతం అత్యధికంగా దృష్టి సారించిన ముఖ సౌందర్యం విభాగం నుంచి కంపెనీలు కేశాలు, కలర్ కాస్మెటిక్స్‌వైపు మళ్లనున్నాయి. విభిన్న కొత్తతరహా ప్రొడక్టులను విడుదల చేయడంపై కసరత్తు చేసే అవకాశముంది. ఇందుకు అనుగుణంగా ఎగ్రిక్యూషన్ పెంచుకుంటున్న డెర్మా కో.. మామాఎర్త్ అనుసరిస్తున్న వ్యూహాల(ప్లేబుక్)ను వినియోగించుకుంటోంది. తద్వారా అమ్మకాలను విస్తరించడంతోపాటు.. లాభదాయకతను సైతం మెరుగుపరచుకుంటోంది. దీంతో మూడేళ్ల కాలం(2023–26)లో డెర్మాకో వార్షికంగా ఆదాయంలో 50 శాతం వృద్ధిని సాధించగలదని భావిస్తున్నాం.




## పటేల్ ఇంజనీరింగ్ — ఐసీఐసీఐ డైరెక్ట్ — కొనొచ్చు

**ప్రస్తుతధర:** రూ. 62 **టార్గెట్:** రూ. 80

**ఎందుకంటే:** టెక్నాలజీ ఆవశ్యకత అధికంగాగల జల విద్యుత్(హైడ్రో పవర్), సొరంగ మార్గాలు, నీటి పారుదల, నీటి సరఫరా, పట్టణ మౌలిక సదుపాయాలు, రవాణా విభాగాలలో ప్రత్యేకత కలిగిన ఈపీసీ కంపెనీ పటేల్ ఇంజనీరింగ్. 2023 డిసెంబర్‌కల్లా కంపెనీ రూ. 19,134 కోట్ల విలువైన ఆర్డర్ బుక్‌ను కలిగి ఉంది. వీటిలో ఎల్–1 కాంట్రాక్టులు సైతం ఉన్నాయి. అంటే 4.3 రెట్లు బుక్ టు బిల్ కంపెనీ సొంతం. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరం(2023–24) ద్వితీయార్ధం(అక్టోబర్–మార్చి)లో ఆర్డర్లు మందగించాయి. దీంతో ఎన్నికల ఫలితాల తదుపరి అంటే ఈ ఏడాది(2024–25) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్) నుంచి తిరిగి కాంట్రాక్టుల జారీ ఊపందుకునే అవకాశముంది. కంపెనీ ఆర్డర్‌బుక్‌లో జల విద్యుత్, టన్నెలింగ్, ఇరిగేషన్ విభాగాలు 93 శాతం వాటాను ఆక్రమిస్తున్నాయి. వెరసి కంపెనీ ఇకపైనా ఆయా విభాగాల నుంచి భారీస్థాయిలో ప్రభుత్వ రంగ కాంట్రాక్టులు పొందే వీలున్నట్లు భావిస్తున్నాం. 19 గిగావాట్ల హెచ్‌ఈపీ ప్రాజెక్టులకు తెరతీసిన అధీకృత కేంద్ర విద్యుత్ సంస్థ(సీఈఏ) వివిధ రాష్ట్రాలలో 20,000 మెగావాట్ల సామర్థ్యానికిపైబడిన పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటు ప్రణాళికల్లో ఉంది. పీఎంకేఎస్‌వై పథకంలో భాగంగా రూ. 93,068 కోట్ల పెట్టుబడులతో కూడిన 2,600 కిలోమీటర్ల పొడవైన 875 సొరంగ మార్గాలను చేపట్టనుంది. వెరసి స్థిరమైన బ్యాలన్స్‌షీట్ కలిగిన కంపెనీ కీలక విభాగాల ద్వారా ఇకపై మరిన్ని కాంట్రాక్టులు దక్కించుకునే వీలుంది. తద్వారా ఆదాయం, నికర లాభాల ఆర్జనకు భరోసా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ షేరు సానుకూలంగా ఉండవచ్చు.




**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే



## ముక్కుతో మూడోసారి..

ఫొటో చూడగానే విషయం కొంత అర్థమై ఉంటుంది. ఈయన పేరు వినోద్ కుమార్ చౌదరి(44). అందరూ టైపింగ్ చేత్తో చేస్తే.. ఈయన ముక్కుతోనూ చేస్తారు. ముక్కుతో అత్యంత వేగంగా ఆల్ఫాబెట్ల(ఏ-జెడ్)ను టైప్ చేయడంలో వినోద్ పేరిట గిన్నిస్ రికార్డు కూడా ఉంది. తాజాగా మరోసారి తన రికార్డును తానే బద్దలు కొట్టారు. 2023లో 27.80 సెకన్లలో ఏ-జెడ్ వరకూ కొట్టి తొలిసారి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కారు. అదే ఏడాది అంతకన్నా తక్కువ సమయంలో(26.73 సెకన్లలో) టైప్ చేసి పాత రికార్డును చెరిపేశారు. ఇప్పుడు ఏ టు జెడ్ వరకూ ప్రతి అక్షరానికి మధ్యలో స్పేస్ ఇస్తూ.. 25.66 సెకన్లలో పని పూర్తి చేసి.. హ్యాట్రిక్ కొట్టారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ యూనివర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వినోద్ టైపింగ్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి పొందారు.

# 'స్మార్ట్'గా దోపిడీ

దేశంలో సైబర్ మోసాలు వణుకు పుట్టిస్తున్నాయి. స్మార్ట్ ఫోన్ల ద్వారా పెరుగుతున్న ఆన్‌లైన్ లావాదేవీలను ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు రూ.కోట్లు కొట్టేస్తున్నారు. కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ నిర్వహించే సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో ఏకంగా 7.40 లక్షల ఫిర్యాదులు నమోదవడం సైబర్ ముప్పు తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ఫిర్యాదుల ప్రకారం రూ.1,750 కోట్లు సైబర్ నేరగాళ్ల దోపిడీకి గురయ్యాయి. ఆన్‌లైన్ పెట్టుబడి మోసం, గేమింగ్ యాప్‌లు, అల్గారిథమ్ మానిప్యులేషన్‌లు, అక్రమ రుణ యాప్‌లు, అశ్లీల వీడియోలతో బెదిరింపులు, ఓటీపీ స్కామ్‌లలో అమాయకులు చిక్కుకుని ఆర్థికంగా నష్టపోతున్నారు. సైబర్ నేరగాళ్లు కాల్ స్పూఫింగ్, ప్రభుత్వ, బ్యాంకు అధికారులుగా నటిస్తూ ఆర్థిక లావాదేవీల వివరాల సేకరణ, ఆన్‌లైన్ టాస్క్‌ల ద్వారా సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశ చూపిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఫలితంగా 2019 నుంచి 2024 వరకు సైబర్ కేసుల్లో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది.

-సాక్షి, అమరావతి



### సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకున్న చాలామంది సైబర్ నేరగాళ్లు ఆగ్నేయాసియా ప్రాంతాల నుంచి మోసాలకు పాల్పడుతున్నారు. పుర్సాట్, కోహ్‌కాంగ్, కంబోడియాలోని సిహనౌక్విల్లే, మయన్మార్‌లోని మైవాడ్డీ, థాయ్‌లాండ్ వంటి ప్రాంతాల నుంచి ఈ ముఠాలు పని చేస్తున్నట్టు తెలుస్తోంది.
- సైబర్ మోసాల కట్టడికి ఐ4సీ.. నాలుగు నెలల్లో దాదాపు 3.25 లక్షల మ్యూల్ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసింది. 5.30 లక్షల సిమ్ కార్డులను బ్లాక్ చేసింది.
- అదనంగా సైబర్ నేరగాళ్ల కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తూ 3,401 సోషల్ మీడియా ఖాతాలు, వాట్సాప్ గ్రూపులను డీయాక్టివేట్ చేసింది.
- గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలను నమ్మొద్దు. సులభంగా డబ్బు సంపాదన, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలంటూ ఇచ్చే అవకాశాలను విశ్వసించవద్దు.
- అధికారిక చానల్స్ ద్వారా ఉద్యోగ ఆఫర్‌లు ప్రామాణికతలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి
- అవసరమైతే తప్ప సురక్షితమైన వెబ్‌సైట్‌లో మాత్రమే సున్నితమైన సమాచారాన్ని పంచుకోవాలి.
- ఏదైనా అనుమానిత సైబర్ స్కామ్ గుర్తిస్తే వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు నివేదించాలి. తక్షణ సహాయం కోసం 1930కి కాల్ చేయాలి.

### మే నెలలో రోజుకు 7 వేల ఫిర్యాదులు

ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) నివేదిక ప్రకారం ఈ ఏడాది మే నెలలో రోజుకు సగటున 7 వేల సైబర్ క్రైమ్ ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇది 2021-2023 మధ్య కాలంతో పోలిస్తే 113.7 శాతం అధికం కావడం ఆందోళన కలిగిస్తోంది. ఫిర్యాదుల్లో 85 శాతం ఆర్థిక ఆన్‌లైన్ మోసానికి సంబంధించినవి కావడం గమనార్హం. ఒక్క 2023లోనే ఐ4సీ డేటా ప్రకారం.. లక్షకుపైగా ఆన్‌లైన్‌లో పెట్టుబడి మోసాలను గుర్తించారు. ఇక డిజిటల్ అరెస్ట్‌ల (వీడియో కాల్స్ స్కామ్‌లు) ఫలితంగా 2024 తొలి నాలుగు నెల ల్లోనే 4,599 కేసులు నమోదవగా.. బాధితులు రూ.120 కోట్ల మేర నష్టపోయారు. 20 వేలకు పైగా ట్రేడింగ్ స్కామ్‌లు నమోదవగా.. సైబర్ నేరగాళ్లు రూ.1,420 కోట్లు కాజేశారు. ఇక 62,687 ఆన్‌లైన్ పెట్టుబడి మోసాల కేసుల్లో రూ.222 కోట్లు, డేటింగ్ యాప్‌ల వలలో 1,725 కేసుల్లో రూ.13.23 కోట్లు సైబర్ మోసాలకు పాల్పడ్డారు.

**గణనీయంగా పెరుగుతున్న సైబర్ మోసాలు**

- జనవరి-ఏప్రిల్ మధ్య దేశంలో అత్యధికంగా 7.40 లక్షల ఫిర్యాదులు
- రూ.1,750 కోట్లకుపైగా ఆర్థిక దోపిడీకి గురైన భారతీయులు
- ఒక్క మే నెలలోనే రోజుకు సగటున 7 వేలకు పైగా సైబర్ క్రైమ్ ఫిర్యాదులు నమోదు
- ఫిర్యాదుల్లో 85 శాతం ఆన్‌లైన్ ఆర్థిక మోసాలే

### సైబర్ ఫిర్యాదుల్లో పెరుగుదల ఇలా..

| | |
|---|---|
| 2019 | 26,049 |
| 2020 | 2,57,777 |
| 2021 | 4,52,414 |
| 2022 | 9,66,790 |
| 2023 | 15,56,218 |
| 2024 | 7,40,957 |

(తొలి నాలుగు నెలల్లోనే)





**ప్రధాన నగరాలు, పట్టణాల్లో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు**

| నగరం/పట్టణం | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| రెంటచింతల | 42.4 | 30.1 |
| విజయవాడ | 36.0 | 28.0 |
| కడప | 38.2 | 25.2 |
| ఏలూరు | 38.0 | 27.0 |
| రాజమహేంద్రవరం | 37.0 | 27.0 |
| విశాఖపట్నం | 33.2 | 27.4 |

# 'నైరుతి' వచ్చేసింది

## రాయలసీమలోకి ప్రవేశించిన రుతుపవనాలు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/యడ్లపాడు/ : నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ముందుగానే ప్రవేశించాయి. ఇవి శనివారం రాత్రి రాయలసీమను తాకినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మరో రెండ్రోజుల్లో అవి రాష్ట్రమంతా శరవేగంగా విస్తరించే అవకాశమున్నట్లు స్పష్టం చేసింది. సాధారణంగా రుతు పవనాలు ఐదో తేదీ తర్వాత రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ముందుగానే ప్రవేశించాయి. దీంతో రాయలసీమలోని అనంతపురం, అనంతరం నెల్లూరు జిల్లాను తాకడంతో ఆయా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఇవి ఒకట్రెండు రోజుల్లో దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తాల్లోకి విస్తరించనున్నాయి. నైరుతి రుతుపవనాలు దూకుడుగా ఉన్నందున రెండు మూడ్రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. అలాగే, పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతాల్లోకి కూడా ఇవి వ్యాపించనున్నట్లు తెలిపింది. ఈ రుతు పవనాలు మధ్య అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, లక్షద్వీప్, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు, నైరుతి బంగాళాఖాతంలోని పలు ప్రాంతాలకు విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు.. దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండడంతో పలుచోట్ల తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. ఇక వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వైఎస్సార్ జిల్లా సిద్దవటంలో అత్యధికంగా 30.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే, అన్నమయ్య జిల్లాల్లోని రాయచోటి, రాజంపేట, కోడూరు, తంబళ్లపల్లి, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో పండ్ల తోటలు దెబ్బతిన్నాయి.



**నేడు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు..**

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సోమవారం అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అలాగే, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం పడేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశు-గొర్రెల కాపరులు చెట్లు, పోల్స్, టవర్స్ కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని సూచించింది. ఆదివారం సా.5 గంటల నాటికి తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో 53.7 మిల్లీమీటర్లు, కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 47.7, చిత్తూరు జిల్లా పుంగనూరులో 33, కాకినాడ జిల్లా గండేపల్లిలో 23.2, అల్లూరి జిల్లా అనంతగిరిలో 22, కాకినాడ జిల్లా పెదపూడిలో 20.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

### పిడుగుపాటుకు నలుగురు మృత్యువాత..

ఆదివారం కురిసిన వర్షాల్లో పిడుగులు పడి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఇద్దరు మత్స్యకారులు.. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో ఇద్దరు రైతులు మృత్యువాత పడ్డారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో పడవలో ఉన్న దుమ్ము పోలిరాజు అనే యువకుడు పిడుగు పడి అక్కడికక్కడే మరణించగా.. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో బోటు తనిఖీకి వెళ్లిన కంబాల ముత్యాలు అనే మరో మత్స్యకారుడు కూడా పిడుగుపడి చనిపోయాడు. ఆదివారం ఉదయం ఉమ్మడి విశాఖ జిల్లాలో గంటకు పైగా ఉరుములు, మెరుపులు, పిడుగులు జనాన్ని భయకంపితులను చేశాయి. మరోవైపు.. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో ఇద్దరు రైతులు కూడా పిడుగులకు బలయ్యారు. పొలాల్ని సాగుకు సిద్ధంచేసుకోవాలని వెళ్లిన పెద్ది చినవీరయ్య (58), చిరుతల శ్రీనివాస రావు (51) పిడుగుపాటుకు గురై మృతిచెందారు. ఉ.5.30 గంటల ప్రాంతంలో పొలానికి వెళ్లిన వీరు అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. దీంతో సమీపంలోని వేప చెట్టు కిందకు వెళ్లగా అప్పుడే పెద్ద శబ్దంతో అదే చెట్టుపై పిడుగు పడింది. ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు.



మృతుడు శ్రీనివాసరావు



మృతుడు పెద్ది చినవీరయ్య

# డెల్టాలో తేనెటీగల పెంపకం

- గోదావరి డెల్టా ఏరియాలో నయా ట్రెండ్
- ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం.. ముందుకు వస్తున్న ఔత్సాహికులు
- గత ఐదేళ్లలో వివిధ జిల్లాల నుంచి 380 మంది వరకు శిక్షణ
- ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై కిట్ల పంపిణీ
- భీమవరం, కోనసీమ ప్రాంతాల్లో 800కు పైగా బాక్సుల ఏర్పాటు

సాక్షి, భీమవరం: ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే తేనెటీగల పెంపకం గోదావరి డెల్టాకు విస్తరిస్తోంది. నయా ట్రెండ్‌గా ఔత్సాహికులు కొబ్బరి, కూరగాయల తోటల్లో వీటిని పెంచుతున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఉద్యాన వన శాఖ అధికారులు ఆసక్తి కలిగిన వారికి శిక్షణతో పాటు వీటి పెంపకాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వ సబ్సిడీలు అందిస్తున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని కోనసీమ, భీమవరం ప్రాంతాల్లో 800కు పైగా బాక్సుల్లో వీటి పెంపకం సాగిస్తున్నారు.

**పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర...**

పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో తేనెటీగల పాత్ర కీలకం. ఆరోగ్యానికి మేలు చేస్తూ అనేక పోషక విలువలు కలిగిన తియ్యని తేనెను అందించడమే కాకుండా పరపరాగ సంపర్కం ద్వారా పంటలకు ఇవి చేసే మేలు అంతా ఇంతా కాదు. తేనె, తేనె ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ పెరుగుతుండటంతో తేనెటీగల పెంపకం లాభసాటి పరిశ్రమగా మారింది. ఉద్యానవన, పండ్ల తోటలున్న విశాఖ మన్యం, ఏజెన్సీ ప్రాంతాల్లో వీటి పెంపకం ఎక్కువగా కనిపిస్తుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న తాడేపల్లిగూడెం, ఏలూరు, రాజమహేంద్రవరం, రంపచోడవరం, తుని, గోకవరం పరిసర ప్రాంతాల్లోనూ రెండు వేలకు పైగా బాక్సుల్లో వీటి పెంపకం చేస్తున్నారు. వరి పండే చోట మాత్రం వీటి సంచారం తక్కువగా ఉంటుంది. ఆ కారణంతోనే గోదావరి డెల్టా ప్రాంతమైన భీమవరం, కోనసీమ ప్రాంతాల్లో తేనెటీగల పెంపకానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు.



బాక్సులోని ఫ్రేకు తేనెపట్టును సిద్ధం చేస్తున్న తేనెటీగలు

**ఔత్సాహికులకు శిక్షణ, ప్రోత్సాహం**

జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని జీవవంతం చేస్తున్న తేనెటీగల మనుగడను పంటల్లో రసాయనిక పురుగు మందుల వినియోగం దారుణంగా దెబ్బతీస్తోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తేనెటీగల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కృషి విజ్ఞాన కేంద్రా(కేవీకే)ల ద్వారా ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్నారు. ఉండిలోని కేవీకే వద్ద గత ఐదేళ్లలో వివిధ జిల్లాలకు చెందిన 380 మందికి తేనెటీగల పెంపకంలో శిక్షణ, అవగాహన కల్పించారు. వీరిలో గోదావరి డెల్టా ప్రాంతానికి చెందిన పలువురు ఔత్సాహికులు ఉన్నారు.



భీమవరం సమీపంలోని కొబ్బరి తోటల్లో తేనెటీగల కాలనీ

**శిక్షణ పొందినవారికి ప్రభుత్వ సబ్సిడీ**

శిక్షణ పొందిన వారికి తేనెటీగల పెంపకం నిమిత్తం సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహం అందిస్తోంది. ఒక తేనెటీగల బాక్స్‌లోని ఎనిమిది అరల్లో 20 వేల నుంచి 40 వేలకు పైగా తేనెటీగలు ఉంటాయి. బాక్స్, ఫీడర్, స్టాండ్ ఒక కిట్ కాగా.. మార్కెట్‌లో దీని విలువ రూ.3200 నుంచి రూ.3800 వరకు ఉంటుంది. ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా ఒక బాక్స్‌కు రూ.1600 సబ్సిడీ అందజేస్తోంది. ఎనిమిది బాక్సులను ఒక తేనెటీగల కాలనీగా పరిగణిస్తూ వీటిని రూ.12,800 అందజేస్తోంది. ఈ విధంగా ఒక్కొక్కరికి 50 బాక్సుల వరకు రూ.80 వేలు సబ్సిడీపై అందిస్తోంది. తేనె సేకరించేందుకు అవసరమైన సామగ్రి విలువ రూ.20 వేల వరకు ఉండగా రూ.8000 సబ్సిడీగా ఇస్తోంది.

**ఔత్సాహికులకు శిక్షణ**



ఇటీవల గోదావరి డెల్టా ప్రాంతంలో తేనెటీగల పెంపకం పెరిగింది. ఔత్సాహికులు ముందుకు వచ్చి శిక్షణ తీసుకుంటున్నారు. ఉండి కేవీకే ఆధ్వర్యంలో గత ఐదేళ్లలో 380 మందికి శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్రభుత్వపరంగా వారికి ప్రోత్సాహం అందిస్తున్నాం.

– డీఆర్ఎం మల్లిఖార్జునరావు, ఉండి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, హెడ్

**గోదావరి డెల్టాలోనూ బాగా పెంచుతున్నారు**



ఇటీవల కాలంలో డెల్టా ప్రాంతమైన భీమవరం, కోనసీమ ప్రాంతాల్లో తేనెటీగల పెంపకం బాగా పెరిగింది. వ్యాపార పరంగా, హాబీగా కొందరు ఔత్సాహికులు ముందుకు వచ్చి వీటిని పెంచుతున్నారు. గత రెండేళ్లలో డెల్టాతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో వెయ్యి వరకు బాక్సులు అందజేశాం.

– ఎంఎస్ రాజు, వశిష్ట హనీ నేచురల్స్, భీమవరం

### కొబ్బరి తోటల్లో తేనెపట్టులు

గోదావరి డెల్టాలోని కొబ్బరి తోటలు, గోదావరి పరీవాహక లంకల్లోని కూరగాయలు, పూల తోటలు తేనెటీగల పెంపకానికి అనువుగా ఉండటంతో ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ సబ్సిడీతో కొందరు వ్యాపారాత్మక ధోరణిలోను, మరికొందరు సరదాగా పెంచుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఉద్యానవన శాఖ లెక్కల ప్రకారం భీమవరం, పాలకొల్లు, వీరవాసరం, పోడూరు, నరసాపురం, కోనసీమలోని అయినవిల్లి, పి.గన్నవరం మండలాల్లో 800కు పైగా బాక్సుల్లో వీటిని పెంచుతున్నట్టు అంచనా. వీరిలో ప్రభుత్వ సబ్సిడీతో పెంచుతున్నవారు ఎక్కువమంది ఉన్నారు. ఒక్కో తేనె బాటిల్ కిలో రూ.450 నుంచి రూ.500కు విక్రయిస్తున్నారు. తేనెటీగలు సేకరించే పుప్పొడిని కూడా వేరు చేసి విక్రయిస్తారు. దీనిలో హై ప్రొటీన్ ఉండటంతో కిలో రూ.2000 వరకు వస్తుంది. సీజన్‌ను బట్టి కొబ్బరి తోటలు, కూరగాయలు, పూల తోటల్లో ఉంచి అన్ సీజన్‌లో వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి పెంచుతుంటారు. ఏడాది క్రితం కేవీకేలో శిక్షణ తీసుకుని 30 బాక్సుల్లో తేనెటీగల పెంపకం ప్రారంభించామని, మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఇప్పుడు లాభసాటిగా ఉందని పాలకొల్లు సమీపంలోని వేండంగిపాలేనికి చెందిన పెంపకందారులు అంబేడ్కర్, నాగరాజు తెలిపారు. 45 రోజుల్లో ఒక్కో బాక్సు నుంచి మూడు బాటిళ్ల తేనెను సేకరిస్తున్నామని, ఒక్కో బాటిల్ రూ.500 వరకు విక్రయిస్తున్నామని వివరించారు.



భీమవరం ప్రాంతంలో సేకరించిన తేనె

# దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

**ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు**
**ఏర్పాట్లను పర్యవేక్షించిన ఈవో**

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): త్వరలో వేసవి సెలవులు ముగియనుండటంతో ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి ఆది దంపతులైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు తలనీలాలను సమర్పించి మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. సర్వ దర్శనం క్యూలైన్‌తో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్లు క్యూలైన్‌లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండు గంటల వరకు ఏకరీతిన కొనసాగింది. సాయంత్రం వాతావరణం చల్లబడటంతో ఆరు గంటల నుంచి రద్దీ తిరిగి ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. నగరంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్ నుంచే కాకుండా కొండ దిగువ నుంచి దేవస్థానం ఉచిత బస్సు సర్వీసులను నడిపింది. దీంతో భక్తులు తమ వాహనాలను కొండ దిగువన నిలుపుకుని దేవస్థాన బస్సుల్లో కొండపైకి చేరుకున్నారు. దీంతో ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య కొంత మేర తగ్గింది. మరో వైపున అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తుల క్యూ ఓం టర్నింగ్ దాటింది. దీంతో ఆలయ ఈవో కెఎస్. రామరావు ఘాట్‌రోడ్డు, ఓం టర్నింగ్ క్యూలైన్లను పరిశీలించి భక్తులకు అమ్మవారి దర్శనం త్వరగా జరిగేలా చూడాలని ఆలయ అధికారులను ఆదేశించారు. మరో వైపున ఓం టర్నింగ్ పరిసరాలలో భక్తులకు దేవస్థానం కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఓం టర్నింగ్ వద్ద పొంగలి షెడ్డును పరిశీలించి భక్తులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం నుంచి భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో మహా మండపం 5వ అంతస్తు వరకే లిఫ్టులను అనుమతించారు. అక్కడి నుంచి సర్వ దర్శనం , టికెట్లు క్యూలైన్‌లోకి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత లేకుండా ఉక్కబోతగా ఉండటంతో దేవస్థానం క్యూలైన్‌లో భక్తులకు మంచినీటిని అందించేలా ఏర్పాట్లు చేసింది. ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేసింది.

**ఆర్జిత సేవలకు డిమాండ్....**

ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవలకు డిమాండ్ కనిపించింది. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణం, యాగశాలలో నిర్వహించిన చండీ హోమం, మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద నిర్వహించిన శాంతి కల్యాణంతో పాటు సాయంత్రం పంచ హారతుల సేవల్లో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు.

# 'హాయ్'వే మ్యాంగో..!

- ఉలవపాడులో కొత్త మామిడి లోకం
- 3 నెలలపాటు జోరుగా మామిడి విక్రయాలు
- రోడ్డుకు ఇరువైపులా సుమారు 250 దుకాణాలు



రాత్రి వేళ విద్యుత్ వెలుగుల్లో దుకాణాలు.

ఉలవపాడు: మామిడి సీజన్ వచ్చిందంటే చాలు ఎన్‌హెచ్ 16పై మామిడి దుకాణాలతో సందడిగా మారుతుంది. ఉలవపాడు నుంచి వీరేపల్లి వరకు హైవే వెంట దాదాపు 250 దుకాణాలు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి కార్లు, లారీలు, బస్సుల్లో వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా ఈ దుకాణాలు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. 40 ఏళ్ల క్రితం ఉలవపాడు పంచాయతీలో గుండా హైవే వెళ్తుండేది. అప్పటి నుంచి హైస్కూల్, ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో అంబేడ్కర్ నగర్, ముస్లిం కాలనీకి చెందిన వారు తొలుత ఐదు దుకాణాలు ఏర్పాటు చేశారు. దాదాపు పాతికేళ్ల పాటు వారే అమ్ముతుండేవారు. కానీ ఆరు లేన్ల రహదారిగా మారిన తరువాత ఈ దుకాణాలు అధికమయ్యాయి. తరువాత రాజుపాలెం వరకు విస్తరించారు. అక్కడ నుంచి నాలుగేళ్ల క్రితం చాగల్లు ప్రాంతం వరకు, గత ఏడాది నుంచి వీరేపల్లి వరకు మామిడి విక్రయ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఏటా దుకాణాల సంఖ్య పెరిగిపోతుండటం విశేషం.

**అందరినీ ఆకర్షించేలా..**

వ్యాపారులు దుకాణాలను సుందరంగా ముస్తాబు చేసి, మామిడి కాయలను అందంగా పేర్చి కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. రాత్రి వేళ విద్యుత్ వెలుగుల్లో మామిడి దుకాణాలు జిగేల్‌మంటున్నాయి. మూడు నెలలపాటు దుకాణదారులు తమ ఇళ్లను వదిలి ఇక్కడే వంటావార్పు చేసుకుంటూ వ్యాపారం చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఉలవపాడు మామిడికి ఉన్న ప్రపంచ స్థాయి గుర్తింపును వ్యాపారులు సొమ్ము చేసుకుంటూనే కొనుగోలుదారులను సంతోషపెడుతున్నారు. ప్రస్తుతం దుకాణాల్లో బంగినపల్లి, రసాలు, హిమామ్ పసంద్, తోతాపురి, కొబ్బరిమామిడి, సువర్ణ రేఖ రకాలు అందుబాటులో ఉన్నాయి. బంగినపల్లి, రసాలు కేజీ రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 